TEXT DARK AND
LIGHT WITH IN
THE BOOK ONLY

UNIVERSAL
LIBRARY
OU_204181
UNIVERSAL
LIBRARY

OUP—881—5-8-74—15,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 891.443 P18J Accession No. P.G. T 4449

Author పార్వతీశ్వరకవులు

Title జయాపజయములు

This book should be returned on or before the date last marked below.

# జయాపజయములు

పాంచకడిదేవ్

వి ర చి త ము

క వి రా జ హం స - క వి కు లా లం కా ర

శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు

అ ను వా ద ము

కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్,

సంస్కృతాంధ్ర గ్రంధాలయం, [స్థా. 1882] రాజమండ్రి.

పునర్ముద్రణ
20 డిశంబర్ 1961
ముఖచిత్రం : : :
శ్రీ వడ్డాది పాపయ్య
ముద్రణ : : : :
రాజేశ్వరి ప్రెస్
రాజమహేంద్రవరం

మూల్యం 4 రూపాయలు

# ప్రకరణము 1

మేమిప్పుడు డిటెక్టివు నవలను వ్రాయుటకు కూర్చుండి యుండలేదు. ఒక కాలమున జరిగిన విషయమును గూర్చియే యథార్థముగ వ్రాయదలంచితిమి. ఇప్పటివలె నాకాలమున దేశ మింత సురక్షితముగా బరిపాలింపబడుటలేదు. దొంగతనములు బందిపోట్లు మొదలగు క్రూరకృత్యములు దినదినవ్యాపారములం బోలి జరిగిపోవుచుండెను. మేమిప్పుడొక యత్యద్భుతమగు బందిపోటు వ్యాపారము గూర్చి వ్రాయదలంచితిమి. విశ్వాసము కలవారు సత్యమని నమ్మవచ్చును విశ్వాసము లేనివారు కల్పితకథ యని భావింపవచ్చును. ఎవ్వ రెట్లు భావించినను మేము వ్రాయునది కథకాదనియు నిదియొకప్పుడు నిజముగా జరిగిన సంగతి యనియు మఱియొకసారి స్పష్టముగా జెప్పుచున్నాము.

ఆ కాలమున మూర్షిదాబాదు నగరమునందు మొహరము పండుగ దినములలో మహోత్సాహముతో వేడుకలును వినోదములును విశేషించి జరుపబడు చుండెను. మంగళవాద్యములు సంగీతపు సభలు సానిమేళములు సరస నాటకములు పగటివేషములు బాణాసంచులు మొదలగువానికి మేర లేకుండెను. హిందువులు ముసల్మానులు నన్నిమతములవారును జాతిభేదములను మఱచి యీ మొహరము వినోదములలో నానందప్రమత్తులగుచుండిరి.

కాని యీ సంవత్సరమున నవిలంఘ్యమగు నంతరాయము సంభవించుటచే నట్టిమహోత్సవములకు మిగుల నాటంకముగా నుండెను. అయినను నెప్పటివలె నాహ్వానపత్రికలంపబడుటచే దూరదేశముల నుండి చాలమంది గొప్పవారు మహావైభవముతో నాయుత్సవములం దిలకింపవలయునని వచ్చుటకు సంసిద్ధులై యుండిరి.

ఆ కాలమున నిప్పటివలె రైలుమార్గము లేదు. కొందఱు పల్లకీలమీఁదను కొందఱు పడవలమీఁదను కొందఱు గుఱ్ఱముల మీఁదను కొందఱు ఏనుఁగులమీఁదను వారి వారి సదుపాయములనుబట్టి బయలుదేఱి వచ్చుచుండిరి. కాని యీ సంవత్సరమున నొకదాని వెనుక నొకటిగా మూఁడు బందిపోటు దొంగతనములు వరుసగా జరిగెను.

ఈ బందిపోటు దొంగతనములు సాధారణమైనవి కావు. ఈనడుమ జరిగిన బందిపోటులన్నియును ముర్షిదాబాదు నగరమునకు నైదాఱు క్రోశముల దూరమునందే—మార్గమధ్యమున నిర్జనస్థానమునందే జరిగియుండెను. ఈ దారికోపిడిలో దొంగలగుంపు లేదు. కేవల మొకఁడు మాత్రమే గుఱ్ఱము నెక్కివచ్చి గాఢాంధకార బంధురమగు రాత్రి సమయమున బల్లకిమీఁదనో గుఱ్ఱముమీఁదనో యేనుగుమీఁదనో యెక్కి ముర్షిదాబాదునకు వచ్చుచున్న ప్రయాణీకు నడ్డగించి రెండు చేతులయందును బాయిచేసియున్న రెండు రివాల్వరులను జూపించు భయపెట్టును. అప్పుడు ప్రాణభయముచే మార్గస్థుఁడగు నా పెద్దమనుష్యుఁడు తనయొద్దనున్న సర్వస్వము నా యశ్వారోహికి సమర్పించును. తోడనే యా యశ్వారోహి యా దొంగ యశ్వముతో నా యరణ్య మధ్యమున నదృశ్యుఁడై పోవును. ఆ బందిపోటు సమాచారమిది.

ఈ వ్యాపారముంగూర్చి ముర్షిదాబాదు నగరమునకు జుట్టు ప్రక్కలనున్న గ్రామములయందును భయంకరమగు నాందోళనముగా నుండెను. ఆబాలగోపాలమును గూడ నీ దొంగతనమును గూర్చియే వింతగా జెప్పుకొనుచుండెను. కాని యింతకాలమువఱకు నాదొంగను బట్టుకొన్నవా రెవ్వరును లేరు; ఆ బందిపోటు దొంగతనములును గట్టువడ లేదు.

ముర్షిదాబాదు నగరమున భాగ్యవంతుడగు నీలరతనబాబు సుప్రసిద్ధుఁడై యుండెను. ఈ మొహరము వేడుకలను జూచుట కాతని యింటికి సంపన్నులగు మిత్రులనేకులు వచ్చియుండిరి. ఆతని మిత్ర

పుత్రుడును, చిన్నతనమునుండి యాతనిచే నాదరింపబడుచు పుత్ర సదృశుడై మెలంగుచున్న వాడును నగు సమరేంద్రుడు కూడ నచ్చటనే యుండెను. ఆ యింటికి వచ్చినవారందఱు నీ బందిపోటు దొంగతనములను గూర్చియే ముచ్చటించుకొనుచుండిరి. ఒక్క నెలలోపల నాలుగు బందిపోటు దొంగతనములు — మొట్టమొదట జగ్గీపూరు జమీందారుని జవాహరీ యంతయును దోచుకొనబడియెను. తరువాత రెండవసారి కాదిగ జమీందారుని సొమ్మంతయు గొల్లగొట్టబడియెను. మూడవసారి మాలవహ జమీందారుని సర్వస్వము నపహరింపబడియెను. [illegible] దినములక్రిందట నాలుగవసారి కాశీపూర జమీందారుని సమస్తమును బలవంతముగ గైకొనబడియెను. ప్రతిసమయమునందును [illegible] యగు నాదొంగ యొక్కడే! ఆతని రెండు [illegible] రివాల్వరులు! నిర్జనమగు మార్గమధ్యమున, నిశీథసమయమున వెనుకపాటున నాకస్మికముగవచ్చి యడ్డగించి యదియే యదలింపు!

ముర్షిదాబాదు ప్రాంతమున వివిధములగా దారిదోపిడులు జరుగుచుండగా పలహాటీనుండి మహాభాగ్యవంతుడగు రణేంద్రప్రసాదుడను నొక యువకుడు తాను మొహరము వేడుకలం గాంచుటకై రెండు మూడు దినములలో ముర్షిదాబాదునకు మీయింటికి వచ్చెదనని నీలరతనబాబునకు జాబు వ్రాసెను. ఒకవేళ నితడు కూడ నీ బందిపోటుదొంగ చేతిలో బడిపోవునేమోయని నీలరతనబాబు భయపడుచుండెను. నీలరతనబాబు నగరమున జాల పేరుగలవాడు. పెద్దమనుష్యులతో గలసి మెలసియుండు స్వభావము కలవాడు. ప్రతిదినమునను సంధ్యాసమయములం దాతనియింటికి నాగరికులును గౌరవనీయులగు పురుషులు తఱచుగ వచ్చుచు బోవుచుండురు. నేడు గూడ జాలమంది యాతని యింటికి విచ్చేసి యుండిరి. రణేంద్రప్రసాదు రావలసినదిన మాదినమే. అందఱు నాతనిరాకకొఱ కెదురు చూచుచుండిరి. అందఱు నుద్విగ్నహృదయులై యుండిరి. అందఱి

యాలోచనలును నాబందిపోటు వ్యాపారము గూర్చియే పనిచేయుచుండెను.

ఇదివఱకు ప్రతిదినమును రాత్రి తొమ్మిదిగంట లయినతోడనే యందఱు నెవరియిండ్లకు వారు పోవుచుండిరి. కాని నేఁడెవ్వరు నట్లు పోలేదు. "ఇంకను గొంతసేపటివఱకు నిరీక్షింతము—రణేంద్రబాబీపాటికి రావలసినదే—అతఁడు వచ్చిన తరువాతనే వెళ్ళవచ్చును" అని యందఱును గూర్చుండి యుండిరి.

క్రమముగా రాత్రి యగుచున్న కొలదియు నందఱి హృదయములును తొందరపడి పోవుచుండెను. ఎన్నియో యనుమానములు తోచుచుండెను. అందఱును దదేకదీక్షతో రణేంద్రుని రాక నిరీక్షించుచుండిరి. ఇంతలో బల్లకీ బోయీల యోంకారధ్వని వినవచ్చెను. అదివిని యందఱు నేకవాక్యముగా—"ఈ సారి నిశ్చయముగా నాతఁడే వచ్చుచున్నాఁడు !" అనిరి.

ఔను. నిజముగా నాతఁడే వచ్చెను. పల్లకి నీలరతనబాబు మందిర ద్వారమున కెదురుగ దింపబడియెను. తోడనే దీనవదనముతో బల్లకినుండి రణేంద్రుఁడు వెలుపలికి వచ్చెను. అతఁడు లోపల నడుగు పెట్టుచునే—"అన్నా ! కొంప మునిఁగిపోయినది. నా సర్వస్వమును బోయినది !" అనియెను.

## ప్రకరణము 2

రణేంద్ర ప్రసాదుని మాట వినినంతనే—అతని యాకార వికారములం గాంచినంతనే యట నున్నవా రందఱి హృదయములందును నా బందిపోటు దొంగ సంగతి స్మృతికి వచ్చెను. కాని యెవరి నోటినుండియు నొక్క మాటయైన వెలువడలేదు. అందఱును నీరవులై యుండిరి. అప్పుడు గృహస్వామియగు నీలరతనబాబు—"ఏమి జరిగినది ? సమాచారమేమి ?" అని ప్రశ్నించెను.

రజేంద్ర ప్రసాదుడు లోనికివచ్చి యొకచో గూలబడి తలపై జేతు లుంచుకొని హీనస్వరముతో—"ఇంకేమని చెప్పుదును! నాసర్వస్వమును బలవంతముగ దోచుకొని పోయినాడు!" అనియెను.

అప్పుడట నున్నవా రందఱును సమస్వరముతో—"ఎవరు? ఎవరు?" అని ప్రశ్నించిరి.

రజేంద్ర ప్రసాదు నిట్టూర్పులు విడుచుచు—"నేను పల్లకినెక్కి బయలుదేఱి వచ్చుచుంటిని. నా మణిమయాలంకారములును, నా సొమ్ముసుగల పెట్టె నా పల్లకియందే యుండెను. నా సేవకులు పల్లకితో బరుగెత్తజాలక యించుక వెనుకబడి యుండిరి. ఆసమయమున మొగమున ముసుగు వైచుకొనియున్న యశ్వారోహియగు నొక వ్యక్తి రెండు చేతులను రెండు రివాల్వరులతో నాకస్మికముగవచ్చి నాపల్లకి యెదుట నిలిచెను. నేమున్నది! ఆ రివాల్వరులను ప్రేల్చినచో నేనేమి కావలసినది! అచ్చట నాకెక్కడి దిక్కెవ్వ రున్నారు? రివాల్వరులను దాల్చిన యాశ్వికయోధునెదుట బల్లకి బోయులుమాత్ర మేమి చేయగలరు? ప్రాణభయముచే నేను వెంటనే నాపెట్టె నాతనికి సమర్పించి ప్రాణముల నెట్లో దక్కించుకొని వచ్చితిని. కాని సర్వస్వమును బోయినది. ఒక్కపైసయైనను మిగులలేదు!" అని చెప్పెను.

ఆ మాటలు విని యట నున్నవారందఱు నొక్కటే మాటగా—"ఆ దోపిడిగాడే! నిజముగా నా బందిపోటుగాడే!" అని పలుక నారంభించిరి.

అప్పుడు రజేంద్ర ప్రసాదుడు వ్యాకుల భావముతో నందఱి వంకను దిలకించుచు—"పోలీసువారికి సమాచారము పంపవలదా? ఆలస్యము చేయుట యెందులకు?" అనియెను.

ఎవ్వరును నెట్టి ప్రత్యుత్తరమును జెప్పలేదు. ఈ విషయమున బోలీసువారేమియు జేయజాలరని యందఱకును దెలిసిన సంగతియే. ఇదివఱ కెట్టి బందిపోటు దొంగతనములు నాలుగు జరిగినవికావా?

పోలీసువారు ప్రాణములకైన నాశింపకుండ గష్టపడి ప్రయత్నము చేయుచుండిరిగాని వారి కింతవఱకు నెట్టి యూగడయును నగపడలేదు. ఈ సంగతి వినిమాత్రము వారేమి చేయుదురు! రణేంద్రుని ప్రశ్న కెవ్వరును దగిన ప్రత్యుత్తరము చెప్పలేదు.

అప్పుడు నీలరతనబాబు మిత్ర పుత్రుడగు నమరేంద్రుడు తన మనస్సులో నొకవిధముగా ప్రతిజ్ఞ చేసికొనియెను. ఆతనికి పోలీసు వారిపై నసహ్యాభావము కలిగెను. ఆత డప్పుడు మంచి వయసులో నున్నాడు. ఆతని రక్తనాళములయం దుష్ణరక్తము ప్రవహించు చున్నది. ఆతని హృదయమునందు గార్యోత్సాహశక్తి యపరిమితమై యున్నది. ఆతడు తనలో దానే—“ ఏమైన నగుగాక! నేనాదొంగను బట్టుకొని తీరెదను!” అని ప్రతిజ్ఞ చేసికొనియెను.

ఈ కడపటి బందిపోటువలన మరల మూర్షిదాబాదు నగరమున మహాందోళనము బయలుదేఱెను, మొహరము వేడుకలన్నియును జాల వఱకు విచ్ఛిన్నములై పోయెను. రాత్రివేళయం దొంటిగా నెవ్వరును బయట దిరుగుటకు సాహసింప జాలకుండిరి. పండుగ వినోదములం గాంచుటకై యా నగరమున కింకను రాదలచియున్న గొప్పవా రందఱును దొంగభయముచే వచ్చుట మానివైచిరి. వచ్చిన వారిలో జాలమంది మరల దమ యింటికి సురక్షితముగా జేరుకొనుట యెట్లను వ్యాకులముచే దల్లడిల్లి పోవుచుండిరి. ఆ నగర ప్రాంతము నందలి జనుల హృదయము లన్నియు నతి దారుణ చరితుడగు నా యాశ్వీక చోరుని భయంకర కృత్యములకు గలగుండు వడి పోవుచుండెను.

అప్పటి మూర్షిదాబాదు నబాబగు నాజిమ్షాహు యీదారుణ కృత్యములకు సంచలితుడై మిగుల సమర్థుడగు నొక పత్తేదారుని కొఱకు గలకత్తాకు వ్రాసెను. అందుపై నచ్చట సుప్రసిద్ధుడగు ఫతేఅలీ యను నొక పత్తేదారుడు మూర్షిదాబాదునకు బంపబడియెను. ఫతేఅలీ యథాసమయమున నచ్చటికివచ్చి జరగిన దొంగతనములను గూర్చి తెలిసికొని పరిశోధనమున కారంభించెను.

ఆతనికి బత్తేదారు పనియం దంతటి నైపుణ్య మున్నట్లు బోధ పడుటలేదు. కాని యదృష్టవశమున నాతఁ డొక గొప్ప యపరాధ రహస్యమును సులువుగా భేదింపఁగలిగెను. అందుచేతనే యీతని కింత గొప్పపేరు వచ్చెను. ఆ పేరుతో గూడ నాతని యహంభావమును బది యాఱుపాళ్ళు పెరిగ్గదొడంగెను. అంతేకాని యాతనికి స్వతస్సిద్ధముగా నెట్టిజ్ఞానమును లేదు. "ఈతని మూలమున నీ విషయమునం దించు కంతయును నుపయోగము లేదు" అని యాతని గడబిడం జూచినవా రందఱును నిశ్చయించుకొనిరి.

అమరేంద్రుఁ డాబందిపోటు దొంగను బట్టుకొందునని ప్రతిజ్ఞ చేసికొని యుండెనుగదా! ఆత డెన్నియో విధముల ప్రయత్నించి యా ఫతేఅలీని దర్శించి ఆత డిదివఱ కెంతదూర మాలోచించెనో, ప్రయత్నించి ఎన్నిసంగతులను గ్రహించెనో తెలిసికొనవలయుననియే యమరేంద్రుని యుద్దేశము— ఫతేఅలీ యేలాఁగునను నైన నీ వ్యవహారము నందు దన్ను సహాయునిగా జేసికొన దలంచినచో బాగుగ నుండునని కూడ నమరేంద్రుడు కుతూహల పడుచుండెను.

నీలరతనబాబు ననుగ్రహమువలన ఫతేఅలీతో నమరేంద్రునకు దగురీతి నాలాప పరిచయము లభియించెను. అమరేంద్రుడు బందిపోటు వ్యాపారమున మీతో గూడ జతగా బని చేయవలయునని యుత్సాహ పడుచున్నాడని నీలరతనబాబు ఫతేఅలీతో జెప్పెను. ఆ మాట విన్నంతనే పత్తేదారుడు పరిహాస సూచకముగా నవ్వివైచెను. అందుచే నభిమానధనుడగు నమరేంద్రునకు బట్టజాలనంత కోపము వచ్చెనది; కాని సమయోచితముగ నాతడా కోపమును దనలోనే యడంచు కొనియెను.

అమరేంద్రుని గంభీర భావముంగాంచి ఫతేఅలీ నవ్వుట మానివైచి తదేక దృష్టితో నాతని మొగమువంక జూడ దొడంగెను. అమరేంద్రుడును తెప్ప ్రవాల్పకుండ నిస్సంకోచముతో నాతని

మొగమువంక దిలకించుచుండెను. అట్లు కొంతసేపు జరుగునప్పటికి—"ఈ యువకుడు సాధారణుడు కాడు" అను దృఢాభిప్రాయము ఫతే ఆలీ స్థూల మస్తిష్కమున నుదయమయ్యెను.

ఫతేఆలీ యట్లు మాట్లాడకుండగనే కొంతసేపుండి యనంతరము గంభీర స్వరముతో—"సరే! నీవు సమర్థుడవుగ నగుచున్నావు. నేను నిన్ను నాకు సహాయునిగా జేసికొందును, కాని అమరబాబూ! ఆలోచించి చెప్పుము! దీనికి దలయును దోకయును నుండ నాకేమియు బోధపడుట లేదు. ఏమి చేయుటకును నుపాయము తోచుట లేదు. ఎక్కడనుండి ప్రారంభించి పని చేయవలయునో యేమియు దారి యగపడుట లేదు!" అనియెను.

అమ—హజ్రతేబాబు సాహేబా! ఈ విషయమున నింత ఆలోచన యేల? సాధారణముగా నన్ని వ్యవహారములలో వలెనే పని చేయుటకు ప్రారంభింపవలయును.

ఫతే—అసంభవము. ఎద్దైన నొక హత్య జరిగుననుకొనుము. అప్పుడా హత్య జరిగిన స్థానమునుండి బాగుగ పరిశోధించి రహస్యమును భేదించుటకు ప్రయత్నింపవచ్చును. ఈ బందిపోటు దొంగ కొక నిశ్చిత స్థానమని యేదియును లేదు. ఆకస్మికముగా నెచ్చటినుండియో యొక చోటికి వచ్చిపడి మార్గస్థుల సర్వస్వమును గొల్లగొట్టి నిమిషములో గుఱ్ఱము నెక్కి యదృశ్యుడై పోవుచుండును. నేటిదినమున నిచ్చట—రేపటిదినము నచ్చట—నేడుత్తరమున—రేపు దక్షిణమున—రాత్రి గాఢాంధకారమున గుఱ్ఱముపై నెక్కి యిరువది ముప్పది క్రోశముల దూరము ప్రయాణము చేయుట సాధారణ కృత్యము గాదా?

అమరేంద్రుడు వినమ్రభావముతో—"అయ్యా! గుఱ్ఱము సాధారణముగా జేసికొని యనుసంధానము కావించుట కేల ప్రయత్నింప రాదు?" అనియెను.

ఫతే—ఆ దొంగ యెవ్వరెవ్వరి ధనము నపహరించెనో వారందఱి యొద్దకును బోయి నేను వారివలన సకల విషయములను

దెలిసికొంటిని. ఆ దొంగ మొగముపై ముసుగు వైచుకొని యుండు వనియు, నాత డెక్కినది నల్లని గుఱ్ఱమనియు, మంచి యెత్తు మనియు వందలు నొక్కొక్క విధముగ జెప్పిరి. ఇంతకంటె స్పష్టముగ జెప్పినవా రెవ్వరును లేరు. ఆ దొంగను గూర్చి స్పష్టముగా నెవ్వరును జెప్పజాలకయే యున్నారు. ఇట్టి స్థితిలో గుఱ్ఱము నొక యాధారముగ జేసికొని ప్రయత్నించుట యెట్లు? ఈ ప్రపంచమునందు నల్లని గుఱ్ఱము లెన్ని వేలు లేవు!—అందఱును దొంగను జూచినంతనే భయభ్రాంతు లైపోయిరి—అందుపై గాఢాంధకారము—ఎవ్వరును గూడ నా దొంగను బరిశీలించి చూచినవారే లేకపోయిరి.

అమ—అయ్యా! ఇందొక సంగతి మాత్రము బాగుగా నాలోచింపవలసి యున్నది, ఏమనిన—ఆ దొంగ దారిని బోవువారి నందఱను గూడ నూరక యాక్రమించుటలేదు, ఎవ్వరియొద్ద విశేష ధనమును, నాభరణములును నుండునో వారిని మాత్రమే యెదిరించుచున్నాడు. ఈ సంగతి మాత్రము నిశ్చయము.

ఫతేఆలీ పరమానందముతో నమరేంద్రుని వెన్నుపై జఱచుచు—"అమరబాబూ! నీవు చాల తెలివిగలవాడవు. నీవిప్పుడు చెప్పిన మాట నిశ్చయమే. ఈ దొంగ యొక్కడే కాదు—ఇంకను కొంత మంది యున్నారు, వారిమూలముననే ధనవంతులగు మార్గస్థుల సంగతి యా దొంగకు దెలియవచ్చుచుండును!" అనియెను,

## ప్రకరణము 3

అమ—అట్లయినచో నదియొక బందిపోటు దొంగల సంఘమనియా మీ యభిప్రాయము?

ఫతేఆలీ పరమోత్సాహముతో గంభీర స్వరమున—"ఔను. నిశ్చయముగా—అమరబాబూ! వినుము! ఒకడు మార్గస్థులను

పరిశీలించి యెవ్వరు ధనముతో బోవుచుండిరో తెలిసికొని సమాచార మందించును—మఱియొకడు వచ్చి దోచుకొనును—ఈ విధముగా వారిలో నొక్కొక్క డొక్కొక్క కార్యభారమును వహించి పని చేయుచుండును. కష్టపడి వీరిలో నొక్కనినైన గనుపెట్ట గలిగినచో వ్యవహార మంతయు బయల్పడిపోవును " అనియెను.

అమ—సరే—మీరిప్పు డేమని స్థిరపఱచితిరి ? దయయుంచి నాకాసంగతి తెలిపినచో ననుగ్రహింపబడుదును.

ఫతే—మంచిది. అట్లయినచో వినుము. ఎవ్వరెవ్వరు ధనము తోడను, విశేషాభరణములతోడను ప్రయాణము చేయుచున్నారో తెలిసికొని సమాచార మందించువాడొక పెద్దమనుష్యుడై యుండ వలయును—అతడు తఱచుగా ప్రయాణములు చేయువాడును, బది మందితో గలసిమెలసి యుండువాడును గావలయును.

అమ—ఏ కారణమువలన మీరీవిధముగా స్థిరపఱుప గలిగితిరి!

ఫతే—వాడట్టివాడై యుండనిచో భాగ్యవంతుల ప్రయాణము లనుగూర్చి నిశ్చయముగా దెలిసికొనుట కవకాశ మెట్లు కలుగును ? వాడట్లు తెలిసికొని రెండవవానికి దెలియజేయును. అప్పుడు రెండవ వాడు పెద్దమనుష్యునివలె గుఱ్ఱము నెక్కి సికారి చేయువానివలె బయలుదేఱిపోయి రాత్రి చీకటిలో నేదియో నిర్జన స్థానమున దన మొగముపై ముసుగు వైచుకొని యానవాలు తెలియకుండ ధనికు లగు మార్గస్థుల నాక్రమించి యదలించి వారి సర్వస్వము నపహరించి తీసికొనిపోయి తమ సంకేత స్థానమునందున్న మూడవవానికా యాభరణములను ధనమును నొప్పగించును. అప్పుడా మూడవవా డేదూర దేశములకోపోయి యావస్తువుల నన్నిటిని విక్రయించి సొమ్ము చేయుచుండును.

అమ—మొట్టమొదట ప్రయాణముచేయు ధనవంతుల సంగతిని దెలిసికొని వార్త దెలుపువాడు మీరు చెప్పినట్లు గొప్పవాడై

కాకపోయినను గాకపోవచ్చును. పెద్దమనుష్యుని ప్రయాణపు సంగతి తెలిసికొనుటకును బెద్దమనుష్యుడే యైయుండనక్కఱలేదు. ఆతనికిని నాతని పరిచారకునకు జరగు సంభాషణ నాలింపగలిగినచో నొక పెద్దమనుష్యుని ప్రయాణపు సంగతి యంతలో దెలిసిపోవును. ఈ మాత్రపు బనికి గొప్పవాడు కావలయునా !

ఫతేఆలీ తల యూచుచు నూచుచు—"సరే—కాని, యీ విషయమున నేనూహించిన పద్ధతియే నిశ్చయము—సందేహము లేదు." అనియెను.

అమ—ఈ బందిపోటు సంగతి యీ దేశమంతటను స్పష్టముగా దెలిసిపోయినది. ఇట్టి స్థితిలో మీరు చెప్పినట్లాదొంగ పెద్దమనుష్యుని వలె గుఱ్ఱపు సికారి చేయుచు దిరుగుచున్నచో నాతని యెడల నెవ్వనికో యొక్కనికైన ననుమానము కలుగక మానదు. అట్లు తిరుగుచున్నచో నాత డొకరికంట గాకున్న మఱియొకరి కంటనైనను బడక మానదుగదా !

ఫతే—ఔను—నీవు చెప్పిన మాటయును నిజమే—కాని యిచ్చటనున్న పోలీసువా రందఱును బుద్ధిహీనులనియే తోచుచున్నది. ఇంతవఱ కెవ్వరు నించుకంతయైనను బని చేయజాలక పోయిరి.

అమ—పాప మిందు బోలీసువారి యపరాధమేమి మాత్ర మేమున్నది ? అనేకాపరాధ రహస్యములను సమూలముగ భేదించి ప్రసిద్ధిం గాంచియున్న మీవంటివారే యీ విషయమున హతాశులై పోవుచున్నప్పుడిక సామాన్యులగు పోలీసువా రేమిచేయగలరు ?

ఫతే—ఏమంటివి ? నేను హతాశుడ నగుచుంటినా ? ఎన్నటికిని నీవట్లు భావింపవలదు.

అమ—అట్లైనచో నిప్పుడు మీ రీ పరమ రహస్యమును బయటబెట్టు విషయమున నెట్టి ప్రయత్నము చేయదలంచితిరి ?

ఫతే—నామాట తరువాత జెప్పెదను. పత్తేదారుపని చేయ వలయునని నీవు వేడుకపడి పరుగు పరుగున వచ్చితివిగదా! ఈ వ్యవహారమున నీ విప్పు డేమిచేయ దలంచితివో చెప్పుము.

అమ—ఇప్పటివఱకు నేనేవిధమైన నిశ్చయమును జేసికొని యుండ లేదు.

ఫతే—నేనిప్పుడీ మూర్షిదాబాదు నగరమునకు జుట్టుప్రక్కల నలుదెసలను దిరిగి పరిశీలించి యనుసంధానము చేయదలంచితిని.

అమ—ఈ నగరమునందలి పోలీసువా రందఱు నిదివఱకు జేసినపనియే యది! కాని యందువలన నెంతమాత్రమును లాభము కలిగినది కాదు.

ఫతే—అట్లయినచో నిక నేమి చేయవలయు నని యెదవు! నాకింకొక సంగతి తోచుచున్నది. ఇప్పు డిక నెదురుత్రోవను బట్టి ప్రయత్నించి యనుసంధానము చేయవలయును.

అమ—అది యెట్లు?

ఫతే—ఆ దొంగ లీవస్తువుల నన్నిటిని దీసికొనిపోయి ఎచ్చట విక్రయించుచున్నారో ముందుగా నా ప్రదేశమును దెలిసికొన వలయును. అంతటి విలువగల యాభరణముల నెక్కడివాని నక్కడనే విక్రయించుట యసంభవముగదా! వారీ నగల నన్నిటిని గొనిపోయి కలకత్తా నగరమున విక్రయించు చుందురని తోచుచున్నది. అట్లే యైయుండవచ్చును. అచ్చటికి బోయి విచారించినచో నేమైన నీగడ దొరకవచ్చును.

అమ—అట్లయినచో నిక నీ ప్రదేశమున నిరంతరాయముగా ప్రతిదినమును బందిపోటు దొంగతనములు జరగుచుండవలసిన దేనా?

ఫతే—నీ యుద్దేశ మేమి? మన మీ ప్రపంచము చుట్టును గావలి యుండి కాపాడగలమా? ఆ గజదొంగ తూరుపు, దక్షిణము, పశ్చిమము, నుత్తరము నలుదెసలను గూడ గొల్లగొట్టుచున్నాడు.

ఎప్పు డెచ్చటికి వచ్చి పడి దోచుకొనునో యెవ్వరికి నెంతమాత్రమును తెలియుటలేదు. నే డిచ్చట జరిగినచో మఱి రెండు దినముల కిరువది క్రోశముల దూరమున కావల జరుగును. ఎచ్చట జరుగునని మనము కాచికొని యుండగలము ?

అమ—సొమ్ముపోయిన జమీందారులును, భాగ్యవంతులు నందఱును గూడ దొంగలను బట్టుకొన్నచో నొక్కొక్క దొక్కొక్క వేయి రూప్యములను బహుమానముగా నిచ్చెదమని కూడ ప్రకటించి యున్నారు

ఫతేఆలీ దీర్ఘనిశ్వాసమును విడుచుచు దీనస్వరముతో—“ అన్ని సంగతులును తెలిసినవి. అంతయును బాగుగనే యున్నది. కాని యీ దారుణ దుస్తంత్ర మంతయును విషమ సంఘటనముగా నున్నది. నే నింతకంటె నభేద్యములగు తంత్రముల నెన్నిటినో యతిసులభముగ భేదించియున్నాను. కాని యీ వ్యాపారములో నొక్క యడుగైనను ముందటికి వైవజాలకున్నాను. ఏమైననేమి ! నాకింకను నిరాశ కలుగుటలేదు. ఏదో యొక విధముగా గార్యమును సాధించి తీరెదను. నీ విప్పు డేమి చేయ దలంచితివో చెప్పుము !” అనియెను.

అమ—ఏమిచేయవలయునో యేమిచేయగలనో నే నింతవఱకు నేదియు నిశ్చయించుకొని యుండలేదు. అదిగాక యేమిచేయుటకు నాకేమియు దోచుటలేదు. నేనీవ్యాపారమున జాల క్రొత్తవాడను. మీరిట్టి వ్యవహారముల ననేకములుగా జూచి యారితేరినవారు. నేను మీరిప్పు డెట్లు చెప్పిన నట్లు చేయుటకు సిద్ధముగా నున్నాను.

ఫతే—ప్రయత్నము చేయుము !

అమ—ఏ యాధారము ననుసరించి ప్రయత్నము చేయుదును ! నాకేమియు మార్గ మగపడుటలేదు.

ఫతే—మార్గమేమున్నది నా తలకాయ !

ఇక గత్యంతరములేక యమరేంద్రుడు ఫతేఆలీ యింటినుండి వెలుపలికి వచ్చెను. ఏమి యనుసంధానము చేయవలయునో,

ఏవిధముగా ననుసంధానము చేయవలయునో ఆతని కెంతమాత్రమును బోధపడుటలేదు. ఇక నొకసారి దొంగతనము జరిగినంగాని ఏవిధముగా ప్రయత్నించుటకును దగిన మార్గము దొరకదని యూరకుండ భావించు కొనియెను.

ఈ దారుణ కృత్యములం గూర్చి ఇంతవఱకు నెవ్వరు నేమియును దగిన ప్రతీకారము చేయజాలకుండుటచే నేదినమున కాదినమే యందఱును భయపడి పోవుచుండిరి. ఎప్పు డెవ్వరికొంప మునుగునో యని యెవరినట్టుకొనకు వారే తల్లడిల్లి పోవుచుండిరి ఎప్పు డెక్కడ నాబందిపోటుదొంగ చేతులలో బడిపోవలసివచ్చునో యను భీతిచే నెల్లరును ప్రయాణము చేయుటకు సందేహపడుచుండిరి. అందఱు నా దొంగ భయముచే నల్లుడికిన ట్లుడికిపోవుచుండిరి.

## ప్రకరణము 4

తరువాత బది పండ్రెండు దినములు వఱకు నెచ్చటను దారుణ వార్తలు వినరాకుండుటచే మరల మోహాగము వినోదములు ప్రారంభింపబడియెను నేను నీలరతనబాబు మందిరమున సంగీతసభ జరుపుట కేర్పాటు జరిగెను. దేశదేశములందు పేరుగాంచిన యిరువురు వార యువతులు నృత్తగీతములకై యాహ్వానింపబడిరి ఆ నగరమునందలి చాలమంది పెద్దమనుష్యులను నీలరతనబాబు సంగీతసభ కాహ్వానించెను. అందఱును సముత్సాహముతో వచ్చియుండిరి.

నీలరతనబాబు భవన మంతయు నానందప్రఫుల్లమై యుండెను. వచ్చినవారందఱు నత్యుత్సాహముతో నుండిరి. ఒక వారసుందరి దేవసుందరివలె నీక్రింది విధముగ బాడుచు నృత్యము చేయుచుండెను-

ఎవరి లోపలి గుట్టు లేరీతి నుండెనో ఇతరు లెవ్వారి కెరుకయే ॥ఎవ॥

1. పవలు రేయి వాసి, పైపై వలపు జూచి గావు తవుపని నమ్మి,
తవిలి యుంటినమ్మ శివశివ! నవ్వుల్లు, చేసిపోవునని యువిద!
నాకలనైన నూహింపలేనైతి ॥ఎవ॥

2. గిలుకు బెళుకు జూచి, గత్తరమున లేచి జిలుగు కెంపని ఎంచి
చేయి వైచితినమ్మ చెలువ! ముట్టిన గాల్చు, చింత నిప్పని
యొకింత తెలివింగా నుండియు దెలిసికోలేనైతి ॥ఎవ॥

అంతటను నానందోత్సాహములలో మునిగియుండిరి. రెండవ వార సుందరీమణి యొక్క ప్రక్కను గూర్చుండి యుండెను. ఆమెపేరు మానియాబీబీ! ఆమె యిప్పుడు పశ్చిమదేశమునుండి యీ మూర్షిదాబాదు నగరమునకు వచ్చియుండెను. ఆమె రూపము జగన్మోహనకర మైనది. ఆమె విలాసములు జగదాకర్షకములైనవి అట్టి సంపూర్ణ రూప లావణ్య విలాసినియగు వారసుందరి యిదివఱకే నగరమున కొక్కసారి వచ్చియుండెను. ఇదివఱ కొకసారి యీ నగరమున నీమె పాట పాడినది మూర్తీభవించిన సరస్వతివలెనున్న యీమెపాటకును నభినయమునకును సభవారందఱును విముగ్ధులైపోయిరి.

ఈ దినమున మానియాబీబీ పాటలేదు. అందుచే నామె యొక్క ప్రక్కను గూర్చుండి యుండెను. కొంతసేపైనతరువాత నామె లేచి యమరేంద్రుడు కూర్చుండి యున్నచోటికి వచ్చి కూర్చుండెను. ఉలికిపడి యమరేంద్రుడు డించుక యోసరిల్లి కూర్చుండెను. అప్పుడు మానియాబీబీ చిరాభ్యస్తమగు మధుర మందహాసము చేయుచు నమరేంద్రునింగాంచి వీణానాదమునంబోని మృదుమధుర స్వరముతో— 'అయ్యా! నేను మీతో నొకటి రెండు మాటలాడదలచి వచ్చియుంటిని" అనియెను.

అమరేంద్రుడు సంపూర్ణ యౌవనుడగు సుందరమూర్తి. ఆతని కింతవఱకు నాడువారితో బరిచయ మించుకంతయును లేదు. అందుచే

నాతఁ డించుక సంకోచముతో—"నాతో మాటాడదలచి వచ్చితివా ?" అనియెను.

మని—ఔను. మీతోడనే మాటాడవలసిన పనియున్నది. ఆ బందిపోటు దొంగను బట్టుకొనుటకు ప్రయత్నించు చుండితిరట మీరే కాదా ? మీరేయని వినియుంటిని. నా చెంత నెంతటి విలువగల రత్నాలంకారము లున్నవియో చూచితిరిగదా !

అని యామె యమూల్య రత్నభూషణ భూషితమగు తన సుందర కోమల బాహువల్లికను జూచి యాతని కన్నుల మిఱుమిట్లు గొలుపజేసెను. అంతటి యతిలోక మనోహర కమలము నాతఁ డిదివఱ కెన్నడును జూచియుండలేదు. అప్పు డామెతో నేవిధముగా మాటలాడవలయునో యమరేంద్రుఁ డించుకంతయును బోధపడకుండెను. సుందరీమణియగు తరుణీమణితో మాటలాడుట యాతని కిదియే మొదటిసారి. ఆతని సర్వాంగకములును బులకించిపోయెను. ఆతని గుండెలు దడదడ గొట్టుకొని పోవుచుండెను. ఆ శబ్దము పైకిగూడ స్పష్టముగా వినవచ్చుచున్నట్లాతనికి దోచుచుండెను. అంతగుండిలో నదివఱ కెన్నడు నెఱుగని యొక యాందోళనతో నట్లాడుట కాతనికి సంకోచముగా నుండెను. తొట్రుపడుచు నాతఁ డెట్లో మనసు కుదుటుపఱచుకొని—"ఔను, చూచితిని !" అని యొక్కమాట మాత్ర మనియెను.

మనియా మధుర స్వరముతో—"చూచితిరిగదా ! ఇన్ని వస్తువులతోనున్న నా రక్షణము విషయమై మీరేమి ఆలోచించితిరో దయయుంచి సెలవీయవలయును. నాకీ యున్నతి ఘోర కృత్యములం గూర్చి చాల భయముగా నున్నది. ఇట్టి సమయమున మీవంటివారి సహాయము లేకున్నచో మావంటివారి కెంతమాత్రమును నెమ్మది యనుమాట యుండదు" అనియెను.

అమరేంద్రు డేమియుం దోచక తల గోకికొనుచు—"అట్లయినచో నీ కన్ని సంగతులును దెలిసినవా ?" అనియెను.

మని—నేను చాలమందిని దర్శించి యడిగితిని. కాని యెవ్వరు నీ విషయమును స్పష్టముగా జెప్పినవారు లేరు. మీరీ దారుణ వ్యాపారము ననుసంధానము చేయుటకు విశేష ప్రయత్నము చేయుచున్నారని—

అమ—నిజముగా నేనుగాను—ఈ వ్యవహారమున నతి నిపుణుడగు ఫతేఅలీ సాహేబు పని చేయుచున్నాడు.

మని—ఔనట! నేనా సంగతియును వినియుంటిని. ఆ ఫత్తేవారు సాహేబు కేవలము బుద్ధిహీనులలో మొదటివాడని జను లందఱును జెప్పుకొనుచున్నారు. ఆ మూఢు డంతటిదొంగ నెంతమాత్రమును బట్టుకొనజాలడు.

అమ— నే నీ వ్యాపారమునందు బని చేయుచున్నానని నీకు జెప్పినవా రెవ్వరు!

మనియాబీబీ మనోజ్ఞ వదన మండలమున మందహాస చంద్రికలను బరిగింప జేయుచు—"ఈ సంగతిని రహస్యముగా నుంచినంత మాత్రమున దాగునను కొంటిరా! నే నీయూరివారివలన మీ సంగతి యంతయును దెలిసికొన గలిగితిని—మీ రిప్పటి కెంతవఱకు ప్రయత్నము చేసితిరో చెప్పుడు!—ఆ దొంగను బట్టుకొనుట కేదైన తగిన యుపాయ మగపడినదా?" అని ప్రశ్నించెను.

అమ—లేదు. ఇంతవఱ కెట్టియాధారము నగపడలేదు. అగపడునను నాశకూడ విశేషముగా లేదు.

మని—ఇంత యదృశ్యముగా దోచుకొను నా గజదొంగ సాధారణుడు కాడని తోచుచున్నది. ఈ నడుమ నా దొంగచే సర్వస్వము నపహరింప బడినవా రెవ్వరో యొక రిచ్చటనే యున్నారట గాదా?

అప్పు డమరేంద్రుడు మనియాకు రణేంద్ర ప్రసాదుని జూపించి—"ఈతడే—నీ కితనితో మాటలాడవలసినపని యేమైనా నున్నదా?" అని ప్రశ్నించెను.

మనియాబీబీ యనంగీకార సూచకముగా దల నాడించుచు—"అక్కా అలేగు—ఇంత కాలము వఱకు నాతని నెవ్వరును బట్టుకొనజాలకున్నారు—కాని యా దొంగ యీ నగరములలో నెప్పుడైన దొంగతనము చేసినాడా?" అనియెను.

అను—లేదు. కాని యీ దుష్కృత్యమునకు బ్రతీకారము చేయజాలక యందఱు నిట్లే విమూఢులై యూరక చూచుచున్నచో నిక నా క్రూరకర్మునకు సాహసము మఱింత వర్ధిల్లిపోవును. ఆ పిమ్మట క్రమముగా నాతడు పట్టణములోనికి వచ్చికూడ బందిపోటు చేయుటకు బ్రారంభించును.

మనియాబీబీ యదరిపడి సర్వాంగకములును గంపించుచుండ దొట్రుపాటుతో—"ఏమనుచున్నారు? అతడు నేటిదినముననే నగరమునబడి దోచుకొనునుగదా!" అనియెను.

అను [illegible] చిఱునవ్వు నవ్వుచు—"భయము లేదు. ఈ నగరమునందలి ప్రజలందఱును మిగుల జాగరూకులై యున్నారు. ఇప్పుడా దొంగవచ్చి యెవ్వరినైన నాక్రమించినచో దప్పకుండ బట్టువడియైన బోవును—లేదా గుండుదెబ్బ తినియైన బోవును" అనియెను.

మని—ఎందుచేత?

అను—ప్రొద్దు గ్రుంకినంతనే యీ యూరివారందఱు నొక్కొక్కడొక్కొక్క రివాల్వరును జేబూని జాగ్రత్తగా గాచుకొని యుందురు.

మని—అలాగా! అయ్యో! నాయొద్ద నట్టి రివాల్వరేదియును గూడ లేదు. ఈ పట్టణమునందిక నాగతి యేమికావలసినది!

అను—నీవంతగా భయపడ నక్కఱలేదు. నీతో గూడ నెప్పుడును జాలమంది పరిజను లుండనే యుందురు. ఇంతేకాక—ఆ దురాత్ముడు సాహసించి యీ పట్టణమున బ్రవేశించునని సందేహించుట కెట్టి యవకాశమునుగూడ లేదు.

మని—ఆ దొంగను బట్టుకొనుటకు దగిన శక్తిగలవారెవ్వరును లేరనియేనా మీ యుద్దేశము?

అమ—ఈ విధముగానే మఱియొకటి రెండు దొంగతనములు చేసి అతడు తప్పించుకొని పోయిన పోవచ్చును. కాని తుట్టతుద కాతఁ డెట్లయినను బట్టువడక మానడు. ఈ మాటమాత్రము నిశ్చయము.

ముని—అలాగా! అట్లయినచో మీరు నాతో బందెము వైచెదరా! సంగతి సందర్భములను బట్టి చూడగా నాతఁడు సాధారణముగా బట్టుపడువాఁడు కాడని నా యుద్దేశము.

అమరేంద్రుడు మునియాబీబీ మాటల నాలకించి యెంతయో విస్మయముతో దదేకదృష్టి నామె మొగమువంక దిలకింప నొడంగెను. కాని యామె ముఖలక్షణములనుబట్టిగాని, యామె విలాస చేష్టితములనుబట్టిగాని యామె హృదయభావము నాతఁ డించుకంతయును గ్రహింపజాలక పోయెను. తుట్టతుద కాతఁడు—"పందెము వైచినచో దప్పకుండ నీ వోడిపోవుదువు!" అనియెను.

"ఓడిపోవుదునని నాకెట్టి భయమును లేదు పందెము వైచినచో నేను సిద్ధముగనే యున్నాను" అని మునియాబీబీ యమరేంద్రుని కడనుండి లేచి మఱియొకచోటికి బోయెను.

అప్పటికి చాల రాత్రి యయ్యెను. సభలోనివా రొక్కరొక్కరే లేచి యింటికి బోవుట కారంభించిరి. చాలమంది పోవుటకు లేచి నిలువబడి యుండిరి. నాగవనితా గానమును, నాట్యాభినయమును సమాప్తమయ్యెను. ఆ సందడిలో నమరేంద్రునకు మునియాబీబీ కనఁబడలేదు.

ఇంతలో నాకస్మికముగా నొక గందరగోళ మారంభమయ్యెను. రణేంద్ర ప్రసాదు ఉచ్చైస్స్వరముతో—"దొంగ! దొంగ!" అని కేకలువైవ నారంభించెను.

అప్పుడట నున్నవా రందఱును భయగద్గద స్వరములతో—"ఏడీ! ఏడీ!—దొంగ, యెక్కడ నున్నాడు!" అని కేకలువైవ నారంభించిరి.

అప్పుడు మహేంద్రుడు రణేంద్ర ప్రసాదు నొద్దకుబోయి శాంత స్వరముతో—"మీరనుచున్న మాటయేమి! నిజముగా దొంగయేనా!" అని ప్రశ్నించెను.

రణేం—ఇప్పుడే నాకా దొంగ కంఠస్వరము వినవచ్చినది. అది నిజముగా నా ప్రమాదుని కంఠధ్వనియే

ఈ మాటవిని యట నున్నవారందఱును స్తంభితులై పోయిరి. ఒక్క నిమిషములో నా మందిర మధ్యమునం దెట్టి శబ్దమును లేకుండ నుండెను. కేవల నిస్సబ్ధము యుండెను. సూది క్రిందబడినం జప్పుడు వినబడునట్లుండెను. కాని యేవైపునుండియు నెవ్వరును మాటామాట లేదు. అందఱును గూడ దదేక దృష్టితో రణేంద్ర ప్రసాదుని మొగమువంక దిలకించుచుండిరి.

అప్పుడు రణేంద్ర ప్రసాదు వారింగాంచి—"నేను నిశ్చయముగా నా దురాత్ముని కంఠస్వరమును వినియుంటిని. తప్పక నా గజదొంగ యీ గుంపులో నెచ్చటనో దాగి యుండితీరవలయును" అనియెను.

అట నున్నవారందఱు నొకరి మొగమువంక నొకరు చూచు కొన నారంభించిరి. అప్పు డాకస్మికముగా నా జనసమూహ మధ్యము నుండి గంభీర స్వరముతో—"మీరెవ్వరు నెంతమాత్రము నాదొంగను బట్టుకొనజాలరు!" అనుమాటలు స్పష్టముగా వినవచ్చెను.

అప్పుడు రణేంద్ర ప్రసాదుడు విశృత స్వరముతో—"వాడే—వాడే—ఆ కంఠస్వరము వానిదే!" అనియెను.

## ప్రకరణము 5

ఇక నూరక విశేషముగా వర్ణించి చెప్పుటకు ప్రయోజన మేమున్నది? తోడనే యచ్చటి వేడుకలు, వినోదములు, నామోద ములు, ప్రమోదము లన్నియు నొక్కసారిగా గట్టువడిపోయెను. బందిపోటు దొంగ యీ భవన మధ్యమునకువచ్చి ప్రవేశించెనని

రణేంద్ర ప్రసాదు చెప్పిన మాటయం దటనున్నవారిలో నొక్కనికైనను విశ్వాసము కలుగలేదు. అప్పుడా మందిరమునం దెచ్చటనైన నెవ్వడైన గ్రొత్తవాఁ డగుపడునేమోయని నాలుగుమూలల నందును బరీక్షించుట ప్రారంభించిరి.

కాని క్రొత్తవాఁ డెవ్వఁడు నా మందిర మధ్యమునం దగపడలేదు. పిమ్మట జాలమంది లాంతరులను జేతఁబూని యింటినుండి వెలుపలికి వచ్చిరి. కాని యెచ్చటను నెవ్వరును క్రొత్తవానిని గనుగొనజాలరైరి. అమరేంద్రుఁడు కూడ గడు జాగరూకుఁడై యన్వేషించుచుండెను. అనుమానింపదగిన మనుష్యుఁ డొక్కఁడును గూడ నగపడుటలేదు. అప్పుడు మరియాబీబీ తన పడకగదికి బోవుచు బోవుచు భయప్రకంపిత స్వరముతో—"ఈ వీధిలో నెచ్చటనైన నొదిగి యుండడుగదా! సమయము చూచి యాకస్మికముగ నాపైఁబడి నా యాభరణము లన్నిటిని దోచుకొనునుగదా!" అనియెను.

అమ—నీ వంతగా భయపడ నక్కఱలేదు. నీతో కూడ గావలసినంతమంది పరిజనులుందురు ఇట్టిచో నా దొంగ యంతగా సాహసించి పని చేయజాలడు.

సభకు వచ్చినవారందఱు నెవరి యిండ్లకు వారు పోయిరి. అందఱి హృదయములను భయప్రకంపితము లగుచునే యుండెను. అప్పుడు నీలరతనబాబు వికల హృదయముతో నమరేంద్రుని యొద్దకు వచ్చి—"అమరబాబూ! ఈ విషయమున నీవేమి యాలోచించితివి? ఆ దొంగ తన గుఱ్ఱము నెక్కియే వచ్చి మన గృహమధ్యమున ప్రవేశించి యుండుననియెదవా?" అని ప్రశ్నించెను.

అమ—అట్లు జరిగి యుండదు. అట్లు వచ్చినచో నొక్కరికి గాకున్న నొక్కరికైన వీధి వెలుపల గుఱ్ఱపు డెక్కల చప్పుడైన వినబడక యుండెనా?

నీల—ఇది యంతయు జాల వింతగా నున్నది. అట్లు గాకున్నచో మఱి యాతఁ డెట్లు వచ్చియుండును? మరల నెట్లు తప్పించుకొని

యెక్కడకు బోయియుండును? రణేంద్ర ప్రసాదుడు పొరపాటు పడు వాడుమాత్రముగాడు. వాడింకను మన యింటి పనివాండ్రలో నెచ్చట నైన దాగియున్నాడేమో?

అమ—ఉండడు! వాడీపాటికి నిశ్చయముగా బాతిపోయియే యుండును. అయినను పత్తేదారుడగు ఫతేఅలీ సాహేబు వచ్చి మన సేవకులుండు చోటంతయును బాగుగా బరీక్షించుచున్నాడు. ఉన్నచో నాతనికి దొరకియే యుండు.

నీల—ఈ విధముగా నింకను దారుణ కృత్యములు జరుగుచునే యున్నచో నీదేశమునం దెవ్వరును నెమ్మదిగా నిలిచియుండుట కవకాశ ముండదు. ఆ దుష్టుడు క్రమముగా తుడకీ నగర మధ్యమునకు గూడ వచ్చుట కారంభించినాడు. పెద్దమనుష్యుల యిండ్లలో గూడ ప్రవేశించుటకు మొదలుపెట్టినాడు! ఎట్లయినను నీదొంగను బట్టుకొనకున్నచో నిక నీ దేశమునందలి ప్రజల ధనమునకుగాని, మానమునకు గాని, ప్రాణమునకుగాని, యెంతమాత్రమును రక్షణ ముండదు.

అమ—మీరాగంతగా దొట్రుపడ నక్కఱలేదు. నేను గాకున్న మఱియొక్క నాటికైనను నిశ్చయముగా నా దొంగ దొరకితీరును

నీల—ఈ వ్యాపారమున నిప్పటి కెంతవఱకు దెలిసికొనగలిగితివి!

అమ—ఇంతవఱకు నే నేమియును గ్రహింపలేదు. ఉపాయము కూడ నాకేమియును దోచుటలేదు.

నీల—పత్తేదారుసాహే బేమైన నాధారమును గనుపెట్టినాడా?

అమ—అతడు కూడ నింతవఱ కేమియును గ్రహింప లేదనియే నా యుద్దేశము.

నీల—అట్లయినచో నిక గత్యంతర మేమున్నది? వాడింకను మనయింటిలో నేమూలనైన దాగికొని యున్నాడేమో?

అమ—ఇల్లు నలువైపులను బాగుగ వెదకి పరిశీలించుట అయినది. వాడు చాలసేపటి క్రిందటనే పలాయితుడై పోయినాడు!

నీల— కాని మనమీయింటిలో నింతమంది యున్నాముగదా ! ఇందొక్క రమైనను నాదొంగ ప్రవేశమును గనుపెట్టజాలక పోయితిమి! ఆహా ! ఎంత వింతగా నున్నది.

అమ— వాడు దొంగయైననేమి ! చాల జరుకైనవాడు. మిగుల జమత్కార చరిత్రము కలవాడు. ఈ విషయమున నెంతమాత్రమును సంశయము లేదు.

నీల— ఇక నీ రాత్రి యంతయును నా కంటికి నిద్రయనుమాట యుండదు.

అని చెప్పి నీలరతనబాబు తన శయన మందిరమునకు వెడలి పోయెను.

ఆతనికారాత్రి సరిగా నిద్రపట్టినదో లేదో చెప్పజాలముగాని నిజముగా సమరేంద్రునకా రాత్రియంతయు నొక్క కునుకైనను రాలేదు. ఆ చోరుని దుష్కృత్యములం గూర్చిన యాలోచనలే ఆతని మస్తిష్క మధ్యమున బ్రవేశించి ఘోరతర విప్లవమును గల్పించుచుండెను. ఆ రాత్రియంతయు నాతని కన్నుల యెదుటనే గడచిపోవుచుండెను. అప్పుడు సమరేంద్రుడా దొంగను గూర్చియే యనేక విధముల భావించుకొనుచుండెను. ఆతని కెన్ని యెన్ని యాలోచనలు తోచెనో యాతనికే స్మృతికి వచ్చుటలేదు. పర్యవసానం బాతం డెప్పటివలెనే— "ఏవిధముగా బ్రయత్నించి యైనను నేనీ దొంగను దప్పక పట్టుకొని తీరెదను" అని స్థిరపఱచుకొనియెను

ఎప్పటివలె నీలరతనబాబు గృహమునందే నివసించియున్నచో నా దొంగను బట్టుకొనుటకు దగిన ఆధారములు దొరకుట యసంభవమని కూడ నాతడు నిశ్చయించుకొనియెను. ఆ మూర్షిదాబాదు నగరమునకు జివర భాగమునందొక పూటకూటి యిల్లున్నది. అచ్చటి కనేక దేశములనుండి జనులు వచ్చుచు బోవుచుందుగు. అంతమంది జనులు కలియుట కవకాశమున్న యా స్థలమునందీ దొంగతనపు

వ్యాపారముంగూర్చి సంగతులేమైనను దెలియవచ్చును. అమరేంద్రుఁడా పూటకూటియింట విడిసియుండి యనుసంధానము చేయవలయునని యాలోచించుకొనియెను.

తరువాత నాతఁడు సింగరసన బాబునకు దన యుద్దేశమును దెలియజేసి యా హోటలునకుబోయి విడిసి యుండెను. నేనొక యుద్యోగమును సంపాదించుకొనుటకై యీ నగరమునకు వచ్చి ప్రయత్నించుచుంటినని యమరేంద్రుఁడా హోటలు యజమానితో జెప్పెను. ఆతఁడా మాట నిజమనియే విశ్వసించెను. అమరేంద్రుఁడీవిధముగా నచ్చట నివసించి యుండెను.

ఆ యింట నా హోటలు యజమానియు నొక దాసియు దక్క నితరు లెవ్వరును లేరు. ఆ యింటి నడవలో నొక పంజరము వ్రేలాడు చుండెను. దానిలోపల నొక చక్కని మైనగోరు యుండెను. దానికన్నిమాటలును వచ్చును. అది కర్ణానందముగా మాటలాడుచుండును. అమరేంద్రుఁడా పూటకూటియింట ప్రవేశించిన దినమున నచటికి కితరు లెవ్వరును రాలేదు. ఆ దినమున నచ్చట భోజనము చేయువాఁడాతఁ డొక్కఁడే. మఱునాఁటి ప్రాతఃకాలమునం దొకరిద్దఱచ్చటికి భోజనమునకు వచ్చిరి. వారా సాయంకాలమందే మరల వెడలి పోయిరి. ఇక నున్నవాఁ డమరేంద్రుఁ డొక్కఁడే.

అమరేంద్రుఁడా హోటలు యజమానితో దఱచుగా నెట్టి సంభాషణమును చేయుటలేదు. ఏ విషయమును గుఱించియైన నాతని నడిగినచో నాతని కనుమానము కలుగునేమో యని యమరేంద్రుఁడు భావించుకొనియెను. ఒక్కసారి యాతనికి సంశయము కలిగినచో నమరేంద్రునకింక నచ్చట నుండుట కవకాశము లేకపోవును.

మూఁడవనాఁటి సాయంకాలమునం దమరేంద్రుఁడా పూటకూటి యింటినుండి బయలుదేఱి యా నగరమున కుత్తరము వైపుననున్న బయటికి షికారుగా బోయెను. అతఁడట్లు కొంతదూరము పోవునప్పటికా బహిరంగ ప్రదేశమునం దొకచోట డేరాలను చాపపాకలను వైచుకొని

నివసించియున్న మందులవాండ్ర గుంపొకటి యాతని కంటబడియెను. మందులవాండ్రు గుంపులు గుంపులుగా జేరి సాధారణముగా దొంగతనములును, దారిదోపిడులును జేయుచుందురను సంగతి యెల్లరకును దెలిసిన విషయమే. అందుచే నమరేంద్రుడు మందులవాండ్రే యీ బాదపోటు దొంగతనములకు మూలకారణమై యుందురని యనుమానించెను. ఏమైన గొన్ని క్రొత్తసంగతులు తెలియునేమో యను నుద్దేశముతో నప్పుడా యమరేంద్రుడా మందువాండ్రు విడిసియున్నచోటికి బోయెను.

ఆ బయలునందొకచో బుష్కరిణీ తీరమున గుడ్డలతోడను, చాపలతోడను డేరాలు వేయబడియుండెను. వానిలోపల నా మందుల వాండ్రు పిల్లలతోడను భార్యలతోడను నివసించి యుండిరి. వారితో గూడ గొన్ని గాడిదలును, గొఱ్ఱెలును, కోళ్ళును, నొకటి రెండు చిన్న చిన్న గుఱ్ఱములును నుండెను. వారిపిల్లలందఱును మట్టిలో బొరలాడుచు నుత్సాహముతో నాటలాడుకొనుచుండిరి. ఆడువాండ్రందఱును వంటపనులయందు నిమగ్నులై యుండిరి. పురుషులు బుట్టలు, తట్టలు, చాపలు మొదలగువాని నల్లుచు గూర్చుండిరి. చాలమంది యడవి వస్తువులను, వనమూలికలను, ననేక విధములగు ద్రవ్యములను, మందులను విక్రయించుటకై పట్టణములోనికి బోయి యుండిరి. కొందఱు బిచ్చమెత్తుకొనుటకై పోయియుండిరి. అవకాశము దొరకినచో వీరు దొంగతనముచేయుట కెంతమాత్రమును వెనుక దీయువారు కారు.

## ప్రకరణము 6

అమరేంద్రు డచ్చటకు బోవునప్పటి కదివఱకు బట్టణములోనికి బోయిన యొక మందులవాడు తిరిగి గుంపులోనికి వచ్చుచుండెను. అమరేంద్రుడు దూరమునుండి చూచి యాతని రాకకు బ్రతీక్షించుచు నట నిలువబడి యుండెను. ఇంతలో నా మందులవా

దచ్చటికివచ్చి యమరేంద్రున కతివినయముతో వంగి సలాముచేసెను. అతని యాకార వికారములును, వేష భూషణములును జూచి వాఁడే యీ గుంపువాండ్రకు యజమానియై యుండునని యమరేంద్రు డూహించుకొనియెను. అప్పు డమరేంద్రుఁడు వానితో నేదో యొక విధముగా సంభాషింప వలయునని యుద్దేశించి మృదుస్వరముతో— " ఓయీ ! నే నిప్పుడు మీ దేశాలను జూడవలయునను కుతూహాలముతో బోవుచున్నాను " అనియెను.

అంత నా మందులవాఁడు మందహాసము చేయుచు—" ఆలాగా బాబూ ! అట్లయినచో దయచేయుఁడు. మాయిండ్లలో జూడవలసిన వేమున్నవి బాబూ ! కేవలము మా దుఃఖములును, మా కష్టములును మాత్రమే—మా కాధార మేమున్నది ? ఇల్లే యీ యూరు గాదని యా యూరికి, ఈ దేశము గాదని మా దేశమునకు గడుపు గడవక తిరుగుచుందుము. బాబూ ! మా బ్రతుకెప్పుడును గష్టములతో గడచిపోవలసినదే—మాకు గతియేమున్నది ? మా కష్టములను జూచి జాలిపడి మమ్మాదరించువా రెవరున్నారు ?" అనియెను.

అమ—అదియేమి యట్లనుచున్నావు ? మీ జీవితమే విశేష సుఖకరమైనది మీ రెప్పుడును జల్లని గాలిచే నారోగ్యదాయకముగు బట్టబయట నివసించి యుందురు. అనేక దేశములు తిరిగి చిత్ర విచిత్రములను గాంచుచుందురు. కష్టపడి పనిచేసికొని సుఖముగా భోజనము చేయుచుందురు.

అనంతరము నా మందులవాఁడు మరల నవ్వుచు—" బాబూ ! మాయంతటి కష్టజీవులీ లోకములో నింకెవ్వరు నుండరు. దయచేసి మా కష్టసుఖముల నన్నిటిని బాగుగ బరీక్షింపుడు ! మీ కేమైన మందులు కావలయునా ? ఎల్లప్పుడు నడవుల వెంబడినే తిరుగుచుండు వారము. కావున మాకు దెలిసినన్ని యోషధులు మఱి యెవ్వరికిని దెలియవు. మీకు గావలసినచో మాయొద్ద మంచి మంచి మందు లున్నవి " అనియెను.

అమ—సరే, మందుల సంగతి చూతము. మీరందఱు నిప్పు డెచ్చటనుండి యిచ్చటికి వచ్చినారు?

మందు—బాబూ! మా కెచ్చటనైనను స్థిరమైన నివాస మనునది యొకటిలేదు. ఈ దినమున నిచ్చట నుండెదము. రేపు మఱి యొకచోటికి బోయెదము, ఇక నొకటి రెండు దినముల లోపలనే మేమిటనుండి మఱియొక చోటికి బయలుదేఱి పోయెదము

అమ—అలాగా! ఈసారి మరల నేయూరికి బోవదలచితిరి?

మందు—ఇంకను నేమియును స్థిరపఱచుకొనలేదు దేవు డెక్కడకు మమ్ముల దీసికొని పోవదలచెనో యక్కడకు బోయెదము.

అప్పు డమరేంద్రుడు తనలో—“ఈ దొంగముండకొడుకు తా మెక్కడనుండి వచ్చినదియు, నిటనుండి మరల నెక్కడకు బోవు నదియు నెన్నివిధముల బ్రశ్నించినను జెప్పకున్నాడు. ఇక నీ పద్ధతిని విడిచి మఱియొకలాగున మాటలాడవలయును” అని యూహించుకొని—“ఓయీ! మీగుంపులోనివారందఱు నెంతమందియున్నారు?” అని ప్రశ్నించెను.

మందు—బాబూ! ఎంతోమంది యున్నారా? ఇరువదిమంది—ఇరువదియైదుగురికంటె నెక్కువమంది లేరు.

అమ—మీ కందఱకును సంసారములు గడచుటకు వృత్తియేమున్నది?

మందు—ఇదిగో! చూచుచుంటిరిగదా బాబూ! ఇల్లే బుట్టలు, తట్టలు నల్లుకొని యమ్ముకొనుట, పిల్లల యాటల కొఱకు దాటి యాకుల గిలకలు, పిల్లనగ్రోవులు చేసి తీసికొనిపోయి ఇచ్చి బియ్యమో నూకలో తెచ్చుకొనుట, అనేక విధములగు వనౌషధులను, స్వయముగా జేసిన మందులను విక్రయించుట; ఇవియే మా వృత్తులు.

ఇట్లు మాటలాడుకొనుచుబోయి వారిరువురును మందులవాండ్ర డేరాలనడుమ బ్రవేశించిరి. క్రొత్తవాడైన యమరేంద్రునిం గాంచి

వంతనే యటనున్న స్త్రీలును, బురుషులును, బాలికలును, బాలురును నలుదెసలనుండివచ్చి యతని చుట్టును జేరి వింతగా జూడ నారంభించిరి. అందు గొంతమంది యనేక విధములగు వస్తువులను జూపుచు—“మీరు వీనిని గొనియెదరా ?” అని పీడింప దొడంగిరి. మఱికొందరు వివిధములగు మందులను దెచ్చిచూపుచు నవి యే యే రోగముల కుపయోగించునో వర్ణింప దొడంగిరి. అప్పు డమరేంద్రుడు వారి నందఱిం గాంచి—“నే నిచ్చటికి గూరక షికారుగా వచ్చియుంటిని. మీరు చెప్పిన వస్తువు లేవియును నాకక్కఱలేదు” అనియెను.

ఆ మాట విన్నతోడనే వారందఱు హతాశులై యటనుండి వెడలిపోయిరి. అమరేంద్రునితో గూడవచ్చిన మందులవాడొక్కడు మాత్రమే యాతని పార్శ్వమునందు నిలువబడి యుండెను. తరువాత నాత డమరేంద్రుని దన డేరాకు దీసికొనిపోయి నిమిషములో దంబాకు సిద్ధముచేసి మిగుల భయభక్తులతో నాతని కొసంగెను. అమరేంద్రుడును దంబాకు సేవించుచు, సేవించుచు—“ఓయీ ! నీ పేరేమ” ని ప్రశ్నించెను.

మందు—బాబూ ! నా పేరు లోచనుడు—లోచనుడని నన్ను వీరందఱును బిలుచుచుందురు. మందులవాండ్రకు మంచిపేరనగా నేమి బాబూ ! మేము చాల గష్టజీవులము.

అమ—ఈ గుంపులోనివారి కందఱకును నీవే నాయకుడవని తోచుచున్నది నిజమేనా ?

లోచ—బాబూ ! నాయకుడనగా నేమి ! కాని వీరందఱును నన్నెల్లవిధముల బెద్దగా గౌరవించుచుందురు. నే నెట్లు చెప్పిన నట్లు నడచుకొనుచుందురు.

ఇట్లు వారు సంభాషించుచుండగా నింతలో నచ్చోటికొక బాలిక వచ్చెను. ఆమె నిదముగా బాలికయేయని చెప్పుటకు వలను పడదు. ఆమె వయసు పండ్రెండేండ్లకు దక్కువ యుండదు. ఆమె

యాకారమును, వేషమును, విలాపమును జూడగా మందులవాండ్ర
బిడ్డవలె గానవచ్చుటలేదు. ఆమె శరీరచ్ఛాయ గౌరమై కాంతి
మంతమై యుండెను. ఆకస్మికముగ జూచినంతనే యామె యసాధారణ
సుందరమూర్తివలె నుండెను. ఆమె కేశములను మలిన వస్త్రమును
కట్టుకొనియుండెను. ఆమె యొడలియం దెచ్చటను నమూల్యాలం
కారము లేవియును లేవు. ఘాసంపేరులం గాల్చియున్నను నామె
భూలోక దేవసుందరివలె జూపఱి హృదయముల నాకర్షించుచుండెను.
ఆమె విశాల నయనములు రెండును నక్షత్రములవలె దేజోమయములై
యుండెను. ఆ మనోజ్ఞ తరళ నయనములవలెనే యా బాలికామణి
వదన మండలము మఱింత యందముగా నగపడుచుండెను. అమరేంద్రు
డా బాలికారత్నమును జాలసేపటివఱకు విముగ్ధ నయనములతో
దిలకించి పరమాద్భుతనిమగ్న హృదయుడై యా లోచనునిం గాంచి—
"ఈ బాలికామణి యెవ్వరు?" అని ప్రశ్నించెను.

లోచను డేమియో ప్రత్యుత్తరము చెప్పుటకు జూచుచుండ
గనే యా సుందర బాలికా శిరోమణి చటాలున—"నాపేరు కుంజ—
నేను మందులదానను" అని చెప్పివైచెను

లోచనుడు కన్నులెఱ్ఱజేసి కనుబొమలు ముడివడ మిగుల
విరక్తుడై పోయెను. అప్పుడాతడు కుంజవంక దిరిగి తన భయంకర తీవ్ర
దృష్టుల నామెపై ప్రసరింప జేసెను. అందువలన నా సుందరీమణి
పూర్ణముగా దన కిష్టములేకపోయినను నచ్చటనుండి స్థానాంతరము
నకు బోవలసిన దయ్యెను. ఆ బాలిక యట్లు వెడలిపోయినంతనే
లోచను డమరేంద్రునివంక దిరిగి—"బాబూ! ఈ బిడ్డను జూచుట
వలన మీ కెంతయో యాశ్చర్యము కలిగియుండవచ్చును. ఔను.
ఇది మా మందులవాండ్రవలె లేకపోవుటచే నాశ్చర్యము కలుగదా!
ఈమె తల్లిని పశ్చిమ దేశమునందొక వర్తకుడు పెండ్లియాడినాడు.
ఈ బాలిక జనియించినంతనే యీమె తల్లిదండ్రు లిరువురును

మరణించిరి. తరువాత నేనే ఈమెను దీసికొనివచ్చి పెంచి పెద్దదానిని జేసితిని" అని చెప్పెను.

అమరేంద్రున కా మాటలయందు విశ్వాసము కలిగెనో, లేదో చెప్పజాలము గాని యా బాలికా శిరోమణిం గాంచినంతనే యా నవయౌవనుని తరుణ హృదయాంతరాళమునం దేదియో యనిర్వాచ్యమగు నూత్నభావోదయ మయ్యెను. ఆ సుందరీమణి యాకస్మికముగ వచ్చి యంతలోనే వెడలిపోవుట యాతని కెంతయో కష్టముగా నుండెను. ఆతని నయనాంతరాళమున నానంద విద్యుద్వల్లి తళుక్కున నొక్కసారి మెఱసి క్షణములో మాయమైపోయినట్లయ్యెను. ఏమియును దోచనివానివలె నప్పుడాతడు చటాలున లేచెను. ఇంతలో బాహ్యస్థితి స్మృతికి వచ్చుటచే నమరేంద్రుడు లోచనునిం గాంచి—"లోచనా! మీరందఱును నొక గుంపుగా జేరి యనేక దేశములను దిరుగుచుందురు గదా! ఆ బందిపోటు దొంగను గూర్చి మీ రిచ్చటనైన నేమైన వినియుంటిరా!" అని ప్రశ్నించెను.

లోచ—మా కేమియును దెలియలేదు బాబూ! ఎవరి సంగతులైన మా కెట్లు తెలియును! మావంటి పరమ మూర్ఖులగు నడవి వాండ్రతో నెవ్వరు మాటలాడుదురు? పొట్ట చేతబట్టుకొనిపోయి యెట్లో కాలక్షేపము చేసికొనుటయే కాని యెవరి జోలియైనను మా కెందులకు బాబూ!

అమరేంద్రు డటనుండి బయలుదేఱి పూటకూటి యింటి మొగముగా బోవుచుండెను లోచనుడు నతివినయముతో నాతని సాగనంపుచుండెను. కుంజయును వారివెనుకనే వచ్చుచుండెను. ఆ బాలికను లోచనుడుగాని యమరేంద్రుడుగాని చూడనేలేదు. కొంతసేపటికా బాలికయే—"నేనును వచ్చుచున్నాను. ఎందుచేతనో గాని యా వర్తకుడు" అనుచుండగనే లోచనుడు విరక్త భావముతో నామెవంక దిరిగి చూచి భయంకరముగ నదలించి పరుష తీవ్ర

స్వాగముతో—"ఏమి ! నీవు మాతో కూడ నేల వచ్చుచున్నావు ? పొమ్మా ! ఇంటికి బొమ్మా !" అనియెను.

గత్యంతరము లేక కుంజ వెడలిపోయెను. అప్పుడు లోచన డమరేంద్రునిం జూచి—"బాబూ ! మేము నిరుపేదవాండము. కష్ట జీవులము. వర్తకులతో మాకేమి పనియుండును ?" అనియెను.

అమరేంద్రు డాతనితో ననేక విషయములం గూర్చి మాటలాడుచు నడచుచుండెను. ఒక్కసారిమాత్రము కుంజకొఱకు వెనుదిరిగి చూచెను. ఆ సుందరీమణి మఱి యగపడలేదు. ఆకస్మికముగ నాతని కన్నులు చీకటులు గ్రమ్మినట్లయ్యెను. లోచనుడు కూడ నాతనితో గొంతదూరము వఱకును వచ్చి సెలవు తీసికొని వెడలిపోయెను.

అమరేంద్రుడు హోటలునకు దిరిగి వచ్చుచు దనలో— "ఆ బాలికకా బందిపోటు దొంగ సంగతి కొంచెమో గొప్పయో తెలిసియుండునని తోచుచున్నది. కానున్నచో నేను దొంగను గూర్చి ప్రస్తావించుచుండగా నామె యూ వర్తకుని మాటయెత్తుట యెందులకు ? వర్తకుడా ? అతి డెవ్వడై యుండును ? ఏ జాతివాడో ? అతడు నేనున్న హోటలులోనే నివసించి యుండెనేమో ?" అని ఈవిధముగ నాలోచించుకొనుచు నాందోళిత హృదయముతో బూటకూటి యింటికి వచ్చెను.

## ప్రకరణము 7

అమరేంద్రుడా రాత్రియంతయు నాబందిపోటు దొంగ సంగతులను గూర్చియే యనేక విధముల నాలోచింప దొడంగెను. అతడు తనలో—"లోచనునకే దొంగను గూర్చి యేమైన గొంతవఱకు దెలిసి యుండవచ్చును. అతని యాకార వికారములనుబట్టి చూడగా

నాకిట్లనుమానము కలుగుచున్నది. నేనా దొంగ ప్రసంగమును గూర్చి ప్రశ్నించినప్పు డాత డంతలోనే యా ప్రస్తావమును మార్చివేయుట యేమి? ఈవిషయమును గూర్చి సంభాషించుటకే యాతడు కేవలమును విరక్తుడై యుండుటయేమి? ఆ బాలికామణియగు కుంజ యేమేమో మాటాడినంత మాత్రమున నాత డంతగా భయపడుటకు గారణమేమి? తరువాత నాతడు కుంజను మరి యేమియు మాటాడనీయకుండ భీకరముగ వదలించుటయేమి! ఏమైననుగాక! ఏదోయొక విధముగ నింతకాలమునకు దరువాత నీ దారుణ కృత్యము ననుసంధానము చేయుట కేదియో కొన్ని యాధారములు లగపడుచున్నవి. లోచనుడు వర్తకుడు ఈ యిరువురిని గూర్చియు బాగుగ నాలోచింపవలసి యున్నది. వీరిలో నెవరియో కొంతవఱకు రహస్యమును దీయవలయును. ఒకసారి కుంజ యొద్దకు బోయి రహస్యముగా నామెతో మాటాడవలయును. ఆమెకు నిశ్చయముగా నీసంగతి తెలిసియుండును. సరళహృదయయగు నా బాలిక నింకొకసారి మరల యడిగినచో సర్వమును దెలుపగలదు. కాని యతిజాగరూకతతో నీవిషయమున ననుసంధానము చేయవలసి యున్నది. నేను చేయుచున్న ప్రయత్నము నాలో నెవ్వరికైన నేమాత్రము తెలిసినను గార్యమంతయు విధ్వస్తమై పోవును. ముందుగా నీ హోటలు యజమానుని గొన్ని సంగతు లడిగి తెలిసికొనవలయును. ఆ వర్తకుడీ హోటలులోనికి రాకపోయినను నాతడు మందులవాండ్ర దేవాల యొద్దకు బోవునప్పుడీ త్రోవనేపోయి యుండవలయును. ఈ నగరమునుండి యటకు బోవుటకు మరియొక మార్గమేమున్నది? ఏమైననేమి! ఈసంగతిని గూర్చి తప్పక హోటలు యజమానునితో నాలోచింప వలయును. ఆతడు ప్రతిదినమును బగలు రెండుజాములవేళ హాయిగ దంబాకు సేవించుచు నుత్సాహముతో నుండును. అదియే యాతనితో మాటలాడుటకు దగిన సమయము" అని యీ విధముగా నాలోచించుకొని నిశ్చయించుకొనియెను.

మఱునాడు పయుక్త సమయమున సమరేంద్రుడు మెల్లగా బోయి హోటలు యజమానుని చెంత నెమ్మదిగ కూర్చుండి లోకాభిరామాయణమును గూర్చి మాటలాడుట కారంభించెను. మంచి సమయము చూచి యాత్రికా వర్తకునిగూర్చి యడుగవలయునని నిరీక్షించుకొని యుండెను. కాని యాతడు మాటలాడుచున్న వేళకు సరిగా లోచను డచ్చటికి వచ్చి సమరేంద్రుని గాంచి యాగినట్లుగా నచ్చట నిలువబడిపోయెను. అట్లాగుచు కొంతసేపుండి—"బాబూ! మేమీరాత్రియే యీ మంచులో నీ చలిలో బయలుదేరి పిల్లలతో గూడ నిచ్చటనుండి మఱియొక చోటికి పోవుచున్నాము! మేమెప్పుడును కష్టజీవులమే కాదా బాబూ!" అనియెను.

సమ—ఈ రాత్రియే యిటనుండి పోయెదరా! ఆ దినమున నేను మీ గుంపులోనికివచ్చి మిమ్ముల నందఱను జూచితిని. నాకు చాల సంతోషమైనది. మఱియొకసారి మీ డేరాలయొద్దకువచ్చి చూడవలయు ననుకొనుచున్నాను.

లోచ—బాబూ! ఇచ్చటకువచ్చి చాల దినములైనది. ఎల్లప్పుడు నొక్కచోటనే యున్నచో మాపొట్టగడచుట యెట్లు?

ఆ మాటవిని హోటలు యజమాని చిరాకుపడుచు—"పోండు! మీ రిచ్చటనుండి లేచిపోయినచో నేను హాయిగా నిద్రపోవుదును. మీ గుంపులవాళ్ళు చేరియున్న చోటులనెల్ల నెప్పుడును దొంగతనములును, బందిపోట్లును జరుగుచునే యుండును. మీ రిచ్చటికి వచ్చినది మొదలు పొరుగూరినుండి యెవ్వరును నా హోటలునకు భోజనమునకు వచ్చుటయే లేదు. ఏ రాత్రివేళలో నెప్పుడు దొంగలు కొట్టుదురో యని యెవ్వరు నీయూరు వచ్చుటయే మానివైచినారు. మీ రిక్కడకు రానప్పుడు నా హోటలు ప్రతిదినమును మార్గస్థులచే క్రిక్కిరిసి యుండెడిది. ఇప్పు డొక్కడైనను లేడు. మీ మూలముననే నా రాబడి యంతయును చెడిపోయినది" అని ధిక్కరించెను.

అంతయే మంచిసమయమనియెంచి యమరేంద్రు డాతనింగాంచి- "అయ్యా! మీ హోటలునకు వర్తకు డెవడైన భోజనమునకు వచ్చి యుండెనా?" అని ప్రశ్నించెను

హోటలు యజమాని యామాట కింకను ప్రత్యుత్తరము చెప్పకుండగనే లోచనుడు నవ్వుచు—"బాబూ! మీమనసులో నింకను మాకుండ చెప్పిన మాటయే మెలగుచున్నది కాబోలును! ఎవ్వడోగాని యొక చిన్నవర్తకుడు మాడేరాలయొద్ద కేవియో కొన్ని వస్తువులను గొనవలయునని వచ్చినమాట నిజమే!" అనియెను.

ఆ మాటకు హోటలువాడు మండిపడి రోష తీవ్ర స్వరముతో- "ఎఱుగుదును—ఎఱుగుదును! వాడిక్కడకు గూడ వచ్చినాడు. ఎప్పుడును దేశములు తిరుగుటయే ఆతని పనియట! నేను మీయింట స్వయముగా వంటచేసికొని భోజనము చేయుదుననియు, వెడలిపోవు నప్పుడు రెండణాలు మీకద్దెకింద నిచ్చెదననియు నాతో బేర మాడినాడు. నే నెంతమాత్రము నంగీకరింపక యాతని దూరముగా దరిమివైచితిని!" అనియెను.

లోచ—అందుచేతనే యాతడిచ్చటినుండి మాడేరాలయొద్దకు వచ్చినాడు.

హోట—ఔను! అటువంటివాడు మీగుంపులో జేరక మఱి యేమిచేయును? వానివాలకము చూచినప్పుడే నాకనుమానము కలిగినది.

లోచ—మాలో జేరుట యనగ నేమి బాబూ! ఆతడు మమ్ములను భయపెట్టి మాయొద్దనున్న వస్తువులను గొనవలయునని ప్రయత్నించినాడు. ఆ సంగతి చూచి నేనుకూడ నాతని నచ్చటనుండి బలవంతముగా గెంటివైచితిని.

అమరేంద్రుడు వారి సంభాషణము నాలకించుచు నేమియు మాటాడక యూరకుండెను. ఆ యిరువురి సంభాషణములోను బంది పోటు దొంగ సంగతి యేమైన బయలుబడునేమో యని నిరీక్షించి

యుండెను. కాని యీ యిరువురి మాటలలోను గూడ నా విషయ మేమియును రాలేదు. అప్పు డాతడు హోటలు యజమానిం గాంచి—"అయ్యా! ఈ నడుమ నీ ప్రాంతములయందు జరగిన యతి దారుణంబులగు దారిదోపిడులంగూర్చి మీ రేమైన వినియున్నారా?" అని ప్రశ్నించెను.

హోటలువాడు క్రోధకంపిత స్వరముతో—"వినకేమి? ఆ దుష్కృత్యము లన్నియు నీ గుంపులవాళ్ళ పనులే. వీళ్ళతో గూడ నొక వర్తకుడు తిరుగుచున్నట్లు వినియుంటిరిగదా!—దీనిని బట్టియైనను మీకు సత్యము బోధపడుటలేదా?" అనియెను.

అప్పుడు లోచనుడు మొగము చిట్లించుకొనుచు—"బాబూ! నిరుపేదలమగు మాకు దిక్కేమున్నది! మాకిచ్చట దల్లియా, తండ్రియా! ఎవ్వరేతప్పుచేసినను మామీదికే వచ్చును. దొంగ యనినను, దోపిడిగాండ్రనినను మేము చచ్చినట్లు పడి యూరకుండ వలసినదే—" అని పలుకుచు మెల్ల మెల్లగా నటనుండి వెడలిపోయెను.

అప్పు డమరేంద్రుడు హోటలువానిం జూచి—"అయ్యా! మీ రిప్పుడు చెప్పిన సంగతి యేమో నాకు సరిగా బోధపడలేదు" అనియెను.

హోటలువాడు విరక్త భావముతో—"అలాగా? ఇంత మాత్రము తెలిసికొనలేని మీవంటివారికి బోధపఱచునంతటి సామర్థ్యం నాకు లేదు" అనియెను.

అమ—అయ్యా! కోపపడవలదు. ఇంకొకసారి సెలవిచ్చినచో స్పష్టముగా దెలిసికొందును.

హోట—ఇందంతగా దెలియని విషయమేమియును లేదు ఈ గుంపువాళ్ళు దారులుగొట్టి దోచుకొనుచుందురు. వీరు దోచుకొన్న వగల నన్నిటిని రహస్యముగా నా వర్తకున కిచ్చుచుందురు—వాడు వాని నన్నిటిని దీసికొని పెద్ద పెద్ద పట్టణములకుబోయి రహస్యముగా విక్రయించివైచుచుండును.

యమరేంద్రుడు నవ్వుచు—"అయ్యా! ఆ వర్తకుడు మీ హోటలులో దిని మీ కేమియు నియ్యలేదని కాబోలును మీ కాతనిపై నింతకోపము!" అనియెను.

ఆ మాటలు విని హోటలు యజమాని తన మొగమును మఱింత వికృతముగ జేసికొని—"అయ్యా! ఈ మంచులవాండ్రందఱును కేవలము సాధువంతే యుండుకొనుచున్నారా! వీరందఱును దొంగలే. దారులు గొట్టుటయే వీళ్ళపని. ఈ సంగతి యందఱకును తెలిసినదే—" అనియెను.

అమ—అయ్యా! మీ మాట త్రోసివేయ దగినది కాదు. నిజమే కావచ్చును. కాని యా వర్తకు డిచ్చుటకై వచ్చిన దినమున మీ హోటలులోనికి మఱి యెవ్వరైన వచ్చియున్నారా!

హోట—ఆ! వచ్చియున్నాడు. ఆయన వచ్చుటచేతనే యా దినమున వాడు నాకేమియు నియకుండ బోయినను నే నంతగా గోపగింపలేదు.

అమ—ఎందుచేత ?

హోట—ఆ దినమున మంచి పెద్దమనుష్యు డొక డిచ్చటకు వచ్చియుండెను ఎంత మంచివాడనుకొన్నారు! అతని యాకార మతి సౌమ్యమైనది, ఆతని మాటలు కూడ నాకారమునకు దగినవే—అతడు నాహోటలులో నొక్కపూట భోజనముచేసి పూర్తిగా నొక్క రూపాయి నాకిచ్చినాడు. అంతటి సరసుడు నాకగపడలేదు.

అమ—ఆ దినమున వచ్చిన వర్తకుడా పెద్దమనుష్యుని గూర్చి మిమ్ముల నేమైన నడిగి యుండెనా ?

హోట—లేదు. అట్టి తుచ్ఛున కంతటి పెద్దమనుష్యునితో బని యేమియుండును ? ఆ దొంగముండకొడుకు కాదినమున నాప్రాణము విసిగించివైచినాడు. అతడు త్రాగుటకు మంచినీళ్ళు కావలయునని యడిగినాడు. నేనొక చెంబుతో నీరు తెచ్చియిచ్చితిని. ఈపాత్రములో

సిల్లు జిడ్డుగానున్నవనియు, నిందులో మట్టియున్నదనియు, నిందేదియో పడినటనుమానముగా నున్నదనియు నిషేధించుట కారంభించినాడు. నేనీ పాత్రము కాదని యింకొక పాత్రతో నీరు దెచ్చి యిచ్చుచుంటిని. ఈ దకెట్లో దాహము త్రాగి యాతడు పోయినాడు. ఆ దినమున నా పెద్దమనష్యుడు నాకు దలపని తలంపుగా రూపాయ నిచ్చుటచే నా సంతోషములో నుంటిని గాని లేకున్నచో నప్పుడాతడు చేసిన పనికి నేనాతని దౌడలందు గవ్వలవలె రాలునట్లు రెండు మూడు లెంప కాయలు కొట్టియే యుందును. అదృష్టవశమున నప్పుడాతనికా యోగమిట్లో తప్పిపోయినది.

అమరేంద్రున కప్పుడెన్నియో సంగతులు తెలిసినట్లుగా నెంతో యుత్సాహము కలిగెను. అప్పుడాతడు తనలో—"ఆ వచ్చిన పెద్దమనుష్యుడే యా బందిపోటు దొంగయై యుండును. ఆ వర్తకుడు కూడ వానితో సంబంధించినవాడే—ఆ పెద్దమనుష్యుడు దాహ పాత్రమునం దడుగుభాగమున నేవియో సంకేతాక్షరములను లిఖించి యుండవచ్చును. అట్లే కాకయున్నచో రెండవవాడగు నా వర్తకుడు దాహమని నెపము పెట్టి యన్ని పాత్రలను దెప్పించ వలసిన యావశ్యకమేముండును! ఈ నా యూహ నిజమైనను గాకపోయినను సరియే గాని యీ హోటలునందలి దాహపాత్రము లన్నిటి నొకసారి బాగుగ బరిశీలించి చూడవలయును" అని నిశ్చయించుకొనియెను.

తరువాత యథాసమయమున నమరేంద్రుడా యింటియందలి దాహపాత్రముల నన్నిటిని బాగుగ బరీక్షించుచుండెను. అందొక పాత్రమున కడుగుభాగమున బదనైన యినుపశలాకతో నేవియో యక్షరములు వ్రాయబడి యున్నట్లుగా నాతని కంటికగపడియెను. అప్పుడాతడు పరమోత్సాహముతో నా యక్షరములను బరీక్షించెను. అందిట్లు వ్రాయబడి యుండెను—

"ఎండిపోయిన చెట్టు—కుడివైపున బది గజములు—ఎడమ వైపున నాలుగు గజములు—త్రిశూలము !—"

## ప్రకరణము 8

ఆ పాత్రమున కడుగు భాగమున నీ విధముగా నతి గంభీర రహస్య పూర్ణంబులగు కొన్ని మాటలు వ్రాయబడి యుండుటం గాంచి అమరేంద్రుడు కేవలమును విస్మితుడై పోయెను. ఆ మాటలలో నేదియో యతి నిగూఢమగు రహస్య ముండితీరునని యాతడు నిశ్చయించుకొనియెను.

అమరేంద్రున కప్పు డెన్నియో యనుమానములు కలిగెను. ఆ పెద్దమనుష్యు డాకస్మికముగా నీ హోటలునకు భోజనమున కేల రావలయు? అంత గొప్పవా డిట్టి చిన్నహోటలులో భుజించునా? ఒక పూట భోజనము చేసినంత మాత్రమున నాతడీ హోటలువానికి రూపాయ నిచ్చుటయేమి?—అతడు వచ్చిన తరువాతనే ఆ వర్తకుడు కూడ నిచ్చటికి వచ్చెను. వచ్చిన యాతడు దాహమని చెప్పి యొక పాత్రము కాదని నాతి యొక పాత్ర మడుగుచు హోటలువానిని బేధించుట కాతనికి ముఖ్యోద్దేశ మేదియో యుండితీరవలయును. ఎవ్వరు నాతనిం గూర్చి యనుమానింపకుండ నందువలననే యీతడు హోటలువానితో జగడము పెట్టుకొని మనుములవాండ్ర గుంపులోనికి బోయియుండెను.

ఈ విషయము లన్నిటిని బట్టియు బాగుగ నాలోచింపగా మొట్టమొదట నీ హోటలునకు వచ్చిన ఆ పెద్దమనుష్యుడే యీపాత్రము క్రింద నీసంకేతాక్షరములను వ్రాసియుండవలెననియు తరువాత వచ్చిన యా వర్తకుడే దేనో నెపమున పాత్రముల నన్నిటిని దీకించి తుదకీ సంకేతాక్షరములను దెలిసికొని పోయి యుండవలెననియు దోచుచున్నది. ఆ యిరువురును నతి నిపుణముగ నిట్టి యేర్పాటు చేసికొని యుందురు. ఒకరి నొకరు చూచి మాటాడినచో నెవ్వరైన ననుమానింతురని యెంచి యీ విధముగా బరస్పరోద్దేశములను దెలిసికొనుటకు మంచి

మార్గ మేర్పఱచుకొన్నారు! ఆ వర్తకు డనేక ప్రదేశములకుబోయి యేమేమియో సరకులనుగొని యమ్ముకొనుచున్నట్లు నటించును. ఆ పెద్దమనుష్యుడు సత్ప్రవర్తకునివలె నతి చమత్కారముగ నటించుచుండును. ఇక వీరియెడల నెవ్వరికైన ననుమానము కలుగుట కవకాశమేమున్నది? ఎన్నివిధముల భావించినను నిశ్చయముగా నా పెద్దమనుష్యుడు, వర్తకుడు, లోచనుడు ముగ్గురును గూడ నొక గుంపులోనివారేయని తోచుచున్నది. కాని యశ్వారోహియగు నాబందిపోటు దొంగకును వీరికిని నెట్టి సంబంధమున్నదో తెలియుటలేదు. సంబంధ మున్నదని స్థిరపఱచుకొనుటకు గూడ నింతవఱ కెట్టి యాధారము నగపడుటలేదు. ఏమైనను నీ ముగ్గురును మాత్రము తప్పకుండ దొంగలేయని స్థిరపఱచుకొనుట కెట్టి సంశయములేదు— ఆ పెద్దమనుష్యుడు స్వయముగా దొంగతనముచేసి గాని దొంగ వస్తువుల నేప్రదేశమునందో పూడ్చియుంచి ఈ విధముగా హోటలునకువచ్చి రొక పాత్రముపై సంకేతాక్షరములను వ్రాసి పోవుచుండును. తరువాత వర్తకుడువచ్చి యిట్లే ఆ సంకేతమును గ్రహించి పోవుచుండును. అనంతర మాతడా వస్తువులున్న చోటికిబోయి త్రవ్వి తీసికొని వడలిపోవుచుండును. ఆహా! ఇది యెంత యద్భుతమైనపద్ధతి! దొంగలలో గూడ నెంత నైపుణ్యమున్నది! వీరికిగల యీ బుద్ధిశక్తి యంతయును మంచికార్యములయందు వినియోగపడినచో లోకమునకెంత యుపకారకరముగా నుండును! — ఈ సంకేత శబ్దములనుబట్టి చూడగా నెండిపోయిన చెట్టునకు గుడివైపున బదిగజముల దూరమునను, నిడమవైపున యున్నదనియు నచ్చట నానవాలుగా త్రిశూలము పాతబడి యుండెననియు దెలియజేసినట్లు తోచుచున్నది. ఇందులకెంతమాత్రమును సందేహములేదు. ఒకసారి పోయి చూచినచో నన్ని సంగతులును స్పష్టముగా దెలియును" అని యమరేంద్రుడు స్థిరపఱచుకొనియెను.

తరువాత నాతడు హోటలు యజమానితో నీ విషయమును గూర్చి మాటాడకుండగనే యెండిపోయిన చెట్టెవైపున నున్నదో యని జ్ఞప్తికి దెచ్చుకొన నారంభించెను అతడు తఱచుగా సాయంకాలమున బయటికి షికారు పోవుచుండెను. కాని యట్టి శుష్క వృక్ష మెచ్చటనైన నాతని కంటబడినట్లు స్మృతికి రాలేదు

ఇక నూరక శ్రమపడి యాలోచించుటవలన లాభములేదని యెంచి యమరేంద్రు డప్పుడు హోటలువాని యొద్దకుబోయి— "అయ్యా! ఈచుట్టుప్రక్కల నెక్కడనైన నెండిపోయిన చెట్టున్నదియా! నాస్నేహితుడు నాతో మాటలాడవలసిన పనియుండి యెండిపోయిన చెట్టుకడకు సాయంకాలమువచ్చి కలిసికొన వలయునని నాకు జాబు వ్రాసియున్నాడు కాని యా చెట్టెచ్చటనున్నదో మాత్రము వ్రాయలేదు. అందుచే నాకేమార్గమును దోచకుండ నున్నది. అట్టి చెట్టును గూర్చి మీకేమైన దెలిసినచో జెప్పెదరా?" అని యడిగెను.

హోట— అదియేమి? మీకెప్పుడు నగపడనేలేదా! మన హోటలునకు కుత్తరము వైపుననున్న పొలము బయట నొక పురాతన ప్రకాండ భూరుహము శుష్కించిపోయి యున్నది— మీ స్నేహితుడు వ్రాసినది యా వృక్షమును గూర్చియే యైయుండును.

అమ— మీరు చెప్పినమాట నిజమే కావచ్చును. నేనచ్చటి కొకసారిపోయి చూచి వచ్చెదను.

అని చెప్పి యమరేంద్రు డప్పుడే యా హోటలు బయటికి బయలుదేఱి పోయెను. అప్పటికి సంధ్యాసమయ మగుటకు నెంతయో విలంబములేదు అమరేంద్రుడు త్వరితముతో నడచి పోవుచుండెను. మందులవాండ్రింకను వెడలిపోలేదు. వారి డేరాలు దూరమునుండి యాతని కగపడుచుండెను. ఆ మందులవాండ్రదా బయటికి దూర్పు భాగమున బుష్కరిణియొద్ద విడిసి యుండిరి. ఆ యెండుచెట్టా బయటికి బడమటివైపున నున్నదని హోటలు యజమాని చెప్పియుండెను. అమరేంద్రుడా దిక్కుగనే పోవుచుండెను.

ఇంతలో నాకస్మికముగ నాతని వెనుకవైపునుండి—"అయ్యా! అమరేంద్రబాబూ! మీరు క్షేమముగా నున్నారా?" అనుమాటలు వినబడియెను.

అమరేంద్రుడు ఉలికిపడి వెనుకకు దిరిగి చూచెను. అంతటి మధుర మోహన స్వరముతో బలుకరించినవారింకెవ్వరు? మందుల బాలికయగు కుంజయే—ఆ బాలికకు దన పేరెట్లు తెలిసినదో యని యమరేంద్రున కెంతయో విస్మయము కలిగెను. ఏవిధముచేనైన నా బాలిక నింకొకసారి దర్శించి యామెతో రహస్యముగా గొన్ని మాటలాడవలయునని యాతడిదివఱకే మనసులో స్థిరపఱచుకొని యుండెను. ఈ విషయమున నాతని కంతగా శ్రమపడవలసిన యావశ్యకము లేకుండ బోయెను. నిర్జనమగు నర్యైకాంత ప్రదేశమునందు అదృష్టవశమున నామెయే స్వయముగా వచ్చి యాతని కన్నులయెదుట సాక్షాత్కరించెను. ఏమోకాని యమరేంద్రుని సకలాంగకములును పులకించిపోయెను, అతని హృదయ మతివేగముగ జలింప నారంభించెను. ఆ నిర్జన ప్రదేశమునం దామెతో మాటలాడుట కాతనికి సంకోచము కలిగెను. కార్యార్థియగు నాతడప్పుడు మృదుస్వరముతో—"నీవు నా నామము నేవిధముగా తెలిసికొనగలిగితివి?" అని ప్రశ్నించెను.

అతనితో మాటాడుట కామె కెట్టి సంకోచమును లేకపోయెను. అప్పుడామె వసంత వనవిహాంగముంబోలి కలస్వనముతో—"నేను మిమ్ములను బాగుగా నెఱుంగుదును, సులోచనకు గూడ మీ సంగతులు పూర్తిగా దెలియును. మేము మా సరకులను దీసికొని యమ్ముకొనుటకు బట్టణములోనికి బోవునప్పుడు నేను మిమ్ములను జాలసారులు చూచియుంటిని" అనియెను.

అమ—అలాగా! అట్లయినచో సులోచనకు కూడ నన్ను బాగుగ నెఱింగియుండు ననికొనియెదను. నే నెట్టివాడనో కూడ నాతనికి తెలియునని యే తోచుచున్నది, ఔనా!

కుంజ—ఔను. ఆ బందిపోటు దొంగను బట్టుకొనవలయునని మీరు విశ్వప్రయత్నము చేయుచున్నారని కూడ నాతనికి దెలియును.

అమ—అతనికి సంగతులన్నియు దెలిసికొనుట యెందులకు? సరేకాని—ఆ బందిపోటు దొంగతో మీ లోచనునకు సంబంధ మేమైన నున్నదా?

కుంజ—లేదు—నాకాసంగతులేమియును దెలియవు. తెలియుట కవకాశమును లేదు.

అమ—పోనిమ్ము. నీవాదినమున పత్రికునిం గూర్చి యేమో చెప్పితివే—అతని విషయమున నీకేమైన దెలియునా?

కుంజ—అతడొకసారి మాడేరాల యొద్దకు వచ్చినాడు. క్రమముగా నేమోకాని మాలోచనునకు నాతనికిని జూచుచుండగనే జగడము పెరిగిపోయినది. అప్పుడు లోచను డాతని బలవంతముగా నటనుండి తరిమివైచెను.

కుంజ చెప్పిన మాటలయం దమరేంద్రున కంతగా విశ్వాసము కలుగకపోయెను. ఆమెతో నిక నీవిషయమున నధికముగా బ్రస్తావింప గూడదనికూడ నాతనికి దోచెను. కాని యా బాలికతో నెట్లయిన మాటాడవలయునని యాతనికి గుతూహలముగా నుండెను. అప్పుడు కుంజ యమరేంద్రుని సందేహ భావమును గ్రహించి దృఢస్వరముతో—"అయ్యా! నేను చెప్పినదానిలో నెంతమాత్ర మసత్యమనుమాట లేదు. నేనిప్పుడు మీదర్శనము చేయవలయునను నుద్దేశముతోనే బయలుదేరి వచ్చితిని. మీరిక్కడ త్రోవను బోవుచుండగా దూరమునుండి చూచి నేనిచ్చటకు బరుగెత్తుకొని వచ్చియుంటిని" అనియెను.

అమ—ప్రయోజనమేమి? నాతో మాటలాడవలసిన పని యేమైన నున్నదా యేమి?

కుంజ—నేను మిమ్ములను జూడవలయునను కుతూహలముతో నెంతయో శ్రమపడి మాడేరానుండి యతిరహస్యముగా బయలుదేరి రెండవకంటివారి కగపడకుండ నేకాంతముగా నిటకు వచ్చితిని.

అమ—ఇంత యాత్రముతో వచ్చుటకు గారణమేమి? అచ్చట నేమిజరగినది?

కుంజ—అచ్చట జరగిన దేదియును లేదు—కాని మీరు మాత్ర మిప్పుడిచ్చట నెంతమాత్రము నుండవలదు. ఉన్నచో మహా విపత్తున బడిపోవుదురు.

అమ—నాకు మహా విపత్తు కలుగునా? అద్భుతముగ నున్నదే! ఎందుచేత?

కుంజ—ఎందుచేతనా? మీరాబందిపోటు దొంగను బట్టుకొన వలయునని ప్రయత్నము చేయుచుండుటచే మాలోచనుడు మీపై నతిదారుణమగు క్రోధముతో నున్నాడు. అతని దృష్టియంతయు నెప్పుడును మీమీదనే యున్నది. అయ్యా! ఎట్లయిన మీరీప్రయత్న మును మానుకొని పట్టణములోనికి బోయి సుఖముగా నుండుడు!

ఇదివఱకే బలపడియున్న యమరేంద్రుని యనుమానము ఈ మాటలవలన మఱింత ఘనీభవించిపోయెను. అప్పుడాతడు మృదు స్వరముతో—"కుంజా! లోచనునకు నిశ్చయముగా నీ దారికోపిడి గాండ్రతో సంబంధమున్నదని నాకు దోచుచున్నది. నిజమేనా?" అని ప్రశ్నించెను.

అప్పుడు కుంజ తన సుందర వదన మండలమును వంచుకొని మెల్లగా—"ఆ సంగతి నాకేమియును దెలియదు—ఏమైననేమి! మీరు మాత్ర మిప్పుడు శీఘ్రముగా నింటికి బయలుదేఱిపొండు. ఇక నిచ్చట నొక నిమిషమైనను నిలువవలదు" అనియెను.

అమ—మీరందఱు నీ దినముననే యిటనుండి బయలుదేఱి పోయెదరటగాదా?

కుంజ—అవును ఈ రాత్రియే మేమిటనుండి మఱియొక చోటికి బోయెదము.

అమ—ఆమాట నిజమేగదా! అట్లయినచో నిక నాకు భయ మేముండును?

అప్పుడు కుంజ తన మనోహర ముఖ కమలము నమరేంద్రుని చెవిచెంతనుంచి గద్గద స్వరముతో—"మాలోచనుడు మిమ్ముల నెట్లయిన జంపివైవవలయునని ప్రయత్నించుచున్నాడు" అని చెప్పెను.

ఆ మాటవిని యమరేంద్రుడు దదరిపడి యా బాలికామణి వదన మండలమువంక దదేక దృష్టితో జూడ నారంభించెను. అప్పుడు కుంజ యతి మృదుల స్వరముతో—"బయలుదేరుడు—వెనుకకు దిరిగి వెంటనే యింటికిబొండు—ఇక నిచ్చట నుండవలదు!" అనియెను.

ఇట్లు చెప్పుచు నా సుందరీమణి యా ప్రదేశమునుండి యతి శీఘ్రగమనముతో బయలుదేఱి నిమిషములో నదృశ్యురాలై పోయెను. అమరేంద్రుడా శుష్క మహీరుహమున్న దిక్కు ననుసరించి పోయెను.

కొలదిసేపటిలోనే యాతడా యెండుచెట్టును సమీపించెను. తోడనే యాతడు దానికి గుడివైపున బదిగజముల మేరవఱకును జాగరూకతతో బరిశీలించిచూచెను అచ్చట నేలపై నొక త్రిశూలముం పాతిబడియుండెను అమరేంద్రుడు హోటలునుండి బయలుదేఱు నప్పుడే యొక బలమైన కత్తిని జేబులో వైచుకొని తెచ్చియుండెను. అతడా చెట్టుచెంత దలవంచుకొని కూర్చుండి యా కత్తితో నేలను ద్రవ్వుట కారంభించెను. అట్లొక మూరెడులోతు త్రవ్వినప్పటికా కత్తికొక యినుపరేకుపెట్టె తగిలినట్లు చప్పుడు వినవచ్చెను. అప్పు డాతడు వ్యగ్రభావముతో ద్రవ్వినమట్టి నిటు నటు నొత్తిగించి లోపల నున్న యా పెట్టెను బైకిదీసెను అది తాళము వైవబడియుండెను. నేర్పరియగు నమరేంద్రు డప్పుడు తన కత్తితో నా పెట్టెను నిమిషములో దెఱచివైచెను చూడగా నందు గొన్ని సువర్ణాలంకారము లుండెను. విలువగల యలంకారముల నిదివఱకే యెవ్వరో తీసికొని పోయినట్లాతని కనుమానము కలిగెను. అతడాశ్చర్యముతో వానిని దిలకించుచుండెను.

ఇంతలో నాకస్మికముగా నాతని మస్తకముపై దారుణ దండఘాతమయ్యెను. ఆదెబ్బతో నాతనికి నలుదెసలను గాఢాంధకార మైపోయెను. తరువాత నాతనికి స్మృతియే లేకుండబోయెను.

# ప్రకరణము 9

ఆతనికి మరల స్మృతి కలుగునప్పటికి దలపై బలముగ దగిలిన దెబ్బవలనం గలిగిన వేదన యనుభవ గోచరము కాజొచ్చెను. ఆతడు కన్నులువిచ్చి చూచునప్పటి కాకాశమున జంద్రుడు వెలుంగు చుండెను. కాని యందందు మేఘము లావరించుకొని యుండుటచే వెన్నెల యంత ప్రస్ఫారముగా లేదు. ఆతని చెంత నప్పుడొక యువతీ మణి కూర్చుండి యుపచారములు చేయుచున్న ట్లాతడు గ్రహింపగలిగెను. ఆ గ్రుడ్డి వెన్నెల వెలుగులో నాతడామె నానవాలు పట్టగలిగెను. ఆమె యెవ్వరు? మంగల బాలికయగు మన కుంజయే.

అప్పు డమరేంద్రుడు శ్రమపడి మాటలాడుట కెలుగు దెచ్చుకొని హీనస్వరముతో—"నేనిప్పు డెచ్చట నున్నాను? నేను దీసిన యా పెట్టె—" అనునంతలోనే కుంజ యాతని నిక మాటాడనీయక స్నేహార్ద్రపూర్ణంబగు మధుర స్వరముతో—"ఊరకుండుడు. ఏమియును మాటలాడవలదు, మాటాడినచో మీ కాయాసము కలుగును. మీరిచ్చటనే యున్నారు" అనియెను.

అనంతరము కుంజ యేదియో వనమూలికను దెచ్చి రసముతీసి యమరేంద్రునిచే సేవింపజేసెను. ఆ యౌషధ ప్రభావముచే నాతని కొక్క నిమిషములో జాలవఱ కాయాసము తగ్గిపోయెను. అప్పు డమరేంద్రునకు దానా చెట్టుక్రింద త్రవ్విన యా వస్తువుల పెట్టెను దీయుచుండగా వెనుకనుండి యెవ్వరోవచ్చి తన తలపై గఱ్ఱతో బలవంతముగ మోదినట్లు స్మృతిలోనికి వచ్చెను. అప్పు డమరేంద్రుడు కుంజం గాంచి—"ఇట్లు నాతలపై దండాఘాతము చేసినవారెవ్వరో నీకేమైన దెలియునా?" అని ప్రశ్నించెను.

కుంజ మెల్లమెల్లగా—"నేను మీతో ముందుగనే చెప్పితిని గాదా? కాని మీరు నామాట లెక్కచేయలేదు. మిమ్మిట్లు గొట్టినవా డింకెవ్వడు? లోచనుడే!" అనియెను.

అప్పు డమరేంద్రుడు వ్యగ్రభావముతో—"అలాగా? ఆ పెట్టె—ఆ వస్తువులు" అని పలుకుచు జటాలునలేచి యా పెట్టె క్రిందికిపోయి వెదక నారంభించెను. ఏమున్నది? ఆ పెట్టె యెచ్చటను నగపడలేదు. తన్నెవ్వడేట్లు గొట్టెనో యాతడే యా నగలపెట్టె నెత్తికొనిపోయి యుండునని ఆతడు భావించుకొనియెను. అతని మనసు చెదరిపోయెను. సర్వస్వముం గోల్పోయినవానివలె నాతడు వ్యాకులపడుచుండెను.

అప్పు డాతని యవస్థం గాంచి కుంజ మృదుల స్వరముతో—"మీ రెంతమాత్రమును మనసు చెదరగొట్టుకొనవలదు. మీ కాయాస మెక్కువై పోవును. నే నిప్పుడు మీ తలపై గాయమునకు గట్టుకట్టవలసి యున్నది" అనియెను.

అమరేంద్రు డిక నేమియును మాటలాడలేదు. నిపుణమతి యగు కుంజ యప్పు డతి ప్రయత్నముతో నేమేమియో మందులు వైచి అతని తలకు గట్టుకట్టెను. ఆ గాయమునుండి యెంతమాత్రమును రక్తము ప్రసరింపకుండునట్లామె యిదివఱకే యేదో మందు వైచియుండెను. మంగలవాళ్ళ పిల్లకు మందుల కేమికొదవ? ఆమె యిప్పుడు మరల నమరేంద్రునిచే నింకొక యౌషధమును సేవింపజేసెను.

తరువాత నా బాలికామణి జాగ్రత్తగా బట్టుకొని యాతని నా చెట్టుమొదట గూర్చుండజేసి యాతని పార్శ్వమున దానును గూర్చుండి యుపచారములు చేయుచుండెను. అతి గంభీరమగు నా రాత్రిసమయమున—నిర్జనంబును, నతి నిశ్శబ్దంబునువగు బహిరంగక్షేత్రమధ్యమున—శుష్కించియున్న యా మహా మహీరుహము చెంగట నొంటిగానున్న యమరేంద్రుడును, నాతని పార్శ్వమున సుందరీమణియు, నపరిచితయగు నొక యువతీమణియును గూర్చుండి యుండిరి. అప్పు డా యుగపురమునకును జుట్టుప్రక్కల నొక మైలుదూరము లోపల మానవ సంచారమను మాటయే లేకయుండెను. ఇట్టి యవస్థ యెవ్వరికైన నెప్పుడైన దటస్థించి యుండునా యని యమరేంద్రుడు

భావించుకొనుచుండెను. కుంజ నిస్సంశయముగా నాతని చెంత గూర్చుండి యుపచారములు చేయుచుండెను. ఆమె హృదయమునం దెట్టి సంకోచమును గలుగుటయే లేదు. అప్పటికింకను నరేంద్రున కెంతయో వయసు వచ్చియుండలేదు. అప్పుడే యభినవ యౌవనము తలసూపుచుండెను. ఆ కారణముచే నాతని హృదయ మప్పుడు లేత యుండి దాని కుంజ కటాక్షములకు సంపూర్ణముగా వశీభూతమై పోయెను.

సదేశ హృదయుడగు నరేంద్రున కప్పుడు బాహ్యజ్ఞానము లేకుండబోయెను ఆ కష్టస్థితిలో గూడ నాతడొక యనిర్వాచ్యమగు నానందమున నిమగ్నుడై పోయెను. అట్లు కొంతసేపైన తరువాత నాకస్మికముగా నాతడు తెలివి తెచ్చుకొని కుంజవంక దిలకించి ప్రేమ ననుసరించి—"కుంజా! నీవప్పుడే ఇంటికి బోయితివిగదా— ఇంతలో మరల నిచ్చటి కేవిధముగా వచ్చితివి?" అని ప్రశ్నించెను.

సరళ హృదయయగు కుంజ యప్పుడు సంతోషముతో— "అప్పుడు నేను మీయొద్దనుండి బయలుదేరి మా తావునకు బోయితిని. అచ్చట దేనిలోను మనసు దగులుటలేదు అందుచే నాకనుమానము కలిగినది నాకు నిశ్చయముగా మిమ్ము వ్యాఘ్రమే యనుసంధానము చేయుచు బోయియుండునని నాకు తోచినది. ఇక నొక నిమిషమైన నేనచ్చట నుండజాలక పోయితిని. ఎవ్వరితోను జెప్పకుండ నతి కష్టముతో బరుగెత్తుకొని మరల నిచ్చటికి వచ్చివైచితిని. వచ్చి చూచునప్పటికి మీరు తెలివితప్పి నేలపై బడియుంటిరి. నాగుండె గుభిల్లుమనిపోయెను అనుకొనినంత పనియును జరిగినదని నేను చాల భయపడి పోయితిని. అప్పుడు నేను యుక్తసమయమునకువచ్చి మీగాయమునుండి రక్తము స్రవింపకుండ మందు వైచియే యుండక పోయినచో మీరీవిధముగా జీవించి నాతో మాటలాడుటయే యసంభవమై యుండును" అనియెను.

అప్పు డమరేంద్రుడు కృతజ్ఞతా సూచకముగను, ప్రేమపూర్వకముగను నా సుందరీమణి చేయిపట్టుకొని యానందోత్సాహపూర్ణమగు స్వరముతో—"కుంజా! నీవు నా ప్రాణములను నిలిపి నన్ను రక్షించితివి. నేను నీ ఋణము నెట్లు తీర్చుకొనగలను? దయార్ద్రహృదయవగు నీ యవ్యాజ కారుణ్యము నెంతని కొనియాడగలను!" అనియెను.

కుంజ ఆ మాటలను వినిపించుకొనకుండగనే—"మాలోచనుడు మీరు బయలుదేఱిన సంగతి కనుపెట్టి మీ కగపడకుండ మీ వెన్నంటియే వచ్చియుండె ననుకొందును. అతడు మిమ్ముల నెట్లయిన గడతేర్ప వలయునని నిశ్చయించుకొని యున్నట్లు నేను స్పష్టముగా నెఱుంగుదును" అనియెను.

అమ—అలాగా? నే నీ చెట్టుక్రింద ద్రవ్వి తీసిన యా వస్తువుల పెట్టె ఏమైపోయినది?

కుంజ—ఏమో? నా కెట్లు తెలియును? యిచ్చట నట్టి పెట్టె యేదియు నగపడుటలేదు.

అమ—ఆ పెట్టె నా దొంగముండకొడుకే తీసికొని పోయియుండును. అందుల కెంతమాత్రమును సందేహము లేదు.

కుంజ—అది యెట్లు పోయినదో యెవ్వరు చెప్పగలరు? అప్పుడే చాల రాత్రి యైపోయినది. ఈ రాత్రి మా ప్రయాణముకూడను—నే నగపడకుండుటచే మా వాళ్ళందఱును నాకొఱకు వెదకుకొను చుందురు. ఇక నాలస్య మేల? లెండు! నేను మీతో గూడవచ్చి మిమ్ముల మీ హోటలు నొద్దకు జేర్చి మీరు నిరపాయముగా నుండుట గాంచి తరువాత నేను మా గుంపులోనికి బోయెదను.

అమరేంద్రుడు కుంజ మాటకు దన యంగీకారమును సూచించెను. అప్పుడు కుంజ యాతనిని నెమ్మదిగా లేవదీసి యతి భద్రముగా నాతని దక్షిణహస్తమును దన భుజముపై జేర్చుకొని

యూతని భారమంతయు దనపై నానుకొని హోటలు వైపునకు మెల్ల మెల్లగా నడపించి తీసికొనిపోయెను. ఆహా! ఈశ్వరవిలాసము! ఆ సమయమున కుంజయే నచ్చి ప్రతిక్రియ చేయకున్నచో నవనవ యౌవనుండగు నమరేంద్రుని బ్రదుకేమి కావలసినది? అమరేంద్రునకు దీర్ఘాయుష్యమున్నది. కాకున్నచో నెట్టిసంబంధమును లేకుండ వచ్చి ప్రాణోత్క్రాంతి సమయమున నాతని కుపచారములు చేయుట యెట్లు తటస్థించును!

అట్లు కుంజ యూతని మెల్లగా నడపించుకొని పోవుచుండగా మార్గమధ్యముననే యమరేంద్రుడామెం గాంచి—"కుంజా! నీ దయార్ద్ర హృదయమును, నీ సుగుణగణంబులును, నీ స్వరూప సంభాషణములును వివరించి చూడగా నీవు మందులదానవు కావని నాకు దోచుచున్నది" అనియెను.

కుంజ—కాకేమి! నా తండ్రిమాత్ర మొకనర్తకుడు—నే నిప్పుడు నిజముగా మందులదాననే.

అమ—ఏమోకాని నా హృదయముమాత్ర మట్లు విశ్వసింపకున్నది. దానికేమి—నీకీ మందులవాండ్ర గుంపుతో నుండుట సుఖముగానే యున్నదా?

కుంజ—ఎవ్వరికైన నిట్లుండుట యెక్కడైన సుఖముగా నుండునా! మాతండ్రి నన్నెంతో గారాబముతో బెంచుకొనుచుండెడివాడు. ఏమి చేయుదును! ఎప్పటికి నోప్పుటకైనను నాకు దగిన యాశ్రయమేమున్నది! ఈశ్వరుడు నన్నిట్లు మందులదాననై యుండుటకే సృజించెను కాబోలును!

అమరేంద్రుని గుండె జల్లుమనియెను. అతని హృదయ మంతయును కరుణారస తరంగితమైపోయెను. అతఁడాతని సుస్నిగ్ధ విలోచనములతో నామె సుందర వదనమును దిలకించుచు—"ఎవ్వడైన నొక పెద్దమనుష్యుడు తన యింట నిన్నుంచి పోషింప దలంచినచో నీ వంగీకరించి యచ్చట నుండెదవా?" అని యడిగెను.

కుంజ—ఉండకేమి ! నీచజాతినగు నిట్టి నన్ను దమయింట నుంచుకొనుట కెవ్వ రంగీకరించెదరు ?

అమ— ఒకవేళ నంగీకరించు ననుకొందము. నీవట్లుండెదవా ? నిజము చెప్పుము ?

కుంజ యించుక సేపేమో యాలోచించుకొని—"నేనట్లు వచ్చి యుండుట కవకాశము కలుగదనుకొనియెదను" అనియెను.

అమ—కారణమేమి ?

కుంజ—ఎందుచేతనో నేను చెప్పజాలను. వచ్చుటకు వీలుండదని తోచుచున్నది.

అమ—కుంజా ! అట్లయినచో నీ వా దొంగల గుంపును విడిచి రాజాలవా ?

కుంజ—వారందరును దొంగలే యనిమాత్రము నేను చెప్పజాలను వారందరు నిప్పటికి గూడ నన్ను సుఖముగా బోషించుచున్నారు. నాకు గావలసిన వస్తువులను దెచ్చి యిచ్చుచున్నారు. కృతఘ్నురాలనై నేను వారి నేమియు ననజాలను.

అమ—ఇంతటి గుణవతివగు బాలికకు నీకట్టివారితో సంపర్కము మంచిది కాదు నీ వింతమాత్రము నాగుంపులో నుండవలదు కుంజా !

కుంజ—ఇదిగో ! మీ హోటలు గుమ్మము నొద్దకు వచ్చితిమి. ఇక మీరు లోనికిబొండు. చాల రాత్రియైనది. నేనుకూడ నాడేరాల యొద్దకు బోయెదను.

అని చెప్పుచు నా బాలిక యమరేంద్రుని భుజముపైనుండి తన చేతిని వదల్చుకొనియెను. అమరేంద్రుడును నామె భుజముపై నున్న తన హస్తమును దీసికొనియెను త్రోవనే కుంజ కురంగశాబకముం బోలి యొక్క పరుగున దమవారున్న దిక్కుగా వెడలిపోయెను. అమరేంద్రు డతికష్టముతో మెల్లగా నడచి హోటలు గుమ్మము నొద్దకుబోయి తలుపు గొట్టెను. అంతలో మరల నాతని కాయాసముచే దల తిరుగ నారంభించెను. అందుచే నాతడు నిలిచినచోటనే కూలబడి పోయెను. తరువాత నేమిజరిగినదో ఆతనికి స్మృతియే లేకుండబోయెను.

# ప్రకరణము 10

అమరేంద్రునకు స్మృతి కలుగునప్పటికి దానెప్పటివలె నీలరతనబాబు మందిరమున దన పడకగదిలో శయనించియున్నట్లు తెలిసికొని యాతడు మిగుల విస్మితుడై పోయెను. నీలరతనబాబాతని మంచము సమీపమున నిలబడియుండెను. ఆగని గృహవైద్యుడగు డాక్టరుబాబు మంచముపై గూర్చుండి యమరేంద్రుని చేయి పట్టుకొని నాడిని బరీక్షించుచు—"అమరబాబూ! నీకిప్పు డించుక తెలివి కలిగినది. ఇంక నేమియును భయములేదు. ఒక వారము దినములలో నీకు సంపూర్ణముగ నారోగ్యము కలుగును" అనియెను.

అమ—ఎంత త్వరలో నారోగ్యము కలిగిన నంత మంచిది నేను ముఖ్యముగా జేయవలసిన కార్యము లెన్నియో యున్నవి.

డాక్టరు మందహాసము చేయుచు—"ఇప్పుడు నీవా విషయములను గూర్చి యెట్టి యాలోచనలను బెట్టుకొనవలదు విశేషముగా నెవ్వరితోడను మాటలాడవలదు. స్వస్థచిత్తముతో బాగుగ విశ్రమించి యుండుము. ఇక నేను పోయెదను" అనియెను.

డాక్టరు చెప్పినట్లుగా నమరేంద్రునకు వారము దినములలోనే ఆరోగ్యము కలిగెను గాని బాగుగా లేచి నడచుటకు బండ్రెండు దినములు పట్టెను. ఈ పండ్రెండు దినములలోను నాతడా దొంగల సంగతిని గూర్చియే యనేక విధముల నాలోచించుచుండెను. ఆ యాలోచనలే కాక కుంజను గూర్చి కూడ నాతని హృదయమునందనేక భావములు తోచుచుండెను. ఆమె సరళహృదయయును, సాధుశీలయు, కాంతారత్నమును నాతని కాశ్చర్యముం గూర్చుచుండెను. ఆ రమణీయ వదన చంద్రమండలమును, నా సుందర మందహాస చంద్రికలును నాతని కన్నుల గట్టినట్లగపడుచుండెను. ఆ ప్రేమమయ మధుర భాషణములింకను నాతని చెవుల బ్రతిధ్వనించుచున్నట్లే యుండెను. ఆ బాలికామణి విశాల తరళ నయనములనుండి వెలువడిన విమాగ్ర కటాక్ష మాలిక

లాతని సుస్నిగ్ధ హృదయ క్షేత్రము నింకను నానంద పులకితముగ జేయుచునే యుండెను. అతని సర్వాంతఃకరణములు నా సుందరీమణి రూపగుణ విలాసములయందే విలీనములై యుండెను. అమరేంద్రుడు ప్రథమావలోకన సమయమునందే యామెను మనఃపూర్వకముగ ప్రేమించి యుండెను.

ఇందాశ్చర్యపడవలసిన విషయమేమున్నది? యమరేంద్రుడభినవ నవయౌవనోద్భాసితుడగు సుందర సుకుమార శరీరుడు కుంజ కొంత కోయుల గూర్పుకొన్నదైనను వయోరూపగుణ విశేషంబులచే నాగరిక సుందరీమణులనుమించి వన్నెయుయుగు వరవర్ణినియై యుండెను. ఇంతియు కాక యామె యొక విషమ సమయమున నమరేంద్రుని ప్రాణములను నిలిపి రక్షించి యుండెను. అమరేంద్రునికి తన జీవిత కాలములో ప్రాణదాయినియగు నా బాలికరత్నమును మఱవగలడా? ఎట్టియుస ప్రయత్నించి ఆమె నింకొకసారి చూడవలయునని యాతడత్యుత్సాహముతో నుండెను. మఱియును బాసండుడగు నాలోచనున కెట్లయినను దగిన శాస్తి చేయవలయుననికూడ నమరేంద్రుడు తనలో ప్రతిజ్ఞ చేసికొనియెను.

అమరేంద్రునకు స్వస్థత కలిగిన తరువాత నాతడు నీలరతన బాబుంగాంచి—"నేను హోటలునుండి మరల నిచ్చటి కెట్లు వచ్చితిని? ఎవ్వరు తీసికొని వచ్చినారు?" అని యడిగెను.

నీల—నిన్న రాత్రి హోటలు గుమ్మము నొద్ద స్మృతితప్పి పడియుంటివట! అప్పుడొక మందల బాలిక వచ్చి హోటలు యజమానుని పిలిచి నిశ్చేష్టుడవై పడియున్న నిన్నాతని కొప్పగించి—'యీతని నెట్లయిన వెంటనే నీలరతనబాబు ఇంటికి బంపవలసినద'ని చెప్పి పోయినదట! తన హోటలులో నున్న సమయమున నీకట్టి కష్టము ఘటిల్లినందులకు హోటలు యజమాని చాల విచారించి ఆరాత్రియే నిన్నిచ్చటికి బంపివైచినాడు. ఆ రాత్రి యా బాలికవచ్చి యట్లు

చెప్పుకున్నచో నీవప్పుడే మరణించి యుందువనికూడ నాతడే చెప్పినాడు. అప్పుడా బాలిక నీకొక మందుకూడ నిచ్చిపోయినదట! పాపమా హోటలు యజమాని తఱచుగా నీ క్షేమసమాచారమును దెలిసికొనుచునే యున్నాడు.

ఈ సంగతి యంతయును విని యమరేంద్రుడు కుంజకు దన యందుగల యవ్యాజప్రేమకు దగిన ప్రతిఫల మేమి యొసంగగలనని మిగుల దహతహ పడదొడంగెను. ప్రాణదానముచేసిన యామె కేమియొసంగి ఋణవిమోచనము చేసికొనగలడు? ఒకవంక దొంగను బట్టుకొనవలయుననియు, మఱియొకవంక గుంజ నింకొకసారి దర్శింప వలయుననియు నాతని హృదయ మావేగ పడుచుండెను.

అమరేంద్రునకు సంపూర్ణముగ నారోగ్యము కలిగినది. ఆత డొకనాడు హోటలునకుబోయి యజమానింగాంచి తన కృతజ్ఞతను దెలియజేసెను. ఆతడును నమరేంద్రునింగాంచి మిగుల సంతోషించెను. వారిరువురును గొంతసేపుత్సాహముతో ననేక విషయములనుగూర్చి మాటలాడు కొనుచుండిరి. అప్పు డమరేంద్రుడు—"అయ్యా! ఆ దినమున హోటలునకు వచ్చిన వర్తకుని పోలికంగూర్చి మీ రేమైన జెప్పగలరా?" అని ప్రశ్నించెను.

హోటలు యజమాని యతని రూపముం గూర్చియు, నవయవములం గూర్చియు, రంగును గూర్చియు నేమేమో చెప్పెను గాని యంతమాత్రమున దెలిసికొనుట కవకాశ మేమియును లేకపోయెను. ఆతడు బాగుగ జ్ఞప్తికి దెచ్చుకొని—"ఆతని యెడమ కనుబొమ మీద నొక గాయపుమచ్చ యున్నది" అని చెప్పెను.

ఆ మాటవిని యమరేంద్రుడు సముత్సాహముతో—"సరే, ఈసారి యాతని నానవాలు పట్టుటకొక యాధారము దొరకినది!" అని చెప్పి యాతనియొద్ద సెలవుగైకొని తిరిగి యింటికి వచ్చివైచెను.

ఆ దినము నుండియే యమరేంద్రుడు తన కార్యసాధనమునకై ప్రయత్నము చేయుట కారంభించెను. ఆతని కార్యమేమున్నది?

దొంగను బట్టుకొనుట—కుంజను మరల గలిసికొనుట—ఈ రెండే కార్యములు. ప్రాణములున్నను వినియోగించి తీర్పవలసిన ముఖ్య కార్యము లాతనికి రెండే—ముందుగవాండ్ర గుంపిచ్చటనుండి కలకత్తా వైపునకు బోయియుండెనని యాతనికి నిశ్చయముగా దెలియవచ్చెను. తాను గలకత్తాకు బోయినచో కుంజను దర్శింపవచ్చునని యాతడు భావించుకొనియెను. దొంగవస్తువుల యమ్మకపు మేమైన జరుగుచుండనేమో కనుపెట్టవలయునని యెంచి ఫతేఆలీసాహేబు బదివఱకే కలకత్తాకు బోయియుండెను. అమరేంద్రున కిప్పు డాతని గలిసికొనుట కూడ నావశ్యకమై యుండెను. తానింతవఱకు గ్రహించిన విషయము లన్నియు నాతనికి దెలుపవలయును గాదా? ఇరువురును గలసి ప్రయత్నించినచో శీఘ్రముగా దొంగను బట్టుకొనుటకు సులువుగా నుండును. అమరేంద్రుడీ సంగతు లన్నియును బాగుగ నాలోచించుకొనియే కలకత్తాకు బోవుటకు నిశ్చయించుకొని నీలరతనబాబునొద్ద సెలవు గైకొని మరునాడే ప్రయాణమయ్యెను.

## ప్రకరణము 11

అమరేంద్రునకు మూర్షిదాబాదు నగరమునందు నీలరతనబాబు వలెనే కలకత్తా పట్టణమునందు గూడ నమూల్యబాబను నొక యాత్మబంధువుండెను. ఆతడు విశేషముగ గ్రయవిక్రయ వ్యాపారము చేయుచుండెను. ఆతనియొద్ద గావలసినంత సొమ్ముండెను. అమరేంద్రుడు కలకత్తాకుబోయి యమూల్యబాబు గృహమునందే బసచేసి యుండవలయునని నిశ్చయించుకొనియెను. యాతడు బయలుదేఱుటకు ముందుగనే యిక్కడ జరిగిన యెల్లసంగతులను గూర్చియు దాను గ్రహింపగలిగిన యెల్లవిషయములను గూర్చియు సవిస్తరముగా ఫతేఆలీ సాహేబున కొక యుత్తరమును వ్రాసి పంపియుండెను. అందు దాను కలకత్తాకు బయలుదేఱి వచ్చుచున్న సంగతిని గూడ దెలియజేసెను.

అమరేంద్రుడు యథాసమయమునకు కలకత్తాకుబోయి యమూల్యబాబునింట బ్రవేశించెను. చాలకాలమునకు దన యింటికి వచ్చిన యమరేంద్రునిం గాంచి యమూల్యబాబు పరమానంద భరితుడయ్యెను. సోదర సమానులగు వా రిరువురకు నా దిన మొక పండుగ దినమువలె నుండెను.

భోజనమైనతరువాత నమరేంద్రుడు ఫతేఅలీని జూచి మాటాడవలయునను నుద్దేశముతో నాతని నివాసమునకు బోయెను. ఫతేఅలీ అతనిం గాంచి సమాదర భావముతో దన చెంత గూర్చుండ జేసికొని యటనున్నవా రందఱితోడను గావలసిన మాటలాడి క్రమక్రమముగా నందఱను బంపివైచి హర్షోత్సాహ సూచక స్వరముతో— "అమరబాబూ! నీవీ విషయమున విశేషముగా శ్రమపడి చాలవఱకు ముఖ్య విషయములను గ్రహింపగలిగితివి కాని నీ కీ ప్రయత్నములో మహాపాయము కలిగినది" అనియెను.

అమరేంద్రుడు నవ్వుచు—"నా కా రాత్రి తగిలిన దెబ్బను గూర్చియేనా మీరు విచారించుచున్నారు? ఏమైననేమి! ఆ విపత్తు తప్పించుకొని నేను ప్రాణములతో బ్రతుకగలిగితినిగదా! ఆమాటకేమి? నేనీ వ్యాపారమునం దేదేని విషయమును గూర్చి యనుసంధానము చేయగలిగితి ననియా ప్రశ్నము మీ రెట్లైన నంగీకరింపవలసి యుండెను" అనియెను.

ఫతే—ఒకసారి కాదు. పదివేలసారులు నా యంగీకారమును దెలుపుచున్నాను. నీవు చాల బుద్ధిమంతుడవు. ఇంతటి నిగూఢ వ్యాపారమును భేదింప బ్రయత్నించుటలో నీవంటివాని సాయమును బడయగలిగినందులకు నాకెంతో సంతోషముగా నున్నది. ఆ రాత్రి నిన్ను గొట్టినవా డెవ్వడో నేను స్పష్టముగా దెలిసికొనగలిగితిని సుమా!

ఆ మాట కమరేంద్రుడు పరమాశ్చర్యాన్విత హృదయుడై పోయెను. కాని యేమియును మాటాడనేరక [illegible]

యుండుననని భావించుకొనుచుండెను. అప్పుడు ఫతేఆలీ యుత్సాహముతో—"అమరబాబూ! నేనెప్పుడు నీయుత్తరమును జూడ గలిగితినో, యెప్పుడు నీవందు వ్రాసిన వర్తకుని సంగతి తెలిసికొన గలిగితినో యప్పుడే నిన్ను గఱ్ఱతో గొట్టినవా డెవ్వడో స్పష్టముగా నూహింప గలిగితిని" అనియెను.

అమ—అలాగా! ఎవడువాడు? మీ కెవనియం దనుమానము కలిగినది?

ఫతే—నీవంటి బుద్ధిమంతు డింకను నీ విషయమున ప్రశ్నించుట యుచితమా? ఇం కెవ్వడు? ఆ వర్తకుడే—దేశద్రిమ్మరియగు నా వర్తకుడే—ఇంకను సందేహమేమి?

అమ—అట్లయినచో నా దినమున హోటలునకు వచ్చిన వర్తకుడే నన్ను గొట్టియుండుననియా మీ యుద్దేశము?

ఫతే—ఔను. వాడుకాక మఱియెవ్వడు? వాడే మొట్ట మొదట నొకసారి యా చెట్టుక్రింద బూడ్చిన నగలపెట్టెనుదీసి యందలి రత్నాలంకారములను మాత్రము ముందుగా దీసికొని పోయియుండును. తరువాత నందలి స్వర్ణభూషణములను గూడ దీసికొని పోవలయునని రెండవసారి వచ్చినప్పుడు చెట్టుక్రింద గూర్చుండి పెట్టెను బరిశీలించు చున్న నిన్ను జూచి—ఇక జెప్పవలసినదేమున్నది? తరువాత నేమి జరగినదో నీకే తెలియును.

అని చెప్పి ఫతేఆలీ తన దూరదర్శిత్వమును, సూక్ష్మ గ్రహణ శక్తియు బ్రకటితమయ్యెనుగదా యను సంతోషముతో నత్యధికముగ నవ్వనారంభించెను. లోచనుడువచ్చి తన్ను గొట్టినను సంగతి నిజముగా గుంజ వచ్చి చెప్పకయే యున్నచో నమరేంద్రు డిప్పటి ఫతేఆలీ మాటను విశ్వసించియే యుండును. కాని యిప్పు డెట్లు నమ్మును? ఇట్టి మందప్రజ్ఞునకు పత్తేదారున కన్నిసంగతులు నొక్క సారిగా దెలియజేయుట యంత మంచిదికాదని యెంచి యమరేంద్రుడు

తల యూచుచు—"మీ యుద్దేశము నిజమే యైయుండవచ్చును!" అనియెను.

ఫతే—సంశయింప నక్కఱలేదు. వాడు సాధారణుడుకాడు. ఎంతలేసి పనులు చేయుటకైనను నాతడు వెనుదీయువాడుకాడు.

అమ—ఆలాగా? అట్లయినచో మీరాతనిని గనుపెట్ట గలిగితిరా?

ఫతే—ఆ. నీవు వ్రాసిన యుత్తరమునందాతని పోలికను గూర్చి విస్పష్టముగా వ్రాయబడి యున్నది. దానిని బట్టియే యను సంధానముచేసి యాతనిని గ్రహింప గలిగితిని. ఎడమ కనుబొమమీది మచ్చను బట్టియే యాతడు సులభముగా దొరకిపోయినాడు.

అమరేంద్రుడు సంతోషముతో—"ఆలాగా? ఆత డెక్కడ నున్నాడు?" అనియెను.

ఫతే—ఈ పట్టణమునందే వాంశతలాయుందలి గల్లీలో నగల నమ్మ దుకాణమున్నది. కాని లోలోపల దొంగవస్తువులను గొనుట, అమ్ముట మొదలగు వ్యాపారములు జరగుచుండును. ఆత డచ్చట నున్నాడు.

అమ—అట్లయినచో నా మహాపురుషుడు గూడ బందిపోటు దొంగల గుంపులో నొక ప్రధానపాత్రమేనా?

ఫతే—ఔను. నేను చాల దినములనుండి యాతని రాకపోకలను స్వభావ ప్రవర్తనములను గనుపెట్టుచునే యున్నాను. కాని నిదర్శనము లేవియును లేకుండుటచే నేమిచేయుటకు నవకాశము లేకుండ నున్నది.

అమ—మీరాతనిం బట్టుకొని కారాగృహమునందు నిర్బంధించితిరా?

ఫతే—లేదు. ఇంకను నట్లు చేయలేదు. ఇప్పటికిగూడ నాతనికి వ్యతిరేకముగ నెట్టి ప్రమాణములును లభింపలేదు. ఒకవేళ నాతని

బట్టుకొని యేవిధమునైన బంధించినచో మిగిలిన యీతని గుంపువా రందఱును దప్పించుకొనిపోయి మిగుల సావధానులై యుందురు. అట్టి స్థితిలో నప్పుడు వారిని బట్టుకొనుట చాల దుస్సాధ్యమైపోవును. అందుచేతనే తొందరపడక యింతవఱకు నాలోచించుచున్నాను.

అమ—మంచిపని చేసితిరి. మీరు చెప్పినమాట నిజమే. కాని యొకసారి నాకాతని జూడవలయునని యున్నది. అతనిం గాంచి యొకసారి మాటలాడినచో నేనెన్నియో క్రొత్తవిషయములు గనుక తెలియవచ్చును. అదృష్టవశమున నాతనికడ సందేహింపదగిన నిదర్శనములేమైన దొరకిన యెడల వెంటనే మన మాతని నిర్బంధింప వచ్చును.

ఫతే—మంచిది. అలాగే చేయుదము. రేపటి సాయంకాలము సందె యచ్చటికి బోవుదము. కాని, అమరబాబూ! నాకు చాల సంతోషముగా నున్నది! ఎంతో యాశ్చర్యముగా నున్నది!

అమ—ఏ విషయమును గూర్చి?

ఫతే—ఆ ప్రాంతమంతయు [illegible] సీ నూత్నబుద్ధి చమత్కారమును [illegible] నమోఘ ప్రజ్ఞావిశేషమును గావించి [illegible]వైతివి. ఆహా! [illegible] పని నేను మొట్టమొదట [illegible].

అమరేంద్రుడు నవ్వుచు—"ఇందు నా గొప్పతన మేమున్నది? ఆ విధముగా ననుమానము కలిగిన తరువాత నెవ్వరైనను నట్లే చేయుదురు. ఆ యూహమీదనే యాధారపడి నేను ప్రయత్నించితిని. అంతేకాని యిందు నా యాధిక్యమేమియును లేదు" అనెను.

అప్పుడు ఫతేఅలీ సాహేబు పరమానందముతో జటాలున లేచి యమరేంద్రుని గౌగిలించుకొని యాతని వీపుపై దట్టుచు—"అట్లు కాదు, బాబూ! వినయగుణ సంపన్నుడవగు నీ విట్లే చెప్పుదువు. కాని యింతటి దుర్భేద్య రహస్యమును బహిరంగ పఱుపగలుగుట సాధారణ

కృత్యమా? ఎంతయో యనుభవము కలిగి పనిచేయుచుండు పత్తేదారులే యిట్టి విషయములను గ్రహింపజాలరు. అట్టిచో గ్రొత్తవాడవగు నీవు సులభముగా గ్రహింపగలిగితివి. కావున నీవు సుప్రసిద్ధులగు పత్తేదారులచే గూడ బ్రశంసింపదగినవాడవు—ఇట్టి సంకేతములను లిఖించు పద్ధతి తెల్పిన నావారికి దొంగతనముల లోనను గూడ నున్నదో లేదో కనుగొనవలయునని నేను సమర్థులగు కొందఱు రక్షకభటులను బంపించితిని. వారు దొంగతనములు జరిగిన ప్రదేశములకెల్ల బోయి యా సమీపమునందుగల పూటకూళ్ళ యిండ్లయందలి పాత్రములను బాగుగ బరీక్షించి వచ్చిరి. అన్నిచోటులను నిట్టి సంకేత శబ్దములు లిఖింపబడియుండెను. కాబట్టి యా దొంగతనము లన్నియు నొక్క గుంపువారే చేసియుండిరనుట కెంతమాత్రమును సంశయము లేదు. కాబట్టి యాస్వప్నము స్పష్టముగా నీ సంగతులను బోధపఱచుచున్నవి— ఆ విధముగా నశ్వారోహులై వచ్చిన దొంగయే మార్గస్థులయొద్ద బలవంతముగా ధనమును సాధనములను దోచుకొని యా సమీపమునందే దప్పటనో వానినన్నిటిని బూడ్చివైచెను. తరువాత నాతడొక పెద్దమనుష్యునివలె వేషము వైచికొని యా సమీప గ్రామమునందలి పూటకూళ్ళయింటికిబోయి యుంచబోవు పాత్రముపై నా వస్తువులను బూడ్చిన ప్రదేశ మానవాలు తెలియునట్లుగా సంకేతాక్షరములను లిఖించి పోవును—తరువాత మఱొకదిన శిరోమణి యగు నా రెండవవాడు దేశద్రిమ్మరి యగు వర్తక వేషముతో వచ్చి ఆ సంకేతాక్షరములను జదువుకొనిపోయి యథాసమయమున నా వస్తువుల నన్నిటిని దీసికొని యొరుల కంటబడకుండ నీ పట్టణమునకు దయచేయుచుండును. ఈ దొంగముండకొడుకులు దుర్మార్గులే కాని చాల బుద్ధిమంతులని చెప్పుట కెంతమాత్రమును సందేహము లేదు—నీ కుశాగ్రబుద్ధి వారిని గూడ మించిపోయినది. నిన్ను జూచిన నాకు జాల సంతోషముగా నున్నది. నీవు నా పోలీసు శాఖయం దుద్యోగము చేయగూడదా?

నీ కతిశీఘ్రముగా నున్నత పదము లభించునట్లు పైనుండి నేను ప్రయత్నము చేయుచుండెదను. నీ వచిరకాలములోనే యీ శాఖయం దసాధారణమగు విఖ్యాతిని సంపాదింపగలవు ” అనియెను.

ఫతేఆలీ యీ విధముగా దీర్ఘోపన్యాసము చేసిన తరువాత నమరేంద్రుడు సాయంకాలము కావచ్చుచున్నదని చెప్పి యాతనియొద్ద సెలవు గైకొని మరల నమూల్యబాబు గృహమునకు బోయెను.

# ప్రకరణము 12

అమరేంద్రుడువచ్చి ఎల్ల సంగతులును విస్పష్టముగ నమూల్యున కెఱింగించెను. అంతయునువిని యమూల్యబాబు—“ నేను కూడ మీతో వచ్చెదను. అచ్చట నేమిచిత్రము జరుగునో చూడవలయునని యున్నది ” అనియెను.

అమ—అట్లే రావచ్చును. కాని ఫతేఆలీ యంగీకరించునో యంగీకరింపడో నేను చెప్పజాలను. నీవంటివాడు వచ్చుట కభ్యంతరం చెప్పడనియే నేననుకొనుచున్నాను.

అమూ—ఒకవేళ నాత డంగీకరింపకున్నచో నా కగౌరవమా యేమి ? నే నింటికి దిరిగి వచ్చివైదను !

అమ—అట్లయినచో సిద్ధముగా నుండుము ! అప్పుడే సంధ్యా సమయ మగుచున్నది.

అమూ—సిద్ధముగా నుండుట కేమున్నది ? ఒక్కసారి నా రివాల్వరు సరిగా నున్నదో లేదో మాత్రము పరిశీలించి చూచుకొన వలసి యున్నది.

అమ—రివాల్వరా ? ఈ సందర్భమున రివాల్వరుతో ప్రయోజన మేమున్నది ?

అమూ—రాత్రివేళ కేవలమును దుర్మార్గులుండు చోటికి బోవు చున్నప్పు డెట్లయినను జాగ్రత్తగా నుండుట మంచిదికాదా ?

అమరేంద్రుడు చిఱునవ్వు నవ్వుచు—"పోలీసు సత్తేదారు సాహేబు మనతో గూడ నుండగనే భయమా ?" అనియెను.

అమూల్యుడు గంభీర భావముతో—"దుర్జనులగువారు—హత్యలును, చోరకృత్యములను గూడ జేయుచుండు పాపాత్ములగు దారుణ చరిత్రులు—పోలీసు వారిని మాత్రము గౌరవించి క్షమించి విడిచిపెట్టుదురని నీ కెవ్వరు చెప్పినారు ?" అనియెను.

అమరేంద్రుడిక నేమియును ప్రత్యుత్తరమును చెప్పలేదు. ఇంతలో సాయంకాల మయ్యెను. అప్పుడు వారిరువురును గలసి ఫత్తేఅలీ సాహేబు బసవైపునకు బోయిరి. అదృష్టవశమున ఫతేఅలీ యమూల్యుని దమతో దీసికొనిపోవుట కెట్టి యభ్యంతరమును జెప్పలేదు ఆతడు సంతోషముతో—"అమూల్యబాబూ ! పోలీసువారి ప్రయత్నములను, వారి కష్టసుఖములను జూడవలయునని నీకు కుతూహలముగా నున్నది కాబోలునేమి ? మంచిది—అలాగేరమ్ము !" అనియెను.

వారు ముగ్గురును వాంళతలాయందలి గల్లీయొద్దకు బోవునప్పటికి రాత్రి యెనిమిది గంటలు కావచ్చెను. వారట్లు పోయి యొక చిన్న దుకాణముచెంత గూర్చుండి యుండిరి. ఆ దుకాణమునం దొక హిందూస్థాని కుఱ్ఱవాడుండెను. ఆ కుఱ్ఱవాడు వారిని జూచినంతనే యతి వేగముగ లోపలికి బరుగెత్తిపోవుట కుద్యుక్తుడగుచుండెను. కాని యంతలో ఫతేఅలీ చటాలున లేచి తన రెండు చేతులతో నాతని కంఠమును గట్టిగా బిగించి పట్టుకొని—"చెప్పుము ! మియాజుమకూని యెచ్చట నున్నాడు ?" అని యడిగెను.

ఆ బాలకుడు రుద్ధకంఠముతో—"బాబూ ! చెప్పెదను—ఆతడు—ఆతడు—అయ్యో ! నా గొంతు బిగిసిపోవుచున్నది—వదలుడు—నా యూపిరి తిరుగుటలేదు, మాటాడుటయెట్లు ?" అనియెను.

"నిజము చెప్పుము" అని యదలించుచు ఫతేఆలీ ఆ పిల్లవాని గొంతుపట్టును వదల్చివైచెను.

అప్పుడా బాలకు డాయాసపడుచు—"బాబూ! మాయజమాని యిప్పుడా లోపలి గదిలో నెవ్వరితోడనో గాని మాటాడుచు గూర్చుండి యున్నాడు" అని చెప్పెను.

ఫతేఆలీ నిశ్శబ్దముగా నా లోపలిగది గుమ్మము చెంతకుబోయి మెల్లగా దలుపించుక తెఱచి లోపలివంక జూచి వెంటనే వెనుకకు దిరిగివచ్చి మృదుల స్వరముతో—"ఆతనితో మాటాడవచ్చినవాడొక మందులవాడే—వాడిప్పుడే పోవుచున్నాడు. రండు!" అనియెను.

మందులవాడను మాట విన్నంతనే యమరేంద్రునకు జటాలునవలోచనుని సంగతి స్మృతికి వచ్చెను. కాని యాతడేమియో చెప్పబోవుటకు బ్రయత్నించుచుండగనే ఫతేఆలీ—"మాటాడవలదు, వెంటనే రావలయును" అనియెను. తోడనే యమునాల్యామరేంద్రు లిరువురును నాతనితో గూడ బోయి లోపల బ్రవేశించిరి. ఆ గదిలో నొక పురుషుడు కూర్చుండి లెక్కల పుస్తకములను జూచుకొనుచుండెను అమరేంద్రు డాతనిం గాంచినంతనే యాతని యెడమ కనుబొమమీదనున్న మచ్చవైపునకే ముందుగా దృష్టి బ్రసారముం గావించెను. అప్పుడా పురుషుడు వారిం గాంచి సత్వరముగ లేచి సన్మాన పూర్వకముగ రెండు చేతులనుజాచి—"పత్తేదారు సాహెబా! దయచేయుడు!" అని తరువాత నమునాల్యామరేంద్రుల నుద్దేశించి—"ఈ యిరువురు పెద్దమనుష్యులును మీమిత్రులు కాబోలును! అయ్యా! మీరు కూడ గూర్చుండుడు! అనియెను.

అందఱును గూర్చుండి యుండిరి. అప్పుడు పత్తేదారు సాహెబా పురుషునిం గాంచి—"మేమిప్పుడా బందిపోటు దొంగ విషయమున మీవలన గొన్ని సంగతులు తెలిసికొన వలయునని వచ్చియుంటిమి" అనియెను.

ఆ పురుషుడు మందహాసము చేయుచు—" ఇదియేమి పత్తేదారు సాహెబా! దారిదొంగల సంగతులను గూర్చి నాకెట్లు తెలియును! అట్టివారితో నాకేమి పనియుండును? నేను నిష్కారణముగా నుర్రిత్తాడును నాగొంతుమీదికి లాగుకొనునంతటి పిచ్చివాడ ననుకొంటిరా యేమి?" అనియెను.

అప్పు డమరేంద్రుడు గంభీర స్వరముతో—" చాలమంది యిట్లే పైకి భయమును నటించుచు నూరక శ్రీరంగనీతులను జెప్పు చుందురు. కాని యనేక సమయములయం దందఱకు నట్టిభయము నిజముగా నుండదు " అనియెను.

అనుటయు నా పురుషు డించుక యుత్తేజిత స్వరముతో— " అయ్యా! మీరు వర్ణించినయట్టి పెద్దమనుష్యులు లోకములో లేరని నా యుద్దేశముకాదు. కాని మావంటి వర్తకులుమాత్ర మిట్టి గందరగోళములను ద్రవ్వి తలమీదికి దెచ్చుకొనువారు కారు. మాపని యెప్పుడు క్రయ విక్రయ వ్యాపారము మాత్రమే—అదియే మాబ్రదుకు—నే నెప్పుడు నిక్కడనేయుండి నాపని చూచుకొను చుందును. ఇచ్చటనుండి నే నెన్నడు నొక్క అడుగైన నావల బెట్టి యెఱుగను. ఇట్టివాని కితరుల గొడవ లన్నియు నెట్లు తెలియును!

అమ—అయ్యా! మీరు మూర్షిదాబాదు నగరమునందలి హోటలులోని కప్పుడప్పుడు వచ్చుచు బోవుచుండుట కలదా?

పురు—మూర్షిదాబాదా? ఆ పట్టణము పేరుమాత్రము విని యుంటిని. అచ్చటి కెన్నడును బోయి చూచి యుండ లేదు.

అమరేంద్రునకిక నేమని ప్రశ్నింపవలయునో బోధపడ లేదు. ఇట్టి విషమ వ్యాపారములందా యువకున కనుభవ మేపాటియున్నది! తెలివిగలవాడు కావున నాతడు తట్టుకొనుచు—" అయ్యా! మీరిట నుండి మఱియెచ్చటికి నెన్నడును బోవుటలేదని చెప్పియుంటిరిగదా— అట్లయినచో మందులవాండ్రతో మీకెంతటి పరిచయ మెట్లు కలిగినది?" అనియెను.

పురు—సాముగ్రితో నిచ్చిపుచ్చుకొను వ్యాపారముగల నాకన్ని రకముల మనుష్యులతోడను సంబంధము కలిగియుండును. అది యంతేయునేల? మీరు కూడ నాకిప్పుడు కొన్ని వస్తువులను దాకట్టుపెట్టి బదులు పుచ్చుకొనుటకై నాయొద్దకు వచ్చియున్నట్లు జ్ఞప్తికలుగుచున్నది.

ఆ మాటవిని ఫతేఆలీ యమరేంద్రుని మోమువంక జూచెను. ఆ పురుషుని యసత్య ప్రలాపముల కమరేంద్రు డాకస్మికముగ స్తంభితుడై పోయెను. కాని యంతలో నా తుంటరి యెమరెత్తు పన్నాగములను గ్రహించి పరిహాస సూచక స్వరముతో—"ఔను! మహానుభావులగు మిమ్ములను నేను బాగుగ నెఱుంగుదును! మీ ప్రవర్తనమునుగూర్చి కూడ నాకు స్పష్టముగా దెలియును" అనియెను.

అప్పుడా పురుషుడు క్రోధముతో—"అట్లయినచో మీరు నన్ను దొంగల గుంపులోని వాడనని నిర్దేశించుటకు సాహసించు చున్నారా యేమి!" అని యదలించెను.

అమరేంద్రుడు నిశ్చల హృదయుడై దృఢస్వరముతో—"ఔను! నిశ్చయముగా నట్లు నిరూపింపవలయుననియే నేను విశేష సాహసముతో బని చేయుచున్నాను. అందందు బాత్రిముల క్రింద నానుబడిన ఈసంకేత శబ్దములను జదివి గ్రహించుకొనుటకై నాకును నన్ని ప్రదేశములకు దిరిగి శ్రమపడవలసి వచ్చెను" అనియెను.

ఆ మాట కాతడు విస్మయ సంచలితుడైపోయెను. ఒక్క నిముషములో నాతని మొగంబున భయభ్రాంత లక్షణములుతోచి కొంచెముసేపటి వఱకును గానంబడియెను. అప్పుడాతడు ద్విగుణీకృత క్రోధముతో జటాలున లేచి—"మీరు కేవల మసత్యము చెప్పు చున్నారు" అనియెను.

అమరేంద్రుడు కూడ నొక్క యుదుటున లేచి—"లేదు— అసత్య మామాటలేదు—మందులవాండ్రతో నీకు విశేష సంబంధ

మున్నది. ఇంతకుముందే మందులవాడొకడు నీతో మాటలాడుట కిచ్చటికి వచ్చియున్నాడు" అనియెను.

ఇంతలో నా యింటికి బ్రక్కనున్న ద్వారము తలుపించుక తెఱువబడినట్లయెను. లోపల నున్నవా దెవ్వడో తమ సంభాషణము నాలకించుటకు బ్రయత్నించు చుండెనని యమరేంద్రుడు గ్రహించి యావంక కోరగా జూచెను. లోపలివాని మొగ మాతనికి స్పష్టముగా నగపడియెను. వాడెవ్వడు ? లోచనుడే !

అప్పుడా వర్తకుడు నితాంత క్రోధకంపిత స్వరముతో— "నీవంతయు నసత్యమే చెప్పుచున్నావు. ఏమందులవాడును నన్ను జూచుట కొఱ కిటకు వచ్చియుండలేదు" అని గద్దించెను.

అమ— అలాగా ? ఇదిగో ! ఆ పెద్దమనుష్యు డింకను నీ ప్రక్క గదిలోనే యున్నాడు.

అని చెప్పుచు నమరేంద్రు డొక్క యుదుటున లంఘించి ఆ ద్వారము వైపునకు బరుగెత్తెను. కాని యింతలో నాకస్మికముగా నెవ్వరో దీపము నార్పివైచిరి. అప్పుడా యంధకార మధ్యమునం దెవ్వడో గాని వచ్చి యమరేంద్రుని బలముగా నొక గ్రుద్దు గుద్ది పారి పోయెను—అమరేంద్రు డాతని ననుసరించి పరుగెత్తెను. అమూల్యుడు, ఫతేఅలీయు నా వెనుక బరుగెత్తిరి. ముప్వురు నిట్లు కంగారుగా వెలుపలికి జేరుకొనిరిగాని లోచనుడు మాత్రము వారికి దొరక లేదు.

## ప్రకరణము 13

తన యవివేకము వలననే సాధింపదగిన కార్యమంతయును విధ్వస్తమై పోయినదని యమరేంద్రుడు చాల వికల హృదయుడై పోయెను. ఆత డాత్రముతో లోచనుని బట్టుకొనబోవకున్నచో నప్పుడు నెమ్మదిగా నెంతయో పని జరిగియే యుండును. ఇప్పుడు లోచనుడును

వర్తకుడును గూడ దప్పించుకొని పోయిరి. పోలీసువారు తమ్ము దొంగలుగా ననుమానించుచున్నారని కూడ వారికి దెలిసిపోయెను. ఇక నావర్తకు డానగరమునం దుండునా? మరల నీ యిరువురను బట్టుకొనుట కెంత కష్టపడవలసి యుండును?—అమరేంద్రు డిట్లంతయు నాలోచించుకొని ఖిన్నుడై పోయెను.

లోచనుడు దొరకకుండ బాఱిపోవుటవలన ఫతేఆలీకి మిగుల గోపము గలిగెను. అతడమరేంద్రునిం జూచి—"అమరబాబూ! మనచేతికి సులువు లేదు. అప్పు డంత తొందర పడవలసిన యావశ్యక మేమివచ్చినది?" అనియెను.

అమ—హృదయావేగముచే నాకప్పు డేమియును దెలిసినది కాదు. తొందరపడి తప్పుపని చేసితినని నే నిప్పుడు స్పష్టముగా దెలిసికొనగలిగితిని.

ఫతే—ఇక మన మెంతమాత్రము నాలస్యము చేయక యిప్పుడీ వర్తకునైనను జాగ్రత్తగా వెదకి పట్టుకొని బంధింపవలయును.

అమ—అట్లు చేయుట మంచిపనికాదు. మనమిప్పు డాతనిం బట్టుకొన్నచో వాని తోడిదొంగ లందఱును దగిన కట్టుదిట్టములు చేసికొని మిగుల సావధానులై యుందురు. అట్టి స్థితిలో నిక మనకు లోచనునిగాని, యాశ్వికుడగు నా దొంగనుగాని, వారికి సహాయులగు మఱి యెవ్వరినిగాని పట్టుకొనుట కెట్టి యవకాశము నుండదు.

ఫతే—ఔను. ఈమాటయును నిజమే—కాని యిప్పుడు నాకు మతిపోయినది. ఇక మనము చేయవలసినపని యేమున్నది?

అమరేంద్రుడు నవ్వుచు—"అంత కంగారు పడియెద రేల! ఇంతలోనే నిరాశయా? మన మెప్పటికైన నీ దొంగల గుంపును బట్టుకొని తీరుదుము. నామాట నిశ్చయమని నమ్ముడు" అనియెను.

ఫతే—మనము మొదటినుండియు నెంతో జాగ్రత్తగా నుండవలసినది.

అమ—మనమిక గొన్నాళ్ళవఱకు నెట్టి ప్రయత్నమును జేయక యూరకుండవలయును. అప్పుడు మన కెట్టి నిదర్శనములును దొరక లేదనియు, నందుచేతనే యేమిచేయుటయును మానుకొంటిమనియు నెంచి దొంగలందఱును నిర్భయముగా నుందురు. అట్టి స్థితిలో మనము మరల గార్యారంభము చేయవచ్చును.

ఫతే—యీ యాలోచన త్రోసివేయఁదగినదికాదు—ఇప్పుడీ విషయమున గొన్నాళ్ళవఱకు నూరకుండుటయే మంచిది.

ఈ విధముగా స్థిరపఱచుకొని యందఱు నింటిమొగముగా బయలుదేరిరి. ఫతేఆలీ సాహేబు తన బసలోనికి బోయెను. అమరేంద్రుఁడమూల్యునితో గలసి యాతని గృహంబునకు బోయెను. వారము దినముల వఱకును వారెట్టి యనుసంధానమును జేయుట మానివైచిరి. పనియేమియు లేకుండుటచే నమరేంద్రుఁడు కలకత్తా పట్టణమున జూడదగిన ప్రదేశములను జూచుటకై ప్రతిదినమును బోవుచు వచ్చుచుండెను.

ఒకనాటి సాయంకాలమున నమరేంద్రు డింటికి వచ్చినంతనే యమూల్యు డాతనిం గాంచి—"అమరా! పోష్టులోనుండి నీకొక యుత్తరము వచ్చినది. దానిని నీపెట్టెయం దుంచితిని" అని చెప్పెను.

అమ—ఉత్తరమా? ఎవ్వరు వ్రాసినారు?

అని పలుకుచు నాతఁడు తత్తరముతో సత్వరముగ బోయి పెట్టెను దెఱచి యుత్తరమును బైకిదీసి కవరను విచ్చి చూచెను. అందలి విషయములను జదివినంతనే యాతనికి విశేషాశ్చర్యము కలిగెను. ఆ జాబునం దిట్లు వ్రాయబడి యుండెను—

"అమరబాబూ!

నీ మెడలోని రత్నరేకుతోనున్న బంగారు గొలుసు నెవ్వరు దొంగిలించిరో తెలిసికొన వలయునను కుతూహలము నీకున్నయెడల రేపు రెండు జాములవేళకు సరిగా దలతలా యందలి సరకుల దుకాణము నొద్దకు రావలయును.

ఇట్లు నీ హితమునుగోరు నొక వ్యక్తి"

ఒక యోషధి కూర్చబడిన తాయెతుతో గలసిన యొక బంగారు గొలుసు చిన్నతనమునుండియు నమరేంద్రుని మెడలో నుండెను. ఆ రాత్రి దారుణముగ దెబ్బ తగిలి యమరేంద్రుడు విస్మృతుడై పడిపోయిన సమయమునందా హార మెవ్వరిచేతనో యపహరింపబడియెను. తన్నట్లు చావగొట్టిన పాపాత్ముడగు లోచనుడే దాని నెత్తికొని పోయియుండుననని యమరేంద్రుడు స్థిరపఱచుకొని యుండెను. ఇప్పుడీ జాబునుబట్టి చూడగా మొట్టమొదట నాతని కిందలి రహస్య మించుకంతయును బోధపడదయ్యెను. కాని ఇందేదియో దురుద్దేశమున్నదనిమాత్ర మాతనికి సందేహము కలిగెను. ఆ యంగడి వానికి బందిపోటు వ్యాపారముతో నేదియో సంబంధ ముండుననని కూడ ననుమానము కలిగెను.

అందుచే నాతడు వెంటనే బయలుదేఱి ఫతేఆలీ యొద్దకుబోయి యాతనికా యుత్తరము నిచ్చి—"చూడుడు! ఈ విషయమున మీ కెట్టి యభిప్రాయము తోచునో తెలిసికొన వలయుననియే యతి త్వరితముగ మీదర్శనమునకు వచ్చితి" అనియెను.

ఫతేఆలీ యా యుత్తరమును జాగ్రత్తగా జదివి యటు నిటు ద్రిప్పుచు బాగుగ బరీక్షింప నారంభించెను. అట్లు కొంతసేపు చూచి యాతడమరేంద్రునివంక దిరిగి—"అమరబాబూ! ఈ యుత్తరము నెవ్వరు వ్రాసియుందురని నీ యుద్దేశము?" అనియెను.

అమ—ఎట్లు తెలియును? దీనిక్రింద వ్రాసినవారి పేరులేదు.

ఫతే—లేనిమాట నిజమే. ఇట్లెవ్వరు వ్రాయుదురో యూహింప జాలవా!

అమ—ఏమి యూహించుటకును నా కిప్పు డెట్టి యాలోచన యును దోచుటలేదు.

ఫతే—నీ బంగారు గొలుసు పోయిన సంగతి మొట్టమొదట నీవు నాతో జెప్పలేదేమి?

అమ—ఇదియొక సామాన్య విషయమనియెంచి మీకు తెలియజేయలేదు.

ఫతే—ఆ వస్తు వెప్పుడుపోయినది ? ఎచ్చట నపహరింపబడినది ?

అమరేంద్రుడు సమస్త విషయమును సవిస్తరముగా నాతనికి తెలియజేసెను. ఫతేఆలీ యంతయు నాలకించి—"దీని నెవ్వ రపహరించి యుందురని నీకనుమానముగా నున్నది ?" అని యడిగెను.

అమ—ఆ మందుల గుంపునకు నాయకుడగు లోచనుడే దీని నెత్తికొని పోయియుండునని నా సంపూర్ణ విశ్వాసము.

ఫతే—ఎట్లో యెచ్చటనో యీ గొలుసు నీ మెడలోనుండి జారిపడిపోగూడదా ?

అమ—పడిపోవచ్చును గాని యట్లు జరుగలేదు. నేనా సాయంకాలమున శుష్కవృక్షము చెంతకు బోయినప్పుడు కూడ నా గొలుసు నా మెడలోనే యున్నది. నన్ను జంపవలయునని నా తలపై గఱ్ఱతో మోదినవాడే దాని నపహరించి యుండును. ఇదియంతయును నా లోచనుని పనియేగాని వేరుకాదు.

ఫతే—అట్లే జరిగి యున్నచో నా లోచనునకు శత్రుడగువా డెవ్వడో యీ యుత్తరమును వ్రాసి యుంచవలయును. అంతేకాని లోచనుడే పశ్చాత్తాపపడి యిట్లు వ్రాసియుంచుననుట కెంతమాత్రము నవకాశములేదు. ఇట్లెన్నడును జరిగి యుండదు.

అమ—ఔను. మీరు చెప్పినమాట నిజమే పంచుకొను సమయమున దక్కువ వచ్చెయో, మఱి యేకారణముచేతనో ఆతనితో విరోధపడినవా డెవ్వడో తీవ్ర క్రోధముతో లోచను నెట్లయిన బట్టి యొప్పగింపవలయునని యిట్లు నాకీ యనామలేఖను వ్రాసి యుండునని నాకును దోచుచున్నది.

ఫతే—అట్లయినచో రేపు లోచను డచటికి వచ్చునని నీకు నమ్మకముగా నున్నదా ?

అమ—తప్పక వచ్చునని యే తోచుచున్నది. రాకున్నచో సమయమునుగూడ నిర్దేశించి వ్రాయుట యెందులకు ? ఆ వస్తువా యంగడివానియొద్ద దాకట్టు పెట్టుటచే విడిపించుకొనుటకో, కాదేని దాని నాతని కమ్మివేయుటకో లోచనుడు తప్పక రేపు వచ్చునని తోచుచున్నది. ఏమైననేమి ? నేను రేపు రెండుజాములకు సరిగా నచ్చటికి బోవలయునని స్థిరపఱచుకొని యున్నాను.

ఫతేఆలీ గంభీర భావముతో—"నీవు పోవలదు. ఈ కార్యభార మంతయును నాపై బెట్టుము. నేను పోయి యచ్చట జరగిన సంగతు లన్నియును నీకు వచ్చి చెప్పెదను. ఒకవేళ లోచనునియొద్ద నీ వస్తువే దొరకినచో దత్‌క్షణమే యాతని బంధించి చెఱసాలకు బంపించియే వచ్చెదను " అనియెను.

అమరేంద్రునకు స్వయముగా వెళ్ళవలయుననియే దృఢోద్దేశ మున్నను ఫతేఆలీ మాటకు మాఱుమాట చెప్పజాలకపోయెను. సరే యని యంగీకరించి రాత్రి డమూల్యుని మందిరమునకువచ్చి ఫతేఆలీ యేమి చేసికొనివచ్చునో తెలిసికొన వలయునను కుతూహలముతో నిరీక్షించుకొని యుండెను.

## ప్రకరణము 14

మఱునాడు రెండుజాములవేళ మొదలుకొనియు నమరేంద్రు డస్థిమితుఁడై యుండెను. ఒక్కొక్క నిమిషమును గూడ నాతడు లెక్కపెట్టుచుండెను. క్రమముగా మూడుగంట లయ్యెను. ఫతేఆలీ రాలేదు. ఆతని కేమియును దోచదయ్యెను. అనేక సంశయములు తోచి యాతని హృదయమును గలచివైచుచుండెను. అమరేంద్రుడు తన చెంతనే కూర్చుండియున్న యమూల్యునితోగూడ నెట్టిమాటయు నాడకుండ నిశ్శబ్దముగ గూర్చుండి యూరక భావ ప్రపంచమున

గొట్టుకొని పోవుచుండెను. అంతసేపటివఱకును దన్ను బలుకరింపనైన బలుకరింపకయున్న యాతనిం గాంచి యమూల్యు డాకస్మికముగా నా నిశ్శబ్దతకు భంగము కలిగించి—"అమరా! ఆ యుత్తరము వ్రాసినవాని యుద్దేశము నీ కేమైనను బోధపడినదా?" అని ప్రశ్నించెను.

అమరేంద్రుడా మాటవిని యదరిపడి ఆతనితో నింతవఱకును మాటాడకుండుటకు సిగ్గుపడి—"సోదరా! ఎందుచే నిట్లు ప్రశ్నించితివి? ఇందంతగా దెలిసికొనవలసిన విషయ మేమున్నది?" అనియెను.

అమూ—లేకేమి? నిన్నంతమొందింప వలయునను నుద్దేశము తోనే వారీ కపట జాలమును బన్నియున్నారు.

అమ—అదియెట్లు?

అమూ—ఆ గుంపులోనివాడే యెవ్వడో యీ యుత్తరము వ్రాసియుండునని నీ వనుకొనుచున్నావు. నీ యూహ కేవలమును బొరపాటే—అడవి జాతివాండ్ర నేస్తము సర్వసాధారణమైనదికాదు. ఎట్టి యభిప్రాయ భేదములు కలిగినను నది విచ్ఛిన్నము కాజాలదు.

అమ—నీయూహ చాలదూరము పోవుచున్నదే. అట్లయినచో నీ విప్పు డేమని నిశ్చయించితివి?

అమూ—ఈ యేర్పాటంతయును నిన్ను దుదిముట్టింప వలయు ననియే—నీ వా యంగడియొద్దకు బోయినంతనే యాకస్మికముగ నొకటి రెండు కఱ్ఱదెబ్బలతో గార్యమంతయు గడతేఱిపోవును.

అమ—ఎంత వెఱ్ఱివాడవు! పట్టపగటివేళ గలకత్తావంటి పట్టణమునం దంతపని జరగుటయే?

అమూ—కలకత్తా నగరమనిన గైవల్య మనుకొంటివా? దిన దినము నిందెన్నిహత్యలు జరుగుటలేదు! ఏమైననేమి? నీవు పోలేదు. చాల మంచిపని జరిగినది.

అమ—నీ వూహించిన పద్ధతి యంత విశ్వాసార్హముగా నగపడుటలేదు.

అమూ — పర్యవసానము తెలిసికొనువఱకు నీ విట్లే యను చుందువు. వాదమెందులకు ? మీ పత్తేదారు సాహేబువారి కెట్టి యవస్థ కలుగునో యిక నొక గడియకైనను జూచెదవుగాదా !

అని చెప్పి యమూల్యము తాత్కాలికావసక్తుడై పట్టణము లోనికి బోయెను. అమరేంద్రుడు మహోద్విగ్న హృదయముతో ఫతేఅలీ రాకకొఱకై యెదురు చూచు చుండెను. అతనికి ప్రతినిమిషము నతికష్టముతో గడచి పోవుచుండెను. చూచుచుండగనే నాలుగు గంటలు గడచిపోయెను. తరువాత నొక యఱగంటకు మిగుల నాయాసముతో ఫతేఅలీ సాహేబు దయచేసెను. అమరేంద్రు డాతనిం గాంచి తత్తరముతో — "దయచేయుడు — దయచేయుడు. నేను మీ యాగమనమునకొఱకు గట్టుకొని పోవుచున్నాను" అనియెను.

ఫతేఅలీ సాహేబు కూర్చుండి — "ఏమిజరిగినదో తెలియ కుండుటచే నీ మనసు తల్లడపడుచునే యుండును. ఉండదా మరి ?" అనియెను.

అమ — ఆ జంగిడీయొద్ద మీరేమి యోచన తగబడినారా ?

ఫతే — తొందరపడకుము, సావధానముగా విన్నచో నీవు వినుచున్నవే యెరుగుదువు !

అమ — నాకిప్పుడే విసుగుపుట్టుచున్నది. అచ్చట నేమి జరిగినదో చెప్పుడు !

ఫతే — నేను కలకత్తాయందలి యూరదుకాణము నొద్దకు బోవు నప్పటి కింకను కొంచెము ప్రొద్దుండెను. ఆ యంగడివాని వాలకము చూచినంతనే వాడు నానాబుద్ధుల విద్యార్థుడని నేనూహింపగలిగితిని. అట్టి పోలిక వానిని నేనింతకుముందెక్కడనో చూచియున్నాను.

అమ — అలాగా ? తరువాత ఆతడు మీతో నేమని చెప్పెను ?

ఫతే — తొందరపడకుము బాబూ ! ఆ జిత్తులమారి ముండకొడుకు సాధారణముగా నా కెల్లసంగతులను జెప్పునా ? తుట్టతుదకు నేను

పోలీసు పత్తేదారుడనని చెప్పుకొనవలసి వచ్చినది. ఇంకను వట్టి గాంభీర్య మెచ్చట నుండును ? పోలీసువారి పేరు విన్నతోడనే వాని గుండె నీరై పోయినది.

అమ—పిమ్మట నేమి జరగినది ? ఆ వస్తువును గూర్చి యాతఁ డేమైన జెప్పినాడా !

ఫతే—ఆ వస్తువు పండ్రెండు రూపాయల కోమటియొద్ద దాకట్టు పెట్టబడినది. వాడు తన లెక్కల పుస్తకమునుదీసి నాకు చూపించినాడు.

అమ—అట్లు దానిని దాకట్టు పెట్టినవారెవ్వరు? లోచనుడేనా?

ఫతే—కాదు బాబు ! మొదటినుండియు నీవు పడుచున్న పొరపాటే యిది !—ఇంతలో మూడుగంటలు కొట్టెను. మూడు గంటలకే వచ్చి యా వస్తువును విడిపించుకొనునట్లు కేర్పాటు జరిగెను. ఈ సంగతి యా యుత్తరము వ్రాసిన వానికి దెలిసియుండుటచేతనే యట్లు వ్రాసెను. సరిగా మూడుగంటలకా వస్తువును దాకట్టు పెట్టిన వారే విడిపించుకొనుటకు వచ్చిరి.

అమ—వారెవ్వరు ? లోచనుడు కాడా ?

ఫతే—కాదు బాబు ! ఆమె యొక యువతి !

అమరేంద్రుడు కేవలమును విస్మయాక్షిప్త హృదయుడై— "ఏమనుచున్నారు ? ఒక యువతియా ? ఎవ్వా రామె ? ఆమె పేరేమి ?" అని యాతనితో బ్రశ్నించెను.

దానికి బ్రత్యుత్తరముగా ఫతేఅలీ ద్వారమువంక జూచుచు— "ఓ పిల్లా, లోనికిరమ్మ !" అని పిలిచెను.

తోడనే యొక బాలిక యా గృహమధ్యమున బ్రవేశించెను. ఆమె యిట్లు వచ్చినంతనే ఫతేఅలీ చటాలున లేచెను. ఆ బాలిక యెవ్వరు ? కుంజయే !

అమరేంద్రునకు నోట మాట లేకుండబోయెను. ఆతని సర్వాంగకములును స్తంభించి పోయెను. అతని గుండెలు దిగజారి

పోయెను. కుంజయును లజ్జాభారముచే నవనత వదన కమలయై నిశ్శబ్దముగా జిత్ర ప్రతిమవలె నిలువబడిపోయెను. ఫతేఅలీ యామెను వేళాకోళము చేయ నారంభించెను.

అందుచే నమరేంద్రుడు దుస్సహమగు క్రోధముచే జంచలుడై పోయెను. అయినను నాత డాత్మ సంయమనముం గావించుకొని మృదుస్వరముతో—"కుంజా! నా బంగారు గొలుసు నీ కెక్కడ దొరకినది?" అని యడిగెను.

ఆమె దానికి ప్రత్యుత్తరము చెప్పుటకు ముందే ఫతేఅలీ—"ఆ విషయముం గూర్చి చెప్పవలసిన దెంతయో యున్నది. సవిస్తరముగా నడిగి యంతయును దెలిసికొనుము. నేనిప్పుడే వచ్చెదను. నాకొక ముఖ్యమైన పనియున్నది. నేను పోయెదను" అని యాతడు వెడలిపోయెను.

తరువాత నమరేంద్రుడు కుంజ సమీపమునకు బోయి శాంత మధుర స్వరముతో—"నీవు చేసిన ప్రాణదానముం గూర్చి నేను మఱచిపోలేదు. జీవించి యున్నంతవఱకు నీ యుపకారము నేనెన్నటికిని మఱువజాలను" అనియెను.

అప్పుడు కుంజ విశాల తరళ నయనము లశ్రుజల ప్రపూర్ణములై పోయెను. ఆమె కోమల వదన మండల మెఱ్ఱనై పోయెను. పుష్పవల్లికబోని యామె సుందర శరీరము స్వేదసిక్తమైపోయెను. ఆ బాలికామణి యిప్పుడు నిట్టూర్పు విడిచి కోమల స్వరముతో—"మీరిప్పుడు నాయం దెంతయో యనుగ్రహమును జూపించి నాతో నింత చనవుగా మాటాడితిరి. ఇదియే నాకు బదివేలు—నాకిప్పుడిచ్చట మీదర్శనము లభియించునని నేననుమానించియైన నుండలేదు" అనియెను.

అమరేంద్రుడు కరుణార్ద్ర హృదయముతో—"ఏమి? నీకెట్టి కష్టము కలిగినది? సవిస్తరముగా నాకంతయుం జెప్పుము!" అనియెను.

కుంజ—మీ బంగారుగొలుసు నేనపహరించితినని యనుమానించి పోలీసువారు నన్ను నిర్బంధించినారు.

అమ—అది కేవలమును బొరపాటు! నీవు దొంగతనము చేయుదువని యెవ్వరనగలరు! ఇది యంతయు నాలోచనుడు చేసిన దుష్కృత్యమే.

కుంజ—ఔను. మీరు సత్యమును గ్రహింప గలిగితిరి. ఆ గొలుసును దొంగిలించినవాడు వాడే—కొన్నాళ్ళక్రిందట నాతడీ వస్తువు నాయంగడివానియొద్ద దాకట్టుపెట్టి పదిరూపాయలను దీసికొని రమ్మని నా కాజ్ఞాపించియున్నాడు. అది మీ గొలుసని నే నప్పు డెంత మాత్రము నెఱుంగను. మరల నేడు మూడుగంటలకు బోయి యా వస్తువును వదలించి తీసికొని రమ్మని చెప్పి నాకు వడ్డీతో సొమ్మంతయు నిచ్చి పంపించినాడు. నేను సరిగా నాదుకాణమునొద్దకు బోవునప్పటికీ పోలీసు పత్తేదారుసాహెబువచ్చి నన్ను నిర్బంధించినాడు.

అమరేంద్రుడు తత్తరముతో—"ఆలాగా! ఆతడు నీ యెడల నేమైన సమర్యాదగా బ్రవర్తింపలేదుగదా! నీ గౌరవమున కెట్టి భంగమును గలిగింపలేదుగదా?" అనియెను.

కుంజ—లేదు—లేదు—అతడు చాల పెద్దమనుష్యుడు. నేను చెప్పిన సంగతుల నన్నిటిని శాంతముతో నాలకించి నన్నిచ్చటికి దీసికొని వచ్చినాడు—అతడు నా మాటల నన్నిటిని విశ్వసించె ననియే తోచుచున్నది.

అమ—ఔను. నాకిప్పటికీ రహస్య మంతయును బోధపడినది. నిన్నే దొంగను జేసి యొప్పగింపవలయునను దురుద్దేశముతో లోచనుడే నాకొక యనామకలేఖను వ్రాసియున్నాడు. ఆ దుకాణమునకు నేను రావలసినదే—కాని పత్తేదారు సాహెబును బంపించితిని.

కుంజ—ఆ యుత్తరము సంగతి వినియుంటిని—నాపై లోచనున కింత కోప మెందులకో?

అమ—ఎందులకా? నీవు నాకన్ని సంగతులును జెప్పి సాహాయ్యము చేయుచున్నావని యే.

కుంజ—అలాగా ?— ఇక నే నిప్పుడు—పత్తేదారు సాహే బెచ్చటికి బోయినాడు ? నే నిప్పుడు వెడలిపోవచ్చునా ?

అమ—వలదు. నిన్ను నేనిక నాదొంగల గుంపులోనికి బోనీయ దలచుకొనలేదు.

ఇంతలో ఫతేఆలీ సాహీ బచ్చటికివచ్చి దృఢస్వరముతో— " నీ విప్పుడు పోవుటకు వీలులేదు. ఇంకను గొన్నినాళ్ళిచ్చట నుండ వలయును. నేను దొంగల నందఱను వెంటనే పట్టుకొన దలచి యున్నాను " అనియెను.

## ప్రకరణము 15

కుంజ భయ విస్మయాక్రాంత హృదయుఁడై ఫతేఆలీ సాహేబు మొగమువంక జకిత దృష్టులతో గనుంగొనియెను. అప్పుడాతఁడు— " మీ లోచనుఁడు నిశ్చయముగా దొంగలతో జేరియున్నాఁడు. మేమీ దొంగల నందఱను బట్టి బంధింపదలచి యున్నాము. ఈ ప్రయత్నమునందు మాకు నీవలన నేమైన సహాయము కలుగునని యనుకొనుచున్నాను " అనియెను.

కుంజ యేమియును మాటాడలేదు. అప్పు డమరేంద్రుఁడు— " కుంజా ! నీ సంగతి నేను బాగుగ నెఱుఁగుదును. నీవు మాకు సాహాయ్యము చేయక తప్పదు " అనియెను.

ఫతే—మాకు సాయము చేయుటకే నీ వా గుంపువాళ్ళతో గలసి యుండవలయునని చెప్పుచున్నాను. అట్లు కాకున్నచో వాళ్ళ సంగతులు తెలిసికొనుట కవకాశముండదు.

కుంజకీసారి మాటాడుటకు ధైర్యము కలిగెను. ఆమె కోమల స్వరముతో—"నాకు వాళ్ళ రహస్యము లేమియును దెలియవు గాబట్టి నే నేమి చేయఁగలను?" అనియెను.

ఫతే—నీవు చేయఁదగిన పనులు కావలసినన్ని యున్నవి. మొట్ట మొదట నొక సంగతి తెలుపుము! ఆ వర్తకుఁడగు కాహియాను నీ వెఱుంగుదువా?

కుంజ—ఎఱుగుదును. అతఁడు మూర్షిదాబాదులో మాడేరాల కడ కొకసారి వచ్చియున్నాఁడు.

ఫతే—అతనికిని లోచనునకును నెట్టి సంబంధ మున్నదో నీకు దెలియునా?

కుంజ—వారికిగల సంబంధమేమో నాకు దెలియదు. కాని మూర్షిదాబాదులో వారిరువురికిని జగడము జరిగినది.

ఫతే—ఏమైన సరేగాక! ఈ యువరేంద్రుని బంగారు గొలుసును దొంగిలించెననియు, నీతని జంపుటకు బ్రయత్నించెననియు నీ రెండు నేరముల క్రిందను నాతని ముందుగా నరెస్టు చేసెదను. నీ సాక్ష్యముతోనే యాతనికి బది సంవత్సరములు కారాగృహశిక్ష యగును.

కుంజ యతి వ్యాకుల హృదయయై గద్గద స్వరముతో-"నేనా? నేను న్యాయస్థానమునకువచ్చి సాక్ష్యము చెప్పఁగలనా?" అనియెను.

అమ—పత్తేదారు సాహేబా! నే నిదివఱకు జెప్పిన మాటయే యిప్పటికిని జెప్పుచున్నాను. మీరూరక తొందర పడవలదు. ఆ గుంపులో నొక్కని మాత్రము మనము పట్టుకొన్నచో దక్కినవా రందఱును బలాయితులై పోవుదురు.

ఫతే—నీవు చెప్పినమాట నిజమే—కాని యిప్పుడు నన్నేమి చేయుమనియెదవు?

అమ—బాగుగా ననుసంధానముచేసి దొంగల నందఱి నొక్క సారిగనే పట్టి బంధింపవలయును.

ఫతే—మంచిమాటయే—కాకున్నను నీ వీ వ్యవహారమునందు జాలవఱకు బనిచేసితివి. ఇందలి మూలసూత్రమును నీవే బయట బెట్టితివి. అందుచే నీప్రయత్నమునందు నీవు చెప్పినట్లే పని చేయవలయునని నేను నిశ్చయించుకొన్నాను—(అని కుంజవంక జూచి) ఇక నీవు నీ యిష్టము వచ్చిన చోటికి బోవచ్చును.

అమ—ఆ వస్తు వెచ్చట నున్నది ?

ఫతే—అది యెచ్చట నుండుట యుచితమో యచ్చటనే యున్నది—నీ కా సంశయమేల ? నాయొద్దనే యున్నది. అది దొంగ వస్తువుకాదా ?

అమ—ఎంతటి యానాలోచిత కృత్యము! మీయొద్ద నెందుకు? దాని నీమె కిచ్చివేయుడు !

ఫతే—అదియేమి ? ఇచ్చివేయుట యెట్లు ? ఆ వస్తువు దొంగ వస్తువుకాదా ?

అమ—ఆ సంగతి నే నెఱుగుదును. ఆ వస్తువు నీమె తిరిగి తీసికొనక పోయినచో లోచనున కీమెయెడలను మనయెడలను గూడ సందేహము కలుగదా ? అట్లు కలిగినచో మన కార్యమంతయును జెడిపోదా ? దానిని దాకట్టునుండి వదలిపించుకొని తెచ్చితివా యని యాతడు ప్రశ్నించినచో నప్పు డీమె యేమని చెప్పగలదు ?

ఫతే—ఔను నీవు చెప్పినమాట యుక్తియుక్తముగనే యున్నది.

అమ—ఇప్పుడీ వస్తువు నీమె తీసికొని పోయినచో నాతడు తాను వ్రాసిన యుత్తరము నాకందలేదనియు, నందినను ననామలేఖ యందలి యీ విషయములను నే నెంతమాత్రమును లెక్కచేయ లేదనియు, నందుచేతనే నే నా యంగడియొద్దకు రాలేదనియు భావించుకొని యూరకుండును. నాకచ్చట నెవ్వరు నగపడలేదని కుంజకూడ నాతనికి జెప్పును.

ఫతే—అమరబాబూ! బాగుగ నాలోచించితివి. నా కింతటి యాలోచన తోచినదే కాదు!

అమ—(తనలో) నీ తలలో మెదడనుమాటయే లేదు. వట్టి మట్టిముద్ద యున్నది. నీ కాలోచన కూడనా? (ప్రకాశముగా) అయ్యా! ఇప్పుడావస్తువు నీమె కిచ్చివేయుడు.

ఫతేఅలీ యప్పుడు తన కోటుజేబులోనుండి యా వస్తువును పైకిదీసి కుంజ చేతికిచ్చెను. తోడనే ఆమె వెడలిపోవుటకు సిద్ధముగా నుండెను. అప్పుడమరేంద్రు డామెం గాంచి—"కుంజా! నీవొకనాడు నాకు ప్రాణదానముం గావించితివి—కావున నీకొకమాట చెప్పు చున్నాను. ఎప్పుడైన కష్టసమయమున నీకు నాసాహాయ్య మావశ్యక మైనయెడల వెంటనే తెలియజేయుము. ఎంత పనియున్నను దత్‌క్షణమే నీ యొద్దకువచ్చి నీ కష్టమును దీర్చివైచెదను" అని చెప్పెను.

కుంజ లజ్జావనత వదనముతో—"అలాగే తెలియ జేసెదను!" అని చెప్పి వెడలిపోయెను. అనంతరము ఫతేఅలీ సాహేబు కూడ వెడలిపోయెను. అప్పుడమరేంద్రుని హృదయ మంతయును శిథిలమై పోయెను. ఆతని యుత్సాహ మంతయును కుంజతో గూడ బోయెను. ఆతని మనసు కుంజచే సంపూర్ణముగ నాకర్షింపబడియెను. ఒకవంక గార్హ్య తత్పరతయు, మఱియొకవంక గామినీ ప్రణయ తత్పరతయు నాతని నదిమివైచుచుండెను. ఆ ప్రబల సంఘర్షణముచే నాతని హృదయ మాందోళిత మగుచుండెను.

నాలుగైదు దినములు గడచిపోయెను. ఒకనా డమరేంద్రుడు తన గదిలో గూరుచుండి కుంజను గూర్చియే భావించుకొనుచుండెను. కుంజ సుందరాకార మెప్పుడు నాతనికి గన్నుల గట్టినట్లే యగు చుండెను. "కుంజయెవ్వరు? నేనెవ్వరు? ఆమెకొఱకు నామన సిట్లేల పరితపింపవలయును? ఆమెకు గూడ నిట్టి పరితాపము కలుగు చున్నదా?" అని యాత డాలోచించుకొనుచుండెను. ఇంతలో

సమూల్యుని సేవకు డటకు వచ్చి యాతని చేతికొక యుత్తరము నిచ్చెను. మరల నుత్తరమా! అమరేంద్రుడు తత్తరముతో నందికొని దానిని విప్పిచూచెను. ఈసారి యది యనామలేఖ కాదు. ఆవుత్తరము కుంజ వ్రాసినది—

"అమరబాబూ!

లోచనునకు సమస్త వృత్తాంతమును సంపూర్ణముగా దెలిసి పోయినది. ఇప్పుడాతడు నన్ను బలవంతముగా నిర్బంధించి యున్నాడు. ఏమి చేయవలయునో నాకించుకంతయును దోచుటలేదు. నాకీ ప్రపంచమునం దాత్మీయులను వా రెవ్వరును లేరు. మీరు శీఘ్రముగ వచ్చి నన్నుద్ధరింపకున్నచో నికమీద నేనేమైపోవుదునో చెప్పజాలను. ఆ లోచన డేమిచేయుటకైనను సాహసుడని మీకే తెలియును. ఈ యుత్తరము తెచ్చిన వానితో బయలుదేఱి వచ్చినచో నాతడు నేనున్నచోటికి మిమ్ములను దీసికొని పోగలడు. యాలస్యము చేసినచో మాట దక్కదు.

కుంజ"

అమరేంద్రుడా యుత్తరమును జదువుకొని సేవకునిం గాంచి— "ఈ యుత్తరము నెవ్వరు తెచ్చి నీకిచ్చినారు?" అని యడిగెను.

సేవ—ఒక పిల్లవాడు.

అమ—నీవు పోయి యాతని నిచ్చటి కొకసారి తీసికొని రమ్ము! ఆతని నొకటి రెండు మాటలడుగవలయును.

సేవ—చిత్తము—అట్లే చేసెదను.

అని చెప్పి యాత డావలికిబోయి వెంటనే యా బాలకు నచ్చటికి దీసికొని వచ్చెను. చూచినంతనే యాతడు మందులవాండ్ర పిల్లవాడని యమరేంద్రుడు గ్రహింప గలిగెను. ఆ బాలకుని ముఖ లక్షణములను బరికింపగా నాతనిని మూర్శిదాబాదులో జూచినట్లు

కూడ నమరేంద్రునకు స్మృతికి వచ్చెను. అప్పు డమరేంద్రుడా పిల్లవాని నుద్దేశించి—"ఓరీ! నీకీ యుత్తరము నిచ్చినవా రెవ్వరు?" అని ప్రశ్నించెను.

బాల—కుంజ.

అమ—కుంజ యిప్పు డెచ్చట నున్నది!

బాల—ఆమె నిప్పుడు లోచనుడు వరాహ నగరములో గంగానదీ తీరమునందొక యింటిలో నెవ్వారికిని దెలియకుండ దాచి యుంచినాడు.

అమ—అలాగా! అట్లయినచో నామెకు నీ చేతికీ యుత్తరము నిచ్చి నాకు బంపించుట కవకాశ మెట్లు కలిగినది!

బాల—ఆమెకు నాయందెంతో దయయును నమ్మకమును గూడ నున్నది. ఆమెను లోచనుడు నిర్బంధించుటకు మునుపే నాకీ యుత్తరము వ్రాసి యిచ్చి మీ కందించుమని చెప్పినది. ఇచ్చట మీరున్న నివాసమునుగూర్చికూడ నామెయే నాకు జెప్పినది.

అమ—అలాగా! మంచిది. కాని యిప్పుడు మీ లోచను డెక్కడ నున్నాడు!

బాల—అతడు హుగ్లీ పోయినాడు. మా వాళ్ళందఱును గూడ నిప్పు డచ్చటనే యున్నారు.

అమ—మంచిది. అట్లయినచో నీవుమాత్ర మిప్పు డిచ్చట నెందులకున్నావు?

బాల—అదృష్టవశమున మా లోచనుడు నన్నే మా కుంజ యొద్ద గావలిగా నుంచినాడు.

అమ—ఏమీ! అచ్చట నీవే కావలియుంటివా! ఇంకను నీతో గూడ నెవ్వరైన నున్నారా!

బాల—భూలోక రాక్షసియగు నొక ముసలిముండ కూడ నున్నది.

అమె—ఆమె యెవ్వరు ?

బాల—అదియును మామందులదే.

అమ—ఇంక నెవ్వరైన నున్నారా ?

బాల—లేరు. ఎవ్వరును లేరు.

అమ—అట్లయినచో గుంజ యటనుండి యేల పాఱిపోలే
పోయినది ? ఆమె మంచి తెలివిగలదే !

బాల—ఆ ముసలిముండ కుంజయున్న యింటికి దాళమును వై
యుంచినది. మీరు వచ్చి యీ వృద్ధరాక్షసిని బట్టుకొన్నచో
నే నింతలో గుంజను విడిపించి వైచెదను.

అమ—మన మెప్పుడు బయలుదేఱుదము ?

బాల—ఇంకను నెప్పుడనుచున్నారా ? ఈ రాత్రి బయలుదేఱ
కున్నచో గార్యము మించియే పోవును.

అమ—అట్లయినచో నీ రాత్రియే పోవుదము ! నీవు పరిగ
సాయంకాలమైనతరువాత నిచ్చటికి రమ్ము.

బాల—అట్లే వచ్చెదను.

# ప్రకరణము 16

అమూల్యుడు వచ్చినంతనే యమరేంద్రుడు కుంజ వ్రాసి
యుత్తరము నాతనికి జూపించెను. అతడు దానినంతను సమగ్రము
జదివి—" మరల నిదియొక తంత్రమా ?" అనియెను.

అమరేంద్రుడు నవ్వుచు—" నీ వెప్పుడును దంత్రము తంత్రమే
యనుచుందువు. ఈ ప్రపంచమే నీకు దంత్రముగా నగపడుచున్న
కాబోలును !" అనియెను.

అమూ—అట్లనియెదవేమి ? ఇదివఱకు నేను చెప్పిన సంగ
యసత్యమైపోయినదా ?

అమ—లేదుకాని మొన్నటి పన్నాగము నాకొఱకు బన్నినది కాదు. అది కుంజను గూర్చి కావింపబడినది.

అమూ—అంతవఱ కంగీకరించితివికదా ! ఇక నిప్పుడు పన్నిన యీ తంత్రము మాత్రము తప్పకుండ నీకొఱకే.

అమ—పిచ్చివాడా ! ఈ యుత్తరము దెచ్చిన పిల్లవానిని నేననేక విధముల బ్రశ్నించితిని. అతని మాటలలో నాకెట్టి సంశయమును దోచలేదు. ఈ యుత్తరము నిశ్చయముగా కుంజ వ్రాసినదియే.

అమూ—అట్లయినచో భయమేలేదు. నేనిప్పుడు వేఱొక పనిమీద బోవలసి యున్నది. లేకున్నచో నేనుగూడ నీతోడనే వచ్చి యుందును.

అమ—నీ పనియేదో చేసికొనుము. భయములేదు. నన్నెవ్వరు నేమియును జేయజాలరు.

అమూ—ఎట్లయినను మంచిదే. నేనొక్కమాట చెప్పుచున్నాను వినుము, నీవు పోవునప్పుడు రివాల్వరును మాత్రము మఱచి పోవలదు.

అమరేంద్రుడు పకపక నవ్వనారంభించెను. అప్పు డమూల్యుడు గంభీర భావముతో, గంభీర స్వరముతో—"సోదరా ! నీ విప్పుడు నీ నెత్తిపై బెట్టుకొన్న కార్యభారము సాధారణమైనదికాదు. ఈకార్య క్రమమునందడుగడుగునకు ననుమానించుచుండవలసినదే!" అనియెను.

అమరేంద్రుడు మరల నట్లే నవ్వుచు—"నీ మాటకూడ నిజమే—నేనుమాత్ర మంత యజాగ్రత్తగా బోయెద ననుకొంటివా ?" అనియెను.

అమూ—ఈ విషయమునందెంత జాగ్రత్తగా జూచుకొనుచున్న నంత మంచిది.

అని చెప్పి యమూల్యుడు వెడలిపోయెను. అమరేంద్రు డతి కుతూహలముతో నా బాలకుని రాకకు నిరీక్షించుచుండెను. ఇంచు

మించుగా నారాత్రి తొమ్మిది గంటలు కొట్టినప్పటికా బాలకుడు మెల్లగా నచ్చటికి వచ్చి—"బాబూ! ఈ పట్టణములోబడి దారి తప్పిపోయితిని. అన్నివీధులు నాకంటికొకలాగే యగపడుచున్నవి—ఏమి చేయుదును—ఎట్లో యిచ్చటికి జేరుకొనునప్పటి కింతసేపైనది. బయలు దేఱుదుము బాబూ! ఇక నాలస్యము చేయవలదు" అనియెను.

అమరేంద్రు డిదివఱకే సన్నద్ధుడై యున్నవాడు కావున వెంటనే యాతనితో ప్రయాణ మయ్యెను. అప్పుడా యిరువురు నొక బండి మాటాడుకొని వరాహా నగరమునకు వెడలిపోయిరి.

బండి వరాహా నగరము చేరుకొనియెను. అప్పుడా పిల్లవాడొక చిన్నసందున కెదురుగా బండి నాపించెను. ఇరువురును బండినుండి క్రిందికి దిగిరి. ఆ బాలకుడు మృదుస్వరముతో—"బాబూ! ఆ యిల్లీ సందులోనే యున్నది" అని చెప్పెను.

అమరేంద్రుడా పిల్లవాని వెనువెంటనే నడచి పోవుచుండెను. అదియొక చిన్నసందు. వెలుగేమియు లేదు—కేవలమును గాఢాంధకార బంధురమై యుండెను—కంటి కేమియు నగపడుట లేదు. ఆ బాలుని యడుగుల చప్పుడు ననుసరించి యమరేంద్రుడు నడచుచుండెను.

ఆ యిరువురు నావిధముగా గంగానదీ తీరమునకు బోయిరి. అప్పు డాకస్మికముగా నమరేంద్రుని హృదయమున సందేహము కలిగెను. అతని కప్పు డమూల్యుడు చెప్పిన మాట స్మృతికి వచ్చెను. చటాలున నాతడు తన జేబులోనున్న రివాల్వరును పైకిదీసి చేత బట్టుకొని గంభీర స్వరముతో నా బాలకు నుద్దేశించి—"నీవిప్పుడు నన్నెక్కడకు దీసికొని పోవుచున్నావు?" అని ప్రశ్నించెను.

ఆ పిల్లవా డాతనిమాట కెట్టి ప్రత్యుత్తరమును జెప్పక యొక్క యుదుటున నాతనిపైకి లంఘించి వెన్నుపై నొక గ్రుద్దు గ్రుద్దెను. తోడనే వెనుకనుండి యెవ్వడో వచ్చి యాతని రెండుచేతులను బలవంతముగా బట్టుకొనియెను. ఆ వెంటనే మఱియొకడు వచ్చి

యాతని నోట గుడ్డలను గ్రుక్కెను. తుద కింకొకడు వచ్చి యాతని చేతిలోని రివాల్వరును లాగుకొనియెను.

అమరేంద్రుడు కేకలను వైచుటకు కూడ నవకాశము లేనివాడై పోయెను. అతని నోరును, కన్నులును గుడ్డలతో మూసివైవబడియెను. తరువాత నైదారుగురు మనుష్యులు వచ్చి యాతని క్రిందబడద్రోసి కాలుసేతులను బంధించివైచిరి. ఆ బంధములను ద్రెంచికొనుట కాతడెంతో సాహసముతో బ్రయత్నించెను. కాని యెంతమాత్రమును లాభము లేకపోయెను.

అప్పుడు వారందఱు నమరేంద్రుని దీసికొనిపోయి యొక పడవలో బడవైచి పడవను ద్రోసికొని పోవుచుండిరి. చాల రాత్రి వఱకును బడవ కదలుచునే యుండెను. అమరేంద్రునకా పడవ యెటు పోవుచున్నదియును దిక్కు తోచుటలేదు. కొంతసేపటికా పడవ యొకచోట నాగెను. అది యింకొక పెద్ద పడవప్రక్క నాగియుండెనని యమరేంద్రు డూహింపగలిగెను. పిదప కొందరు వచ్చి యాతని నా పెద్దపడవలోనికి దీసికొని పోయిరి. పిమ్మట నాతని నొక యంధకారమయంబగు గదిలోనుంచి తలుపులను బంధించివైచిరి.

అదియొక పెద్ద పడవయనియు, చాల లోతైనచోట నదీమధ్యమునందా పడవ లంగరు వైవబడి యుండెననియు నమరేంద్రు డూహాలనుబట్టి గ్రహింపగలిగెను. వారాపడవయందలి హాలున కెదురుగనున్న చిన్నగదిలో నాతని బంధించివైచిరి. ఇంతేకాక లంగరు గొలుసుతో నాతని పాదములను బంధించివైచిరి. ఆతనికిక గాలుసేతుల బంధములను వదలించుకొనుటకుగాని, తప్పించుకొని పాఱిపోవుటకుగాని యెట్టి యుపాయమును లేదు. అతి కఠినంబగు లోహశృంఖలములచే నాతని గట్టివైచిరి. దానిని ద్రెంచివైచుట యెవ్వరికి సాధ్యమగును?

అప్పు డమరేంద్రుడు తనలో—"అమూల్యాని మాటకు బరిహాసించినందులకు నాకు దగిన శాస్తియే యైనది. నన్నీవిధముగా బంధించుటకే వీరీ తంత్రమును బన్నినారు. ఇప్పటికిగాని నాకీ సంగతి బోధపడినదికాదు!" అని తన్ను దానే నిందించుకొనియెను.

## ప్రకరణము 17

ఇంచుమించుగా నఱగంట సేపటివఱకు నాతడట్లే యుండెను. ఏవైపునుండియు నెట్టి శబ్దమును వినవచ్చుటలేదు. అతడు తనలో—"నన్ను జిన్నపడవపై నెక్కించి తీసికొని వచ్చినవారందఱు నీ పెద్ద పడవపై నన్ను విడిచి తమదారిని బోయియుందురు. ఈ పడవలో నెవ్వరైన నున్నారేమో! నేనిప్పు డెచ్చట నున్నాను? ఈ పడవ యెచ్చట నున్నదో? నేనింటికి రాకుండుటచే నమూల్య డనుమానించి యొకవేళ బోలీసువారికి సమాచార మంపినను వారీ గంగా మధ్యము నందున్న నన్నెట్లు కనుపెట్టగలరు? ఇట్లు నన్నీపడవలో బంధించి యుంచుటకీ దొంగల యుద్దేశ మేమైయుండును? ఒకవేళ వీరు నన్ను జంపదలచిరా యేమి?" అని యిట్లనేక విధముల నాలోచించుకొన దొడంగెను. కాని తప్పించుకొనిపోవుట కుపాయ మేమున్నది? అతడట్లే యేమియు దోపక నిశ్శబ్దముగా గూర్చుండి యుండెను.

అఱగంటసేపైన తరువాత నెవ్వరోగాని దీపము చేతబట్టుకొని వచ్చి యా పడవ గది తలుపును దెఱచిరి. ఆ వ్యక్తి యా దీపముతో లోపల బ్రవేశించునని యమరేంద్రు డనుకొనియెను. అతడు లేచి నిలువబడ దలంచెనుగాని యట్లు చేయజాలక పోయెను

అప్పు డా వ్యక్తి యా దీపము నొకచోటనుంచి యమరేంద్రుని కడకు బోయి ముందుగా నాతని కంటికిని నోటికినిగల బంధముల నన్నిటిని వదలించివైచెను. అమరేంద్రుడు కన్నులనువిచ్చి చూచెను.

ఆ వ్యక్తి యొక్క మందుల ముసలిది! ఆతడు మూర్షిదాబాదులో నామెను జూచియే యుండెను. అప్పుడా వృద్ధురాలమరేంద్రుని చేతి సంకెలను విడిపించెను. అమరేంద్రు డేమియును మాటాడలేదు.

చేతి సంకెలలు వదలినంత మాత్రమున బాఱిపోవుట కెట్టి యవకాశమును లేదు. బలమైన లోహ శృంఖలములచే నాతని పాదములు బంధింపబడి యుండెను. ఉపాయాంతరము కానరాకుండుటచే నాతనికి క్రోధము వర్ధిల్లి పోవుచుండెను. అప్పు డాతడా వృద్ధురాలిని రోష కషాయిత నయనములతో దిలకించుచు దీవ్రస్వరముతో—"ఏమిపని చేయుచున్నావు? ఎంత నిర్భయము! జైలున బడిపోవలసి వచ్చునని మీ కేమియుం భయము లేదా? జాగ్రత్త! పండి పండి మీ పాపము బ్రద్దలు కాక మానదు!" అని యదలించెను.

ఆ మందులది వయసు ఉల్లినదైనను నామె శరీరము మిగుల దార్ఢ్యము కలదిగా నగపడుచుండెను. ఆమె ముసలిదై యున్నను నామె దేహ మించుకంతయైనను ముందటి వైపునకు వంగి యుండలేదు. ఆమె మొగమువంక జూచినచో నెంతయో వికారముగా నుండును. అప్పుడా ముసలిది తన నల్లని మాను మొగమునందలి తెల్లని దంతములను వెలువడజేయుచు నతి వికటముగా నొక్క నవ్వు నవ్వి వికృత స్వరముతో—"ఎవరు? పోలీసువారా? ఓహో! వారు మమ్ములను బట్టి బంధించి యెంతపనియైనను జేయుదలచియున్నారు. వారి చేతనైన పనియేమో మాలోచనన కంతయును బూర్తిగా దెలియును" అనియెను.

అమ—ఆలాగా! అట్లయినచో నీ కపటకృత్య మంతయును మీ లోచనుడు చేసినదేనా!

ముస—అత డచిరకాలములోనే మీ దర్శనమునకు రాగలడు. అప్పు డాతనివలన మీ కెల్లసంగతులను సవిస్తరముగా దెలిసికొన వచ్చును.

అమ—వా డిచ్చటి కెప్పుడు వచ్చును ?

ముస—ఎప్పుడో నా ?—రేపు—రేపే—ప్రియమిత్రమా ! రేపే వచ్చి మీ దర్శనము చేసికొందును !

అమ— నే నెట్టి కట్టుదిట్టమును జేసికొనకుండగనే యిల్లు వదలి మీ మనుష్యునితో నూరక బయలుదేఱి వచ్చితినని యెంచి మీరు నిర్భయముగా నున్నారు కాబోలును ! పోలీసువారీపాటికి మీ దారుణ కృత్యముల ననుసంధానము చేయుట కారంభించియే యుందురు.

ముస—అలాగా ! నీవెంత బెదరించినను పోలీసువారనిన మాకెట్టిభయమును లేదు.

అని చెప్పి యాతడు చటాలున నా పడవ గది తలుపును మూసి తాళమువైచి వెడలిపోయెను. అమరేంద్రుడు మరల నా గాఢాంధకార మధ్యమున నేకాకియైపోయెను. ఏమిచేయుటకు నాతని కెట్టి యాలోచనయును దోచుటలేదు హతాశుడై యాతడా బల్లలగదిలో వెల్లవెలికిల బడియుండెను

ఆ రాత్రి యంతయు నాతని కంటికి నిద్రయనుమాటయే లేకుండెను. ఇట్టి భయంకరావస్థలో నిద్ర ఎవ్వనికి బట్టును ? అమరేంద్రుడప్పుడు దొంగవలె జేతికట్లు బంధింపబడి యుండెను—పారిపోవుట కెట్టి యవకాశమును లేదు. అప్పుడాతడు తన పాదములకు బంధింపబడిన శృంఖలములను జేతితో దడవి చూచుకొనియెను. బలమైన యంత్రసాధనము వలనగాని యవి విడివడునట్లగపడ లేదు.

అనేక విధములగు నాలోచనలచే నాతనికా రాత్రియంతయును గడచిపోయెను. ఇంచుక వెలుగునుబట్టి అతడప్పుడా గదిలోనుండియే తెల్లవాఱినదని తెలిసికొనియెను. కాని యేవైపునుండియు నెట్టి శబ్దమైనను వినరాకుండుటచే నా పడవ యొక నిర్జన స్థానమున బంధింపబడి యుండెనని యాతడు భావించుకొనియెను. అట్టి శూన్య స్థానమున నొకవేళ గేకలు వైచినను నితరులకు వినబడకుండుటయేకాక మీదు

మిక్కిలి యీ దురాత్ములకు దీవ్రభావము మఱింత వర్ధిల్ల జేసినట్లు కూడ నగునని యాత డూహించుకొనియెను. ఇప్పుడు నిరుత్సాహముచే మతి పోగొట్టుకొన్నచో నిక దప్పించుకొనిపోవు నాశ యుండదని యాతడు దైవముపై భారము వైచి ధైర్యముతో నుండెను.

చాలసేపటికి మరల నా గృహద్వారము తెఱవబడియెను. మరల నా క్షుద్రగృహ మధ్యమునం దించుక వెలుతురు ప్రసరించెను. ఆ దుఃఖాంధకార మధ్యమునందా గ్రుడ్డివెలుగు గాతని ప్రాణమున కొకవిధమగు నభూత పూర్వానందము నూర్చుచుండెను. అప్పు డాత డెదుటి వైపునకు బరికించి చూచెను. ఆ బాలకు డొక పళ్ళెముతో నన్నమును దీసికొని వచ్చియుండెను. ఆవిశ్వాసఘాతుకుడే అమరేంద్రున కిట్టి దురవస్థను సంఘటింప జేసినవాడు! వానిం గాంచినంతనే యమరేంద్రుడు తీవ్రక్రోధముచే నున్మత్తుడై పోయెను. ఆతడు తన సమీపమునకు వచ్చినంతనే యాతని తలను బలవంతముగా బట్టుకొని యీ పడవకొయ్యలపై వైచి కొట్టి చూర్ణ విచూర్ణముగా జేసివేయ వలయునని క్రోధముతో నమరేంద్రుడు భావించుకొనియెను. కాని యంతలోనే—"ఇది మంచిపనికాదు. వీని నెట్లయినను లోబఱచు కొనుటకు ప్రయత్నింపవలయును వీడు కట్టువాడు దొంగజిత్తులు వీని కింకను దెలియవు ఒకవేళ వీని సాహాయ్యమున నేను దప్పించుకొని పోవుట కుపాయము దొరకినను దొరకవచ్చును" అని యూహించు కొని యమరేంద్రుడు తన క్రోధమునంతను హృదయమునందే యణచుకొని యాతనివంక నతి శాంతముగా జూడ నారంభించెను. అమరేంద్రుడట్లు తనవంక దదేకదృష్టిం గాంచుచుండుటచే నా పిల్లవాడు భయపడి కంపితస్వరముతో—"అయ్యా! లోచనుడు మీకీ యన్నమును బెట్టి రమ్మని చెప్పి నన్ను బంపించినాడు—ఇది యీ ముసలిదియే వండినది—మీరు భోజనము చేయుడు!" అనియెను.

అమరేంద్రుడు మృదుస్వరముతో—"అలాగా! అట్లయినచో నా యన్నము నిచ్చటికి దీసికొని రమ్ము!" అనియెను

ఆ బాలకుడు భయప్రకంపితుడై గద్గద స్వరముతో—"అట్లే తెచ్చెదను. కాని, నేను చేసినపనికి కోపగించి మీరు నన్ను కొట్టరుగదా?" అనియెను.

అమ—నిన్ను కొట్టుటవలన నేమి ప్రయోజన మున్నది? నీ వేమి చేసితివి? మీ పెద్దలు చెప్పిన పని చేసితివి. ఆ యన్నము నిటు తీసికొని రమ్ము! నీతో కొంచెము మాటలాడవలసిన పని యున్నది.

ఆ కుఱ్ఱవాడా యన్నపు బళ్ళెముతో మెల్లమెల్లగా నా గది లోపల ప్రవేశించెను.

## ప్రకరణము 18

ఆ కుఱ్ఱవాడా యన్నమును లోపలనుంచి తోడనే వెలుపలికి వచ్చి ద్వారము చెంగట కనుపెట్టుకొని నిలిచి యుండెను. అమరేంద్రు డాతనిం గాంచి—"నీవు పోవుట లేదేమి! అక్కడ నేల నిలువబడి యున్నావు?" అని ప్రశ్నించెను.

బాలు—మీరు భోజనము చేయుదురో చేయరో చూచి పోవలయునని యున్నాను.

అమ—అది యేమి?

బాలు—అట్లు చూచిరమ్మని మా లోచనుడు నా కాజ్ఞాపించి యున్నాడు.

అమ—నేను తినియెదను లెమ్ము! నీ వీ విధముగా నన్ను నమ్మించి కొంత కోయకున్నచో నీకు నేను బదిరూపాయలు బహుమానముగా నీయవలయునని నిశ్చయించుకొన్నాను. కాని నీవు నన్ను మోసము చేసినావు.

బాలు—ఔను బాబూ! మీరిచ్చు బహుమానమునను మూట గట్టుకొనుటకు నాకు బట్టలెక్కడివి!

అమ—అట్లు భావింపనక్కఱలేదు. నీకు నిశ్చయముగా నీయ దలచియే యుంటిని ఇప్పుడైనను మించిపోయిన దేమున్నది? నేను చెప్పినపని చేసినచో—

బాలు—ఆ పని యేమో చెప్పుడు! వినియెదను. నాచేత నైనచో జేసెదను.

అమ—మంచిది. నే నిప్పుడొక యుత్తరమును వ్రాసెదను. నీవు దానిని దీసికొనిపోయి వారి కందించినచో—

బాలు—ఎవరికి బాబూ! పోలీసువారికా? నా వ్రేలుపెట్టి నా కన్నే పొడువదలచితిరా!

అమ—పోలీసువారికిగాదు. నీ కా భయ మక్కఱలేదు. నే నీ విషయమున బోలీసువారికి సమాచార మంపదలచుకొనలేదు. మీ కుంజ కొక యుత్తరము వ్రాసి యిచ్చెదను. దానిని నీ వామె కీయవలయును.

ఆ బాలుడు కొంతసేపటివఱకు నే మేమియో యాలోచించు కొని పిమ్మట మెల్లగా—"బాబూ! నే నీ పని చేయుదునుగాని యీ సంగతి మా లోచనున కింతమాత్రము తెలిసినను నన్ను ప్రాణములతో నిలువనీయడు" అనియెను.

అమ—నేను పదిరూపాయల నీయునని కాబోలును నీ వనుమాన పడుచున్నావు!

బాలకుడు మరల గొంతసే పాలోచించుకొని—"అట్లయినచో నాకు బదిరూపాయలు నిచ్చెదరా?" అని ప్రశ్నించెను.

అమ—నీకీ సందేహ మేల కలుగుచున్నది! నా వంటివా డసత్యము చెప్పుననుకొంటివా!

బాల—ఎప్పుడో యిచ్చెదననిన లాభములేదు. నా కిప్పు డిచ్చినచో మీపని చేసెదను.

అమ—నీవట్లు కోరుట యుచితముగా లేదు. నీవు నా యుత్తర మును దీసికొనిపోయి కుంజ కిచ్చి యామెవలన ప్రత్యుత్తరమును

దెచ్చి నాకిచ్చినచో నప్పుడే నీకు పదిరూపాయలు నిచ్చెదను. ముందుగనే రూపాయల నిచ్చినచో నీవు నా యుత్తరము నీ గంగా జలములలో బాఱవైచెదవు.

ఆ బాలకుడు మరల బాగుగ నాలోచించుకొనియెను. అతడు తనలో—"కుంజ మామందుల గుంపులోనిదేగదా! ఆమె కుత్తరము నిచ్చుటవలన గలుగు నష్టమేమియు నుండదు. కాని తరువాత నీతడేమి చేయునో? అన్నమాట ప్రకారము పదిరూపాయలును నాకిచ్చునా?" అని యూహించుకొన దొడంగెను.

అమ—నీకు రూపాయల నీయకున్నచో నామె వ్రాసిన యుత్తరము నాకీయనేవద్దు—నాయొద్ద రూపాయలను దీసికొన్న తరువాతనే యీయవచ్చును.

బాల—మీయొద్ద నప్పుడేమియును లేదుగదా! ఇట్టి స్థితిలో మీకు పదిరూపాయ లెక్కడనుండి వచ్చును?

అమ—నీ కా సంశయము మక్కఱలేదు. నా సొమ్ము కుంజ యొద్దనే యున్నది. ఆమెయే నీకీయగలదు.

బాల—మంచిది. అట్లయినచో నుత్తరమును వ్రాసి యిండు. కుంజ నాకు రూపాయల నిచ్చినప్పుడే నేనామెకీ యుత్తరము నిచ్చెదను. ఈయకున్నచో దీనిని జించి పాఱవైచెదను.

అమ—మంచిది—అలాగే చేయుము.

అని చెప్పి యమరేంద్రుడు తన జేబులోనుండి పెన్సిలును, గాగితమునుదీసి కుంజకీ విధముగా నుత్తరమును వ్రాసెను—

"నన్నిద్దొంగలు గంగానది యందొక పడవలో నిర్బంధించి యుంచినారు. చీకటి గదిలో బంధించి యుంచుటచే నిది ఏ ప్రాంతమో నాకు బోధపడుటలేదు. ఈ యుత్తరము తెచ్చిన బాలకు నడిగినచో నీకన్ని సంగతులును దెలియ వచ్చును."

ఆ బాలకుడా యుత్తరమును దీసికొని యటనుండి వెడలి పోయెను. అప్పు డమరేంద్రుని హృదయమునం దొక్కించుక యాశా సంచార మగుచుండెను "నాయెడల కుంజకవ్వాడ ప్రేమ యున్నది. నాకష్టము నించుకంతయైనను నామె సహింపలేదు. ఆమె నిశ్చయముగా నన్నుద్ధరించుటకై తన ప్రాణములనైన వినియోగించి తగిన ప్రయత్నము చేయక మానదు. ఇంతకంటె నారక్షణమునకు మఱియొక యుపాయము లేదు" అని యాత డాశతో నెదురు చూచుచుండెను. అప్పు డాతని హృదయావస్థ వర్ణనాతీతమై యుండెను

మఱునాఁడు రెండుజాముల వేళ స్వయముగా లోచనుండే యచ్చటకు విచ్చేసెను. అమరేంద్రు డాతనిం గాంచి యేమియును మాటాడలేదు. ఆతనిం గాంచి భయభ్రాంతుడైనట్లుగాని, సంచలిత హృదయుడైనట్లుగాని ప్రదర్శించుట యమరేంద్రున కెంతమాత్రము నిష్టము లేకయుండెను. లోచను డట్లువచ్చి యాతని సమీపముననే కూర్చుండెను. కాని యంతసేపటివఱకు నేమియు మాటాడలేదు. పిమ్మట నాతడు—"అమర బాబూ! నీవు చాల తెలివిగలవాడవు—చుఱుకైనవాడవు—నే నీ సంగతిమాత్ర మంగీకరించెదను" అనియెను.

అమరేంద్రుడు గంభీర భావముతో దీవ్రస్వరముతో—"నీవు ఘోరతర కపటతంత్ర నిపుణుడవు—దారుణ చరిత్రుడవు—ఈ సంగతియును నేను మనఃపూర్వకముగా నంగీకరింతును" అనియెను.

లోచ—అమరబాబూ! ఎందులకీ కడుపుబ్బు మాటలు? ఇట్టి మాటలవలన ప్రయోజన మేమున్నది?

అమ—ఇప్పుడు లేకపోవచ్చును. ఇవి యెప్పటికైన ప్రయోజనీయములగు మాటలు కాగూడదా?

లోచ—ఏమైననేమి? ఇప్పుడు నీవు మాచేతికి దొరకిపోయితివి. మాచే బంధింపబడియుంటివి.

అమ—ఔను. నిజమే—నేడిట్లు జరగినదిగదాయని సంతోషించుటయేగాని రేపేమగునో నీవాలోచించుకొనుటలేదు.

లోచ—ఏమిజరగినను నీవిటనుండి తప్పించుకొని పోయినప్పుడు గదా! అట్టిపని యింతిలో జరగుట కవకాశము లేదు.

అమ—నే నిచ్చట బంధితుడనై యున్నంత మాత్రమున బసియాగుననుకొంటివా? పోలీసువారందఱు నేమగుదురు?

లోచ—పోలీసువారా? వారిసంగతి నే నెఱుగుదు. వారు వేయిమంది వేయి ప్రయత్నములు చేసినను నీవున్న ఈ ప్రదేశమును గనుపెట్టలేరు.

అమ—సరే! ఈ మాటలకేమి! మీరందఱు నన్నిట్లు బంధించి యుంచితిరిగదా! తుద కేమిచేయ దలచితిరి?

లోచ—ఆ సంగతి మా వర్తకుడు కాహెయావచ్చి స్వయముగా మీకు మనవిచేయగలడు.

అమ—అలాగా? అట్లయినచో నా దుర్మార్గుడేనా మీకందఱకును నాయకుడు?

లోచ—అట్లే యనుకొనవచ్చును.

అమ—మంచిది. నేను మిమ్ముల నందఱును బట్టుకొని మీకు దగిన శాస్తి చేయింపకున్నచో నాపేరు మారుపేరు పెట్టుడు!

లోచ—బాబూ! ఇక నీ మాటలన్నియు నెందులకు! ఈ యడియాస కేవలమును వదలుకొనవలసినదే—

అమ—ఏ కారణముచే నట్లు చెప్పుచున్నావు! మీ రందఱు నిచ్చట నన్ను జంపివైవ దలచితిరా యేమి?

లోచ—అట్లెన్నటికిని జరుగదు. కాని మీపనులను నీ మూలమున నెట్టి వ్యాఘాతమును గలుగకుండునట్లుగా నిన్ను మా స్వాధీనములో నుంచుకొనియుందుము.

అమ—ఏమిజరగునో చూతముగదా!

లోచనుడు లేచి నిలువబడి—"మీ కాహెయా యిప్పుడిచ్చటికి వచ్చును. అతడు వచ్చి నీ కెల్ల విషయములును సవిస్తరముగా

తెలియజేయును నే నిప్పుడు నిన్ను జూచిపోవలయునని మాత్రమే వచ్చితిని " అని చెప్పి యాతడు వెడలిపోవుచుండెను.

అప్పుడు యమునేంద్రుడు ద్రోకు యెదుటున లంఘించి క్రోధకంపిత స్వరముతో—" పాపాత్మా! దారుణ చరిత్రా!" అని తిట్ట నారంభించెను.

లోచనుడు వెడలిపోయెను. బంధనములలోనుండి యమునేంద్రుడు లంఘించుటచే లోహ శృంఖలముల వలన నాతని పాదములు కొట్టుకొనిపోయి రక్తము ప్రవింప దొడంగెను. చేయునది లేక యాతడచ్చటనే కూలబడి పోయెను.

# ప్రకరణము 19

లోచనుడు వెడలిపోయినంతనే చాలమంది మనుష్యులా పడవ మీదికి కెక్కు చున్నట్లుగా వారి యడుగుల చప్పుడునుబట్టి యమునేంద్రుడు గ్రహించెను. పడవ యిటునటు నూగనారంభించెను. తరువాత లంగరు నెత్తివేసి నట్లను, క్రమముగా బడవ యా నదీ గర్భమున నడచిపోవుచున్నట్లును యమునేంద్రుడు తెలిసికొన గలిగెను. అప్పుడాతడు లోలో—" వీరీ విధముగా నన్నచ్చటకు దీసికొని పోవుచున్నారు?" అని యూహింప దొడంగెను. ఆతని కేసంగతియును బోధపడకుండెను.

పడవ యట్లే కదలిపోవుచుండెను. క్రమముగా సాయంకాల మయ్యెను. అప్పుడా పడవ మరల లంగరు వేయబడియెను. ఇక కొంతసేపటి కచ్చట నెట్టి పదశబ్దమును వినరాకుండుటచే బడవను ద్రోసికొని వచ్చిన గొందఱును నింకొక చిన్నపడవపై వెడలిపోయిరని యమునేంద్రు డూహించుకొనియెను. చూచుచుండగనె రాత్రియైపోయెను. ఆ గాఢాంధకార మధ్యమున యమునేంద్రు డేకాకియై

కూర్చుండి యుండెను. తా నట్లయిన నుద్ధరింపబడుదునని యిదివఱ కాతని కించుక ఆశ యుండెను. కాని యిప్పుడా యాశ వదలిపోయెను.

అమరేంద్రు డప్పుడు తనలో—"ఒకవేళ కుంజ నన్నుద్ధరింప వలయునని ప్రయత్నము చేసినను నేనున్న యీ ప్రదేశము నెట్లు తెలిసికొన గలుగును? ఈపాపాత్ములు మరల నీపడవలో నన్నిచ్చటికి తీసికొని వచ్చినారు. ఈ చోటు కుంజకు దెలియుట కవకాశ మేమున్నది? ఇక నాగతి యింతే! ఫత్తేదారు సాహేబీ రహస్యము భేదించునంతటి తెలివిగలవాడా? ఇక దేవునికంటె నన్నుద్ధరించువా రెవ్వరును లేరు" అని యాలోచించుకొన దొడంగెను

ఈ యాలోచనలచే నాతని మనసంతయు వికలమై పోవుచుండెను. సాయంకాలమైనతరువాత వర్తకుడగు కాహియా అచ్చటికి వచ్చెను. అతనిం జూచినంతనే యమరేంద్రుడు క్రోధోద్రేకముతో— "పాపాత్ములారా! ఇంకను మీ దుష్కృత్యములను మానరా? జైలులో బడవలసి వచ్చునేమోయని భయములేదా?" అని ధిక్కరించెను.

ఆ మాటలు విని పాపిష్ఠుడగు కాహియా వికృతముగ నవ్వుచు— "అమరబాబూ! నీవు కన్నుఎఱ్ఱజేసినంత మాత్రమున నేను భయపడుదు ననుకొంటివా? మహా సమర్థుడవగు నీ ప్రస్తుతము మా చేతులలో నున్నావు. ఘోలాఘుడైనను నిన్ను నుద్ధరింపలేడు. మాకు గలిగించిన నష్టమునకు మావలన నీవు తగిన ప్రతిఫలమును బడయనక్కఱలేదా?" అనియెను.

అమరేంద్రు డట్లే క్రోధోన్మత్తుడై గంభీర స్వరముతో— "నేను మీకెట్టి నష్టమును గలిగించితిని?" అనియెను.

కాహి—అయ్యో! మీకింకను బోధపడలేదా? మీరాదినమున మాదుకాణములోనికి బోలీసువారిని దీసికొని రాలేదా? ఇంకేమి యుపకారము చేయవలయును? ఆకారణముచే నేను వర్తకమంతయును వదలుకొని మఱియొకచోటికి బోవలసి వచ్చినది.

అమ—నీయందు దోషమున్నది. కావుననే నీవట్లు పాఱి పోయితివి. నేరమే లేకున్నచో పోలీసువారనిన నీకంత భయమేల కలుగవలయును ?

రాహి—ఇంకను నీ దురభిమానము వదలుటలేదు నీవేమి చేయగలవు ? నీకిక నీదేశమునందు యథేచ్ఛముగా సంచరించు భాగ్యము తప్పిపోవుచున్నది. ఆ పాత్రములయందలి సంకేతాక్షరముల నిగూఢ రహస్యమును నీవు బయట బెట్టుకున్నచో బుద్ధిహీనులగు పోలీసువారు మమ్ముల నేమైనను జేయగలరా ? మా దారిదోపిడులను నూర్చిన రహస్యము లెంతవచ్చినను వారికి బోధపడునా ? నీవట్టి మునుక కంతకును మూలకారణము నీవే

అమ—అట్లయినచో నీవుకూడ నీ దొంగల గుంపులోని వాడవేనా ?

రాహి—ఔను బాబూ ! ఈ దాసుడుకూడ నందులోనివాడే! నీవు మఱియొకలాగు భావింపనక్కఱలేదు. కాని దొంగతనము చేయు వారు మాత్రము వేఱుగా నున్నారు.

అమ—వారెవ్వరు ?

రాహి—ఆ సంగతి యొక్కటి మాత్రమే నీకింకను దెలియలేదు. అందుచేతనే యింతవఱకు మా ప్రయత్నముల కెట్టి వ్యాఘాతమును గలుగుటలేదు. ఇక నా రహస్యము నీ కెప్పటికిని దెలియకుండుటకే నిన్నిట్లు చేయవలసి వచ్చినది.

అమరేంద్రుడు విస్మయ సంశయాకులిత హృదయుడై తనలో— "వీరు నిజముగా నన్ను జంపివైవ వలయుననియే ప్రయత్నించు చున్నారు. ఏదియో యొక నిర్జన ప్రదేశమున కీపడవను దీసికొనిపోయి యచ్చట వీరు నన్ను గడతేర్చివైచి నామృతకళేబరమును గంగా నదిలో బాఱవేయుదురు. చావునకు సిద్ధపడియున్న నేనిక భయపడు టెందులకు ! నిరాశపడు టెందులకు ! మరణమునకు భయపడక

తెగించి బ్రదికి యున్నంతవఱకు నాచేతనైనపని చేయవలసియే యుండెను నా శరీరమునం దసాధారణమగు బలమున్నది. వీరిలో నెవ్వరైనా కూడ నాచేతియొద్దకు రాజాలరు. వచ్చినచో గ్రుద్దున కొక్కడుగా స్మృతితప్పి పడిపోవలసినదే. రెండురాత్రులనుండి విశ్రాంతియనుమాట లేకుండ నాకాలికి బంధించిన ఈ గొలుసులను బగులగొట్టుటకు బ్రయత్నించుచుంటిని. చాలవఱకీగొలుసు నలగిపోయినది ఇక నొకరాత్రి కష్టపడినచో సంపూర్ణముగా పడిపోవునని తోచుచున్నది. నేనెట్లయిన నీ సంకెలలను వదలించుకొనుటయే తటస్థించినయెడల ననాయాసముగా నిటనుండి తప్పించుకొని పోగలుగుదును. ఈ దొంగముండ కొడుకులు పదిమంది యడ్డమై వచ్చినను నన్నేమియు జేయజాలరు" అని యూహించుకొనుచు నా వర్తకుని మాట కెట్టి ప్రత్యుత్తరమును జెప్పక మౌనముతో గూరుచుండెను.

కాహిరా యమరేంద్రుని మనోభావమును బాగుగ గ్రహించి- "అమరబాబూ! ఏమి యాలోచించుచున్నావు? మమ్మిక నీ వేమియును జేయజాలవు. మేము నిన్నింతమాత్రమును జంపదలచుకొనలేదు నీవు మాకు జేసిన యుపకారమునకు నిన్ను జంపివైచినను దోషము లేదుగాని నీవంటివానిని జంపుట మాకిష్టము లేదు. నిన్ను రేబియా స్టీమరుపైన రేబియా దేశమునకు బంపివేయవలయునని నిశ్చయించుకొన్నాము. వారు నిన్నటనుండి మదీనాకు బంపివైతురు. తరువాత నీ వెప్పటికైన మరల నీ దేశమునకు వచ్చినను నందువలన మాకెట్టి నష్టమును లేదు" అని చెప్పి వికటహాసము చేయుచు నా దురాత్ముడటనుండి వెడలిపోయెను.

అమరేంద్రుడు క్రోధోన్మాదముచే నొడలు తెలియక యాతని బట్టుకొనవలయునని లంఘించెనుగాని యినుప గొలుసుల రాపిడిచే నాతని పాదములు కొట్టుకొనిపోయెను. ఆ దుర్మార్గుల దురుద్దేశములం

గాఢమైన క్రోధోద్రేకముచే నాతని సర్వాంగకములును కంపించి పోవుచుండెను. దాని ప్రతీకారము చేయుట కుపాయమేమున్నది? అతడేమి చేయుటకైనను నసమర్థుడై పడియుండెను. దైవవశమున నిసారి యెట్లయిన దప్పించుకొనగలిగినచో నిదురాత్ములకు దగిన శాస్తి చేయుదునని యాతడు తనలో వేయిసారులు ప్రతిజ్ఞ చేసికొనుచుండెను. కాని యెంత యాలోచించినను దానుద్ధరింపబడుటకు మార్గమేదియు నాతనికి బోధపడుటలేదు. ఈ రాత్రి కష్టపడి యేలాగునైన నినుప శృంఖలములను బగుల గొట్టవలయునని యాతడు నిశ్చయించు కొనియెను.

పిమ్మట నాతడు తనలో—" నేనగపడకుండబోయి యిప్పటికే మూడుదినములైపోయినది. నారాక లేకుండుటచే నా యమూల్యుడు పోలీసువారికి సమాచార మంపకుండునా! అమూల్యుడు తెలివి తక్కువవాడు కాడు. ఫతేఅలీ సాహేబును, పోలీసువారును గూడ నాకొఱ కనుసంధానము చేయుచునే యుందురు. మూడుదినములు తెటాలుపడికూడ నారెట్టి యూగడయును గ్రహింపజాలనప్పుడిక నన్ను వారెప్పటికైన గనుపెట్టి యుద్ధరింపగలరను నాశ యెంతమాత్రమును లేదు " అని నిశ్చయించుకొనియెను.

కోపముచే నాతని కనుదలు మండిపోవుచుండెను. నిరాశచే నాతని హృదయము కొట్టుకొని పోవుచుండెను. పాపాత్ములగు నా ముసలిముండను బట్టుకొని కసిదీర బాధింప గలిగినచో దన హృదయ పరితాపము కొంతవఱకైన శాంతింపగలదని యాత డూహించుకొనియెను. ఆమె ప్రతిదినమును నాతని కాహారమును దీసికొని వచ్చుచుండెను. ఆ కుఱ్ఱవాడేమైపోయినదియును దెలియలేదు. ఇంతవఱకును వాడు రానేలేదు. అందుచే వాడా యుత్తమును దీసికొని పోయి కుంజ కందించి యుండునని యమరేంద్రుడాశతో నుండెను.

ఈ దినమున నెట్లైన నాముసలిదానిని బట్టి కొట్టవలయునను నుద్దేశముతో నమరేంద్రు డాగదిలో నొకమూల నొదిగి కూర్చుండి యుండెను. అత డనుకొన్న ప్రకారమా ముసలిది యెప్పటివలెనే

యాహారమును దీసికొని యచ్చటికి వచ్చెను. ఆ చీకటి గదిలో నామె కంటి కేమియు నగపడుటలేదు. అమరేంద్రుడు యథాస్థానమునందే కూర్చుండి యుండునని భావించి యామె పూర్వమువలెనే నిస్సంకోచముగా లోనికి బోయెను. అంతలో నమరేంద్రుడు సింహకిశోరమువలె నొక్క యుదుటున లంఘించి పైబడి యామెను బలవంతముగ బట్టుకొనియెను. యీ యాకస్మిక వ్యాపారము వలన నామె నిలువున స్తంభించిపోయి భయ సంచలిత స్వరముతో—"బాబూ! నీకు బదివేల సలాములు చేసెదను. నన్ను గొట్టవలదు, బాబూ! నన్ను విడిచిపెట్టుము!" అని వేడుకొనియెను.

అమరేంద్రు డామె నచ్చటనే క్రింద బడద్రోసి యామె కంఠమును గట్టిగ నడచి పట్టుకొనియెను. పిమ్మట నామె పైటచెఱగును జించివైచి దానితో నామె కాలుచేతుల నతి దృఢముగ బంధించి వైచెను. ఆ క్రోధములో నాతని కట్లుచేయుటకు సంశయముగాని జాలిగాని యెంతమాత్రమును లేకపోయెను. కోపముచే నాత డామె శిరోజములను బలవంతముగ లాగి యామె తలను బ్రక్కచక్కలతో డీడిక్కలాడించెను. ఆడుదాని నట్లుచేయగూడదని యాతని కప్పు డెంతమాత్రమును దోచలేదు. ఆ ముసలిముండ భయముచేతను నాయాసముచేతను మృతప్రాయమైపోయెను. ఆమెనోట మాటయే లేకుండ బోయెను.

ఆ సమయమునం దెవ్వరో యా పడవపై కెక్కి వచ్చుచున్నట్లుగా నమరేంద్రున కనుమానము కలిగెను. ఆ యుత్తర క్షణము నందే యెవ్వరో వచ్చి యా ద్వారముచెంత నిలువబడిరి. అప్పుడా ముసలిది యదరిపడి యా వంక జూచి—"అమ్మా! కుంజా వచ్చితివా? నన్ను బ్రతికింపుము తల్లీ!" అనియెను.

నిశ్చయముగా నా వచ్చిన యామె కుంజయే. అకస్మికముగ నామెం గాంచి యానందోత్సాహోద్వేగముచే నమరేంద్రునకు వాఙ్నిరోధమైపోయెను.

# ప్రకరణము 20

కుంజ సర్వసన్నద్ధయై వచ్చియుండెను. ఆమె రేఖయును మాటాడకుండగనే ముందుగా నమరేంద్రుని శృంఖలములను వదలించుటకు ప్రయత్నించుచుండెను ఇనుప గొలుసులను విడగొట్టు సాధనమును గూడ నామె తనతో దీసికొని వచ్చినది ఒక్క నిమిషములో నామె యా లోహ శృంఖలములను విడగొట్టివైచెను. అమరేంద్రు డిప్పటికి విముక్తుడయ్యెను. కాని కుంజ తరళ కటాక్షములచే మరల బద్ధుడైపోయెను అత డప్పు డద్భుతానంద పరవశుడై కుంజ సుందర వదన మండలమును దదేక దృష్టితో జూచుచుండెను అప్పుడు కుంజ యమరేంద్రుని హస్తమును బట్టుకొని రుద్ధప్రాయమగు కంఠ స్వరముతో—"రండు! ఇక నిచ్చట నొక నిమిషమైనను నిలువ గూడదు" అనియెను.

అమరేంద్రుడు మాఱుమాట చెప్పకుండ నామె వెనువెంటనే బయలుదేరెను. ఇరువురును నిమిషములో బడవ టాపుమీదికి వచ్చిరి ఆ ప్రక్క మూలనుండి యార్త స్వరముతో—"కుంజా! నన్ను గూడ విడిపింపవా?" అని కేకలు వైవసాగెను.

కుంజగాని యమరేంద్రుడుగాని యా మాటలను జెవిని బెట్టలేదు కుంజ యొక్క చిన్న పడవపై నచ్చటికి వచ్చియుండెను ఆ పడవ మీద నొక్క మనుష్యుడు మాత్రమే యుండెను. వా డా పెద్దపడవ తెట్టుచెక్కను బట్టుకొని నిలువబడి వారి రాక కెదురు చూచుచుండెను అప్పుడు కుంజయు నమరేంద్రుడును జటాలున పెద్దపడవపై నుండి చిన్నబోటులోనికి దుమికిరి. తత్క్షణమే యా బోటు కదల నారంభించెను.

అమరేంద్రు డిప్పుడు నిశ్చయముగా విముక్తుడయ్యెను ఆకస్మికముగ జరగిన యీ సంఘటన మప్పుడాతని కానంద స్వప్నము వలె నుండెను. అత డెట్లాశపడియుండెనో తుద కట్లే జరగినది. కుంజచే

స్వయముగ వచ్చి యాతని నుద్ధరించినది. ఆతని హృదయ మిప్పు డానంద ప్రపూర్ణమైయుండెను. మృత్యుముఖమునుండి ప్రాణములతో దప్పించుకొని రాగలిగినవా డెవ్వడైన నున్నచో నాతడే యిప్పటి యమరేంద్రుని హృదయావస్థను బాగుగ గ్రహింపగలడు. అంతేకాని యితరు లెవ్వరు తెలిసికొనగలరు ?

అమరేంద్రుడు కొంతసేపటివఱకు నేమియు మాటాడ జాలకుండెను. కుంజయు నిశ్శబ్దముగా నాతని పార్శ్వమున గూర్చుండి యుండెను. అప్పుడు కుంజ హృదయమునం దొకవిధముగను నమరేంద్రుని హృదయమునందు మఱియొకలాగునను నాలోచనా తరంగములు పొంగి పొరలిపోవుచుండెను. అమరేంద్రుడిక నూరకుండజాలక యాత్రముతో కుంజ హస్తమును బట్టుకొని—“కుంజా! నీ వొకప్పుడు నా ప్రాణ రక్షణము గావించితివి. మరల నిప్పుడు కూడ వచ్చి నన్నుద్ధరించితివి. నేను నీ కేమి సమర్పించి యీ ఋణమును దీర్చుకొనగలను!” అనియెను.

కుంజ—మన మిప్పుడింకను విపత్సముద్ర మధ్యమునందే యున్నాము. అప్పుడే మన కష్టము తప్పిపోయె ననుకొను చుంటివి కాబోలును!

అమ—కుంజా! నీ విక భయపడనక్కఱలేదు. నే నిప్పుడు సంపూర్ణముగ విముక్తుడనై యుంటిని. పదిమందివచ్చి యడ్డుకొన్నను మనల నేమియును జేయజాలరు.

కుంజ యేమియును మాటాడలేదు. ఆమె వ్యాకుల హృదయముతో నిమిష నిమిషమునకును దీరమువంక దిలకించుచుండెను. తీరమునకు జేరువఱకును దమ కష్టము తీరదని యామె యావేగ పడుచుండెను. అమరేంద్రుడు కూడ నామె యుద్దేశమును గ్రహించెను. ఆత డప్పుడు తిన్న బంధించి యుంచిన పడవ ఖిదరపురము రేవునకు సమీపమునందే యున్నట్లును నిప్పుడు తా మెక్కిపోవుచున్న బోటా

రేవున కెదురుగా బోవుచున్నట్లును స్పష్టముగా గ్రహింపగలిగెను. ఆ కాలమునందుకూడ నిప్పటివలెనే ఖిదరపురపు రేవునందు లెక్క-లేనన్ని పడవ లుండెడివి. వానిలో జాలవఱకరేబియాదేశపు పడవలే.

వానిని జూచినంతనే యమరేంద్రుని హృదయము కంపించి పోయెను. అప్పు డాతడు తనలో—"కుంజవచ్చి యెన్నివిధముగా నిప్పు డుద్ధరింపకయే యున్నచో నే నీ పడవలలో దేనిమీదనో యధిరోహించి యరేబియా దేశమునకు బోయి యుందునుగదా! ఇక నీ యిహ జీవమునం దెప్పటికైన నీ దేశమునకు మరలివచ్చు భాగ్యము నాకు లేకుండ బోవునుగదా!" అని యూహించుకొన దొడంగెను.

ఇంతలో వారెక్కినబోటు రేవునకు జేరుకొనియెను. కుంజ తత్క్షణమే యా బోటువానికి కూలి నిచ్చివేచెను. ఆ ఘట్టమునందొక గుఱ్ఱపుబండి సిద్ధముగా నుండెను. తోడనే కుంజ యమరేంద్రు నా బండిపై నెక్కించి తానుకూడ నెక్కెను. ఆమె యిదివఱకా బండిపై నెక్కియే కలకత్తానుండి బయలుదేఱి యిచ్చటికి వచ్చి యుండెను.

వారెక్కినతోడనే బండివాడు గుఱ్ఱము నదలించెను. బండి యతివేగముగ గదలిపోవుచుండెను. అప్పుడు కుంజ విశ్రాంతి సూచకముగా నొక దీర్ఘ నిశ్వాసమును విడిచి—"ఇక వారెవ్వరును మనల నేమియును జేయజాలరు" అనియెను.

అమ—సమాచారము తెలిపినచో నిశ్చయముగా నీవు వత్తువని నే నెఱుంగుదును. కాని యా కుఱ్ఱవాడు నీ కా యుత్తరము నిచ్చునను నాశమాత్రము నాకేమియును లేకపోయినది.

కుంజ—ఏమైననేమి—వాడు నా కా యుత్తరము నిచ్చినాడు! నేను వానికి బదిరూపాయల నిచ్చెదననికూడ జెప్పియున్నాను.

అమ—మంచిపని చేసితివి. ఇంటికి బోయినంతనే నేనారూపాలను నీచేతి కిచ్చెదను.

కుంజ—అంత తొందర లేదు.

అమ—నే నెట్టి యవస్థలో నుంటినో యా సంగతుల నన్నిటిని నీకు వాడు స్పష్టముగా జెప్పినాడా ?

కుంజ—వాడు బుద్ధిపూర్వకముగా నాకేమియును దెలిపి యుండలేదు. ప్రశ్నలపై ప్రశ్నలనువైచి నేనే వానివలన నన్ని సంగతులను దెలిసికొనగలిగితిని.

అమ—నన్ను బంధించిన పడవయున్న ప్రదేశమును గూర్చి కూడ నాతడు నీకు జెప్పియుండును. కాని యాతడు వెడలిపోయిన దినమునందే యా పడవ లంగరు నెత్తివైచి వారు నన్ను ఖదరపురము రేవు నొద్దకు దీసికొనిపోయి విడిచిరి. ఈ సంగతి యా కుఱ్ఱవానికిగాని నీకుగాని తెలియుట యసంభవమని నేను కేవలమును నిరాశతో నుంటిని.

కుంజ—ఆ పడవ ఖదర పురమునకు బోవును సంగతి వాని కదివఱకే తెలియును. అందుచేతనే నేను కలకత్తాకుబోయి యచ్చట నీ బండి చేసికొని యొక్క పరుగున నిచ్చటికి రాగలిగితిని. మిమ్ము బంధించి యుంచిన పడవ యెట్టిదో దాని యానవాళ్ళనుగూడ నేనాతని వలననే తెలిసికొంటిని - అందుచేతనే వెదకి పట్టుకొనుటకు విశేష శ్రమపడవలసిన యావశ్యకము లేకపోయినది.

అమ—నన్ను వీరఱబ్బీ యోడపై నెక్కించి యరేబియా దేశమునకు బంపదలంచిరనుసంగతికూడ నీతో నాతడు చెప్పెనా ?

కుంజ విస్మయాక్రాంత హృదయముతో—" లేదు. ఈసంగతి ఆతనికి దెలియదు. మిమ్ములను వీరేల బంధించి యుంచిరో ఆ సంగతి కూడ వానికి దెలియదు

అమ—అలాగా ! లోచనుడును, వర్తకుడగు కాహియాయును గూడ నాయొద్దకువచ్చి నాతో నిర్భయముగా మాటలాడిరిసుమా ! నన్ను రేబియా దేశమున కెట్లో పంపివైచి నిరంతరాయముగా దారిదోపిడులను నడపింపవలయునని వారి యుద్దేశము.

ఏమైననేమి! ఇక వారి యాటలు సాగుట కవకాశ మేమున్నది! అమరేంద్రుడు కుంజ యభిప్రాయమును గ్రహించెను. కుంజ యాతని విడిపించినది. చిన్నతనమునుండి పెంచి పెద్దదానిగా జేసిన లోచనుని కంటె కుంజ కమరేంద్రుడు సమీపబంధువా! అమరేంద్రున కుపకారము చేయుటయే లోచనున కపకారము చేసినట్లగునని ముగ్ధ హృదయయగు కుంజ యెఱుగదా! కుంజకు ప్రత్యేకముగ లోచనుని యెడల నసహ్యా భావము లేదుగాని యామె యమరేంద్రునియెడల ననిర్వాచ్యమగు ప్రేమభావమును గలిగియుండెను. ఆ ప్రేమామృత రసముచే నామె సర్వాంతఃకరణములును బరిపూర్ణములై యుండెను. ఆమె యమరేంద్రునిం గాంచి యితర ప్రపంచమునే మఱచిపోవు చుండును. ఆమె చేయు పనులన్నియు నా మఱపులోనే జరిగిపోవు చుండును

అమరేంద్రునకిక కుంజను విడువవలయునని లేదు. ప్రాణదానము చేసిన యామెను ప్రాణఘాతుకుల చేతులలో మరల నొప్పగించుట యెట్లు! అతడు మృదుల స్వరముతో—"కుంజా! నీవే నన్ను విడిపించితివనుసంగతి తప్పకుండ వారికి తెలియకమానదు. నీవు మరల వారియొద్దకే పోయినచో మహా విపత్తున బడిపోయెదవు. నీవు కొన్నాళ్ళ వఱకును నమూల్యబాబునింట నాయొద్దనే యుండుము! తరువాత—" అనియెను.

అప్పుడు కుంజ విషాద గర్భితమగు మందహాసము చేయుచు తన వస్త్రాభ్యంతరమునుండి శాణిత కరవాలమును బైకిదీసి గంభీర స్వరముతో—"అమరబాబూ! నేను మందులదానను. లోచనుని వంటి వారు నూరుగురైనను నన్నదిరించుటకు సమర్థులు కారు!" అనియెను.

అమరేంద్రు డభిమాన పూర్ణ హృదయముతో—"కుంజా! నీవు నిజముగా మందులదానవుకావు—నీ నోటితో నిట్లిక నెన్నడును చెప్పవలదు!" అనియెను.

కుంజ మరల నట్లే నవ్వుచు—"నేనిప్పుడు మందులదానను—ఇదివఱకును మందులదాననే—మందులదాననే కాకయున్నచో మిమ్ముల నీ విధముగా దప్పింప గలిగి యుందునా ?" అనియెను.

అమరేంద్రు డతి వ్యాకుల హృదయముతో—"కుంజా ! ఎట్లయినను నిన్నా గుంపులోనికి మరల బంపవలయునని లేదు. నాకేమో గాని భయమగుచున్నది" అనియెను.

కుంజ యతి గంభీర భావముతో—"నా నిమిత్తమై మీరు భయపడ నక్కఱలేదు. నన్నెంతటివారునుగూడ నేమియును జేయ జాలరు. మాగుంపున కంతకును నేనే యిప్పుడు నాయకురాలనై యున్నాను. లోచను డెక్కడికో పోయినాడు" అనియెను.

అమరేంద్రుడు విస్మయోద్విగ్న హృదయముతో—"అది యేమి ? లోచనుడు పాఱిపోయినాడా ?" అని ప్రశ్నించెను.

కుంజ—వాడిక బదిదినముల వఱకు నెవ్వరికంటికిని గూడ నగపడడు. తిరువాత మరలి వచ్చినను నిక నెప్పటివలె మాగుంపులో నుండడు.

అమ—కారణమేమి ?

కుంజ—మీరాతని చేతులలోనుండి జాగ్రత్తగా దప్పించుకొంటిరి. పోలీసువారి కందఱకును సమస్త విషయములును దెలిసిపోవును. ఇట్టి స్థితిలో నాతని కెప్పటివలె నుండుటకు సాహసమెక్కడిది ? వర్తకుడగు కాహియాయును, లోచనుడును గూడ నిక నీ దేశమునుండి పలాయితులు కావలసినదే.

ఇంతలో బండి యమూల్యబాబు మందిరము నొద్దకు వచ్చెను. అమరేంద్రుడు బండినుండి దిగియెను. తోడనే వెనుకకు దిరిగి చూచెను. కుంజ యా బండి యవ్వలి గుమ్మమునుండి యెప్పుడు దిగినదో ; కాని నిమిషములో నామె యా యంధకార మధ్యమునం దంతర్హితురాలై పోయెను !

# ప్రకరణము 21

అమరేంద్రు డన్నివైపులను వెదకెను. కుంజ యెచ్చటను గనపడలేదు. ఆమె యిట్లు చెప్పకుండ రహస్యముగా వెడలిపోవుట యాతని కెంతయో కష్టముగా నుండెను. ఆ గాఢాంధకారమునం దబలయగు నామె కెచ్చట నెట్టి యపాయము లెటసిల్లునో యను సందేహముచే నాతని హృదయము పరితపించి పోవుచుండెను. కాని యేమి చేయగలడు! ఆమెను వెదకి కనుగొనుట కుపాయ మేమున్నది! ఏ త్రోవను బోయినదో యాతని కేమియును దెలియలేదు. ఆతని గుండె లతి తీవ్రముగ గొట్టుకొని పోవుచుండెను. ఆమె కిక మూరాల వాళ్ళ గుంపులో నిరపాయముగా నుండుట కెట్టి యవకాశమును లేదనియు, లోచనుండును, శాహియాయును గూడ నామె ప్రాణములను దీసివైచుటకైనను వెనుకదీయరనియు భావించుకొని యాతడు తల్లడిల్లి పోవుచుండెను. ఆ యమూల్య ప్రేమామృతతిలక హాలాహల జ్వాలామధ్యమున దపించి పోవుచున్నట్లుగా నాతని మనోనయనములకు బొడకట్టుచుండెను. ఆ ప్రేమమయింగూర్చి యాతని హృదయ మెల్ల విధముల నీమునే శంకించుచుండెను. ఏవిధముచేతను నాతనికి ధైర్యము కలుగకుండెను. తుదకాతఁ డొకవిధముగా ధైర్యము నెమ్మకొని— "ఆ పాపాత్ములామె కెట్టి యనిష్టమును గలిగింపకుండ దెల్లవారిన తోడనే తగిన యేర్పాటు గావించెదను" అని దృఢప్రతిజ్ఞ చేసికొనియెను.

ఇట్లొకరీతిగ నిశ్చయించుకొని యాత డమూల్యని యింటియొద్దకు వచ్చునప్పటి కించుమించుగా రాత్రి రెండు గంటలయ్యెను. బండి వచ్చిన చప్పుడు విననచ్చినంతనే యా లోపలినుండి యమూల్యుడును, ఫతేఅలీయును సత్వరముగా వెలుపలికి వచ్చిరి. అమరేంద్రుడు వారింగాంచి నివ్వెఱపాటుతో నిలువబడిపోయెను.

అప్పు డమూల్యు డమరేంద్రునిం గాంచి చటాలున వచ్చి యాతని గాఢాలింగనము చేసికొని ప్రేమగద్గద స్వరముతో— “ అమరబాబూ! నీవెంత సాహసుడవోయి! నీవగపడకుండుటచే మాకెవ్వరికిని నిద్రాహారములే లేవు. ఈ పత్తేదారు సాహేబును నేనును గూడ నీకొఱకెంతయో కష్టపడి వెదకితిమి. కాని మా ప్రయత్నము లేవియును సఫలములైనవి కావు. తుదకు మేమిరువురమును గూడ హతాశులమైపోయితిమి. ఎంతపని చేసినావు! నీవేమైపోయితివోయని మేము తల్లడిల్లిపోవుచున్నాము ” అనియెను.

ఫతే—అమరబాబూ! నీమూలమున మేమెన్నియో కష్టముల పాలైపోయితిమి, ఎంతయో పరితపించిపోయితిమి.

అమ—పత్తేదారు సాహేబా! నేను మీకు బుద్ధిపూర్వకముగా కష్టమును గలిగింపలేదు. పువ్వుకొఱకు బోవుచుండగా ముల్లు గ్రుచ్చుకొనినది. నేనేమి చేయుదును? లోనికి దయచేయుడు. సమస్త వృత్తాంతమును వినిపించెదను.

అనంతర మందఱును గృహమధ్యమున బ్రవేశించిరి. అప్పు డమరేంద్రుడు జరిగిన సంగతు లన్నియును సవిస్తరముగా వారికి దెలియజేసెను. అంతయు నాలకించి ఫతేఆలీ సాహేబు—“ మేము వచ్చి చూచునప్పటికా పడవ గంగానదిలోనున్నది. కాని దాని విషయమున మాకెట్టి యనుమానమును గలుగలేదు. అచ్చట మాకెట్టి యాజాడయును దొరకలేదు. మేము వరాహనగరపు గల్లీవరకును గడు జాగరూకతతో ననుసంధానము చేసితిమి. అక్కడ మాత్రము నీ సంగతి కొంతవఱకు దెలిసినది ” అనియెను.

అమ—మీరెట్లు తెలిసికొనగలిగితిరి?

పత్తేదారు సాహేబు గంభీరముగా నవ్వుచు—“ అమరబాబూ! పత్తేదారు పనియనిన నేమనుకొన్నావు? వేయి కన్నులును, వేయి యూహలును గలవాడుగాని పత్తేదారుపని చేయగలడా? నీవే

బండిపై నెక్కిపోయితివో, యా బండివానిని బిలిపించి విచారణ చేసితిమి, నీవొక కుఱ్ఱవానితో దన బండిపై నెక్కి వరాహపురవు గల్లీ వఱకును బోయినట్లును వాని నచ్చట నిరీక్షించి యుండుమని చెప్పి నీ వా బాలకునితో గలసిపోయినట్లును, ఎంతసేపటికిని గూడ నీవు తిరిగిరానట్లును, దుదకు బ్రాణము విసిగి తాను బండిని మరలించుకొని వచ్చివైచినట్లును బండివాఁడు చెప్పినాడు. ఈ విధముగా బ్రయత్నించి యింతవఱకైనను నేను తెలిసికొనఁగలిగితినిగాని యితరు లెవ్వరైన నింతపని చేయగలరా ?" అనియెను.

అమా—అమరబాబూ ! అట్టి స్థితిలో గుంజవచ్చి నిన్నుద్ధరింపక యేయున్నచో నీ వేమైపోవుదువో యెవ్వరు చెప్పగలరు ?

ఫతే—అట్లు జరుగక యేయున్నచో నమరబాబునకు నిశ్చయముగా మక్కా యాత్ర లభించియే యుండును. అట్టి పుణ్యక్షేత్ర దర్శన మెంతవారికి దొరకును ?

అమా—పత్తేదారు సాహేబా ! తెల్లవాఱినంతోడనే బయలుదేఱి పోయి ముందుగా నా దురాత్ముని నిరువురను గూడ బట్టుకొని కారాగృహమున బంధింపవలయును.

అమ—వలదు—వలదు—నేను మొదటినుండియును జెప్పుచునే యున్నాను. మన మిప్పుడా యిద్దఱిని మాత్రము పట్టుకొనినచో దక్కినవా రందఱును బాఱిపోవుదురు. మనము కొంతకాలము వఱకును వేచియుండవలయును. ఈసారి మరల వారు బందిపోటు చేయుదురని తోచుచున్నది—ఆ సమయమున గనుపెట్టి మనము వారి నందఱి నొక్కసారిగా బట్టి బంధించునట్టి యేర్పాటు చేసికొనవలయును. విశేషించి యా యశ్వారోహియగు దోపిడికాడే వీరి గుంపునకు మొనగాడని తోచుచున్నది. ఎట్లయిన నాతని బట్టుకొనుటయే మన కవశ్య కర్తవ్యము.

పత్తేదారు సాహేబు గంభీర భావముతో—"నీ యాలోచన సరిగనే యున్నది" అనియెను.

అమూ—వాఁడెవ్వఁడో ?

ఫతే—మీ రెవ్వరినిగూర్చి యడుగుచున్నారు ?

అము—ఆ బందిపోటు దొంగను గూర్చియే—

ఫతే—వాఁడు నిశ్చయముగా గుఱ్ఱము నధిరోహించి మిగుల నేర్పుతో స్వారిచేయుటయందు సమర్థుఁడై యుండవలయును.

అమూ—ఇంతేకాదు వాఁడెప్పుడును పెద్దమనుష్యులతో గలిసి తిరుగుచుండెడువాఁడని తోఁచుచున్నది. ఈ విషయమున నాకెంతమాత్రమును సంశయము లేదు. అట్లే కాకున్నచో నాదినమున సీలరతనబాబు యింట జరగిన సంగీత సభలోనికి వాఁడెట్లు రాఁగలిగెను !

ఫతే—ఏమో—ఇవియన్నియు ననుమానమాత్రములు. వాఁడు దొరకిన తరువాతగాని నిశ్చయముగా నే సంగతులును దెలియవు

పత్తేదారు సాహేబు మాటల కమరేంద్రుఁడు మనసులో నవ్వుకొనుచు—“అయ్యా ! ఆ వర్తకు డింకను నా దుకాణములో నున్నాఁడా ?” అని ప్రశ్నించెను.

ఫతే—లేదు—ఇక నెట్లుండును ! వాఁడా దుకాణము నెత్తివైచి యెక్కడకో యప్పుడే పాఱిపోయినాఁడు. నేను స్వయముగనే పోయి చూచితిని. ఇప్పుడా యిల్లంతయు శూన్యమై యున్నది.

అమ—అలాగా ? మీకు లోచనునిం గూర్చి విశేషము లేమైనను దెలియవచ్చినవా ?

ఫతే—ఆ, ఇప్పుడు వాని గుంపంతయును జందననగర ప్రాంతమున డేరాలను వైచుకొని విడిసి యున్నది కాని లోచను డిప్పుడా గుంపులో లేఁడు. కొలది దినముల క్రిందటనే యాతఁ డెచ్చటికో పోయినాఁడట ! వాఁడెక్కడకు బోయెనో యట నున్నవా రెవ్వరికి దెలియదు.

అమ—ఆ వర్తకుఁడుగాని లోచనుఁడుగాని యింకను నీదేశమును విడిచి పోలేదు. వారిరువురును నిశ్చయముగా నీ ప్రాంతమునందే యెచ్చటనో దాగియుందురు.

ఫతే—అట్లే యైయుండవచ్చును. కాని మరల వారు దొంగ తనములను జేయుదురో చేయరో మాత్రము చెప్పజాలను. మన ప్రయత్నము లన్నియును గాంచి వారు చాల భయపడి యుందురు.

అమ—భయమా! వారికి భయమను మాటయే తెలియదు. గుండెలుదీసిన బంట్లు!

అమూ—అమరబాబూ! నీవు చెప్పిన ప్రకారము మన మిప్పుడు జాగరూకతతో పరీక్షించి యుండవలసిన దేనా?

అమ—ఔను అదియే నాదృఢోద్దేశము.

అమూ—ఈ మాటల కన్నిటికి నేమిగాని యీ సందర్భమున మీకుంజ నెన్నియో విధముల ప్రశంసింపవలసి యున్నది. ఆ బాలిక కావించిన యద్భుతకృత్యము లెంతటి సమర్థులగు బుద్ధిమంతులైనను జేయజాలరు. ఆమెకు నీయందెట్టి దయ కలిగినదోగాని రెండుసారులు నీకు ప్రాణదానము కావించినది.

అమ—ఔను. ఆ కరుణామయి సాహాయ్యమే నాకు గలుగకున్నచో నేను లోచని ప్రవాహమునకు బ్రప్రథమమునందే లోకాంతరగతుడనై యుందును.

ఫతే—ఆ బాలిక మంచి సమర్థురాలు—చతురమతి—ఆమె పోలీసుశాఖలో నుద్యోగము చేయదలచినచో వెంటనే నేనామెను గైకొనగలను.

ఫతేఅలీ యీ విధముగా గుంజను గూర్చి మాటాడినందుల కమరేంద్రున కెంతయో కోపముగా నుండెను, కాని యాతడేమియును మాటాడలేదు. అప్పుడమూల్యుడు పత్తేదారునిం గాంచి—"నాకిది వఱకు బెండ్లియే కాకయున్నచో నిశ్చయముగా నేనటువంటిదానిని బెండ్లియాడి యుందును" అనియెను.

ఫతేఅలీ నవ్వుచు—"వట్టిమాటలేగాని నీ వా పని యెట్లు చేయగలవు? మందులదానిని బెండ్లియాడినచో మీకు జాతిభ్రష్టత

గలుగును. మాశాస్త్రములను జూడుడు! మామతమునుబట్టి యేజాతి వారినైనను మాయిష్టము వచ్చినట్లు పెండ్లి చేసికొనవచ్చును. ఆవశ్యకమైనచో మరల నట్టి వివాహ బంధమును వదలించుకొనవచ్చును. మాశాస్త్రములలో నింకటి సులభములగు నేర్పాటులున్నవి" అని చెప్పి పకపక నవ్వుచు దానెంతయో సరసముగ మాటలాడినట్లు భావించుకొనియెను. అమరేంద్రు డతి కష్టముతో తన క్రోధమును, హాస్యమును గూడ నడంచుకొనియెను.

ఫతేఆలీ సాహే బింకను నట్లే నవ్వుచు—"అమరబా బిప్పుడు చాల విషమావస్థలో నున్నాడు" అనియెను.

అమూల్యుడు తత్తరముతో—"పత్తేదారు సాహేబా! అది యేమి యట్లనుచున్నారు?" అనియెను.

ఫతే—ఏమున్నది! కుంజమాలముననే—

అమూ—ఎందుచేత?

అమరేంద్రు డేమియు మాటాడక మౌనముతో గూర్చుండి యుండెను

ఫతేఆలీ సాభిప్రాయముగా—"మందులబాలికయగు నామెను పెండ్లియాడినచో సమాజములో నెంత గోలఘట్టును? దానిని భరించుట సామాన్యమా?" అని మరల నుచ్ఛ్వాసము చేయుచు—"అమూల్యబాబూ! నీకింకను బోధపడలేదా? మన యమరబాబు కుంజను ప్రేమించినాడు!" అనియెను.

వారిట్లు వినోదముగ మాటలాడుకొనుచుండగా పోలీసువా డొకడు వగర్చుకొనుచు, వగర్చుకొనుచు నచ్చటికి బరుగెత్తుకొని వచ్చి—"అయ్యా! పత్తేదారు సాహేబా! మరల బందిపోటు జరిగినది—హరా రాసమీపమున—దొంగ యెప్పటివలె నా యాశ్వీక యోధుడే—" అని తెలియజేసెను.

ఆ సమాచారము విన్నతోడనే యా ముగ్గురు స్తంభితులై పోయిరి—మరల నెప్పటివలె నిశ్చయముగా దారిదోపిడి జరిగినది!

# ప్రకరణము 22

కడపటి బందిపోటుతో నీ విధముగా నిప్పటికి నాలుగు దొంగతనములు జరిగినవి. ఈ దొంగతనములలో నొకదానికంటె నొకదాని యందు క్రమముగా సాహస మధికముగ గానవచ్చుచుండెను. అట్లు కాకయున్నచో కలకత్తానగరమునకు సమీపమున హౌరా ప్రాంతమున నీ విధముగా బందిపోటు చేయుట కెవ్వరు సాహసింపగలరు?

ఈసారికూడ నదియేపద్ధతి—ఆనందూలాల్ జమీందారు విశేష ధనముతోడను రత్నాలంకారములతోడను కలకత్తానుండి తన గ్రామమునకు బోవుచుండెను. అతడు కలకత్తాలోనే భోజనముచేసి బయలుదేరెను. ఇంచుమించుగా రాత్రి పండ్రెండు గంటలవేళ కాతని పల్లకి హౌరా ప్రాంతమునందలి బయటి ప్రదేశమునకు జేరుకొనియెను. ఇంతలో నాకస్మికముగా నొక నల్లని పెద్ద గుఱ్ఱము నెక్కివచ్చిన యొక వ్యక్తి అతి సాహసముతో నదలించి యా పల్లకి నాపివైచెను. ఆ వ్యక్తి మొగముపై ముసుగు—చేతిలో రివాల్వరులు—జమిందారు బాబు భయభ్రాంతుడై పెట్టెలో గూడ సర్వస్వము నాతనికి సమర్పించి వైచి యెట్లో ప్రాణములను రక్షించుకొనియెను. తోడనే యా దొంగ గుఱ్ఱమును బరుగెత్తించి యేవైపునకో మాయమైపోయెను; మఱి యెవ్వరికిని గూడ నగపడలేదు.

అనంతరము తన సర్వస్వమును గోలుపోయిన యాజమీందారు ఉత్సాహ శూన్య హృదయముతో హౌరా స్టేషనుకుబోయి పోలీసు వారికి సమాచారము నెఱింగించెను. ఆ నిమిషమునందే వారాసంగతిని కలకత్తా పోలీసువారికి దెలియజేసిరి కలకత్తా పోలీసువారికి సమాచారము చేరిన వెంటనే వారొక పోలీసు కర్మచారిని పత్తేదారు సాహెబు నొద్దకు బంపించిరి.

అప్పుడు దమరేంద్రుడును ఫతేఅలీయు నెట్టి యాలస్యమును జేయకుండ వెంటనే హౌరా వైపునకు బోవలయునని తొందరపడుచుండిరి.

అమూల్యునకు గూడ వారితో గలసి పోవలయునని యుండెను కాని యప్పుడు ఫతేఆలీ—"సన్యాసు లధికమైనచో గంజాయికి జేటుగాని లాభము లేదు. అమరబాబూ! మన మిరువురమాత్రమే పోవుదము" అనియెను.

అవకాశము లభింపకుండుటచే నమూల్యుడు తన యింటియొద్దనే నిలిచిపోయెను.

అమరేంద్రుడును, ఫతేఆలీయును గలసి యా దొంగతనములను గూర్చి యనేక విధముల నాలోచించుకొనుచు బయలుదేరి పోవుచుండిరి. అప్పుడు ఫతేఆలీ సాహేబు విరక్తి భావముతో—"ఏమి లాభమున్నది? మన మచ్చటికి బోవునప్పటికా దొంగముండాకొడుకు గుఱ్ఱముపై నెక్కి యిరువది క్రోశముల దూరము పోయియుండును" అనియెను.

అమ—అవును. అట్లు జరిగియుండవచ్చును. కాని ఆకారణముచే వాతని మనము పట్టుకొనజాలకపోయినను నీసారి యా కాహియాను మాత్రము తప్పక పట్టుకొని తీసుదుము.

ఫతే—అది యెట్లు? ఏమో కాని నాతలలో నిప్పు డెట్టి ఆలోచన యును దోచుటయే లేదు.

అమ—వారందఱు నిప్పటివఱకు యథారూపముగనే తమ తమ కార్యములను నెఱవేర్చుకొనుచున్నారు. ఆ యాశ్వికుడెప్పటి పద్ధతినే ధనమంతయును కొల్లగొట్టి దానినా సమీపమునం దెచ్చటనో పూడ్చిపోవును. తరువాత నే హరకొటలునకో పోయి యా సంగతి తన వారికి తెలియునట్లును సంకేతాక్షరములను లిఖించి పోవును.

ఫతే—కాని యీసారి మాత్రము మునుపటివలె బ్రాతము క్రిందనే సంకేతాక్షరములు వ్రాయరేమోయని నాకు సంశయముగా నున్నది.

అమ—కావచ్చును. వారిప్పుడు మరల నేదియో క్రొత్తపద్ధతి నేర్పాటు చేసికొన్నను జేసికొనవచ్చును. కాని యా దొంగ ప్రతి

పర్యాయమును దాను కొల్లగొట్టిన వస్తువుల నొక్కచో బూడ్చి పోవుచుండెననుమాట మాత్రము నిశ్చయము. ఆ పద్ధతిలో నెట్టి మార్పును జరగియుండదు. ఆ దొంగయైనను గ్రామమునుడాయించి చాల దూరము వెళ్ళును బోయియుండడు. ఈ సంగతి కూడ నాలోచింపవలసినదే. వాడట్లు దూరముగనే పోయియున్నచో నొకప్పుడైనను నెవ్వరి కంటనైనను బడియే యుండును. వాడట్లు దొంగతనము చేసి కొంతదూరము మాత్రము తప్పించుకొనిపోయి యచ్చట నా గ్రామమును వదలిపైచను తరువాత నా వస్తువుల నన్నిటి నొక్కచో భద్రపఱచి యొక పెద్దమనుష్యునివలె వేషము వైచుకొని వెడలి పోవును.

ఫతే—అవును. ఈ యూహ సరిగనే యున్నది.

అమ—అందుచేతనే కాహియా నిశ్చయముగా నావస్తువులను దీసికొనిపోవుటకై వచ్చునని చెప్పుచున్నాను.

ఫతే—వాడు మరల నీపని చేయుటకు సాహసింపగలడని నాకు నమ్మకముగా దోచుటలేదు.

అమ—ఒకవేళ వాడు రాకపోయినను మఱియొకడైనను వచ్చి తీరును. కాని యీసారి వచ్చువాడు మాత్రము మాఱువేషముతో వచ్చునని తోచుచున్నది.

ఫతే—ఆలాగా! అట్లయినచో మనమేమిచేయగలము! ఎవ్వని ననుమానించి పట్టుకొనగలము! దొంగకూడ మనుష్యుడేకదా!

అమ—మనమిప్పుడు హౌరా బయట నలువైపులను సమర్థులగు పోలీసువారిని గావలియుంపవలయును.

ఫతే—అది మనకు సాధ్యమగునా! అంతటి విశాల ప్రదేశమున కెంతమందిని గావలిపెట్టగలము!

అమ—ఎంతమందినైనను సరియే—అచ్చట నలువంకలనుగల యున్నిత్రోవలయందును గొంతమంది నుంచితీరవలయును.

ఫతే—మనము శ్రమపడి పోలీసువారి నందఱిని గూడ శ్రమ పెట్టి యట్లు కావలి యుంచినంత మాత్రమున ప్రయోజన మేమైన నుండునని నాకెంతమాత్రమును దోచుటలేదు.

అమ—అయ్యా! మీ రెంతమాత్రమును నిరాశ చెందవలదు. ధైర్యముతో జాఱుకుగా బనిచేయుడు. ఈసారి తప్పకుండ మనము దొంగలను బట్టుకొనగలము. ఆ గుఱ్ఱము కూడ నీ సమీప ప్రదేశము నందే యెచ్చటనో యుండగలదు. ఈ విషయమున నెంతమాత్రమును సందేహింపనక్కఱలేదు.

ఫతే—ఆ గుఱ్ఱ మెచ్చట సంగ్రహింపబడు చున్నదో ఆ సంగతి కూడ ముఖ్యముగా దెలిసికొనవలసి యున్నది.

అమ—ఆ గుఱ్ఱమును లోచనుడే రహస్యముగా దీసికొనివచ్చి యాలెని కొప్పగించునని నాకనుమానముగా నున్నది నేను మూర్షిదాబాదు నగరమున వారి డేగాల యొద్దకు బోయినప్పుడు చూచి యుంటిని. లోచనునకు జాల నెత్తయిన మంచి తెల్లగుఱ్ఱ మొకటి యున్నది.

ఫతే—ఏమి యీ యవివేకము! దొంగ యెక్కవచ్చినది నల్లని గుఱ్ఱముకదా! నీవు తెల్లని గుఱ్ఱముమాట చెప్పెదవేమి?

అమ—ఏమి? తెల్లని గుఱ్ఱమున కేదైన నొక నల్లనిరంగు బూసినచో నల్లని గుఱ్ఱమువలె నగపడగూడదా?

ఫతేఆలి యించుక యాలోచన నభినయించి—"అమరబాబూ! ఈసారి నీమాట విశ్వసింపదగినదిగా దోచుచున్నది. కాని నా కింకొక విషయము మాత్రము చాల గందరగోళముగా నగపడుచున్నది" అనియెను.

అమ—మీ కుగల సంశయ మేమో స్పష్టముగా జెప్పుడు. మనస్సులో బాలు త్రాగుటవలన నేమిలాభము?

ఫతే—వర్తకుడగు నా కాహియా యా వస్తువులయందలి రత్నములను మాత్రమే ముందుగా నొలచి తీసుకొని పోవుటకు గారణ మేమి? వస్తువు లన్నిటిని గూడ నేల తీసికొని పోవుట లేదు?

అమ—అట్లు వాడు వస్తువుల నన్నిటిని గూడ నొక్కసారియే తీసికొని పోయినచో నెచ్చటనైన బట్టుబడిపోవుట కవకాశ ముండును. ఇప్పు డాతి డేర్పఱచుకొన్న పద్ధతి ప్రకారము దొరకిపోవుట యసంభవము.

ఫతే—ఎందుచేత?

అమ—వస్తువులు వేఱుగను రత్నములు వేఱుగను నున్నచో నెవ్వరును గూడ నానవాలు పట్టజాలరు.

ఫతే—అతడు వాని నెవ్వరికిని నగపడకుండ నెట్లు తీసికొని పోవును?

అమ—మన మాతని దుకాణము లోనికి బోయిన దినమున మొట్టమొదట నాకీసంగతియే స్మృతికి వచ్చినది. ఆ దుకాణములో బాగుగుపాటి వలమైన కఱ్ఱయొకటి యున్నది మీరు దాని నప్పు డంతగా లక్ష్యము చేయలేదు కాబోలును!

ఫతే—లేదు నేనప్పుడంత సావధానముగా బరిశీలింపనే లేదు. అంతలోనే గందరగోళమైపోయినది.

అమ—ఆ కఱ్ఱ యంతయును లోపల గుల్లగా నుండునట్లు కల్పింపబడి యుండునని నానమ్మకము. ఆ గుల్లకఱ్ఱ లోపలనే అతడు ముందుగా రత్నములను నింపుకొని నిర్భయముగా దీసికొని పోవు చుండును.

ఫతేఆలీ పరిహాస సూచక స్వరముతో—"అమరబాబూ! నీవు చాలవఱకు దెలివికలవాడవేగాని యిప్పటి నీమాటలు మాత్రము కేవలము పిచ్చిమాటలవలె నున్నవి. ఇందుల కెంతమాత్రము సందేహము లేదు" అనియెను.

అమ—మీరిప్పుడట్లే యనుకొనుడు. కాని తరువాత నెప్పటి కైనను నామాటలు సత్యములని మీకే బోధపడగలవు.

ఫతే—సరే దానికేమి! ఇప్పుడు కాహిరాయా తప్పకుండ నిచ్చటికి వచ్చుననియేనా నీ యుద్దేశము?

అమ—ఔను. వస్తువులను దీసికొనుపోవుటకై వాడిచ్చటికి నిశ్చయముగా వచ్చితీరును.

ఈ విధముగా వారు సంభాషించుకొనుచు క్రమముగా హారా స్టేషనునొద్దకు జేరుకొనిరి; తోడనే యచ్చట గొంతమందిని వెంట బెట్టుకొని బందిపోటు జరిగిన యా ప్రదేశము వైపునకు వెడలిపోయిరి.

ఆ కాలమున హారా యిప్పటివలె పెద్ద పట్టణముగా లేదు. కేవలమును గంగాతీరమున మాత్రము కొంతమంది యిండ్లు కట్టుకొని నివసించి యుండిరి. ఆ చుట్టుపక్కల గనుచూపు మేఱవరకును విశాలమగు బయలే. అచ్చట రాత్రివేళల జనసంచార మేమియు నుండదు. ఆ బహిరంగ ప్రదేశ మధ్యమునుండి ఆందూర్ గ్రామము నకు దిన్నగా నొక కాలిబాట యున్నది. ఉత్తరపు దిక్కుగా మఱియొక మార్గమున్నది. ఆ మధ్య ప్రదేశమున గుంపులు గుంపులుగా పెద్ద పెద్ద చెట్లు పెరిగి క్రమ్ముకొని యుండెను. ఆ చెట్లగుంపులోనే యీ బందిపోటు జరిగినది. కాని వారచ్చటికి బోవునప్పటికా ప్రదేశమునం దెచ్చటను గూడ నెవ్వరు గనపడలేదు.

వారప్పుడా ప్రదేశమున నలువంకలను రక్షకభటులను గాపుంచి తాము గూడ జెట్లచాటున దాగుకొని యుండిరి. ఈ ఏర్పాటంతయును జరుగునప్పటికి రాత్రి యంతయును గడచిపోయెను. తెల్లవాఱు సమయమున నమరేంద్రుడును ఫతేఆలీయును గలసి స్టేషనులోనికి బోయిరి. ఫతేఆలీ కేవలము నలసిపోయియుండెను. స్టేషనున బ్రవేశించిన తోడనే యాతడు పడకవైచెను. ఇంకను కొంచెము నిమిషములు కాకుండగనే యాతని నాసారంధ్రములనుండి ఘుర్ఘురా గర్జారవము వెలువడ నారంభించెను.

# ప్రకరణము 23

అమరేంద్రునకు రాత్రి యించుకయును నిద్రపట్టలేదు. కేవలము ఫతేఆలీ నాసిర్ గర్జనము మాత్రమునవే కాదు—అనేక విధములగు నాలోచనాస్ఫులింగములు మెఱసిపోవుచుండుటచే నాతని తల యంతయును మండిపోవుచుండెను. చల్లగానుండునని యెంచి యాతడు వీధి బయటకువచ్చి యటు నిటు పచారు చేయనారంభించెను. అప్పటి కప్పుడే బాగుగ వెలుతురు వచ్చినది—సూర్యోదయముకూడ నగుచుండెను.

ఆ సమయమునం దాకస్మికముగా వెనుకనుండి యేదియో పల్లకి వచ్చుచున్నట్లు శబ్దము వినవచ్చుటయు నమరేంద్రుడు వెనుకకు దగ్గి వీధిలో గొంచెము ప్రక్కగా నిలువబడి యుండెను. ఇంతలో బల్లకివచ్చి యాతని ప్రక్కనుండియే వెడలిపోయెను. కాని యట్లు కొంతదూరము మాత్రమే పోయి యచ్చట నాగెను ఆ పల్లకి తలుపులన్నియును మూయబడి యుండుటచే నందెవ్వరో యాడువాండ్రుండి యుందురని యమరేంద్రుడు భావించుకొనియెను. కాని యా పల్లకి యట్లాకస్మికముగా నాగిపోవుటకు గారణమును మాత్ర మాతడు గ్రహింపజాలకపోయెను. ఆ యుత్తర క్షణముననే బోయిలా పల్లకిని గ్రింద దింపుటను జూచి యాతడతి విస్మయాక్రాంత హృదయుడై పోయెను. అప్పుడొక బోయివాడు సత్వరముగా నమరేంద్రుని యొద్దకు వచ్చి—" బాబూ ! మిమ్ములను బిలుచుచున్నారు " అనియెను.

అమరేంద్రుడు మఱియును విస్మయముచే దెల్లపోవుచు—
" ఎవరు పిలుచుచున్నారు ?" అని ప్రశ్నించెను.

బోయి—ఆ పల్లకిలో నున్నవారే.

అమరేంద్రు డించుక ముందరికి బోయి చూచెను. పల్లకిలో నున్నవా రించుక తెలుపు తెఱచుకొని చేయూచుచు నాతని బిలుచుచుండిరి. ఆహాస్తము సువర్ణ మణిభూషణములచే సురుచిరమై సుందరమై

కానవచ్చుచుండెను. దానివిబట్టి యా పిలుచుచున్న యామె స్త్రీయని స్పష్టముగా దెలియవచ్చెను. ఆ కోమలకర కమలము సువర్ణాలంకార భూషితము కాకపోయినను నట్టి హాస్తముగల యామె యువతీలోక సుందరీమణియై యుండవలెనని యూహింపవచ్చును. అమరేంద్రుడప్పుడు తన్నొక సుందరియగు యువతీమణి పిలుచుచున్నదని నిశ్చయించుకొనియెను.

ఒక యువతీమణి తన్నట్లు పిలుచుచున్నందుల కమరేంద్రుడు మరింత యాశ్చర్యపడిపోయెను. అప్పుడతడు మెల్ల మెల్లగా నాపల్లకి చెంతకు బోయెను. తోడనే యాతడు పరమాద్భుత నిమగ్న హృదయుడై పోయెను. ఆ పల్లకిలో నున్న యామె ఎవరు? మనియాబీబీ!

అమరేంద్రు డాశ్చర్యముతో నామెవంక జూచుచు— "నీవిచ్చట నున్నావేమి?" అని యడిగెను.

మనియాబీబీ తన చిరాభ్యస్తమగు మధుర మందహాసము చేయుచు—"నేను లేనిచో నెక్కడ నున్నది! ఎప్పుడును సంగీత సభలకై నగరముల వెంట దిరుగుచుండుటయే నాపనిగదా! ఇప్పుడు కలకత్తాకు వచ్చియుంటిని. అందూర్ జమీందారుని రాజమందిరమున రేపు సంగీతసభ జరుగును. మీరిచ్చట నున్నారేమి? మీరగపడుట చేతనే పలుకరించి మరిపోవుదమని నేనీపల్లకి నాపించితిని" అనియెను.

అమ—అలాగా? నిన్న రాత్రి యీ ప్రాంతమున మరల దారి దోపిడి జరిగినది. నీకీ సంగతి తెలిసినదా?

మనియాబీబీ గడగడ వడకిపోవుచు భయగద్గద స్వరముతో— "అయ్యో! ఆ దొంగ ఇంకను బట్టువడనేలేదా? ఎంత దారుణముగా నున్నది! అదృష్టవశమున నేను రాత్రి బయలుదేరలేదు—అట్లే జరిగినచో నేనా దొంగ చేతులలోబడి నాసర్వస్వమును గోలుపోయియే యుందును" అనియెను.

అమ—కాదా మరి—నిన్న రాత్రి బయలుదేరినచో నీపని యంతవరకు రావలసినదే.

మని—అవును, కాని భగవంతుడు దయతో నన్ను రక్షించి

నాడు—పరేశానీ—అమరబాబూ! మీరింకను నాదొంగను బట్టుకొనుటకై ప్రయత్నములు చేయుచున్నారా?

అమ—చేయుటకేమి? ఎట్లయిన వానిని బట్టితీరెదనని నేను ప్రతిజ్ఞయే చేసికొంటినిగదా!

మని—అమరబాబూ! కొన్నాళ్ళవఱకు మీరిచ్చటనే యుందురు గావున నెప్పుడైన నొకసారి మాయింటికి రాకూడదా? నేనిప్పుడు కలకత్తాలో బెద్దబజారు వీధియం దున్నాను. నాపేరు చెప్పినచో నచ్చట నెవ్వరైనను మీకు నాయిల్లు చూపింపగలరు.

అని చెప్పి యామె పల్లకి నెత్తుడని బోయల కాజ్ఞాపించెను. బోయలా పల్లకిని భుజములపై నెత్తుకొన్నతోడనే యామె చిఱునవ్వు నవ్వుచు—"అమరబాబూ! పందెము మీరే యోడిపోవునట్లు తోచుచున్నది!" అనియెను.

అమ—ఎందుచేత?

మని—ఆనాడు నీలరతన బాబు మందిరమున మీరా దొంగ నెంతమాత్రమును బట్టుకొనజాలరని నేను మీతో బందెము వైచిన సంగతి మీకు జ్ఞాపకము నున్నదా?

అమ—ఉన్నది, అయిననేమి? ఇంకను నేనాపందెము నోడిపోలేదే!

మని—ఓడిపోవుదురు.

అని చెప్పుచు మందహాస వదనముతో నాతనివంక నొక తరళ కటాక్షమును బరగించి చటాలున నామె పల్లకి తలుపులను మూసి వైచెను. తోడనే యా పల్లకి కదలిపోయెను. అమరేంద్రుడును విశ్రామార్థమై గంగాతీరమునకు బోయెను. అత డేమేమియో యాలోచించుకొనుచు నట దిరుగుచుండ క్రమముగా నెండ వేడిమి యధికమైపోయెను. అందుచే నాతడు మరల స్టీమను వైపునకు బయలు

దేజెను. ఆ సమయమునకు సరిగా కుంజ పరుగెత్తుకొనివచ్చి యాతని యెదుట నిలువబడియెను. ఆకస్మికముగా నామెం గాంచినంతనే యాతని పరితాపమును, హృదయతాపమును గూడ నాతని కొక్క నిమిషములో జల్లారిపోయెను. ఆ రాత్రి యగపడకుండ బోయిన తరువాతి మరల నిదియే దర్శనము! ఆమెం జూచినంతనే యాతని హృదయ మానంద తన్మయమైపోయెను. అప్పుడాతడు స్నేహ మధుర స్వరముతో—"కుంజా! నీ విచ్చటి కెట్లు వచ్చితివి? విశేషము లేమి?" అని ప్రశ్నించెను.

కుంజ—నేను మీకొఱకే వచ్చియుంటిని. కలకత్తాలో నమూల్య బాబు నింటియొద్దకు బోయితిని. మీరిచ్చటకు వచ్చియున్నట్లు నాకక్కడనే తెలిసినది. అందుచేతనే యిచ్చటికి వచ్చితిని.

అమ—పనియేమి? ఏమైన క్రొత్త సంగతులు తెలియ వచ్చినవా?

కుంజ—నిన్నటి రాత్రి మరల నిచ్చట నొక బందిపోటు జరిగినది కాదా?

అమ—అవును. ఎప్పటివలెనే జరిగినది.

కుంజ—అందుచేతనే నేను మీదర్శనమునకు వచ్చియుంటిని. ఈసారి నేను చాల సంగతులను దెలిసికొన గలిగితిని.

అమరేంద్రు డాశ్చర్యముతో—"అలాగా! ఎట్లు తెలిసికొంటివి? శీఘ్రముగా దెలుపుము!" అనియెను.

కుంజ—ఆదొంగతనము చేసినవాడెవ్వడో మాత్రము నాకింకను దెలియలేదు కాని మా లోచనుడు నిన్నటిరాత్రి తన తెల్లగుఱ్ఱమును జందన నగర ప్రాంతము నందలి యరణ్యములోనికి దీసికొనిపోయి యచ్చట దానికి నల్లరంగు బూయుచుండగా నేను చూచియుంటిని. కొన్నిదినములనుండి యాతడు మాగుంపులోనికి వచ్చుటలేదు. కక్కడకు బోవునదియు నెవ్వరికిని దెలియదు. ఆ ముసలిది రాత్రివేళ

నా గుఱ్ఱమును దోలుకొని పోవుచుండగా జూచి నేను రహస్యముగా దాని వెనువెంటనే పోయితిని. అని తిన్నగా నాయరణ్య మధ్యమునకా గుఱ్ఱమును దీసికొనిపోయి లోచనుని కొప్పగించి మరల మామకాము నకు బోయెను. ఏమిజరుగునో చూతమను కుతూహలముతో నేను మాత్ర మచ్చటనే దాగియుండి చూచుచుంటిని. లోచనుడా గుఱ్ఱము నకు బూర్తిగా నల్లరంగు పూసిన తరువాత నాతడా గుఱ్ఱముతో గూడ నాయడవినుండి బయలుదేరెను.

అమ—ఆలాగా? అట్లయినచో నీ దొంగతనము చేయువాడు మీలోచనుడేనా?

కుంజ—కాదు—కాదు—వాడా గుఱ్ఱము నెవ్వరికో యప్పగించి యప్పుడే తిరిగి వచ్చినాడు.

అమ—అట్లయినచో నాతని డింగరీడునుగూడ నాయరణ్య మధ్యమునందే దాగికొనియున్నాడా?

కుంజ—లేదు. అచ్చటినుండి యాతడు వెడలిపోయిన తరువాతనే నేను మరల నెప్పటివలె మాబసకు బోయితిని. ఆ రాత్రి యంతయును నాకు నిద్రయే లేదు.

అమ—ఆలాగా? పాపము నీవీ విషయమున జాల శ్రమపడి యుందువని తోచుచున్నది.

కుంజ—లేదు—లేదు—తరువాత దెల్లవారినంతనే కాహియా మాడేగారియొద్దకు వచ్చినాను.

అమరేంద్రుడు ఆత్రముతో—"ఆలాగా? వచ్చి యేమి చేసినావు?" అని యడిగెను.

కుంజ—నాడు మారువేషమును వైచుకొని వచ్చియున్నాడు. ఆతని కనుబొమమీది మచ్చనుబట్టి కేవలమును నేను మాత్రమే గ్రహింపగలిగితిని. ఆతడప్పుడు ముసలివాని వేషమును దాల్చి వచ్చినాడు.

అమ—దొంగ యుండకొనుకు—తరువాత మరల నాతఁ డెక్కడకు బోయినాఁడు ?

కుంజ—వాఁడు మా ముసలిదానితో మాటలాడవలయునను నుద్దేశముతో వచ్చెను. కాని రాత్రి మామెం గుంపులోనుండి వెలువడి మఱియొక చోటికి బోయియుండెనుగదా—అందుచే నాతఁడు ప్రాతఃకాలమున మరల వచ్చెను. అప్పుడా యిరువురికిని మాటలు జరగినవి. వారి సంభాషణమును వినవలయునని నేనా సమీపమునం దొకచో దాగియుంటిని, కాని యామాట లేవియును నాకు స్పష్టముగా వినబడ నేలేదు. కేవలము నొకటి రెండు మాటలు మాత్రమే తెలిసినవి. కాహియాగా ముసలిదానిం జూచి—"నేని రాత్రియే యిచ్చటికి బోయెదను—తరువాత నేమి జరగినదియు నీకు సమాచార మంపెదను" అని చెప్పెను. ఈ మాట మాత్రము నాకు స్పష్టముగా వినబడినది.

అమరేంద్రుఁడు మహోత్సాహముతో—"ఇక నేమి ! తెలియదగిన సంగతి యేదో తెలిసియే పోయినది. ఆ కాహియా నిశ్చయముగా ముసలిదాని వేషముతో నావ సువ్వులను దీసికొని పోవుటకై రాగలఁడు. కాని యిక వాఁడు మునుపటివలె దప్పించుకొని పోజాలఁడు" అనియెను.

కుంజ—కారణమేమి ! అతని మీ రేవిధముగా బట్టుకొనగలరు ?

అమ—నీ వీ సంగతి తెలుపకున్నచో నాతని బట్టుకొనుట మాకసాధ్యమే యైయుండును. కాని యిక వాఁడెక్కడకు బోగలఁడు ! ముసలిదాని వేషముతోనున్న తన్నెవ్వరు నానవాలు పట్టజాలరని యాతఁడు ధైర్యముతో నుండును. కుంజా ! నీవన్ని విధముల చేతను నాకనేకోపకారములు చేయుచున్నావు నీ యవ్యాజప్రేమకు బ్రతిఫలముగా నింతవఱకు నేనేమి యొసంగఁగలిగితిని—కుంజా ! నేను నీకు ఋణపడి యున్నాను — ఈ ఋణవిమోచనమున కుపాయ మేమియు నగపడుట లేదు.

ఆకస్మికముగా గుంజ సర్వాంగకములును స్వేదసిక్తము లై పోయెను. ఆమె హృదయ మతి తీవ్రముగ జలింప నారంభించెను. ఆమె యేమియు మాటాడకుండ నమరేంద్రుని మొగముపంక దదేక దృష్టిం గాంచుచు చిత్రప్రతిమవలె నిలువబడిపోయెను. ఆ చూపులో జలనములేదు. ఆ బాలిక హృదయ భావము లన్నియు నందు మూర్తీభవించి యుండెను. అమరేంద్రుడు కూడ నిక నేమియు మాటాడజాలక పోయెను. ఆ రమణీమణి సుస్థిరాలోక సుధారసముచే నాతని సర్వాంతఃకరణములును సంతృప్తములై పోయెను. ఆనంద తన్మయత్వముచే నాతడును చిత్రప్రతిమవలె నైపోయెను. అప్పుడా యిరువురి హృదయములందు నొక్కటే భావము పూర్ణీభవించి యుండెను. ఆ భావమేమో మనకే కాదు—వారికి గూడ నభేద్యమై యుండెను.

కొంతసేపైన తరువాత గుంజ కోమల స్వరముతో—"ఇక నేను పోయెదను" అనియెను.

అమరేంద్రు డదరిపడి—"కుంజా! అప్పుడే పోయెదవా? మరల నీ దర్శన మెప్పుడు?" అనియెను.

కుంజ—ఎప్పుడని యడుగనేల? అవశ్యకమైనప్పుడెల్ల వచ్చి యగపడుచునే యుండెదను.

అమ—ఆ యావశ్యక మెవరికి? నీకా? నాకా?

కుంజ యేమియును బ్రత్యుత్తరము చెప్పక తలవంచుకొని యూరకుండెను.

అమ—కుంజా! నిన్నిక నామందులవాళ్ళ గుంపులో నుండ నిచ్చుట నాకెంతమాత్రము నిష్టములేదు.

కుంజ చిఱునవ్వు నవ్వుచు నొక్కసారి యమరేంద్రుని వదనమున దృష్టి ప్రసారముం గావించి—"ఆ సంగతి తరువాత జూచుకొనవచ్చును" అని గిరుక్కున దిరిగి యొక్కటే పరుగున వచ్చిన దారినిబట్టి వెడలిపోయెను.

అమరేంద్రునకామెను బలవంతముగ నిలిపి యుంచుటకు సాహసము లేకపోయెను. అతడు స్థాణువువలె నిలువబడి కంటి కగపడి నంతవఱకు నామెవంకనే చూపుల బ్రసరింప జేయుచుండెను. కాని యొక్క నిమిషములో నామె యదృశ్యమైపోయెను. ఆ యుత్తర క్షణముననే యీ క్రింది విధముగా నొక మధుర గానము వెలువడి యా ప్రభాతాంతరాళమును మధురామృత రసతరంగితముగా జేసివైవ దొడంగెను. అమరేంద్రు డాశ్చర్యముతో నాలకించుచుండెను—

"అడవితీగలకు చిగుళ్ళు లేవే, చందమామా ఆ
యలరులచాటున మొగ్గలు లేవే, చందమామా
అడవిపువ్వులా మేలివలపులు, చందమామా
ఆకాశంబున కెగురవటోయి, చందమామా
అడవిచిలుక పలుకులకు, చందమామా
అర్థమేమి లేదంటోయి, చందమామా
పట్టణములో బావులనుండి, చందమామా
పచ్చిపాలూ పొంగునటోయి, చందమామా
నగళ్ళలోని వారికెల్ల, చందమామా
నడినెత్తిని కళ్ళుండునటోయి, చందమామా
పురములోని కాకులన్నీ, చందమామా
పువ్వులపాటలు పాడునటోయి, చందమామా
నగరమైన నట్టడవైన, చందమామా
నాకు నీకు నొకటేనోయి, చందమామా
తొంగి తొంగి చూడకోయి, చందమామా నీ
రంగు నాకు నచ్చినదోయి, చందమామా
మాపులైన రేపులైన, చందమామా నా
మనసు లోపల నీవేనోయి, చందమామా!"

అది కేవలమును గుంజ కంఠస్వరమువలెనే యుండెను. కుంజ పాటలు పాడుట నమరేంద్రు డిదివఱకు వినియుండలేదు. అందుచే

నిప్పు డాతఁ డద్భుత రస నిమగ్నుడై పోయెను. మందుల బాలిక యైననేమి? అడవిపాట యైననేమి? ఆ సహజ మోహన కంఠస్వరము నుండి మధుర గానామృతరసము పొంగిపొరలిపోయినది. ఎదురెండలో నిలువబడియున్నను, నప్పు డమరేంద్రుని హృదయ మమృతరస శీతలమైపోయెను. ఒక్క పరుగునబోయి కుంజను గేసికొనవలయునని యాతఁ డుబలాటపడియెను గాని యామె యేమనుకొనునోయని యట్లు చేయుటకు సాహసింపజాలకపోయెను. ఆ మధురగీతము మహా వాయు తరంగములలో విలీనమైపోయినను నాతని హృదయమునం దింకను ప్రతిధ్వనించుచునేయుండెను. అప్పు డమరేంద్రుడు తనలో—"పంజర కీరమునకేగాని, యడవిచిలుకకు మధురస్వరము లేదా?—గృహ మయూరమునకేగాని, యడవినెమిలికి నానందనృత్యము లేదా?" అని యనుకొనియెను.

ఇంతలో స్టేషనులో బదిగంటలు కొట్టిన శబ్దము వినవచ్చెను. అమరేంద్రు డదరిపడి తన విధాయక కృత్యమునకై మనసు మరలించుకొని యతి వేగముగ స్టేషనునకు దరిగిపోయెను. కార్య తత్పరులగు ధీరహృదయుల యద్భుత ప్రవర్తనములు ప్రశంసనీయములుగదా!

## ప్రకరణము 24

అమరేంద్రునివలన నెల్ల సంగతులను సవిస్తరముగ దెలిసికొని పత్తేదారు సాహేబు గంభీర స్వరముతో—"కుంజ మంచి తెలివిగల బాలిక, ఆమె పోలీసుశాఖలో జేరిన నెంతయో బాగుగ నుండును. ఒకటి రెండు సంవత్సరములలో నామెకు మంచి పేరుకూడ వచ్చును. ఆ మందులగుంపుతో దిరుగుచున్నచో నామె సామర్థ్యమంతయును నిరర్థకమైపోవును" అనియెను.

అమరేంద్రుడా మాట కెట్టి ప్రత్యుత్తరమును జెప్పక—"మన మిక నించుకసేపైనను నాలస్యము చేయగూడదు—ఇప్పుడే బయల్దు

దేరిపోవుట మంచిది. వలయు చోటులందెల్ల దగిన వారిని గావలి యుంచుట కిప్పటినుండియును ప్రయత్నము చేయవలయును" అనియెను.

ఫతే—అమరబాబూ! ఇంత తొందర పడియెదవేమి? ఇప్పటి నుండియు బాధపడు టెందులకు? వాడు వచ్చునది రాత్రిగాదా? అప్పటికి మనము కావలసినన్ని యేర్పాటులు చేసికొనవచ్చును.

అమ—సరిసరి! మీరింకను బెడదారినే యున్నారు. దూర మాలోచింపక కేవలమును బొరపాటు పడుచున్నారు వాడు రాత్రివేళ వచ్చుననుకొంటిరా? రాడు—పట్టపగలేవచ్చును. ఈపాటికి బయలు దేఱియే యుండును. ఇక నొకటి రెండు గంటలలో రాగలడు.

ఫతే—అమరబాబూ! నీమాట లేవియును నాకు సరిగా బోధపడుటలేదు. ఒకమాటకు నొకమాటకు సంబంధ మగపడుటలేదు. రాత్రి బయలుదేఱెదనని యాతడు ముసలిదానితో జెప్పినట్లు నీ విప్పుడేగాదా చెప్పితివి!

అమ—ఆ మాటనుబట్టియా మీరిట్లనుచున్నారు? మీరు బాగుగ నాలోచింపలేదు. వాడప్పుడా ముసలిదానితో ననేక విషయములనుగూర్చి చాలసేపు మాటలాడినాడు. అందొక్కమాటయైనను గుంజకు స్పష్టముగా వినబడలేదు. తుదకు వాడీమాట యొక్కటి మాత్రమే బిగ్గఱగా బలికినాడు—దీని తాత్పర్యమేమని యూహించితిరి? మన కన్నులలో దుమ్ము గొట్టుటకే వాడిట్లు చేసినాడు. గుంజ చాటుననుండి వినుచున్నదనుసంగతి వానికి దెలియకపోలేదు. ఆమె మన కెల్లసంగతులును జెప్పునని యాతనికి దెలియును. అందుచేతనే యామెకామాట వినబడునట్లుగా బలికినాడు. ఆతని యుద్దేశము మీకు బోధపడలేదా? ఇంతకాలమునుండి పేరందిన పత్తేదారు పని చేయుచున్న మీకు నావంటివాడు తెలుపవలయునా? నాడావస్తువులను దీసికొనిపోవుటకై రాత్రి వచ్చునుగదాయని మనము రాత్రివేళనే

యాతని బట్టుకొనుటకు ప్రయత్నించి సిద్ధముగా నుందుమనియు, సంతలో దాను పగటివేళనే పోయి తన పని నిర్విఘ్నముగా నెఱవేర్చుకొని నిర్భయముగా బోవచ్చుననియు నూహించి యాతడీయెత్తు వేసినాడు. మీకిప్పుడైన నీసంశయము తోచుటలేదా ?

ఫతే—నీమాటల యర్థమేమో నాకు తెలియుచునే యున్నది. కాని—అమరబాబూ! ఊహలకు దలయును దోకయు నుండదు—ఏదారినిబట్టిన నాదారియే—పర్యవసానమునుబట్టిగాని సత్యము బోధపడదు. నీవు పొరపాటు పడుచున్నావేమోయని నాకు సందేహముగా నున్నది.

అమ—పత్తేదారు సాహేబా! ఒకవేళ నాయూహ పొరపాటే కావచ్చును. కాని మనము సావధానముగా నుండుటవలన నష్టము లేదుగదా! వాడు పగలు రాకపోయినను రాత్రివేళ వచ్చుననుటకు సంశయములేదు. మనము రాత్రియైనను వానికొఱకు గాచుకొని యుండవలసినదే—అట్టిచో నిప్పటినుండియును జాగ్రత్తగా గనుపెట్టుకొని యున్నచో మనకు నష్టమేమున్నది? మనము సిద్ధముగానుండి నిరీక్షించుచున్నచో బగలు వచ్చినను రాత్రివచ్చినను నాతని బట్టుకొనవచ్చును. రాత్రివఱకు నూరక చూచుచున్నచో నాతడు పగలే వచ్చిపోవునేని మన ప్రయత్న మంతయును నిష్ఫలమైపోదా ?

ఫతే—అదేమిమాట? మనము మనుష్యులముగాని ప్రాకులము కాము! ఎప్పుడీపనిలో ప్రవేశించితిమో యప్పటినుండియు నిద్రాహారములులేక ప్రాణములు తల్లడిల్లిపోవుచున్నవి. సమయమును సందర్భమును లేకుండ నిరంతరము నొక్కరీతిగ నెవ్వరు పని చేయగలరు? వృధాశ్రమయేగాని యింతవఱకు వెంట్రుకంతపని జరుగలేదు. క్రమక్రమముగా శక్తియంతయును సన్నమై పోవుచున్నది. బుద్ధిగూడ మోహువడి పోవుచున్నది. ఏమి చేయగలము ?

అమ—అయ్యో! ఇంతకష్టమునుబడి ఫలసమయమున నిట్లు విసుగుకొనుటవలన నేమిలాభము? ఇంతటి గజదొంగలను బట్టుకొన గలిగినచో నీకీర్తియంతయును మీదేకాదా ?

ఫతే—అవును. నీవన్నమాట సత్యమే—నేను గాకున్నచో మఱి యెవ్వడీ దొంగలను బట్టుకొనగలడు ?

అమరేంద్రుడు చిఱునవ్వు నవ్వుచు—"మీమాట నిశ్చయము. ఇంతటి ఘనకార్యమును సాధించుటవలన దొరతనమువారి బహుమానమును కూడ మీకే చెందగలదు" అనియెను.

ఫతేఅలీ గర్వముతో—"అది యెప్పటికిని దప్పదు—దారుణ చరిత్రులగు నీ గజదొంగల రహస్య తంత్రములను భేదించు నీకార్యము నితరు లెవ్వరు సాధింపగలరు ? అఱచేత ప్రాణములను బెట్టుకొని యడవులవెంట—ఆ ఘాతుకుల వెనువెంట దిరుగుట కెవ్వరు సాహసింపగలరు ?" అనియెను.

అమరేంద్రుడు నవ్వుచు—"కావుననే మనమిప్పుడు బయలుదేఱి పోవలయును. ఇంకను నాలస్యము చేయుట యెందులకు ?" అనియెను.

ఫతే—అట్లయినచో నడువుము !

అని చెప్పడు నాతడు హుక్కా—గొట్టమును క్రిందబడవైచి లేచెను. తోడనే యా యిరువురును గొంతమంది పోలీసుభటులతో గలసి యా ప్రదేశమునకుబోయి యావశ్యక స్థలములయందు రహస్యముగా రక్షకభటులను గాచికొనియుండున ట్లేర్పాటు గావించిరి. పిమ్మట నమరేంద్రుడును, ఫతేఅలీయును గూడ నొక పొదలో గూర్చుండి సావధానులై యుండిరి.

క్రమముగా మధ్యాహ్నము రెండుగంటలవేళ యయ్యెను. ఫతేఅలీ కంతకంతకు గోపము హెచ్చిపోవుచుండెను. అప్పు డాతడస్పష్ట కంఠస్వరముతో దనలో దానే—"నే నిదివఱ కెన్నియో విషమ వ్యవహారములలో బనిచేసి యున్నాను. కాని యెన్నడు నీవిధముగా జిక్కులలో దగుల్కొని యుండలేదు. ఇంతకష్ట మెన్నడును బడియుండలేదు—అబ్బబ్బ ! దోమలు కఱచుటచే నొడలంతయును బొబ్బలెక్కిపోవుచున్నది" అని గొణగుకొన నారంభించెను.

అప్పు డమ రేంద్రునకు నవ్వునాపుకొనుట దుసాధ్యమైపోయెను. అయినను నాతఁ డతికష్టముతో నడఁచుకొని నిశ్శబ్దముగా గూర్చుండి యుండెను. ఈ సమయమునం దేమిమాటాడినను ఫతేఆలీ మఱింత కోపముచే మండిపోవుననియెంచి యమరేంద్రుఁడు మాటాడ కూరకుండెను.

ఫతేఆలీ మరల దనలో—" ఈ దొంగముండ కొడుకులను బట్టుకొనుటయే తటస్థించినచో నాకాలిజోడుతో గసితీర గొట్టక మానను. అప్పుడుగాని నాకోపము తీరదు. దుర్మార్గులు—తుంటరులు—వీరికొఱ కెన్నియో కష్టముల పాలగుచుంటిని—అబ్బ! ప్రాణము విసిగి పోవుచున్నది" అని యనుకొనుచు నసంతర మమరేంద్రుని వైపుకు దిరిగి—" బాబూ! నేనిదివఱ కింతకంటెను ఘనులగు గజదొంగల నెందఱినో పట్టుకొని వారికి దగినశాస్తి చేయించితిని. కాని, యీసారి మాత్రము బుద్ధిలేక నీవెంటనే తిరుగుచు క్రమముగా నీగతికి వచ్చితిని. ఇకముందుగూడ నెట్టి కష్టములు సంప్రాప్తము లగునో చెప్పజాలను. ఈ విధముగా నాపేరు చెడిపోయినది. అయ్యయ్యో! దోమలు నా మొగమంతటను ముసురుకొని కఱచివైచుచున్నవి. ఏమిచేయుదును బాబూ!" అని చిరాకుపడదొడంగెను.

అంతలో నొక వృద్ధ స్త్రీ తన యవసన్న శరీర భారమును చేతి కఱ్ఱపై నానుకొని మెల్ల మెల్లగా నడచుచు నాత్రోవనే వచ్చుచుండెను. అమరేంద్రు డావంక గనుంగొని యుత్సాహముతో ఫతేఆలీ చేయిపట్టుకొని మెల్ల మెల్లగా—" అదిగో! అవైపు చూడుడు! వాడే—నిశ్చయముగా వాడే!" అనియెను.

ఫతేఆలీ యావైపునకు జూచి యాక్షేప సూచకముగా నవ్వుచు—" బాబూ! నీకు బుద్ధిలేకుండ బోయినది. తదేక ధ్యానముచే మతిపోయినదని తోచుచున్నది. నేను మొట్టమొదట నవివేకముచే నీవేమో చాల బుద్ధిమంతుడవని నమ్మి నిన్నివ్యవహారమునందు నాకు

సహాయునిగా జేసికొంటిని. ఈ సంగతి యిప్పుడే తెలిసికొనగలిగినచో నాకిట్టిగతి కలుగకయే యుండును. ఇప్పు డేమనుకొనిన నేమి లాభము ?" అనియెను.

అమరేంద్రుడు మందహాసము చేయుచు—"పత్తేదారు సాహేబా! అట్లు కోపగించుకొనియెదరేల ? ఇప్పుడు నేనేమి యపరాధము చేసితిని ?" అనియెను.

ఫతే—అపరాధమా ! ఈ యెనుబదియేండ్ల ముసలిముండను నాకు జూపించి కన్నుండగనే కనుపాపలను దీయగలిగిన కపటతంత్ర కుశలుండగు కాహియా వీడేయని చెప్పుచున్నావు. నీకింకను నేమైన బుద్ధియున్నదా ?

అమ—సరే—క్రమముగా నంతయును మీకే బోధపడును. కాహియా ముసలిదాని వేషముతో రాగలడని కుంజ నాతో జెప్పినది. అట్లామె చెప్పకయే యున్నచో నీ ముసలిదానిం గాంచి కాహియా యని నేనుమాత్రము గ్రహింపగలనా ? ఇట్టి వేషముతో నున్నను గనుబోమమిాది మచ్చనుబట్టి కుంజ యాతని నానవాలు పట్టినది. ఒకసారి రండు—మనముపోయి యా ముసలిదానిని బాగుగ బరిశీలించి వత్తము.

ఫతే—నీవుపోయి చూడుము—ఎంత బాగుగ జూడవలయునో—నీయిష్టము వచ్చినట్లు చూడుము.

అమ—ఎట్లయినను నేను పోకమానను—అనుమానము తోచి నప్పుడు తీర్చుకొనవలసినదే—మీరు రారా !

ఫతే—నీవంటి కన్నుల దెఱవని చిన్ని పాపను నేను సహాయునిగా జేసికొన్నప్పుడిక నాకు నీవు చెప్పినట్లు చేయక తప్పునా ?

అమరేంద్రుడు మనసు లోపలనే నవ్వుకొనుచు దుబ్బుల చాటునుండి మెల్లమెల్లగా నావ్యక్తి వచ్చుచున్న వైపునకు బయలు దేఱెను. ఫతేఅలీయును గత్యంతరములేక యమరేంద్రు ననుసరించి

పోయెను. ఆ వృద్ధవ్యక్తి వారిని గనుపెట్టలేదు. ఆమె యొకసారి నలుదెసలను బాగుగ బరికించి చూచెను. కనుచూపుమేర నెచ్చటను నెవ్వరును గానవచ్చుటలేదు. అప్పుడా ముసలిది తూలుచు దూలుచు బోయి యొక చిన్న చెట్టునొద్దకుజేరి యా నీడను గూలబడియెను. ఆమె గమనాయాసముచేతను, నా తపతాపముచేతను, గ్లాంతయై పడిపోయినట్లు స్పష్టముగా బోధపడుచుండెను. ఆమె యప్పటియవస్థను గన్నారజూచిన యమరేంద్రు డప్పుడు తనలో—"నేనే కేవలమును బొరపాటు పడిపోయితిని—వీడు కాహియా కాడు, పాపము నిజముగా నెవ్వతెయో వృద్ధురాలనియే తోచుచున్నది. కాకున్నచో నంతటి వేసగాడైనను నింత స్వభావముగా నభినయింపగలడా !" అని భావించు కొనదొడంగెను.

కాని యమరేంద్రుడు తొందరపడి తన సంశయమును పత్తేదారునకు దెలుపలేదు. వారిరువురు నాసమీపమునందలి యొక పొదలో దాగికొని యుండిరి. ఆ వృద్ధురాలికి వారగపడుటలేదు. కాని వారుమాత్ర మామెను స్పష్టముగా జూడగలిగి యుండిరి. అప్పుడా వృద్ధురాలు మెల్లగా దన పైటచెఱగు నాచెట్టుమొదట బఱచు కొనియెను. అమరేంద్రుడా సంగతిని గనుపెట్టి పత్తేదారునిం గాంచి మెల్లగా—"చూచుచున్నారా ! ఆ పఱచిన చెఱగు క్రిందనే నగలను బూడ్చిన గోయి యున్నది !" అనియెను.

ఫతేఆలీ సాహేబు విరక్తుడై తలయూచుచు—"కాదు బాబూ ! కాదు—గ్రుడ్డినమ్మకముచే నీవన్నిసంగతులను నీ యూహానకే ముడిపెట్టుకొనుచున్నావు—వెఱ్ఱివాడా ! ఈ మాత్రము తెలిసికొన లేకపోయితివి—ఆ వృద్ధురాలాయాసపడివచ్చి యా చెట్టునీడను విశ్రాంమార్థ మించుకసేపు పరుండవలయునని పైటచెంగు పఱచు కొన్నది. తెలిసినదా !" అనియెను.

అమరేంద్రు డెట్టి ప్రత్యుత్తరమును జెప్పకుండ దదేకదృష్టితో నావంకనే పరిశీలించి చూచుచుండెను. అప్పుడా వృద్ధురాలు తన

చేతికఱ్ఱ నందుకొని దానితలపైనున్న బిరడను సడలించివైచి పైట చెఱగు క్రిందనుండి యేమేమియోతీసి యొక్కటొక్కటిగా నా కఱ్ఱ గొట్టములో బడవైచుట కారంభించెను. అది యంతయును జూచి యమరేంద్రుడు తుత్సాహమును బట్టజాలక ఫతేఆలీని జూచి—"అయ్యా! తలవంచుకొని నిరాశతో నట్లు కూర్చుండెదరేమి? ఒకసారి యావైపు చూడుడు! చూచితిరా? ఇక నిప్పుడేమి చెప్పెదరు? నేనేనా బుద్ధిహీనుడను?" అనియెను.

ఫతేఆలీ యావంక జూచి సర్వమును గ్రహించి యమరేంద్రుని మాటలను వినిన బెట్టకుండగనే చటాలున బాదలోనుండి పైకి లంఘించి యుచ్చ తీవ్ర స్వరముతో—"మొండిముండాకొడుకా! పత్తేదారులలో ప్రసిద్ధి గాంచిన ఫతేఆలీని కూడ కన్నులలో దుమ్ము గొట్టి భ్రమపెట్ట దలంచితివా? ఇక నెక్కడకు బోయెదవు? ఇక నీలీలావసానమైపోయినది!" అని కోపముతో గేకలు వైవదొడంగెను.

అప్పుడా వృద్ధవేషధారి యాకస్మికముగా ఫతేఆలీని గాంచి తత్తరముతో లేచి భయభ్రాంతుడై శరవేగమున బాఱిపోవ దొడంగెను. అప్పుడమరేంద్రుడు సింగపు గొదమవలె గర్జించుచు నతివేగముగ నాతని వెన్నంటి పోయెను ఫతేఆలీ యాత్రముతో దన గార్ధభ స్వరమున దెశలు మాఱుమ్రోగునట్లుగా రక్షకభటుల బిలువదొడంగెను. పొదలనుండియు, బుట్టలనుండియు, గోతుల నుండియు, కొమ్మలనుండియు నొక్క నిమిషములో రక్షకభటు లందఱును వెలువడి వచ్చి నలువంకలను గాచుకొని యుండిరి.

ఇక నాచోరశిఖామణికి బాఱిపోవుట కవకాశము లేక పోయెను. తన పాపమంతయు నిన్నాళ్ళకు బండి బ్రద్దలైనదని భయపడి పోయెను. ఇక గత్యంతరములేక చావుతెలివి తెచ్చుకొని మొండి చొఱవచేసి తెగించి పిచ్చికోతివలె, వెఱ్ఱికుక్కవలె వెనుకముందాలో చింపక ప్రాణత్యాగమునకైనను సిద్ధపడి యాతడు గిరుక్కున వెనుకకు

మరలి యొక్క యుదుటుల లంఘించి ఫతేఆలీపై బడియెను. ఆ యుదాటునకు ఫతేఆలీ వెల్లవెలికల బడిపోయెను. తోడనే యా దురాత్ముఁ డాతనిపైఁబడి యంత్యకాలపు దుస్సాహసముతో ఫతేఆలీ కంఠమును బలవంతముగ దన రెండు చేతులతోడను నొక్కి పైచుట కారంభించెను.

ఫతేఆలీ కూపిడి యామట లేదు. మొగ మంతయును నెత్తురు గడ్డవలె గందిపోయెను. క్రమముగా నాతనికి చైతన్యము తగ్గిపోవు చుండెను. ఆ నిమిషములో నమరేంద్రుఁ డొక్కపరుగున సింహమువలె వచ్చి పడకయేయున్నచో నిక నొక్క నొక్కుతో బాపవర్తనుఁడును, ప్రాణఘాతుకుఁడునగు కాహియా ఫతేఆలీ జీవిత చరిత్రమునకు స్వస్తి చెప్పియేయుండును. పాపాత్ముల పాపకృత్యము లెంత ప్రబలములైనను బర్యవసానమున బరాజితములు కాకమానవు. మోసములును, దౌర్జన్యములును జేయువాఁడు ప్రకృతి లాభమును బడయఁగలిగినను క్రమముగా గట్టకడపటికి గడగండ్లపాలై నిష్కృతి యనుమాట లేక తీరని దుఃఖమున గ్రుంగి దిక్కుమాలి నశింపక మానఁడు !

## ప్రకరణము 25

అమరేంద్రుఁ డధిక బలసాహసములుగల మహాధైర్యశాలి. ఆతని బుద్ధి యెంతటి నిశితమైనదియో, బలపరాక్రమములు కూడ నంతటి యప్రతిమానములైనవి. ఆతఁడు కాహియా వెన్నెముక విఱుఁగు నట్లుగా నశనిసదృశంబగు ప్రబల ముష్టిఘాతముం గావించి మెడ పట్టుకొని వెనుకకు బడద్రోసి యాతని గుండెలపై గూర్చుండెను. గళబంధము వదలి యుచ్ఛ్వాస నిశ్వాసముల యవరోధము తీరి పోవుటచే ఫతేఆలీ సాహెబు బ్రదికి బయటబడియెను. కాహియా మాత్రము పిటికిపందయా ? ఆతనికిని గావలసినంత కండసత్తువ

యున్నది. అట్లు పడియుండియే యాత డున్మత్తునివలె సమరేంద్రుని గొంతు నొక్కుటకై ప్రయత్నించెను. అతనికిక భయ మేమున్నది! ఆశ యేమున్నది!—

ఇంతలో నలుదెసలనుండియును రక్షకభటులువచ్చి కాహియాను జుట్టబెట్టుకొనిరి. ఆ సమయమున ఫతేఆలీ మండిపడుచు లేచి వచ్చి తన క్రోధమంతయును దీరునట్లుగా నా కాహియాపై బడి బాదుట కారంభించెను. అధికారి చిత్తము నెఱింగి రక్షకభటులు కూడ నాతనినే యనుసరింప దొడంగిరి. అప్పు డచ్చట సమరేంద్రుడే లేకయున్నచో నిక నొక నిమిషమునకా దెబ్బలవలన కాహియా కిమ్మనకుండ నట జచ్చి పడియే యుండును.

అమరేంద్రుడిక నాతని గొట్టవలదని వారినివారించెను. ఆ అపరాధి యపరాధమునుబట్టి ఆతని దండింపజేయవలయునేగాని ఆవిధముగా నాతని జావగొట్టుట పోలీసు ధర్మమునకు విరుద్ధము—ఇతరుడగు సమరేంద్రుడీ విధముగా దమ తప్పు నుగ్గడించినందులకు వారందఱును సిగ్గుపడిపోయిరి. తరువాత నారక్షకభటు లాతని చేతుల కరదండాలను వైచి స్టేషనున కీడ్చుకొని పోయిరి—కాని కాహియా యేమియును మాటాడకుండ వారి వెంటనే పోయెను.

ఫతేఆలీకి దొంగను బట్టి తీసికొని పోవలయు ననియేగాని యా వస్తువుల మాటయే జ్ఞప్తి లేదు. అమరేంద్రుడా చెట్టుక్రిందికి బోయి యచ్చటనున్న వస్తువులను, కాహియా గుల్లకట్టలో వైచిన వస్తువులతో గూడ దీసి వారివెనుకనే స్టేషనునకు బయలుదేఱెను. ఆ కడపటి బందిపోటునం దపహరింపబడిన ఆందూార్ జమీందారుని సర్వస్వమును నొక్క పైసయైన బోకుండ దొరకి పోయెను.

ఫతేఆలీ రక్షకభటుల మూలమున కాహియాను స్టేషనునకు దీసికొని పోయెను. ఇంతలో సమరేంద్రుడు కూడ నచ్చటికి వచ్చి యా వస్తువుల నన్నిటిని పత్తేదారున కొప్పగించెను. ఫతేఆలీ

సంతోషముతో—" అమరబాబూ! పత్తేదారుగా నుండుటకు నీవే తగినవాడవు. కష్టసమయమందైనను, సుత్సాహసమయమందైనను నీకు చలనమనుమాట లేదు—విధాయక కృత్యములందశ్రద్ధ యనుమాట లేదు—ఆవశ్యక విషయములంగూర్చి మఱపనుమాట లేదు. నీయెట్ట యెదుట నేమనినను ముఖస్తుతిగా నుండును" అనియెను.

అమరేంద్రు డేమియు మాటాడక చిఱునవ్వు నవ్వుచు నూరకుండెను. బలవత్ప్రహారములచే సగము చచ్చినట్లున్న కాహియా స్టేషనునకు జేరినంతనే శవమువలె క్రింద బడిపోయెను. అట్లు కొంతసేపైనతరువాత నాత డించుక యోసరిల్లి మూల్గుచు దాహము కావలయునని సంజ్ఞ చేసెను. అప్పు డమరేంద్రుని కాతనిపై జాలికలిగి యొక రక్షకభటునిం బిలిచి—" యాతని కించుక దాహమిమ్ము!" అని చెప్పెను.

కాహియా శీతల జలపానమును గావించి యించుక తేరుకొనిన తోడనే ఫతేఆలీ యాతని యొద్దకు బోయి—" అన్నా! కాహియా! ఇంకను దాపరిక మేల? రహస్య మంతయును సవిస్తరముగా వెల్లడింపుము బాబూ!" అనియెను.

కాహి—వెల్లడించుట కేమున్నది? నా కేమి తెలియును!

అనుటయు ఫతేఆలీ క్రోధోద్రేకముచే గర్జించుచు—" మాయలమారీ! తుంటరీ! పోకరీ! ఇప్పటికిని నా సంగతి నీకు దెలియలేదా? ఇంకను నీపొగ రడగలేదా?" అని ధిక్కరించెను.

కాహి—నేను చెప్పవలసిన దేమున్నది?

ఫతే—ఏమున్నదా? ఆ విధముగావచ్చి దారులనుగొట్టు నా మహాపురుషు డెవ్వడో యాతని సంగతి చెప్పవలయును.

కాహి—ఇంకెవరు? నాసంగతి మీకు దెలియుటలేదా? ఇంకేమి చెప్పవలయును?

ఫతే—నీమాటకాదు—దారులు దోచుకొనిపోవు నాగుఱ్ఱపు సరదారుమాట యడుగుచున్నాను.

కాహియా మఱి యేమియును మాటాడలేదు. అందుచే ఫతేఆలీ సాహేబు మండిపడుచు తీవ్ర స్వరముతో—"పొగరుబోతా! నీగుండెలు పగులగొట్టించెదను. ఆ గజదొంగ యెవ్వడో చెప్పెదవా! చెప్పవా!" అనెను. కాహియా యప్పుడు కూడ నేమియు మాటాడలేదు. ఫతేఆలీ క్రోధోన్మత్తుడై పోయెను. ఆ కాలపు బోలీసువారిప్పటివారికంటె కూడ నతి దారుణ కృత్యములను జేసెడివారను సంగతి చెప్పనక్కఱలేదు. ఫతేఆలీ యప్పుడాతని మరల బ్రహరించుటకారంభించునేమోయని యమరేంద్రుడు జాలిపడి కాహియాను జూచి-"ఓయీ! నీవెంత దాచినను మాకిదివఱకే యున్నసంగతులును దెలిసిపోయినవి. లోచనుడు తన తెల్లగుఱ్ఱమునకు నల్లరంగును బూసి తీసికొనిపోయి యొప్పగించుచుండునని కూడ మాకు దెలిసినది. ఇంకను గందరగోళమెందులకు? వృథాగా నేల దెబ్బలను దినియెదవు? ఆ గుఱ్ఱముపై నెక్కివచ్చి మార్గస్థులను భయపెట్టి దోచుకొనువాడెవ్వడో యాతని సంగతి చెప్పివేయుము. నీకును మాకును కూడ శ్రమ యుండదు. చెప్పకున్నచో వీరు నిన్ను మరల గొట్టుటకారంభింతురు" అని శాంతముగా బోధించెను.

ఫతేఆలీ గర్జించుచు—"కేవలమును గొట్టుటయే కాదు. ఎముక లొకచోటను, మాంసమొకచోటను గుట్టలు గుట్టలుగా బడిపోవును—ఎవరక్కడ? ఈ ముండిముండకొడుకును గొట్టుగదిలోనికి దీసికొని పొండు!" అనియెను.

ఆ కాలమునందు బోలీసువారి కొట్టుగదిలోనికి బోయిన యపరాధులలో జాలమంది రక్తప్రవాహములలో బ్రాణములతో గూడ గొట్టుకొని పోయినవారే—అప్పటి దారుణ కృత్యములను గూర్చి యిప్పుడు వర్ణించుటవలన బ్రయోజన మేమియును లేదు—ఆ కొట్టుగది సంగతి కాహియాకు బాగుగనే తెలియును. అందుచే నాతడు భయభ్రాంతుడై వడకుచు గద్గద స్వరముతో—"బాబూ! నేను

మీచేతుల కెప్పుడు దొరకిపోయితినో యప్పుడే నాకు గతిలేకుండ బోయినది. ఇక నేనెంత భీష్మించిన నేమిలాభము! చెప్పెదను వినుడు! అట్లు గుఱ్ఱము నధిరోహించి పోయి దొంగతనము చేయువాడు లోచనుడే—దొంగిలించిన తోడనే యాతడా గుఱ్ఱము నుడాయించుకొని కొంతదూరము పోయి యొకచో నాదొంగవస్తువుల నన్నిటిని బూడ్చియుంచి, మఱియొక వేషముతో సమీప గ్రామము నందలి హోటలునకుబోయి యేపాత్రము క్రిందనో యా ప్రదేశమును గూర్చి సంకేతాక్షరములను వ్రాసి పోవుచుండును. నేనా సంకేతమును గ్రహించి చల్లగా బోయి యెవ్వరికిని దెలియకుండ వానిని దీసికొనుచుందును—ఇదియే మావృత్తి—ఇన్నాళ్ళవఱకు సాగినది. మీదయ వలన నిదియే మాకు గడపటిసారి!" అని చెప్పెను.

"ఫతేఆలీ బుద్ధిహీనతవలన, కాహియాకు పోలీసువారి ప్రహారములు తప్పిపోయెను. అతడు దొంగతనము చేసినవాని పేరు చెప్పువఱకు నాతని యెడల బోలీసువారి యమానుష కృత్యములు జరుగుచునే యుండును. కాహియా ఫతేఆలీ యంతటి బుద్ధిహీనుడే యైనచో నింతకాలము వఱకు నింతలేసి పను లెట్లు చేయగలుగును! ఆత డిప్పుడు కూడ దన బుద్ధికుశలతను వినియోగించి యేదోయొక విధముగా దొంగపేరు చెప్పివైచి తన ప్రస్తుత బాధను దప్పించుకొనియెను" అని యమరేంద్రుడు భావించుకొనియెను. కాని కాహియా యదృష్టవశమున ఫతేఆలీ యాతని మాటల నన్నిటిని సంపూర్ణముగా విశ్వసించి గంభీరవదనముతో మందహాసముచేయుచు—"ఔను! వాడేదొంగ—లోచనుడే బందిపోటు దొంగ యను సంగతి నేను మొట్టమొదటనే గ్రహించితిని!" అనియెను.

అమరేంద్రునకుమాత్రమా విషయమునం దెంతమాత్రమును విశ్వాసములేదు. అతడు తనలో—"కాహియా పోలీసువారి బాధల బడజాలక తప్పించుకొనుటకై లోచనుని పేరు చెప్పివైచినాడు.

లోచనుడా గుట్టము నెవ్వరికో యొసంగి యిప్పుడే తిరిగి వచ్చెనని కుంజ చెప్పినదికాదా! వాడా రాత్రి యంతయును దాగియే యుండెను. కుంజ యాతని రహస్యముగా గాచుకొనియే యుండెను. అట్టి స్థితిలో జందననగరారణ్యమునం దున్నవాడు హౌరా ప్రాంతమున బందిపోటు గొట్టుట యెట్లు! నిశ్చయముగా దొంగతనము చేయువాడింకొక డెవ్వడో యుండితీరును” అని స్థిరపఱచుకొనియెను.

ఫతేఆలీ యిక హౌరా స్టేషనులో దినములు గడపక మహో త్సాహముతో గాహియాను వెంటబెట్టుకొని మిగుల నాడంబరముగా గలకత్తాకు బయలుదేరెను. అమరేంద్రుడు కూడ నాతని ననుసరించి పోయెను. కలకత్తా చేరిన తరువాత ఫతేఆలీ యుపరాధియగు కాహియాను పెద్దస్టేషనునకు దీసికొని పోయెను. చాల గష్టపడి యలసిపోయిన యమరేంద్రుడు విశ్రామార్థమై యమూల్యు నింటికి బోయి యచ్చట నెమ్మదిగా నుండెను.

## ప్రకరణము 26

లోచనుడే ఈ విధముగా దారులు గొట్టువాడని ఫతేఆలీ సాహేబు సంపూర్ణ విశ్వాసముతో నుండెను. కాని యమరేంద్రునకు మాత్రమా విషయమునం దెంతమాత్రమును నమ్మకములేదు. అయినను నాతడు తన యుద్దేశమునుబట్టి వాదించుచు బత్తేదారునకు విరక్తి కలిగింప దలచుకొనలేదు. ఇంతేకాక యీ విషయమున వాదించినచో గుంజచే సాక్ష్యము చెప్పింపవలసి వచ్చునని యాతడు భయపడియెను. న్యాయస్థానమున నిలిపి కుంజచే సాక్ష్యమిప్పించుట యమరేంద్రున కెంతమాత్రము నిష్టములేదు.

ఆ కారణముచే నమరేంద్రుడు ఫతేఆలీ యభిప్రాయముతోనే యేకీభవించినట్లుండెను. కాని యాతడు తనలో—“లోచనుడు దొంగతనము చేయుటలేదు. ఆ దొంగకు గుట్టమును సిద్ధముచేసి

యొప్పగించుటయే యాతనిపని—ఆ యశ్వము నధిరోహించి పటా టోపముతో బోయి పాంథుల నదలించి ధనము కొల్లగొట్టువా డింకొకడు వేఱుగా నున్నాడు. వాడే యీ దళములో ప్రధానుడు, ఎన్నటి కైనను విశ్వప్రయత్నముచేసి వెదకి గాలించి యెట్లయిన నాతని బట్టు కొనవలయును. ఆపని నేనే చేసితీరెదను ” అని ప్రతిజ్ఞ చేసికొనియెను.

ఫతేఆలీ లోచనునిం గూర్చి యనేక రీతుల ననుసంధానము గావించుచుండెను. కాని వాని యీగడ యేమియును దెలియవచ్చుట లేదు. మందులవాళ్ళ గుంపింకను జందననగర ప్రాంతమునందే యున్నది. ఫతేఆలీ యచ్చటకు బోయి విచారించెను. ఆతడాగుంపులో నొక్కొక్కరినే వేఱు వేఱుగ బిలిచి యడిగెను. లోచను డెక్కడికి బోయెనో యెవ్వరును గూడ జెప్పజాలకపోయిరి. లోచనుడు చాల దినములనుండి తమ తావునకు వచ్చుటయే లేదని యందఱు నేక వాక్యముగా జెప్పిరి. “ అట్లయినచో మీకిప్పుడు యజమాని యెవ్వరు ?” అని ఫతేఆలీ ప్రశ్నించెను. “ మానాయకురాలు కుంజ !” అని యందఱును దెలియజేసిరి.

ఫతేఆలీ తనలో—“ సుగుణమణియగు కుంజ యిప్పుడు చోర సంఘమునకు నాయకురాలయినదా ?” అని యాశ్చర్య పడియెను. ఇందాశ్చర్య పడవలసిన పనియేమున్నది? కుంజ చాల గుణవంతురాలు, బుద్ధిమంతురాలు ; ఆమె యందఱ నాత్మీయులంబోలె నాదరించు దయామయురాలు, ఆ బాలిక వనవిహంగివలె నానంద విహారిణి— అమృత ప్రసూనవల్లరివలె నఖిలామోదాయిని_ఆ దేవి ధర్మపాలనమునం దనంత ప్రేమమయ దివ్యమూర్తి—అధర్మ శాసనమునం దతిదారుణ సింహినీమూర్తి—ఆమె నందఱును ప్రేమించుచుందురు ; ఆమెం గాంచి యందఱును భయపడుచుందురు. అట్టి శాంతురాలు స్వతంత్రురాలు సమర్థురాలు నాయకురాలగుట వింతయేమున్నది ! కుంజమే యిప్పుడా గుంపువారి కందఱకును సర్వాధికారిణియై యుండెను.

పాపము వారందఱును మేకలవలె సాధుజీవులు. రాక్షసుడగు లోచనుడును, ఢాకినియగు నా ముసలిదియు జేయుచుండు దుండగముల వలన నప్పు డప్పుడు వారి శాంతిజీవమున కలజడి కలుగుచుండెను. అయినను వారాబలవంతుడగు లోచనుని నాయకత్వమునకు లోబడియుండి వాడు చెప్పిన పనులు చేయుచుండిరి. చాల దినముల నుండి వాడు రాకుండుటచే నిప్పు డాతనికి పుత్రికాసదృశయగు కుంజను వారు నాయకురాలిం జేసికొనిరి. వారి కన్నులకు కుంజ బాలికవలె దోచుటలేదు—సాక్షాత్కరించిన దేవీమూర్తివలె నగపడుచుండెను.

ఫతేఅలీ యచ్చటివారి మాటలయం దించుకంతయును నమ్మకము లేకపోయెను. ఆత డచ్చట సమర్థులగు రక్షక భటులను గావలియుంచి తిరిగి వచ్చుచుండగా త్రోవలో నా ముసలిది యాతనిం గాంచి ప్రక్కకు దప్పించుకొని పోజూచుచుండెను. అప్పుడు ఫతేఅలీ యామెం గాంచి భీకర స్వరముతో—"ఆగుము!" అని యదలించెను.

ఆ ముసలిది యట్లే నిలువబడి వడకుచు—"ఎందులకు బాబూ!" అనియెను.

ఫతే—పనియున్నది.

ముస—ముసలిదానితో నేమిపని బాబూ!

ఫతే—నీవు పేరికే ముసలిదానవేగాని పింకపుష్టి తగ్గినదానవు కావు—దాని కేమి—లోచను డేమైనాడు?

ముస—అదేమో—నాకెట్లు తెలియును? మీకుంజ నడుగలేదా?

ఫతే—ఆమె నాకగపడలేదు.

ముస—అమరబాబూ రాలేదు కాబోలును!

ఫతేఅలీ నవ్వుచు—"ముసలీ! నీసంగతి నాకు దెలియును. నీవెందులకు దాచెదవు? లోచనుని బట్టి యొప్పగించినచో నీకు నూఱురూపాయలు బహుమాన మిప్పించెదను. నిజము చెప్పుము!" అనియెను.

ముస—బాబూ! మీరు పోలీసువారు, తలలుమార్చి తలలు పెట్టగలరు, దరిద్రుని భాగ్యవంతునిగా జేయగలరు—మీకు నాయం దింత దయగలిగినదిగాని మీరిచ్చు కాసులను మూటగట్టుకొనుటకు నాకు గట్టిబట్టయైనను లేదు!—నన్నెందుల కాడించెదరు బాబూ! నాకేమి తెలియును!

ఫతే—మీ లోచనునకు గుఱ్ఱమున్నదా?

ముస—దినదినము నూరూర దిరుగు దేశద్రిమ్మరులమగు మాకు బుట్ట తట్ట, కుండ, మండ తీసికొని పోవుటకు గుఱ్ఱములును, గాడిదలును గూడ నుండక తప్పునా?

ఫతే—మీ మాటకాదు—లోచనునిమాట యడుగుచున్నాను.

ముస—వానిమాట వానినే యడుగుడు!

ఫతే—వాడేమైనాడనియే నిన్నడుగుచున్నాను.

ముస—బాబూ! మీరధికారులు గనుక యేమన్నను దప్పు లేదు. ఈమాట నేనే మిమ్మడిగినచో మీరేమి చెప్పుదురు?—ఏమియు నెఱుగనిముండ నెంతయడిగిన నేమిలాభము?

ఫతేఅలీ కోపముతో—"మొండిముండా! మీరందఱును గూడ దొంగలే! మిమ్మందఱను గూడ బంధించి తీసికొనిపోయి జైలులో బడద్రోయవలయును. ఎంత పొగరు! ఎంత నిర్భయము! నే నెవ్వడ ననుకొన్నావు?" అని యదలించెను.

ముస—మీరు పత్తేదారులని యెఱుగుదును. మీరనిన దొంగలు భయపడవలయును—నాకేమిభయము? మీరు మమ్మందరను గూడ దొంగలనుజేసి జైలులో వేయించినచో నూరూరును దిరుగకుండ కష్టములేకుండ నొక్కచోటనే పడియుందుము!

ఇక దానితో నేమిమాటాడినను లాభములేదనియు, నెట్టి నిదర్శనములును లేకుండ దానిని బట్టుకొనుటవలన బ్రయోజనము లేదనియు నూహించి ఫతేఅలీ విసుగుతో నటనుండి వెడలిపోయెను.

# ప్రకరణము 27

ఇంటికి వచ్చిన తరువాత నమరేంద్రుని వలన నమూల్యు డన్ని సంగతులును వినియెను. అత డాశ్చర్యముతో నమరేంద్రు ననేక విధముల ప్రశంసించెను. ఆ కారణం బంధురాలై యనేక విధముల నమరేంద్రునకు సాయపడుచున్న కుంజను గూర్చి యాతడు మెచ్చుకొనియెను. అప్పు డమూల్యుడు నవ్వుచు—"అమరా! అట్లయినచో మన పత్తేదారు సాహేబు లోచనుడే దొంగయని యాతని బట్టుకొనుటకై తల్లడిల్లి పోవుచుండుట గ్రుడ్డినమ్మకమేనా!" అనియెను.

అమ—ఔను. కేవలము నంధవిశ్వాసమే—ఆ రాత్రి యంతయును గుంజ యాతని గాచుకొని యున్నది. వాడా గుట్టమును దీసికొనిపోయి యరగంటలో మరలివచ్చెను. ఆ యరగంటసేపు మాత్రమే యా రాత్రి వాడు కుంజ కంటి కగపడకుండ నుండెను. ఇంతలో వాడు హౌరాబయటికివచ్చి మరల జందననగర ప్రాంతమునకు బోగలుగునా?

అమూ—ఎంతమాత్రమును బోజాలడు. వ్యవధి యేదీ? ఎంత వేగముగ నడచినను రెండు గంటలకు దక్కువ పట్టదు.

అమ—ఔనా? అందుచేతనే లోచనుడు దొంగతనము చేయుట లేదని నేను చెప్పుచున్నాను.

అమూ—ఔను—వాడు చేయుట యసంభవమే.

అమ—కావుననే నేనింత నిశ్చయముగా జెప్పుచున్నాను. కేవలమును గుట్టమును సిద్ధముచేసి యొప్పగించుటయేకాని దొంగతనముచేయుట లోచనుని పనికాదు—ఆ పనికి మఱియొక డుండితీరవలయును.

అమూ—వాడెవ్వడో యింతవఱకును దెలియుటయేలేదు ఇట్టి స్థితిలో నీవిక నేమిచేయ దలచుకొన్నావు?

అమ—తలచుకొనుట కేమున్నది ? తప్పకుండా నేనాదొంగను బట్టుకొని తీరెదను.

అమూ—ఎట్లు ?

అమ—లోచను డగపడకుండ బాఱిపోయినను నాతని గుఱ్ఱ మింకను నాగుంపులోనే యున్నది. ముసలిదికూడ నచ్చటనే యున్నది. అందుచే నాదొంగ మరల దొంగతనము చేయకమానడు. ఇంకొక దొంగతనము చేసినచో మఱివాడు పట్టుపడక మానడు.

అమూ—అట్లయినచో నింకను వాడు దొంగతనము చేయు నని యేనా నీనమ్మకము ?

అమ—ఔను—నిశ్చయముగా.

అమూ—కాహిరూ యిప్పుడు కారాగృహమునం దుండెను గదా !—ఆ వస్తువులం దీసికొనిపోవువా రెవ్వరున్నారు ?

అమ—వాడు లేనంత మాత్రమున బని యాగిపోవు నను కొంటివా ? ఈపాటికి వారన్ని యేర్పాటులను జేసికొనియే యుందురు. చతురంగములో నొక బంటు చచ్చినంత మాత్రమున నాట కట్టిపోవునా ?

అమూ—అవును. నీ యుద్దేశముకూడ నూరక త్రోసివేయ దగినదికాదు.

అమ—మిత్రమా ! నేను జోస్యము చెప్పుచున్నాను వినుము—ఆ చందననగర ప్రాంతమునందే—ఈ నడుమనే మఱియొక దొంగ తనము జరుగగలదు—నామాట నిశ్చయము !

అమూ—నీవు దైవజ్ఞునివలెనే యున్నావు. కాని యేకారణ మునుబట్టి నీవట్లూహించితివి ?

అమ—ఆ మందులవాళ్ళింకను నచ్చటనే యున్నారు. గుఱ్ఱము కూడ నచ్చటనే యున్నది. కావున జందన నగరమున కైదాఱు క్రోశముల దూరము లోపున మరల నొక బందిపోటు జరుగకమానదు.

అమూ—సరే—అట్లే జరగుననుకొందము—దానికి ప్రతీకారము నీవేమి చేయ దలచితివి?

అమ—ఈసారి యా గజదొంగను బట్టుకొనుటకై యొక పన్నాగమును బన్నవలయును.

అమూ—ఏమి చేయవలయునో స్పష్టముగా జెప్పరాదా? రహస్య మెందులకు?

అమ—మనమిరువురమును జమీందారులవలె వేషములను వైచికొని యొక పల్లకిపై నెక్కి యర్ధరాత్రివేళ బయలుదేఱి యా ప్రాంతమునుండియే రావలయును. ఒకానొక జమీందారు కలెక్టరు దొరవారిని దర్శించుటకై హుబ్లీకి బోవుననియు, నాతడు విశేషముగ జవాహరితో బయలుదేఱుననియు ముందుగనే ప్రకటింపవలయును. ఈ సంగతి యా దొంగకు క్రమముగా దెలియక మానదు. అప్పు డాతడు సాహసించివచ్చి మనల నాక్రమింపక మానడు.

అమూ—అట్లయినచో నీసారి తప్పకుండ దొంగ దొరకిపోవుననియేనా నీ యుద్దేశము?

అమ—నేను చెప్పినట్లుగా బనిజరగి నాయూహయే సరియైనచో, నిశ్చయముగా దొంగను బట్టుకొనగలమని యే నాదృఢవిశ్వాసము.

అమూ—అట్లయినచో మన మెప్పు డీపనిలో బ్రవేశింపవలయును? నేను నీతోగూడా నెప్పుడు రమ్మనిన నప్పుడు వచ్చుటకు సిద్ధముగనే యున్నాను.

అమ—నేనొకసారి చందననగరమునకు బోయి యా గుంపువాళ్ళందఱు నెట్లుండిరో యచ్చటి విశేషము లేమియో ముందుగా దెలిసికొని రావలసియున్నది.

అమూల్యుడు మందహాసము చేయుచు—"గుంపువాళ్ళను గాదు—నీకొకసారి కుంజను జూచిరావలయునని యున్నది!" అనియెను.

అమరేంద్రు డప్రతిభుడై—"అమూల్యా! నీవు నాకు ప్రాణబంధుడవు—నీకంటె నాకు గావలసినవా రెవ్వరున్నారు?

నీయొద్దగూడ దాపరిక మెందులకు ? నిజము చెప్పుచున్నాను. సుందరీ మణియు, సుగుణమణియు, సుఖజీవన చింతామణియునగు నాకుంజను నేను నామనఃపూర్వకముగ ప్రేమించియున్నాను—కాని—కాని—కాని—" అనియెను.

అమూ—అమరా ! నీవు గుణజ్ఞుడవు—కృతజ్ఞుడవు—నీహృదయము నేనెఱుగనా ? నీవు సందేహింప నక్కఱలేదు ! కుంజ నిజముగా మందులబాలిక మాత్రము కాదని తోచుచున్నది. ఈ మందులవాళ్ళు తఱచుగా శిశువుల నెత్తికొని పోవుచుందురని నేను వినియున్నాను. కుంజకూడ నట్టి యపహృత బాలికయే యైయుండవలయును. ఆమెను జూచునప్పటినుండియు నాకొక పూర్వచరిత్రము స్మృతికి వచ్చుచున్నది.

అమరేంద్రుడా మాటవిని యాత్రముతో—" ఆ సంగతి యేమో చెప్పుము !" అని యడిగెను.

అమూ—కాదు—కాదు—నేనే పొరపాటు పడితిని. అది కాదనుకొనియెదను.

అమ—నీమనసులో నెట్టి యనుమానము కలిగినదో చెప్పుము ! నేను గూడ వినియెదను.

అమూ—చాలకాలము క్రిందట మాయాత్మీయులయింట నొక యాడు శిశువు దొంగలచే నపహరింప బడినది. అప్పటికా బిడ్డకొకయేడు గడచి రెండవ యేడు జరగుచుండెను. కుంజను నేను మొట్టమొదట జూచినప్పుడా బిడ్డయే యీయామెయైయుండునా యని సందేహించితిని.

అమ—కుంజను జూచి నీవేకారణముచే నట్లనుకొంటివి ? ఊరక సంశయము కలుగదుగదా ?

అమూ—ఆ బిడ్డతల్లిని నేను బాగుగ నెఱుంగుదును. ఆమె పోలిక కొంతవఱకు కుంజయందు నాకగపడినది.

అమ—వారేజాతివారు ?

అమూ—అంత తొందర పడియెదవేల ? ఒకవేళ నిజముగా కుంజ వారిపిల్లయే యైనయెడల నీవామెను పెండ్లియాడుట కెట్టి యాటంకమును లేదు.

అమరేంద్రుడు కొంతసేపటివఱకు నూరకుండి—“ అమూల్యా ! నీయాత్మీయు డంటివిగదా ! ఆతనిపేరేమి ?” అని ప్రశ్నించెను.

అమూ—ఆనందకుమార వసువు.

అమరేంద్రుని యానందమునకు బరిమితి లేకపోయెను. అదృష్ట వశమున కుంజ వారిబిడ్డయే యైనచో నాత డామెను పెండ్లియాడ వచ్చును. కుంజ మందులబాలిక యైనప్పుడే యమరేంద్రు డామెను ప్రేమించెను. అవ్యాజప్రేమ కన్వయ మర్యాదలతో బనియేమున్నది ? శంతనుడు దాశకన్యను ప్రేమింపలేదా ? కుంజకును, నమరేంద్రునకును బ్రథమ దర్శన సమయమునందే ప్రేమోదయ మయ్యెను. ఆ ప్రేమ యవ్యాజమైనది, అనిర్వాచ్యమైనది, అమూల్యమైనది—ఆ ప్రేమ చేతనే వారిరువురు నాత్మీయులై పోయిరి : ఐక్యమైపోయిరి. ఇక కుంజ మందులబాలికయైన నేమి ? అమరేంద్రుడు కుంజ కాత్మబంధు వినాశకు డైన నేమి ? ఆ యిరువురి హృదయములందును భిన్నభావము లేదు.

అమరేంద్రుని హృదయము కుంజను మరల నొకసారి చూడ వలయునని కుతూహల పడుచుండెను. ప్రణయభరాక్రాంత హృదయు డగు నాతని తలపై గార్యభారముకూడ నున్నది. అందుచే నమరేంద్రు డాదినముననే చందన నగరమునకు బ్రయాణమైపోయెను. ఆ దొంగను గూర్చిన విశేషములను దెలిసికొనవలయుననియు, నాగుట్టము మందుల వాళ్ళ డేరాలయొద్ద నింకను మున్నదో లేదో చూడవలయుననియు, నాముసలిముండ యేమైనదో, యేమి చేయుచున్నదో కనుపెట్టవలయు ననియు, దొంగకును లోచనునకును నేమైన మాటలు జరగుచున్న వేమో గ్రహింపవలయు—ఇన్ని యూహాలతో నాతడు చందన నగర మునకు బోయెను.

# ప్రకరణము 28

అమరేంద్రుడు ప్రయాణమై పోవుచు మనసులో—"కుంద యొంతమాత్రమును మందులవాలిక కాదు. ఆ రమణీమణి సుందర వదన మండలమును గాంచినంతనే యీ సంగతి స్పష్టముగా బోధపడు చున్నది. ఇంతేకాక కుంజకు గూడ దాను మందులదానను గానని తెలియును—అట్లయినచో నామె యెవ్వరిబిడ్డ? ఏజాతి? ఈ గుంపులో నెట్లు చేరినది? ఎంత శ్రమపడియైనను ప్రయత్నముచేసి ఈ విషయములను స్పష్టముగా దెలిసికొనవలయును—కాని, యిది కేవలమును స్వార్థపరత్వము కాదా? ఆమె యెవ్వరైన నాకేమి? నేనామె చరిత్రమును దెలిసికొనుట కేల ప్రయత్నింపవలయును? నామనసునం దేదియో యాశ కలుగుచున్నది. ఇది యనుచితము కాదా? నావిషయమునం గుంజ యేమైనను నాశపడినదా? ఏయాశచే నామె రెండుసారులు ప్రాణదానము చేసినది? ఏయాశచే నాప్రయత్నముల కన్నిటికిని దోడు చూపుచున్నది? ఏయాశచే నాత్మీయులను త్యజించి నన్ననుసరించుచున్నది? ఆమె కేయాశయును లేదు. ఆ రమణీరత్నము కేవలమును ప్రేమమయమూర్తి—అందుచేతనే నేనామె శుభము నాకాంక్షించి, యామె సత్యచరిత్రమును గ్రహించి, యీ నీచ జీవనమునుండి యామెను బూర్వోన్నత స్థితికి దీసికొని రావలసిన బాధ్యత నాయందున్నది. అట్లు చేయకున్నచో నావంటి యకృతఘ్నుడును, పాషండుడును మఱియొకఁడెవ్వడైన నుండునా?" అని భావించుకొన దొడంగెను,

మందులవాండ్రిప్పుడు చందన నగర ప్రాంతమునందలి విశాల మగు నొక బయలునందు డేరాలను వైచుకొని యుండిరి. ఈసారి మాత్రము వారు సంపూర్ణ స్వతంత్రులై యుండలేదు. కొంతమంది పోలీసువారు జాగరూకులై వారి చర్యలను గనుపెట్టి చూచుచు గావలి కాచుకొని యుండిరి, వారి కిప్పుడు మునుపటివలె దమ యిచ్ఛ వచ్చినచోటికి బోవుట కవకాశము లేదు,

అమరేంద్రుడు వచ్చుటకు బోవుచున్నప్పటికి ముందుగా నాతనికా బాలుడు దగపడియెను. వాడప్పుడేమియో తినుచు తిరుగుచు బటాలున నమరేంద్రుని గాంచి యాతని చెంతకు బరుగెత్తుకొనివచ్చి- "బాబూ! కుంజ నాకు రూపాయ నిచ్చినది. ఆమెయే లేక యున్నచో నాదినమున లోచనుడు మీజీవితమును దుదిముట్టించియే యుండును!" అనియెను.

అమరేంద్రుడు నవ్వుచు—"మీలోచనునివంటివారు పదిమంది యైనను నన్నేమియు జేయజాలరు!" అనియెను.

బాల—ఔను బాబూ! వాడు మీవల్లనే భయపడి యీ దేశమును విడిచి పాఱిపోయినాడు.

అమ—ఆలాగా? ఎక్కడకు బోయినాడో నీకేమైనను దెలిసినదా?

బాల—నాకు దెలియదు బాబూ! భయముచే దిరిగి చూడకుండ నేదేశమునకు బాఱిపోయినాడో!

అమ—నాకు నమ్మకములేదు. మిమ్మందఱను విడిచి వాడెక్కడకు బోగలడు? ఈ చుట్టుపక్కలనే యెచ్చటనో దాగి యుండును.

బాల—ఏమో బాబూ! అది యెట్లు తెలియును? చాల దినములనుండి వాడిచ్చటికి వచ్చుటలేదు.

అమ—సరే. కాని వానిసంగతి మీ ముసలిది యేమియును జెప్పుటలేదా?

బాల—మీరాదినమున నామెను బట్టి బాధించి బంధించి పోయితిరి—ఇప్పుడు మీరు దానికంట బడినచో నది యెంతపనియైనను జేయకమానదు.

అమరేంద్రుడు నవ్వుచు—"చేయునేమి? అది యెంతకైనను దగినదియే—నేనిప్పుడు దానిని జూడవలయుననియే పోవుచున్నాను" అనియెను.

బాల—పోవలదు బాబూ! అది చాల కోపముతో నుండి పోవుచున్నది. అది కేవలము డాకినియె.

అమ—భయములేదు. నాయొద్ద డాకినీమంత్ర మున్నది. కుంజ యెక్కడ నున్నది?

బాల—డేరాలో నున్నది.

అమరేంద్రుడిక నాబాలునితో నేమియు మాటాడక డేరాల వైపున కభిముఖుడై పోవుచుండెను. అప్పుడా బాలుడు వికృత వదనముతో నాతని వెక్కిరింప నారంభించెను. అమరేంద్రుడు రెండడుగులు నడచి యాకస్మికముగా వెనుకకు జూచెను. వెంటనే యా బాలు డెప్పటివలె జక్కగ నిలువబడియెను. అప్పు డమరేంద్రుడు దాతిసం గాంచి తీవ్ర స్వరముతో—"పోకిరుపోతా! నాసంగతి యెఱుగవు కాబోలును? ఈ చేతికఱ్ఱతో నీబుఱ్ఱ పగులగొట్టివైచెదను జాగ్రత్త!" అని యదలించెను.

ఆ బాలుడు భయప్రకంపితుడై యెక్కటి పరుగున బాఱి పోయెను. అమరేంద్రుడును డేరాల వంకకు బోవుచు దనలో—"ఈ కట్టివాని చర్యలంబట్టి చూడగా నిక్కడివా రందఱును నాయెడల విరక్తులై యున్నట్లగపడుచున్నది. లోచనుడు నాభయము చేతనే దేశాంతరములకు పాఱిపోయెనని వీరు భావించుచున్నారు. పోలీసువారు తమ చుట్టును దిరుగుచుండుట నామూలముననే యని వీరి యనుమానము. ఎప్పటికైన దమ్మందఱను నేనే జైలునకు బంప దలచి ప్రయత్నించుచుంటినని వీరు భయపడుచున్నారు. ఇంతేకాక యా ముసలిముండ వీరందఱికిని నాపై గోపము కలుగునట్లు చేసి యుండును. దానిని నేనాపడవలో నాక్రమించి బంధించి పోయితిని గాదా! అందుచే నారాక్షసికి నన్ను మ్రింగివేయవలయు నన్నంత కోపమున్నది. అది వీరితో నావిషయమున నేమేమియో చెప్పి యుండఱకును నాపై నసహ్య భావము కల్పించి యుండును. కుంజయే

లేకయున్నచో నేనిట నిరసాయముగా నుండుట కవకాశమే లేక పోవును. కుంజ యనిన వీరందఱకును భయమే. అందుచే వీరెవ్వరును నాకు వ్యతిరేకముగ బ్రవర్తించుటకు సాహసింప జాలకున్నారు" అని భావించుకొనుచు బోవుచుండెను.

అమరేంద్రుడు డేరాలయొద్దకు బోవునప్పటి కటనున్నవా రందఱు నాతనిం గాంచి ఆత్రముతో దప్పించుకొని పోయిరి. కుంజ యెటనున్నదని యాతడొకరిద్దఱి నడిగెను. కాని వారెట్టి యుత్తరము నెప్పకుండ బాఱిపోయిరి. తన రాకమూలమున నచ్చటివా రందఱిలోనను నిశ్శబ్దముగ గందరగోళము పుట్టినదని యమరేంద్రు డూహించుకొనియెను.

కుంజ యగపడకుండుటచే నమరేంద్రు డేమియుం దోచక యొకచో నిలువబడిపోయెను. అతని కప్పుడు మహారణ్యములో ఘాతుక మృగమధ్యమునం దున్నట్లుండెను. అతడు నలుదెసలం గాంచుచు సంజీవనీ లతికయగు కుంజకొఱకు వెదకుచుండెను. ఇంతలో నొక చిన్న గుడ్డ గుడారమునందు గూర్చుండి కుట్టుపని చేసికొనుచున్న కుంజ వనదేవతవలె నాడేనుండి వెడలి వెలుపలికి వచ్చెను. ఆ యుత్తర క్షణమునందే యామె సుస్నిగ్ధ తరళ కటాక్షము లమరేంద్రునిపై బ్రసరించెను. అతడా లీలాపాంగ శృంఖలములచే బంధింపబడినవానినుంబోలి నిశ్చల నయనములతో నామె సుందర వదనముం దిలకించుచు నచ్చటనే నిలువబడిపోయెను. చిన్ని చెక్కులపై చిఱునవ్వు చిందులాడుచుండ గునగున నడచుచు గుంజ యుప్పు డమరేంద్రుని చెంగటికి వచ్చెను.

అమరేంద్రు డానందోద్వేగముచే బ్రకంపితంబగు కంఠస్వరముతో—"కుంజా! క్షేమముగ నున్నావా?" అని కుశలప్రశ్న చేసెను.

కుంజ యల్లే మందహాసముతో దల యూచుచు హృదయ భావమంతయు నుట్టిపడునట్లుగా—"ఆ!" అనియెను.

అమరేంద్రుడు డతృప్త నయనములతో నామెవంక దిలకించుచు- "కుంజా! నిన్ను జూడవలయుననియే నేనిచ్చటికి వచ్చితిని" అనియెను.

కుంజ కించిదవనతవదనకమలయై కోమల మధుర స్వరముతో- "ఏమైన బనియున్నదా?" అని ప్రశ్నించెను.

అమరేంద్రుడు డప్రతిభుడై తనలో—"పనియేమున్నది? ఒకసారి నీమోహనాకారమును దర్శించుటయే—ఒకసారి నీ మధుర భాషణముల నాకర్ణించుటయే—ఒకసారి నీప్రేమానందరసతరంగముల నోలలాడుటయే—ఇంతకంటెను నాకు బనియేమున్నది?" అని యనుకొని ప్రకాశముగా—"పనియున్నది కుంజా! ఒక ముఖ్యవిషయమును గూర్చి నీతో మాటలాడవలసి యున్నది" అనియెను.

కుంజ—అట్లయినచో దయచేయుడు!

అని చెప్పి చటాలున వెనుకకు మరలెను. అమరేంద్రుడును నాగమణీమణి యడుగులలో నడుగులను వైచుచు బయలుదేరెను. అట్లామె యా డేరాల కించుక దూరమునందున్న చెట్లగుంపులోనికి బోయి గిరుక్కున మరలి యమరేంద్రునిం గాంచి—"మీరిచ్చట నించుకసేపు నిలిచి యుండుడు! నేను పోయి యిచ్చట గూర్చుండుట కేమైనను దెచ్చెదను!" అనియెను.

అమరేంద్రు డేమియు నక్కఱలేదని చెప్పబోవు చుండగనే కుంజ యొక్కపరుగున డేరాల యొద్దకు బోయెను. అమరేంద్రుడు డప్రతిభుడై యచ్చటనే నిలువబడి పోయెను అతడు తనలో—"కుంజ హృదయ మిప్పటికిని నాకు స్పష్టముగా బోధపడుటలేదు. ఎంతచనవు చూపుచున్నను, నెంతటి ప్రేమను బ్రదర్శించుచున్నను నేమాటయనిన నేమనుకొనునోయని ఈమెతో సంభాషించునప్పుడు నాకే భయముగు చున్నది. ఈమె సర్వస్వతంత్రురాలు—ఈ సుందరీమణి కుసుమ కోమల హృదయమున గూడ దీవ్రభావము కానవచ్చుచున్నది,

ఈమెకు నాయందకారణముగ నింతదయ యేలకలిగినది! ప్రేమ మూర్తియగు నీమెకు జీవకారుణ్యము సహజ స్వభావమే యైయుండును. ఊరక ప్రేమోన్మాదమునచే నీమె నావలెనే నన్ను ప్రేమించుచున్నదని వెఱ్ఱిపడుచున్నాను. కాదు—కాదు—ఈమె నన్ను హృదయ పూర్వకముగనే ప్రేమించినది నావలెనే ప్రేమించినది. అపరిచితయగు వనసుందరి యగుటచే నీమె హృదయమును నేనే గ్రహింపజాల కున్నాను. ఆనాడు పాడిన పాటలో నీమె హృదయమంతయు మూర్తీభవించి నాహృదయ ఫలకమున ముద్రితమై పోయినది. ఆ గీతామృత సాగరము నందలి ప్రతి తరంగమునందును నామూర్తియే యానంద తాండవము చేయుచు నిప్పటికిని నాకన్నులలో ప్రతి బింబించుచున్నది—ఆ మూర్తియే యీ మూర్తి! నిశ్చయముగాన నీమె ప్రేమించి యున్నది—నావలెనే ప్రేమించి యున్నది—అట్టి ప్రేమమయ విలాసములచేతనే—అట్టి ప్రేమమయ కటాక్షములచేతనే—అనంత ప్రేమమయ దివ్యక్షేత్రమునకు నన్నీమె యాకర్షించుచున్నది—కాని—నేనెవ్వడను? ఈమె కేట్టి యుపకారము చేసితిని! ఈమె యూరక నన్నేల ఋణస్థునిగా జేసివైచుచున్నది? ఎప్పటికైన నేనీ ఋణమును దీర్చుకొనగలనా?" అని భావించుకొనుచు చిత్రప్రతిమ వలె నిశ్చేష్టుడై యచ్చటనే నిలువబడి యుండెను.

కుంజ మూడు నిమిషములలో నొక కంబళమును దీసికొని పరుగు పరుగున నచ్చటికివచ్చి యొక చల్లని చెట్టునీడ నాకంబళమును బఱచి మృదుస్వరముతో—"దయచేయుడు!" అనియెను.

## ప్రకరణము 29

అమరేంద్రుడా కంబళముపై గూర్చుండెను. కుంజ యవనత వదనయై యచ్చటనే నిలువబడి యొక తరుపల్లవమునుగోసి దానిని దన నఖాంకురములచే శతఖండములుగా జిదుము చుండెను. ప్రయోజన

మేమున్నది ? తోచనిపని !—ప్రప్రథమమున ననిర్వేద్యమగు హృదయ భావము క్రమక్రమముగా ననుభవవేద్య మగుచుండుటచే నమరేంద్రుని గాంచినప్పుడెల్ల నామెకు లజ్జా సంకోచము కలుగుచుండెను. అడవి లేడివలె స్వచ్ఛన్నరీతి మసలుచుండు నామె కిప్పు డడుగడుగునకు నభ్యంతరమే కలుగుచుండెను. వనవిహంగినివలె యథేచ్ఛముగ భాషించుచు నామె కిప్పుడు పలుకు పలుకునకును సంశయమే కలుగు చుండెను. సంపూర్ణ స్వాధీనయగు నామె క్రమక్రమముగా బరాధీన యగుచుండెను. తెలియకుండ మారిపోవుచున్న హృదయ పరిణామ మామెకు తెలిసిపోవుచుండుటచేతనే కుంజ యిట్లు సిగ్గుపడుచుండెను. ఆమె హృదయ కోరకము వికసించిన కొలదియు భావపరిమళము లలము కొనుచుండెను. ఆ యభినవామోద పరంపరల మూలముననే కుంజకీ యభినవ పరిణామము కలిగినది ! అందుచేతనే కుంజ యిప్పుడు తోచని పని చేయుచు నమరేంద్రుని సన్నిధిని దల వంచుకొని నిలువబడి యుండెను !

అమరేంద్రుడు మాత్రము సుస్థిర హృదయముతో కూర్చుండ గలిగెనా ? హృదయావేగముచే నాతనికిని నోట మాట లేకుండ బోయెను. చాలసేపటివఱకు నాతడు వెఱ్ఱివానివలె కుంజ మొగము వంక దదేకదృష్టిం గాంచుచు కూర్చుండి యుండెను. కొంతసేపైన తరువాత మృదుస్వరముతో—“ కూర్చుండుము !” అనియెను.

కుంజ కూర్చుండెను—అదేవిధముగ దల వంచుకొనియే కూర్చుండెను. కాని యొక్కమాటయైనను నాడజాలకపోయెను. ఆమె హృదయభావము నమరేంద్రుడు స్పష్టముగా గ్రహింపజాలకపోయెను. గ్రహించుట కాతని కప్పుడు మనశ్శక్తి యెక్కడ నున్నది ? ఏమనుట కును నాతనికి దోచకుండెను. తన హృదయ ఫలకమున ముద్రితములై యున్న నిగూఢ భావముల నన్నిటిని సంపూర్ణముగ నామెకు జదివి వినిపింపవలయునని యమరేంద్రునకు దోచెను. కాని యాత డేమి

చేయుటకును సాహసింపజాలకపోయెను. తుట్టతుదకాతడు మెల్లగా—"కుంజా! ఒక ముఖ్యకార్యముం గూర్చి నేను నీయొద్దకు వచ్చితిని" అనియెను.

కుంజ వంచినతల యెత్తకుండగనే వాల్చినచూపు తేల్చకుండగనే కేవలము నొక్క మాట—గోముల కలస్వనముతో నొక్క టేమాట—"చెప్పుడు!" అనియెను.

అమరేంద్రు డించుక యుత్సాహము దెచ్చుకొని—"ఆ దినముననే కాహియాను బట్టుకొని కారాగృహమునకు బంపించితిమి. ఈ సంగతి నీకు దెలిసియేయుండు ననుకొనియెదను" అనియెను.

కుంజ—ఆ వినియుంటిని.

క్రమముగా నాయిరువురిలోనను సంకోచము వదలిపోవుచుండుటచే సంభాషణము సాగిపోవుచుండెను.

అమ—నీవప్పుడువచ్చి రహస్యమంతయును వెల్లడింపకయే యున్నచో మేమాతని బట్టుకొనజాలకయే పోవుదుము.

కుంజ—ఆ సంగతి యిక్కడివారి కెవ్వరికినిగూడ దెలియదు. వీరు కాహియానే యెఱుంగరు. లోచనునియందుగూడ వీరి కంతగా ప్రేమలేదు. ఈ నడుమ బోలీసువారి రాకపోకలు జరుగుచుండుటచే వారిమూలముననే తమ శాంతజీవనమునకు భంగము కలుగుచున్నదని వీరిలో జాలమంది యాతని నసహ్యించుకొనుచున్నారు.

అమరేంద్రు డాత్రముతో—"సరే! దానికేమిగాని, వీరందరికిని నీయందిష్టమేనా? వీరు నిన్ను గౌరవించుచుందురా?" అని యడిగెను.

కుంజ—నాచిన్నతనమునుండియును వీరికి నేననిన ప్రాణమే—ఇప్పుడు వీరందఱును నన్నే పెద్దగా జేసికొనియున్నారు.

అమ—ఆ ముసలిముండ యేమనుచున్నది?

కుంజ—భయముచే నేమియు ననుటలేదని తోచుచున్నది. కాని మనమిరువురిమీదనుగూడ నామెకు గావలసినంత కోప ముండు ననుమాటమాత్రము నిశ్చయము.

అమ—లోచనునకును దానికిని నేమైన మాటలు జరుగుచుండెనేమోయని నాకింకను ననుమానముగనే యున్నది.

కుంజ—లేదు. నేనామెపై నొక కన్నుంచియే చూచుచున్నాను. కాని నాకు దాని రహస్యము లేవియును దెలియవచ్చుటలేదు.

అమ—ఆ వృద్ధపిశాచి మాత్రము సాధారణురాలు కాదు. ఆ గుడ్డి మచ్చటనే యున్నదా ?

కుంజ—ఆఁ ఉన్నది.

అమ—దానికి నీరును మేతయును వైచి యెవ్వరు సంరక్షించుచున్నారు ? ఆ ముసలిదేనా ?

కుంజ—ఔను.

అమ—అట్లయినచో లోచనుని సంగతి యింతవఱకేమియును దెలియుటయే లేదా ?

కుంజ—లేదు—ఎట్లు తెలియును ? వాడీదేశములోనే యుండడనుకొనియెదను.

అమ—సరే ఆ మాటలకేమి ! నేను నిన్ను గూర్చి యొక రెండు మాటలాడవలయునను కుతూహలముతో నిచ్చటికి వచ్చియున్నాను.

కుంజ విస్మయముతో నమరేంద్రుని మొగమువంక దిలకించెను. ఆమె విశాల నయనేందీవరములనుండి సుస్నిగ్ధావలోకనములు వెలువడి అమరేంద్రుని నేత్రపద్మములలో విలీనము లగుచుండెను అమరేంద్రుని హృదయము తటిద్వేగముతో గొట్టుకొని పోవదొడంగెను. ఆనిమిషము నందే కుంజ మెఱుగుచూపు గిరుక్కున మరలిపోయెను. ఆమెకు మరల నెచ్చటనుండియో వచ్చి సిగ్గు ముంచుకొనిపోయెను. అప్పుడు కుంజ యవనతముఖకమలయై మృదుస్వరముతో—"నన్ను గూర్చియా ! నన్ను గూర్చి యేమి మాటలాడ దలంచితిరి ?" అనియెను.

అమరేంద్రు డించుక సాహసమును దెచ్చుకొని—"కుంజా ! నీవేమోకాని యెప్పటివలె నాతో మాటలాడుటలేదు. నీ వైఖరి యంతయు గ్రొత్తగా నగపడుచున్నది !" అనియెను.

ఆ మాట విన్నంతనే కుంజ తళుకు జెక్కులు పులకించిపోయెను. ఆమె మొగ మెఱ్ఱగ కందిపోయెను. కుంజ కొంతసేపటివఱకు నేమియు మాటాడజాలక యనంతరము మెల్లగా—" మీ కా సందేహ మేల కలిగినదోగాని నేను మునుపటివలెనే మాటాడుచుంటిని. మీరే నాకు క్రొత్తగా నగపడుచున్నారు " అనియెను.

అమరేంద్రు డుత్సాహవేగముతో—" లేదు. లేదు. నీవు నన్ను క్రొత్తవానిగ భావించి మర్యాద చేయుచున్నావు. సంకోచించుచు మాటాడుచున్నావు " అనియెను.

కుంజ యప్పుడు తన గుట్టంతయును వెల్లడియైపోయెనని మఱింత సిగ్గుపడిపోయెను. ఆమె సర్వాంగకములును స్వేదసిక్తములై పోయెను. అప్పు డామె కోమలాధర పల్లవము ప్రకంపిత మగుచుండ నతికష్టముతో నెలుగు తెచ్చుకొని—" ఏమి చేసితిని ! ఏమంటిని ! నేను మునుపటివలెనే యున్నాను " అనియెను.

అమరేంద్రు డనంగీకార సూచకముగా దల త్రిప్పుచు— " లేదు. లేదు !" అనియెను.

కుంజ యట్లే తల వంచుకొని—" ఎట్లుండవలయునో మీరే చెప్పుడు ! ఇక నట్లే యుండెదను. మీమనసు నచ్చునట్లుండుటయే నాకిష్టము " అనియెను.

అమరేంద్రుని హృదయమిక నానందమును భరింపజాలక పోయెను. ఆ యానందోన్మాదముచే నాతడు కుంజ నొకసారి మనసార నాలింగనము చేసికొన బోయెను. కాని యంతలోనే యాత్మ సంయమనముం గావించుకొని యుత్సాహ సూచక స్వరముతో— " కుంజా ! నేనేమి చెప్పుదును ! లేనిపోని మర్యాదలు చేయక మునుపటి వలెనే యుండవలయునని నాకోరిక !" అనియెను.

కుంజ—అట్లే యుండెదను.

అప్పు డమరేంద్రుడు ప్రధాన విషయమున ప్రస్తావము నెత్తి— " కుంజా ! నీసంబంధమున నన్నొకటిరెండు మాట లడుగవలసి యున్నది " అనియెను.

కుంజ చూపులలో నింకను లజ్జాకిరణములు మెఱయుచునే యుండెను. ఆమె యెట్లో మనసు చిక్కబట్టుకొని—"నా సంగతిని గూర్చి నాకింతవఱ కేమియును దెలియదు" అనియెను.

అమ—నేనొకనాడు మూర్షిదాబాదు నగరము మీరాజేగాల యొద్దకు వచ్చిన సంగతి జ్ఞప్తి యున్నదా? అప్పుడు లోచనుడు ప్రసంగ వశమున మీతల్లి మంచికులజాతి యువతియే యనియు గాని మీతండ్రిమాత్ర మొక పత్రకుడనియును జెప్పియున్నాడు. ఆ సంగతి నిజమేనా?

కుంజ—నా చిన్నతనమునందలి సంగతు లేవియును నాకు జ్ఞప్తియందు లేవు. నాతల్లినిగాని, తండ్రినిగాని నేనెన్నడును జూచి యుండలేదు కాని నేనొక లాలాయొద్ద బెరిగితిని. ఆతడు నన్నెంతయో గారాబముతో బెంచెను ఆతడే నాకొక యుపాధ్యాయుని మూలమున బంగాళా భాషయందు బాగుగ వ్రాయను జదువను నభ్యసింప జేసెను.

అమ—ఆతడు హిందూస్థానీవాడుగదా—నీకు బంగాళాభాష నేర్పించుటకు గారణమేమి?

కుంజ—ఏమో! నాకు దెలియదు.

అమ—నీవు బంగాళీల కుటుంబమున జన్మించినదానవని ఆతని కేమైన దెలియునేమో?

కుంజ—ఆ సంగతియును నాకు దెలియదు.

అమ—సరే—ఆతడు నీతండ్రి గాడను సంగతి నీవేవిధముగా దెలిసికొన గలిగితివి?

కుంజ—ఆతని భార్యయే యొకనాడు నాపై గోపముచే మండి పడి నోటికిరాని తిట్లను దిట్టుచు—"ఎఱవు సొమ్ము బరువునకు జేటు—పరుల బిడ్డలకై యెంత ప్రాకులాడిన నేమిలాభము!" అని విసిగి కొనియెను. అప్పుడు నేనామె తనయను గాననియు, నాకు దల్లి

లేదని యదెలిసికొని యటనుండి లాలాయొద్ద కేడ్చుచుబోయి అతని యొకిలో గూర్చుండి జరగిన సంగతి యంతయును జెప్పితిని. అతడు దన్నూఱడించుచు—“ అమ్మా ! ఈమాట నిజమే. నీవు మాబిడ్డవు కావు ; నీవు మందులదానవు ; లోచనుని బిడ్డవు ; నిన్ను బెంచి పెద్ద దానిని జేయవలయునని యాతడే నాకొప్పగించి పోయినాడు ” అని చెప్పెను.

అమ—అలాగా ? అట్లయినచో లోచనునకును, నాతనికిని నెట్టి సంబంధముండెనో నీకు దెలియునా ?

కుంజ—తెలియదు.

అమ—కాహియా నిదివఱ కెప్పుడైన జూచియున్నట్లు నీకు జ్ఞప్తియున్నదా ?

కుంజ—నాచిన్నతనమునం దెప్పుడో యెచ్చటనో యాతని జూచినట్లు నామనసునకు దోచుచున్నది. అతని బ్రథమమున జూచి నప్పుడే నాకీసంగతి స్మృతికి వచ్చినది.

అమ—నీచిన్నతనమునం దాతని నెచ్చట జూచితివో జ్ఞప్తికి దెచ్చుకొనగలవా ? ఆ లాలా గృహమునం దేగదా ?

కుంజ—ఆ సంగతి జ్ఞప్తికి దెచ్చుకొనవలయునని చాల దినములనుండి ప్రయత్నించుచున్నాను. కాని స్మృతి కలుగుటలేదు. కాని నేనొకప్పు డాతని యింటికి బోయినట్లును, నచ్చట నాకంటె బెద్దదియగు నొక బాలికతో నాడుకొన్నట్లును స్వప్నవృత్తాంతమువలె నామనసునకు దోచుచున్నది.

అమ—అది యేయూరో, అయిల్లెట్టిదో బాగుగ బ్రయత్నించి జ్ఞప్తికి దెచ్చుకొనజాలవా ?

కుంజ—ఎన్నియోవిధముల నాలోచించుచునే యున్నాను. ఏమియును స్మృతి కలుగుటలేదు.

అమ—ఆకాలపువా రెవ్వరైన నిప్పుడు మీగుంపులో జేరి యున్నారా ?

కుంజ—ఒక్కటేమాత్రమున్నది. కాని దానివలన నేసంగతి తెలిసికొనుటకును మన కవకాశము లేదు. అది మనకేమియును జెప్పదు.

అమ—అది యెవ్వరు ?

కుంజ—ఇంకెవరు ? లోచనుని ప్రాణమునకు ప్రాణమై సంచరించుచున్న యీ ముసలి ఢాకినియే.

అమ—నీ వెప్పుడైన నీవిషయమునుగూర్చి యీమెతో ప్రస్తావించితివా ?

కుంజ—నేనుమాత్ర మామె నెన్నడు నడుగ లేదు. అడుగుట కంత యావశ్యక మేమి కలిగినది ?

అమ—నీతండ్రి యెవ్వరో, తల్లియెవ్వరో తెలిసికొన వలయునని నీకెప్పుడును కుతూహలమే కలుగ లేదా ?

కుంజ—ఇదివఱ కెన్నడును నాకట్టి యుద్దేశము కలుగ లేదు—కాని—ఇప్పుడు మాత్రము—

అనునంతనే ఆమె సర్వాంగకములును బులకితములై పోయెను ; మనోహర ముఖమండల మెఱ్ఱనై పోయెను. ఇక నామె యేమియు మాటాడక తలవంచుకొని కూర్చుండెను.

అమరేంద్రు డుత్సాహముతో—" కుంజా ! ఏమంటివి ! ఇప్పుడా !—ఇప్పుడు మాత్రము నీ కా కోరిక యేల కలుగుచున్నది ! చెప్పవా ! చెప్పవా !" అనియెను.

## ప్రకరణము 30

కుంజ యేమియును మాటాడజాలకపోయెను. కాని అమరేంద్రు డామె హృదయ భావమును స్పష్టముగా దెలిసికొన గలిగెను. ఆమె తన్ను మనఃపూర్వకముగ ప్రేమించినదని యాతడు గ్రహించు కొనియెను. అందుచే నిప్పుడాతని హృదయమునందలి సంశయ లేశము దూరమైపోయెను. అతడు మరల మరల ప్రేమపూర్ణ స్వరముతో

నా విషయముం గూర్చియే ప్రశ్నింపఁ దొడంగెను. "ఏమి కుంజా! ఇప్పుడు నీ తల్లిదండ్రుల చరిత్రమును దెలిసికొనవలయునని కోరిక కలుగుచున్నదా! ఇన్నాళ్ళనుండియు లేనికోరిక యిప్పుడేల కలుగ వలయును? కారణమేమో చెప్పవా కుంజా!" అనియెను.

అమరేంద్రు డిట్లు విడువకుండ బ్రశ్నించుచుండగా బాపము సిగ్గుచే గొట్టుకొని పోవుచున్న కుంజ యేమని ప్రత్యుత్తరము చెప్ప గలదు? అమరేంద్రుని గాంచినప్పటినుండియే యుద్ధమువలె నిర్మల మగు నా కోమల హృదయమునం దించుక యాశ కలుగుట కారంభమయ్యెను; ఆ భావ మనుభవవేద్యము కాదొడంగెను. అంతకుబూర్వ మామె జీవితమునందా భావమును లేదు; ఆశయును లేదు—అమరేంద్రుని పరిచయ మధికమైనకొలదియు, నాతని మనో భావము బోధ యగుచున్నకొలదియు నా బాలికామణి కాశయు, నుత్సాహమును, వానితో గూడ లజ్జావేగమును వర్ధిల్లి పోవుచుండెను.

అమరేంద్రుని మూలమునవనే యామె కంతటిసిగ్గు! అప్పుడు కుంజ యేదో విధముగా నమరేంద్రునకు బ్రత్యుత్తరము చెప్పుట కొకటి రెండుసారులు ప్రయత్నించెను గాని సిగ్గు నోరదమివైచుటచే నేమియు మాటాడజాలకపోయెను. లజ్జావనతవదనయైయున్న కుంజ యప్పటి చెలువముంగాంచి యమరేంద్రు డానందోన్మాదముచే మనసు నిలుపుకొనజాలకపోయెను. ఆమోహావేశముచే నాతడొడలెఱుంగక యామె కోమల కరపల్లవమును దన కరకమలమున గీలించెను ఆ సుఖ స్పర్శముచే గుంజ యానంద వివశయైపోయెను. అప్పుడామె తనచేతిని వదలించుకొనలేదు. వదలించుకొనుట కామెకు బాహ్యజ్ఞాన మెక్కడ నున్నది? అప్పుడు కుంజ కరపల్లవము సుడిగాలి తాకునం దూలు వెదురాకుంబోలి కంపించిపోవుచుండెను. స్వేదసిక్తంబులగు నామె సర్వాంగకంబులును బులకాంకురములచే నిండిపోయెను. ప్రణయరస నిమగ్నులగు నారమణీమణుల కాగోధూళికాలగ్నమున బాణిగ్రహణము

జరిగిపోయెను. ఏమనుటకును, నేమిచేయుటకును నామెకు సాహసము కలుగకుండెను. అప్పు డమరేంద్రుడు మరల ప్రేమమధుర కంఠ స్వరముతో—" కుంజా ! చెప్పవా ! ఆ కోరిక యిప్పు డేల కలుగు చున్నది !" అనియెను.

అప్పుడు కుంజ మృదులాధర పల్లవమునుండి యస్ఫుట మధుర స్వరముతో—" ఎందుచేతనో నాకే తెలియుటలేదు !" అను మాటలు వెలువడియెను. ప్రేమమయులగు నాసుందరీ సుందరుల సమావేశముచే నాతరుషండము రమణీయోద్యానముంబోలి శోభాసంపన్న మయ్యెను. అప్పు డచ్చట నితరజను లెవ్వరును లేరు. రహస్యముగా మాటలాడు కొనవచ్చునని యే కుంజ యమరేంద్రు నచ్చటికి దీసికొని వచ్చెను. అమరేంద్రు డొకసారి నలుదెసలను బరికించి చూచెను ఎచ్చటను గూడ నెవ్వరు నగపడుటలేదు. ఇక నాత డాత్మసంయమనముం గావించు కొనుట కసమర్థుడైపోయెను. అప్పు డాతడు చటాలున గుంజను దన వక్షమునం జేర్చుకొని యామె తళుకు జెక్కులపై బదిసారులు, నూఱుసారులు, వేయిసారులు ముద్దులు పెట్టుకొనియెను. ఆనంద పరవశయగు కుంజ వదనమండల మప్పుడా గోధూళింబోలి రాగ రంజితమై యపూర్వ రామణీయకముం దాల్చెను.

అతితరంబులై వెలువడు క్రొవ్వేడినిట్టూర్పులచే నాబాలి కామణి యధరపల్లవము ప్రచలితమై పోవుచుండెను ; వక్షోభాగము ప్రకంపితమై పోవుచుండెను. ఆ సుఖసమయమునం దాకస్మికముగ నామె హృదయమున సంకోచము కలిగెను. ఆ సంకోచముచే గ్రుంగి యామె చటాలున నమరేంద్రుని కౌగిలి విడిపించుకొని యతికష్టముతో మనసు కుదురుపఱచుకొని ప్రకంపితంబును ప్రణయ మధురంబును నగు మృదుల స్వరముతో—" నేను మందులదానను—నీచజాతిని—నేను—మీకు దగినదానను గాను—నన్ను క్షమింపవలయును !" అని యామె యొక్కయెదుటున లేచి నిలువబడియెను.

అమరేంద్రుడును హృదయావేగముతో జటాలున లేచి నిస్సంకోచముగా—"కుంజా! నేను నిన్ను పెండ్లియాడెదను—నీకిష్టమున్నదా లేదా? చెప్పుము!" అనియెను,

కుంజ యాకస్మికముగ నప్రతిభయై లజ్జావేశముచే దల వంచుకొని యత్లే యస్ఫుట స్వరముతో—"నేను మందులవాళ్ళ బిడ్డను—నేను" అని యిక మాటాడజాలకపోయెను.

అమరేంద్రు డుత్సాహోద్వేగముతో—"కుంజా! నీవు మందులదానవుకావు—కాయస్థ వంశమున జనియించితివి—నీవు మాయమూల్యాని కాత్మీయుడగు నానందకుమారవసు మహాశయునకు దనూజాతవు!" అనియెను.

కుంజ విస్మయ నిమగ్న హృదయముతో స్తంభితయైపోయెను. ఆమె చంద్రకాంత శిలాప్రతిమవలె నిలువబడి తదేకదృష్టితో నమరేంద్రునివంక జూడదొడంగెను. ఆ యాశా నయనములతో నతి నిగూఢములగు నామె హృదయ భావముల నమరేంద్రుడు విస్పష్టముగా గ్రహింపగలిగెను. అప్పుడాతడు దృఢస్వరముతో—"కుంజా! నేనిప్పుడు చెప్పిన మాటకు నీకింకను నిదర్శనమును మాత్రము చూపజాలను. కాని యీమాట యథార్థమనియే నీవు విశ్వసింపవచ్చును. ఎప్పటికైన నే నీ విషయమున దగిన ప్రమాణములను జూపజాలకున్నచో నా పే రమరనాథుడు కాదు" అనియెను.

ఔరా! నవయౌవన సులభంబగు నా భావోద్దీపనము! ఆ హృదయావేగము! ఆ ప్రబలోత్సాహము—ఆ నిశ్చల మనోరథము! ఆ నవనవోత్తేజనము!—ఔను! అమరేంద్రు డిప్పుడు సంపూర్ణ యౌవనుడై యున్నాడు. మఱియు బ్రణయోన్మాదముచే మత్తుడై యున్నాడు. అందుచేతనే యాతని హృదయ మింతటి తీవ్రమై యుండెను. కుంజ యేమియును మాటాడుటలేదు; నిశ్శబ్దముగా గూర్చుండియుండెను. ఆమె కోమల హృదయ క్షేత్రమునం దింతవరకు

నకుంఠితమైయున్న యాశాలత నమరేంద్రుని వచన సుధారసముచే నాకస్మికముగ గొనలుసాగి, చిగిర్చి, పూచి నవనవామోద విలసితము కాజొచ్చెను. అప్పు డమరేంద్రుని నిశ్చల వీక్షణములనుండి విస్పష్టముగను, కుంజ తరళ కటాక్షములనుండి యస్పష్టముగను, హృదయ భావములు మూర్తీభవించి ముఖరంగముల సవిలాసముగ నర్తనము చేయుచుండెను. ప్రథమ ప్రణయరంగమున ప్రథమ సమావేశముం గాంచియున్న ప్రణయినీ ప్రణయుల మనోభావములను యథా రూపముగ వర్ణింపజాలిన సరసకవి శిఖామణి యింతవఱకెవ్వడును బయల్పడి యుండలేదు.

అమరేంద్రుడు మరల కుంజ హస్తమును బట్టుకొని ప్రణయ మధుర స్వరముతో—"కుంజా! సౌఖ్యము! నన్ను బెండ్లి యాడెదవా?" అనియెను.

కుంజ సాహసించి యెన్నియో విధముల ప్రయత్నించెను గాని యెట్టి ప్రత్యుత్తరము జెప్పజాలకపోయెను. కాని యమరేంద్రు డుత్సాహోద్రేకముచే నదేవిధముగ ప్రశ్నించి పీడించుచుండుటచే నామె తుట్టతుదకు మృదుస్వరముతో—"నేనేమి చెప్పగలను?" అనియెను.

అమరేంద్రుడు ప్రేమభరముచే నామె లేలేత నెమ్మొగమును దన రెండు చేతులతోడను నెత్తి మరల నొక ముద్దు పెట్టుకొనియెను. కుంజ విశాల నయన కమలములు నిమీలితములై పోయెను. ఆమె యమరేంద్రుని దక్షిణ భుజంబున నుత్తమాంగమును, వామ భుజంబున దక్షిణ కర కమలమును జేర్చి యానంద వివశయైపోయెను. అమరేంద్రు డప్పుడు సానురాగముగ నారమణీ రత్నమును దన వక్షమునం జేర్చుకొని యా సుందరి సోగ కన్నుల వఱకు వ్రాలుకొనియున్న కుటిల కుంతలములను మెల్లమెల్లగ సవరింప దొడంగెను

అప్పటి కమరేంద్రుని వయ సిరువదియైదేండ్లకంటె నధికముగా లేదు. కుంజకు మాత్రమో—పదునైదు వత్సరముల ప్రాయము!

అప్పుడా యిరువురి జీవితములును, స్రోతస్వతీ ద్వయముంబోలి స్వాభావిక నియమముచే నొక నిర్మల ప్రణయ క్షేత్రమున సమ్మిళితములైపోయెను. ఇక నా ప్రవాహ వేగము నెవ్వ రడ్డగింపగలరు ?

ఏకహృదయముతో, నేకభావముతో, నేకశరీరులై యున్న వారికప్పు డేరీతిగా నెంతసేపు గడచిపోయెనో తెలియుటయే లేదు. కుంజ యేకాగ్రచిత్తముతో నేమియో భావించుకొనుచు కేవలమును సంజ్ఞావిహీనయై యుండెను. ఆమె యుత్తమాంగ మమరేంద్రుని స్కంధ ప్రదేశమున విలుంఠిత మగుచుండెను ఆ సుందరీమణి సుకుమార తనులత యాతని వక్షఃప్రదేశమున నలస భావముతో నలముకొని యుండెను.

ఆమె హృదయమునం దణుమాత్రమైనను విరక్తిని గల్పించుటకమరేంద్రుడు సాహసింప జాలకపోయెను. అప్పు డాత డనిర్వాచనీయంబును, స్వర్గీయంబునునగు నానందమును సంపూర్ణంబుగ ననుభవించుచు కూర్చుండి యుండెను ఎన్నినిమిషములు గడచిపోయినవో యానంద తన్మయుడగు నాతనికి దెలియనేలేదు.

అంతలో గుంజ యాకస్మికముగా మొగ మింత చేసికొని చకిత భావముతో నమరేంద్రుని కౌగిలిని విడిపించుకొని చటాలున లేచి దూరముగ బోయి తలవంచుకొని కూర్చుండెను. ఏమియు మాటాడలేదు. అప్పు డామె సర్వాంగకములును స్వేదబిందు సంకలితములై పోయెను; విడువకుండ వేడి నిట్టూర్పు లతితీవ్రముగ వెలువడుచుండెను. మఱియు నామె మ్లానవదనమున నేదియో యొకవిధమగు గంభీరభావ ముద్యోతక మగుచుండెను. ఆ యాకస్మిక పరిణామముం గాంచి యమరేంద్రుడు భయపడిపోయెను; మోహావేశముచే దానొనరించిన సాహస కృత్యములకు మనసులో జాల నొచ్చుకొనియెను. అప్పు డాతడు ప్రకంపిత స్వరముతో —" కుంజా ! నీకు గోపము వచ్చినదా ?" అనియెను.

కుంజ యేమియును మాటాడలేదు. కూరుచున్నయామె కూరుచున్నట్లే కుంగిపోవుచుండెను. అప్పుడమరేంద్రుడు చటాలున లేచి చెంతకు బోయి యామెం గౌగిలించుకొని—"కుంజా! ఒకవేళ నేను తొందరపడి యేయుపచారము చేసెనన నీకు కోపమును కలిగించి యుంటినేని నాపై దయయుంచి నన్ను క్షమింపుము'" అనియెను.

ఆ బాలిక యేమేమో చెప్పబోయెనుగాని పాపమామె నోటి నుండి మాట వెలువడలేదు. అమరేంద్రుడామె ననేక విధముల బుజ్జగించుచు నామాటయే యడుగుచుండెను. కుంజ చంచల నయనములతో దిక్కులు చూచుచుండెనే కాని యేమియు మాటాడజాలకపోయెను. ఇంతలో నావృక్షాంతరాళమునుండి యాకస్మికముగా కర్ణకఠోరంబగు వికట హాసము బయలు వెడలెను.

తోడనే యమరేంద్రుడు కుంజను వదలివైచెను. అప్పుడు కుంజ యదరిపడి తలయెత్తి వ్యాకుల భావముతో నలుదెసలను బరికించి చూచెను. అంతలో నామె కేమితోచెనోగాని యామె యుత్తర క్షణముననందే చటాలున లేచి నిలువబడియెను; మరల నొకసారి యన్నివైపులకును దన దృష్టులను బరపించెను; అనంతర మమరేంద్రుని మొగమువంక గనుగొనియెను; ఏమియును మాటాడలేదు; అట్లు మాటాడకుండగనే తత్తరపడుచు చంచల చరణ విన్యాసముతో దేరాల వైపునకు బరుగెత్తెను.

ఆ నిమిషముననందే యమరేంద్రుడును నొక్క పరుగున బోయి యామె చేయి పట్టుకొనియెను. అప్పుడును కుంజ కేవలము నుద్విగ్న హృదయముతో, మ్లాన వదనముతో, కోమల గద్గద స్వరముతో—"దయయుంచి నన్ను విడిచిపెట్టుము. నాయపరాధమును క్షమింపుము—నేనేమియు నెఱుంగనిదానను—చిన్నదానను—తెలివితక్కువదాననై వెనుక ముందరయక మహాపరాధము చేసితిని—ఇందుకొఱకు మీరిప్పుడుగాక నన్ను నెప్పటికైనను నన్ను దృణీకరింపక మానరు!" అనియెను.

అమరేంద్రుడు వ్యాకుల హృదయముతో—"కుంజా! ఏమనుచున్నావు! నేను నిన్ను దృణీకరింతునా? ఏమి? నీవేమితప్పు చేసితివి? ఏ కారణముచే నిన్ను నేను తృణీకరింతును? అట్లెన్నటికిని జరుగదు—నీవు నీనోటితో నెన్నడు నిట్టిమాట యనవలదు—వలదు—వలదు—" అనియెను.

చూచుచుండగనే కుంజ కనుదమ్ములశ్రుజల పరిపూర్ణములై పోయెను. అప్పుడామె సజల నయనములతో గంపిత తనువల్లితో, గాతరకంఠ స్వరముతో—"నా తప్పులను క్షమింపుడు—నన్నిప్పటికి మన్నింపుడు! నాశరీరమునే, నామనసునే—నాప్రాణమునే—సమర్పించి వైచిన యింతటి పరమానందమును నేనిదివఱ కెన్నడు ననుభవించి యుండలేదు—ఇక నెన్నటికైన ననుభవింతునను నాశ లేదు—నామనసంతయు నిప్పుడు వికలమైపోయినది—నేనల్పురాలను. మందుల దానను—ఏమియును నెఱుంగనిదానను—బోధించినను దెలిసికొన జాలనిదానను—దయయుంచి మీరిప్పుడు మీనివాసమునకు వెడలి పొండు!—అట్లుపోక మీరికను నిచ్చటనే యున్నచో నేనొక్కసారిగా బిచ్చిదాననై పోవుదును—" అని యిక నామె మాటాడ జాలక పోయెను.

అమరేంద్రుడన తప్పేదేమి చేయవలయునో, యేమని ప్రత్యుత్తరము చెప్పవలయునో నిశ్చయించుకొనగల సామర్థ్యము లేకుండ బోయెను. అతడప్రతిభుడై యతి కష్టముతో గుంజ హస్తమును వదలివైచెను. వెంటనే కుంజ యటనుండి యతి వేగముగ బరుగెత్తి పోయెను. అమరేంద్రు డచ్చటనే హతబుద్ధియై స్తంభితుడై నిలువబడి పోయెను.

ఈ విధముగా నచ్చట నెంతసేపు నిలువబడి యుండెనో ఆతనికి దెలియలేదు. ఇంతలో మరల గఠోరంబగు నా వికటహాసధ్వని శ్రవణగోచరంబగుటచే నాతని కొక్కసారిగ స్మృతి కలిగెను,

అప్పు డాత డదరిపడి చటాలున వెనుకకు దిరిగి చూచెను. కాని యెచ్చటను నెవ్వరును గూడ గనబడ లేదు.

చూడగా నప్పటికి సంధ్యాకాలము గడచిపోయెను. రాత్రి యెనిమిది గంటలై యుండునని యాత డూహించుకొనియెను. అతనికి దెలియకుండగనే యింత శీఘ్రముగా నంతసేపు గడచిపోయెను. అమరేంద్రుడు తాను కలకత్తానుండి యెక్కివచ్చిన బోటును రేవు నందు విడిచి పాదచారియై యిచ్చటికి వచ్చియుండెను. ఇంత యాలస్యమై పోవుటచే గళాసు లందఱును దనకొఱకె౦త యాలజడి పడుచుందురో యని యమరేంద్రు డతిత్వరితముగ రేవున కభిముఖుడై బయలు దేఱెను.

# ప్రకరణము 31

ఆ మంములవాళ్ళు డేరాలను వైచియున్న ప్రదేశము చందన నగరపు రోడ్డునకు జాల దూరమునందున్నది. అది యొక పొలము బయలునందలి యొక ప్రాంతము రోడ్డునకు దానికి నించుమించుగా నొక మైలు దూరమున్నది. త్రోవ కూడ నంత సుగమమయినది కాదు. చేల నడుమనుండియు జేల గట్లనుండియు నడచిపోవలయును. ఆ మార్గమునందు సర్పభయము కూడ నున్నది.

ఆ దిన మమావాస్య యగుటచే నంధకార మతినిబిడమై యుండెను. ఎట్టయెనుట నొకటి రెండడుగుల దూరమందున్న వానిని గూడ దృష్టించుట యసాధ్యముగా నుండెను. ఎదురుగా దూరము నందున్న రోడ్డుమీద నొక కోమటి దుకాణ మున్నది. ఆ గాఢాంధ కార మధ్యమునందా యంగడిలోనున్న దీపము నక్షత్రమువలె గాన వచ్చుచుండెను. అమరేంద్రుడా దీపమునే లక్ష్యముగా జేసికొని యా దుర్గమ మార్గమున నతిజాగరూకుడై నడచిపోవుచుండెను.

ఆ సమయమున వెనుకవైపునుండి యెవ్వరిదో యడుగుల చప్పుడు వినవచ్చినట్లాతని కొకటి రెండు సార్లనుమానము కలిగెను. అతడు వెనుకకు దిరిగి చూచెను. ఆ ఘోరాంధకారములో నాతని కంటి కెవ్వరును గూడ నగపడలేదు.

కుంజ మరల దన్ననుసరించి వచ్చునను నాశ యాతని కెంత మాత్రమును లేదు. తుట్టతుదకు కుంజ హృదయమున గోపమే కలిగెనో భయమే కలిగెనో యాతనికి బోధపడలేదు. కాని యామె నిస్సంశయముగా నాతని కంటికి బొమ్మవలె ప్రార్థించినది. విరక్తి చేతనా! కాక నిరాశ చేతనా? ఇంతలో నీవిధముగా మారిపోవుట కితర కారణ మేమున్నది? ఏమో గాని యిప్పటి యామె హృదయ భావ మవేద్యమై యుండెను. అమరేంద్రుడీ సంగతు లన్నియు నాలోచించుకొనుచు నిరుత్సాహియై నడచుచుండెను.

మరల నాతని కడుగుల చప్పుడైనట్లు తోచెను. అమరేంద్రుడు దదరిపడి యచ్చటనే నిలువబడి తనలో నీవిధముగా నాలోచించుకొనియెను— ' ఆ డేరా వైపునుండి యెవ్వరో ఈదారిని వచ్చుచున్నట్లున్నది. అట్లయినచో ద్వరలోనే నన్ను గలిసికొనగలరు. కలిసికొన్నచో బాగుగనే యుండును. ఈ గాఢాంధకార మధ్యమున నొంటిగ బోవుటకంటె నొకరి కొకరు తోడుగా నడచిపోయినచో నతిశీఘ్రముగ రోడ్డును జేరవచ్చును '' అని—

అమరేంద్రుడా యుద్దేశముతోనే కొంతసేపచ్చట నిలువబడియెను గాని తరువాత మరల నెట్టి పదశబ్దమును శ్రవణగోచరము కాలేదు. ఎవ్వరో మఱియొక వైపునుండి డేరాల వైపునకు బోవుచుండిరనియు నిశ్శబ్దంబగు నంధకారమునందా యడుగుల చప్పుడే వినవచ్చెననియు, నెవ్వరైన వచ్చుచున్నచో నీపాటికి దన్ను గలిసికొనియే యుందురనియు నిశ్చయించుకొని యామడ యంగడి దీపమును గుఱుతు చూచుకొనుచు మరల నడచుట కారంభించెను.

అట్లాత డించుమించుగా సగము దూరము వఱకును బోయెను. ఇంతలో మరల నెప్పటివలె నడుగుల చప్పుడు వినవచ్చుటచే నాత డదరిపడి వెనుకకు దిరిగి చూచెను. ఆ నిబిడాంధకార మధ్యమునం దాతని కన్నుల కేదియో యస్పష్టముగ గానవచ్చుటచే నదరిపడి చటాలున బది యడుగుల దూరము వఱకు నొక్క గంతువైచి నిలువ బడియెను. గాఢాంధకారము మిన్నును మన్నును నేకమైయుండెను. అతడట నిలిచి మరల వెనుకకు దిరిగి పరిశీలించి చూచెను, సబలంబుగ జాచి యెత్తబడిన యొకచేయి— ఆ చేతి యందలి నిశితంబగు భీకర కరవాలము! ఆ యంధకారమున దాని వ్యక్తి పిశాచమువలె నస్పష్ట ముగ గానంబడు చుండెను—ఆ వెనుకవైపునుండి యెవ్వరో దారుణ కృపాణ సంకలితంబగు నాహస్తమును బలవంతముగ లాగి పట్టుకొని యుండిరి.

ఇక నొక నిమేషమాత్ర మాలస్యమైయెనచో నా సముద్యత కృపాణాఘాతముచే నమరేంద్రుని పృష్ఠప్రదేశ మామూలవిద్ధము కావలసినదే—ఔరా! ఎంతటి దారుణ ఘటనము! అమరేంద్రుని శరీర మంతయును ఘర్మసంసిక్తమైపోయెను. అతని తల తిరిగిపోవు చుండెను. అప్పు డాతి డాకస్మికముగ స్తంభితుడయ్యెను దక్షణము నందే ముందటికొక్క యడుగుటున లంఘించెను. అతడు మరల వెనుకకు దిరిగి చూచునప్పటికా యిరువురు వ్యక్తులు భూమిపైబడి పరస్పర బలప్రయోగమున నొండొరుల నాక్రమించుచుండిరి. అమరేంద్రు డప్పుడు చటాలున వారి చెంతకు బోయెను. అప్పటికొకవ్యక్తి వక్షో భాగమున గరవాలాగ్రముతో బొడుచుటకు ప్రాణపణంబుగ బ్రయత్నము చేయుచుండెను రెండవవ్యక్తి యతి సాహసముతో నాత్మ రక్షణము చేసికొనుటకు బ్రయత్నించుచుండెను. అందెవ్వరి నోటినుండియు నొక మాటయైన వెలువడుటలేదు.

అప్పు డమరేంద్రుడా విధముగా బొడువ జూచుచున్న వ్యక్తి చేతియందలి కరవాలమును జటాలున నూడబెఱికికొని దూరముగ

బాలవైచి యా వ్యక్తి కంఠమును రెండు చేతులతోడను బలవంతముగ నొక్కి పట్టుకొనియెను. ఆ యవకాశమునందా రెండవ వ్యక్తి యాయాసముచే వగర్చుకొనుచు నొక్క యెదుటను లేచి నిలువబడియెను.

ఆ ప్రథమవ్యక్తి యమరేంద్రుని చేతులనుండి యెట్లయిన దప్పించుకొనవలయునని శక్తికొలదిని ప్రయత్నము చేయుచుండెను; గోళ్ళతో రక్కుచు నాతని శరీరము క్షతక్షతముగ జేసివైచుచుండెను; కఱచుటకు గూడ ననేక విధముల ప్రయాసపడుచుండెను. మఱియొకడైనచో నాబాధలను సహింపజాలక హతాశుడై విడిచిపెట్టవలసినదే. కాని యప్పుడమరేంద్రుని శరీరమున నపరిమిత బలమున్నది—ఆతని హృదయమున నసాధారణ ధైర్యమున్నది. ఆతడా వ్యక్తిని దన పాదముల సందున నిఱికించి వామహస్తముతో రెండుచేతులను గట్టిగ బట్టుకొని, దక్షిణ హస్తముతో మొగమును పైకెత్తి యా యంధకారమున బరికించి చూచెను. తోడనే యాతడు విస్మితుడై పోయెను. వారెవ్వరు? ప్రత్యక్ష రాక్షసియగు నామందుల ముసలిదియే!

అమరేంద్రుడిదివఱకు జేసిన యపకారమునకు ప్రతీకారముగా నాతని నెట్లయిన జంపవలయునని యుద్దేశించుకొని యామె కృపాణహస్తయై వచ్చియుండెను. ఆమెం గాంచినంతనే యమరేంద్రుని సర్వాంగకములును క్రోధానలముచే ప్రజ్వలితములై పోయెను. ఆ క్రోధోద్రేకముచే నాతడామెను దన పాదములతో గట్టిగ నొక్కివైచెను. ఆ బాధకు సహింపజాలక యప్పుడామె బిగ్గఱగా నేడువ నారంభించెను.

ఇంతలో నమరేంద్రుని వెనుకవైపునున్న వ్యక్తి సంభ్రమసూచక స్వరముతో—"వలదు—వలదు—నిష్కారణముగా జంపవలదు!" అనియెను.

అమరేంద్రుడు డదరిపడి—"ఎవరువారు! కుంజయేనా! కుంజా! నీవు నాకు మూడుసారులు ప్రాణదానమును గావించితివి. నీవీ రాక్షసి దారుణ కృపాణ హస్తమును వెనుకనుండి బలవంతముగ బట్టుకొనక యేయున్నచో నాఖడ్గప్రహారముచే నేపాటికి మరణించియే యుందునుసుమా!" అనియెను.

కుంజ మృదుస్వరముతో—"ఈ డాకిని మీవెనువెంటనే బయలుదేఱి వచ్చుచుండుటగాంచి నా మనసునం దనుమానము కలుగుటచే నేను దీని వెనుకనే వచ్చియుంటిని" అనియెను.

అమ—అలాగా! నేనప్పుడు దీనిచేతిలో కత్తిని లాగికొని పాఱవైచితిని గాని లేకున్నచో నిది నిన్నును జంపవలయుననియే తలంచినది.

కుంజ చిఱునవ్వు నవ్వుచు—"అంతభాగ్యమా? అట్లు జరిగినచో నిది నాకెంతయో యుపకారము చేసినదియే యైయుండును—ఈ నిరర్థక జీవితమువలన లాభమేమున్నది?" అనియెను.

అమ—కుంజా! నీకింత నిరాశయేల? అట్లయినచో నీవిప్పుడు నన్నేల బ్రతికించితివి?

కుంజ యేమియును మాటాడలేదు. ఆ యంధకార మధ్యమునం దామె ముఖభావము లవిదితములై యుండెను.

అమ—కుంజా! నేనీ పాపాత్మురాలి నిప్పుడు ఠాణాకు తీసికొని పోయెదను. దీనికి మరణదండనము కాజాలదు. ద్వీపాంతరవాస శిక్షయగును.

అని చెప్పి యాతడా రక్కసిని వదలి కేవలము మాకొ యెడమచేతిని మాత్రము పట్టుకొనియెను. ఆ యమరేంద్రుని లోహ ముష్టినుండి చేతిని వదలించుకొనదగిన శక్తిగలవా రెవ్వరున్నారు!

ఆ దురాత్మురా లింతసేపటివఱకు మాటాడుటయే లేదు. కాని యిప్పుడు మాత్రము కుంజ నుద్దేశించి వికటస్వరముతో—"ఓసి నిర్భాగ్యురాలా! దురదృష్టవంతురాలా! నాకు ద్వీపాంతరవాస

శిక్షయైనచో నీకేమిలాభము? నాకాలము చెల్లిపోయినది. ఇక నాకేమైనను భయములేదు—నీమాట చూచుకొనుము! నాకే యట్టి శిక్షయైనచో నిక నీవు జీవించియున్నంతకాలము నిట్లే మందుల దాననై యుండవలసినదే!" అని ధిక్కరించెను.

ఆ మాట విన్నంతనే యమరేంద్రు డుత్సాహముతో—"కుంజా! దీని మాటలను వింటివా? దీనికి నీ తల్లిదండ్రుల వృత్తాంతమంతయును దెలిసియుండునని నాకు దోచుచున్నది!" అనియెను.

ఆ దుష్టురాలిపేరు రాసమణి—కాని పేరికి దగిన గుణమొక్కటియు నామె జీవితచరిత్రమున గానవచ్చుటలేదు. ఆ రాసమణి యిప్పుడు మఱింత క్రోధముతో మండిపడుచు—"అయ్యా! నాకు శీఘ్రముగ ద్వీపాంతరవాస శిక్షను జేయింపుము. అందుకొఱకు నాకణుమాత్రమును భయములేదు—కాని దానికిమాత్ర మొక్క దమ్మిడియైనను దక్కకుండ బోవును—ఎల్లకాలమును నిరుపేదరాలగుచుండవలదియే యైయుండును—ఇప్పు డెట్లున్నదో యిక నెప్పుడును గూడ నట్లే—" అనియెను.

అప్పు డమరేంద్రుడు శాంతస్వరముతో—"రాసమణీ! నీవు కుంజ తల్లిదండ్రుల నెఱుంగుదువా?" అని యడిగెను.

రాసమణి వికటహాసము చేయుచు—"ఎఱిగిననేమి? నేను చెప్పినప్పుడుగదా!—దీనిరక్తమును జూచిన తరువాతగాని చెప్పనునా?" అనియెను.

కుంజ—అదియేమే? నేను నీకేమి యపకారము చేసితిని?

రాసమణి గర్జించుచు—"ఏమిచేసితివా? మాడుమొగపుదానా! నీవు నాలోచనుని ముగ్ధునిం జేసివైచుచున్నావు—నేనిన్నియేండ్లనుండియు వానిని సేవించుచున్నాను. ఇంకను నాతడు నిన్ను పెండ్లియాడ దలచియే యున్నాడు" అనియెను.

కుంజ—అలాగా? వాని కెంతటి పోగాలము! ఈమాట వాడే చెప్పినాడా?

రాస—ఈ గందరగోళ మణగిన తరువాత నెట్లయిన వాడు వచ్చి తప్పక నిన్ను పెండ్లియాడును. నీతండ్రి ఆస్తినంతను వశపఱచు కొనును—తుదకు నన్ను ద్యజించివైచును. అయినను నేనాతడు చెప్పినట్లు చేయుచునే యున్నాను. అతని మాటమీదనే యీతని జంపుటకు వచ్చియుంటిని. ఈతడు బ్రదికియుండగా తాను తిరిగి వచ్చుటకు నవకాశము లేదని చెప్పి యన్నిపని చేయుమని ప్రార్థించినాడు. నేనాతనికొఱకు కన్నిపనులను జేయుచున్నాను. కాని కాలముఖినగు నీవు మమ్మిరువుర నెడబాపుటకు సిద్ధముగా నున్నావు.

రాసమణికి వయసు చెల్లిపోయినను నామె శరీర బలముమాత్ర మింకను దగ్గిపోలేదు. ఆమె నోటికి వచ్చినట్లెల్ల నేమేమియో వదరుచునే యుండెను. అమరేంద్రు డప్పు డామె నదలించి నోరు మూయింపకయేయున్నచో నారాత్రియంతయు నూరక వాగుచునే యుండును.

అప్పు డమరేంద్రుడు కుంజం గాంచి—"కుంజా! డేరాల యొద్దకు పోవుదము నడువుము! దీనితో మాటాడవలసిన సంగతు లనేకము లున్నవి. నేనడిగినవాని కన్నిటికిని దగిన ప్రత్యుత్తర మిచ్చినచో దీనిని వదలివైచెదను. అట్లు చేయక పెంకితనము చేసినచో దప్పక పోలీసువారి కొప్పగించివైచెదను. అప్పుడు దీనికి దగిన శాస్తి యగును" అని చెప్పుచు దాను దూరముగ బాఱవైచిన కత్తిని వెదకి తీసికొని రాసమణి చేయి పట్టుకొని యీడ్చుకొని పోవదొడంగెను. కుంజయును మాఱుమాటాడకుండ నాతని వెనుకనే పోయెను.

## ప్రకరణము 32

అనేక సమయములయం దపకారము వలననే యుపకారము కలుగుచుండును. రాసమణి యీ విధముగా ఖడ్గప్రహారముచే నమరేంద్రునిం జంపుటకు బ్రయత్నింపకయేయున్నచో నామెవలన

దెలిసికొనదగిన విషయముల నన్నిటిని మఱి యేయుపాయముచేతైనను గ్రహించుట కవకాశమే లేకయుండెను.

అమరేంద్రుడు మందులవాళ్ళ డేరాల యొద్దకు రాసమణి నీడ్చుకొనిపోయెను. ఆమె దురవస్థం గాంచి యా డేరాలలోని యాబాల వృద్ధవనితా జనమంతయు నచ్చటికి బరుగెత్తుకొని వచ్చెను. కాని యమరేంద్రుని హస్తమునందు మిలమిలలాడుచున్న కరవాలముం జూచి యెవ్వరును సమీపించుటకు సాహసింపజాలక పోయిరి.

అప్పు డమరేంద్రుడు రాసమణిని భయపెట్ట వలయుననియు, మఱికొన్ని యితర కారణములచేతను నొక రక్షకభటునిం బిలిపించి యాతని కొక యుత్తరమును వ్రాసి యిచ్చి స్టేషనునకు బంపుచు— "నీవతిత్వరితముగ బోయి యీ యుత్తరమును స్టేషనులో నందింపుము. ఇది యీ రాత్రియే కలకత్తాయందలి ఫతేఅలీ సాహేబునకు జేరవలసి యున్నది" అనియెను.

రక్ష—చిత్తము మహాప్రభూ, చేసెదను.

అమ—సరేకాని, నీవు పోవునప్పుడు ముందుగా రేవులోనున్న నాబోటునొద్దకు బోయి యచ్చటి నాసేవకులలో నొక్కని నిచ్చటికి లాంతరును దీసికొని రమ్మని చెప్పి మఱిపొమ్ము. నేనిచ్చటి పనిని శీఘ్రముగా ముగించుకొని బోటుకడకు బోయెదను.

రక్షకభటుడు చిత్తమని వెడలిపోయెను. యీ వ్యాపార మంతయుం గాంచి మందులవాళ్ళందఱు నమరేంద్రుని పోలీసువా డనియే నిశ్చయించుకొనిరి. అమరేంద్రుడు కూడ నట్లే నటించు చుండెను. కుంజ యప్పు డటనున్నవా రందఱితోడను—"ఈయన పోలీసు కర్మచారి. ఆ బందిపోటుదొంగను బట్టుకొనుటకై ప్రయత్నము చేయుచున్నాడు. ఈ రాసమణియు, కాహియాయు, లోచనుడును నీయన నొకప్పుడు కపట తంత్రముచే బట్టుకొని యొకపడవలో రహస్య స్థలంబున నిర్బంధించి యున్నారు. రాసమణి ఈవిషయమునం

దన్నియు నసత్యములే చెప్పుచున్నది. ఈత డిప్పుడు లోచనుని సమాచారము తెలిసికొనుటకై మనయొద్దకు వచ్చినాడు. మన మేమి చోరులమా? ద్రుచ్ఛులమా?" అనియెను.

అప్పు డందఱు నొక్కటే వాక్యముగా—"కాదు—కాదు—మన మెన్నటికి నట్టివారము కాజాలము" అనిరి.

కుంజ—దొంగయైనను, దోపిడిగాడైనను లోచనుడే—వాడు మనగుంపును విడిచిపోయినాడు. అతనితో సంబంధము వదలిపోవుట మనకు మేలేయైనది. అతని సంగతి మన కెవ్వరికిని దెలియనే తెలియదు!

అనుటయు మరల నందఱు నేకకంఠముతో—"పాముకాళ్ళు పామునకే తెలియును. వానిసంగతి మన కించుకంతయును దెలియదు" అనిరి.

కుంజ—ఈ రాసమణి యొక్కతెకు మాత్రమే సర్వమును దెలియును. ఆ లోచనుని యాజ్ఞానుసారముగా నీమె ఈ కృపాణముతో నీతని నఱకుటకు బ్రయత్నించినది. ఇదిగో! చూడుడు! ఈఖడ్గమెంత తీవ్రముగా నున్నదో! నాకనుమానము కలుగుటచే నేనీమె వెనుకనే పోయి ఖడ్గప్రహార సమయమున నీమె చేతిని బలవంతముగ బట్టుకొని వెనుకకు లాగితిని. అట్లు చేయకున్నచో నప్పు డీమె యీతని జీవితమును దుదముట్టించియే యుండును.

ఈ మాటలను వినినంతనే యచ్చటివా రందఱును నాకస్మికముగ క్రోధాంధులై రాసమణి ననేక విధముల దిట్టుట కారంభించిరి. అందు గొంద ఱీమెను నిలువున జీల్చివైవవలయుననియు, మొగము తెగులబెట్టవలయుననియు, ముక్కుకత్తులగోసి యుప్పుపాతఱ వేయింపవలయుననియు శిక్షావ్యవస్థలం గావింప దొడంగిరి.

కుంజ యా కలకల మంతయును వారించి గంభీర స్వరముతో—"ఇప్పు డీయన యీమె నేమియో యనుగదలచి యున్నాడు.

మీరందఱు నెవ్వరి డేరాలకు వారు పోయి నెమ్మదిగా నుండుఁడు. రేపటి యుదయమున మీకన్ని సంగతులును దెలియఁగలవు" అనియెను.

అట్లు పోవుట యెవ్వరికి నిష్టము లేకయున్నను కుంజ యాజ్ఞ ననుసరించి యందఱు నటనుండి వెడలిపోయిరి. అమరేంద్రుఁడు రాసమణి నచ్చటి కీడ్చుకొనివచ్చి పడపై నిడెనో యామె యచ్చటనే యుండి యనేక విధములగు ముఖవికారములచే దన మనసులోని క్రోధమును వెలువరించుచు గూర్చుండెను. అప్పు డమరేంద్రుఁడు రాసమణి చెంతకు బోవుట కుద్యుక్తుఁడయ్యెను.

కుంజ—ఇచ్చటగాదు. నా డేరాలోనికి బోయి కూర్చుండి యచ్చట నెల్లవిషయములను రహస్యముగా దెలిసికొనవచ్చును.

ఇప్పుడా కుంజ సంధ్యాసమయమునందువలె లజ్జావనత వదనయు ప్రేమవిహ్వాల హృదయయు నగు బాలికామణియై యుండలేదు. మరల నామె యెప్పటివలె మందులబాలికయే యైయుండెను. ఆమె యనేక సమయములం దనేకావస్థల యనుభవమునుబట్టి యసాధారణ ప్రత్యుత్పన్న మతిత్వమును, నచంచల ధైర్యమును, నకుంఠిత సాహసమును, ననూనమగు తేజమును సంపాదించి యుండెను—ఇప్పు డామె యా దళమున కధీశ్వరియై కార్యభారమును వహించి యుండెను. కార్య నిర్వహణము గావింపవలసిన యామె యింకను బాలికయై యెలఁగుటెట్లు !

అమరేంద్రుఁ డప్పుడు కుంజ డేరాలోనికి రాసమణి నీడ్చుకొని పోయి భయంకరముగ నదలించి బలవంతముగ నామె నట గూర్చుండ జేసెను. రాసమణియు ననేక విధములగు వికార చేష్టలను జేయుచు, ననర్థక క్రోధావేశముచే నేమేమియో గొణఁగుకొనుచు గూర్చుండి యుండెను.

ఆ డేరాలోపల నొక బెత్తముల పెట్టెయు, రెండు మూడు కంబళములును, నొకటిరెం డిత్తడి పాత్రములునుదక్క మఱే యెట్టి

వస్తువులును లేవు. ఒక మూల నొక చిన్న దీపము మినుకుమినుకుమని వెలుగుచుండెను. ఆ ప్రక్కనే యొక కట్టెపెట్టె యుండెను. ఆ పెట్టె మీద నొకటి రెండు పుస్తకములు కూడ నుండెను. వానిలోనుండియే కుంద యమరేంద్రునకు గాగితమును గలమును దీసి యిచ్చెను. ఆ గుంపునందు దామె యొక్కతె మాత్రమే చదువుటకును, వ్రాయుటకును నేర్చియుండెను. అట్టి యేకమాత్ర విద్యావతియగు నామె యెదుట నశిక్షితులును, ననాగరికులునగు నాగుంపువా రందఱును వినమ్రభావముతో వినతులై యుండిరనుటలో వింత యేమున్నది.

అమరేంద్రు డొకచో గూర్చుండి కుందను గూడ గూర్చుండుమని చెప్పెను. ఆమె యప్పు డాతని కించుక దూరముగా నొక కంబళమును బఱచుకొని కూర్చుండి యుండెను. అమరేంద్రుడా సంగతి గ్రహించి చూచియు జూడనట్లుగా నూరకుండి కార్యక్రమమున కారంభించి రాసమణివంక రోషకషాయిత నయనములతో దిలకించుచు భీకర కంఠస్వరముతో—"పాపాత్మురాలా! నేనడిగిన ప్రశ్నల కన్నిటికిని దగిన ప్రత్యుత్తరముల జెప్పెదవా? కారాగృహమునకు బోయెదవా?" అని యదలించెను.

రాసమణి కర్కశ స్వరముతో—"ఈ బెదరింపు లెందులకు? నేనేవిషయముంగూర్చి చెప్పవలయునో తెలుపుడు!" అనియెను.

అమ—చూడుము! నేనడిగిన దానికెల్ల సరిగా బదులు చెప్పుము. ఎంతమాత్రము నసత్యము చెప్పవలదు. అట్లు చేసినచో నిన్నింక బోలీసువారి కొప్పగింపను. అంతేకాక నీకు దగిన సొమ్ము కూడ నిచ్చి యితర దేశమునకు బంపివైచెదను.

రాస—తరువాత నీయిష్టము వచ్చినట్లు చేయవచ్చును. నన్నడుగవలసిన సంగతు లేవో స్పష్టముగా నడుగరాదా?

అమ—మంచిది. ఆలాగున దారికిరమ్ము. లోచను డిప్పు డెచ్చట దాగియున్నాడు?

రాస—నాకాసంగతి యించుకంతయును దెలియదు. అతడు తన గుఱ్ఱమును గూడ వెంటబెట్టుకొని పోయినాడు

అనుటయు గుండ వ్యగ్రభావముతో—"అది యేమే యట్లు చెప్పుచున్నావు? వాడు గుఱ్ఱమును దీసికొని పోయినాడా? ఎప్పుడు?" అనియెను.

రాసమణి క్రోధతీవ్ర నయనములతో నావంక జూచుచు—"ఇప్పుడే!" అనియెను.

కుండ—ఓసీ! నీకెంతటి ధైర్యమే. పుట్టుమొదటి మాటలోనే యింతటి యసత్యమా?

రాస—నేను సత్యమే చెప్పితినో, యసత్యమే చెప్పితినో పోయి రెండుకన్నులతోడను జూచుకొనరాదా?

కుండ—సరే! నీమాటయే నమ్మెదను. వాడు స్వయముగనే వచ్చి యా గుఱ్ఱమును వెంట దీసికొని పోయెనా?

రాస—లేదు. ఆ గుఱ్ఱమును దీసికొని రమ్మని వాడొక పిల్లవానిని బంపించినాడు. వాడీసాయంకాలమునకు ముందే యా గుఱ్ఱమును దీసికొని యద్దుత్రోవను బోయినాడు. తరువాత మరల నిచ్చటికి రాలేదు.

ఆ మాట విన్నంతనే యమరేంద్రుని హృదయము ప్రకంపితమై పోయెను. అతడు తనలో—"రెండు మూడు దినముల లోపల నెచ్చటనో యొకచోట పొరల బందిపోటు దొంగతనము జరుగక మానదు—నిశ్చయముగా లోచనుడా గుఱ్ఱముతో నాపిల్లవానిని గూడ దనవెంట దీసికొని పోయియుండును. వానిని విడిచిపెట్టినచో దన సంగతి యెవ్వరికైన దెలుపునేమోయని భయముకాదా! లోచనుడు సాధారణుడుకాడు! అని భావించుకొనియెను.

అనంతర మాతడు రాసమణివంక జూచి—"నన్ను గత్తితో బొడిచి చంపవలయునని లోచనుడు నీతో నెప్పుడు చెప్పినాడు?" అని యడిగెను.

రాస—ఏదినమున నాతడా యడవినుండి తిరిగి వచ్చెనో యా దినమునందే—

అమ—ఎన్నాళ్ళయినది ?

రాస—నాకా లెక్కలు బాగుగా దెలియవు. నేనేమి చదువుకొన్నదాననా యేమి ?

అమరేంద్రుడు తనలో—"దీనివలన లోచనుని సమాచారమించుకంతయైనను దెలియుట యసంభవము. ఒకవేళ దీనికి వాడున్నచోటు తెలియకపోయినను పోవచ్చును. వాడు మాత్రము తాను దాగియున్న ప్రదేశ మితరులకు దెలియనిచ్చునంతటి బుద్ధిహీనుడా ? ఈ విషయమున వాడెంతయో జాగ్రత్తగా నుండక మానడు" అని యాలోచించుకొని యా ప్రస్తావము నిక మార్చివైచి శాంతస్వరముతో—"రాసమణీ! నీవిదివఱకు జెప్పిన మాటలనుబట్టి నీకు గుంజ తల్లిదండ్రులను గూర్చి బాగుగా దెలియునని నాకు స్పష్టముగా దోచుచున్నది. ఆ సంగతియైనను సత్యముగా దెలియజేసినచో నిన్ను విడిచిపెట్టెదను. మఱియు నీకొక నూఱురూపాయలను బహుమానముగ గూడ నిచ్చెదను" అనియెను.

రాసమణి మొగము చిట్లించుకొనుచు నాసికను గుంచించి—"ఒక్కసారిగా నూఱు రూపాయలే! లోచనునకు గూడ జాలధనమే లభించును. కాని యాతడీ కుంజను బెండ్లియాడవలయునని యున్నాడు. అందుచేతనే నాకాతనిపై గోపము—కావున నాతని కంతధనము దొరకుట నాకిష్టముగా లేదు" అనియెను.

అమ—లోచనుడు పట్టువడినచో జెఱసాలకే పోవును—ఆ ధనమును బడయుట కిక నాతని కవకాశ మెక్కడ నున్నది ?

రాస—ఒకవేళ నీకాసంగతి స్పష్టముగా జెప్పెద ననుకొనుము ! అప్పుడు నన్ను విడిచిపెట్టెదవా !

అమ—విడిచిపెట్టెదను. కాని, నీవీ దేశమునం దుండుటకు మాత్ర మంగీకరింపజాలను. ఏమో—నీవీ కోపముచే మరల నెప్పుడు నాపై గత్తికట్టుకొని వచ్చెదవో ! నీవంటిదాని నెవ్వరు నమ్మగలరు ?

రాస—అట్లయినచో నేనీ దేశమును విడిచి యేదేశమునకు బోవలయును ?

అమ—నీ కేదేశమునకు బోవలయునని యున్నదో యా దేశమునకే పోవచ్చును.

రాస—సరే—నేను దేశాంతరము బోవుట తప్పనిచో ఫయజాబాదునకు బోయెదను.

అమ—ఏమి ? అక్కడ నీ కేమిపని యున్నది ?

రాస—అచ్చట నొక బోగముదానియొద్ద నా చెల్లెలు పరిచారికయై పని చేయుచున్నది.

అమ—అట్లయినచో నీవచ్చటికి పోవుటకు నాకెట్టి యభ్యంతరమును లేదు.

రాసమణి యప్పుడు తన బట్టల నన్నిటిని మూట గట్టుకొని ప్రయాణమునకు సిద్ధముగా నుండెను.

## ప్రకరణము 33

రాసమణి యిప్పుడు కుంజ పూర్వచరిత్రమునంతను స్పష్టముగా దెలుపునని యమరేంద్రుడు భావించుకొని యుండెను. కుంజయు రాసమణివంక కించుక జరగి కూర్చుండుటచే నామెకూడ దనవలెనే నిశ్చయించుకొన్నదని యాతడు గ్రహించెను. కాని రాసమణి యనేక భావములతో నొక్కటే ధోరణిగా లోచనుని దిట్టుట కారంభించెను. అట్లే గుక్క త్రిప్పకుండ దిట్టుచు నెంతసేపటికిని నాధోరణి విడువకుండుటచే నమరేంద్రు డిక సహింపజాలక కన్నులెఱ్ఱజేసి యతి భీషణ స్వరముతో నదలించి యామె వాక్ప్రవాహము నాకస్మికముగ నడ్డగించి వైచెను.

రాసమణి మఱి మాటాడక కూరుచుండెను. అమరేంద్రు డప్పుడు మరల క్రోధావేశమును నటించుచు—“దురాత్మురాలా !

నీదుర్మార్గ మంతయును దెలిసిపోయినది. నీ విప్పుడు సామాన్యముగా నీమనసులోని సంగతులను దెలిపెదవా? స్టేషనున కీడ్చుకొని పోవలయును—అచ్చట బెత్తపు దెబ్బలతో గాని నీకు జంకు పుట్టదు! అప్పుడుగాని నీ యంతరంగము బయటబడదు!" అని యదలించెను.

ఆ గుంపులోనివా రందఱును స్టేషనను బెద్దపులికంటెను క్రూరమైనదిగా భావించి భయపడుచుందురు. ఆ పేరు విన్నంతనే రాసమణి యదరిపడి—"అక్కఱలేదు—అక్కఱలేదు—అంతయును జెప్పివైచెదను బాబూ!" అనియెను.

అను—మంచిది, అట్లయినచో మర్యాదగా నీకు దెలిసిన సంగతి యంతయును జెప్పుము!

రాస—చెప్పెదను బాబూ! నదేజిల్లా నుండి మేమీ బాలికను దొంగతనముగా నెత్తుకొని వచ్చితిమి—నోదనుడు చాలకాలము నుండియును దొంగయే—వాడే నన్ను గూడ నీదొంగతనములో బ్రవేశ పెట్టినాడు.

అను—నదేజిల్లాయందా? సరే—ఈమె యెవ్వరిబిడ్డయో నీ వెఱుగుదువా?

రాస—అంత జ్ఞాపకముగా లేదు. అపహరించిన నాటిరాత్రియే మేము మా డేరాల నెత్తుకొని యటనుండి మఱియొకచోటికి బోయితిమి.

అను—ఏగ్రామము?—దాని పేరేమి? ఆ సంగతి యైనను జ్ఞప్తియందున్నదా?

రాస—గ్రామముపేరా?—పేరంతయును బాగుగ స్మృతికి వచ్చుటలేదు. ఏడియో డాంగా.

అను—ఆలాగా? అట్లు మీ రెత్తుకొని వచ్చునప్పటికి కుంజ వయసెంత యున్నది?

రాస—ఒకటి రెండేండ్ల వయసు కలిగియుండవచ్చును. అప్పటి కింకను పసిబాలికయే.

అమ — అంతటి పసిబాలికను మీరేల దొంగిలించితిరి ? అందువలన మీకేమి లాభము ?

రాస — ఓ ! ఈ విధముగా నెన్ని దొంగతనములు చేసితి మనుకొన్నారు ; లెక్కయే లేదు.

అమ — అట్లు చేయుటకు గారణమేమి ?

రాస — కారణమా ? మంచి వయసు వచ్చినంతనే పశ్చిమదేశమునకు దీసికొని పోయినచో నెంతయో మూల్యమునకు విక్రయింప వచ్చును.

అమ — లోచనునకీ వ్యాపారముకూడ నున్నదా ? ఈ విధముగా నింకను నెంతమంది నపహరించి తెచ్చితిరి ?

రాస — ఇక నొక్కతెను మాత్రమే — తరువాత గందరగోళము పట్టుటచే లోచనుడీ వ్యాపారమును మానివైచినాడు.

అమ — మానివైచి యేమిచేసినాడు ? దారిదోపిడుల కారంభించినాడా ?

రాస — ఆ సంగతి నాకేమియు దెలియదు.

అమ — తెలియకేమి ? నాలిముచ్చు మాయలాడీ ! ఇంతయును దెలియును — సరే ! దానికేమి — తరువాత మీరీకుందనను బెంచుటకై యెవ్వరియొద్ద నొప్పగించిరి ?

రాస — లక్నో నగరమునందలి యొక లాలాయొద్ద నొప్పగించితిమి. ఆతని కెట్టిసంతానమును లేదు. అందుచేతనే యాతడీమె నతి గారాబముతో బెంచినాడు ; ఎంత సొమ్మయినను నడిగినది లేదనకుండ నిచ్చినాడు.

అమ — రాసమణీ ! ఒక్కమాట యడిగెదను నిజము చెప్పుము. కుందన బంగాలీల బిడ్డయేనా ?

రాస — అప్పటి యేసంగతియు నాకు దలపునకు రానప్పుడు నేనేమని చెప్పుదును ?

అమ — ఇతరు లెవ్వరో యిట్టి పిల్లను చాల సొమ్మిచ్చి కొనియెదరని చెప్పితివిగదా! ఎందుకొఱకు?

రాస — సంగీతము నేర్పించి సానిని జేసికొనుటకు — మేమిది వఱ కమ్మిన పెద్దపిల్ల మంచి పేరొందిన గాయకురాలైనది. సభలుచేసి చాల ధనము సంపాదించుచున్నది.

అమ — ఆమె యెవ్వరు?

రాస — ఈమెవలెనే చిన్నతనమునం దపహరించి తెచ్చిన మఱియొకబిడ్డ.

అమ — అలాగా? ఆ పిల్ల నే గ్రామమునుండి దొంగిలించి తీసికొని వచ్చితిరి?

రాస — భాగల్పురమునుండి.

అమ — అట్లయినచో నామె మాత్రము బంగాళీల బిడ్డ కాదను కొనియెదను.

రాస — కాదు — ఆమె యొక వర్తకుని కూతురు.

అమ — కుంజను కన్నతండ్రి యేజాతివాడో నీకు దెలియక పోవచ్చును, కాని యాత డేమైన గొప్పవాడా?

రాస — అయ్యో! కాకేమి? ఆతనికి పెద్ద లోగిలి యున్నది. చాల భాగ్యవంతుడు కూడను —

అమ — అట్లయినచో దన తనయ నపహరించిన మిమ్ముల వెదకి పట్టుకొనజాలకపోయెను?

రాస — లోచనుడా రాత్రియే పడవయెక్కి లక్నో నగరమునకు బాఱిపోయినాడు. ఈమె తండ్రి యప్పు డెంతయో ప్రయత్నించెను గాని యెట్టి యాగడయును దెలియకుండుటచే హతాశుడై యూర కుండెను.

అమ — నీవు కాహియాను బాగుగా నెఱుగుదువా?

రాస — ఆతని నెఱుగకేమి? మేము మొదట విక్రయించిన పిల్లను గొన్నవాడు వాడేకాదా?

అమ—అట్లయినచో గాహియాకును లోచనునకును జాల కాలమునుండియే సంబంధ మున్నదా?

రాస—ఎటుగ రాదేమి? అన్ని వ్యాపారములు గూడ వారిరువురును గలసియే చేయుచుందురు.

అమ—ఏ యే వ్యాపారములను జేయుదురు?

రాస—అట్లడిగెదరేమి? వారు రహస్యముగ జేసికొను పను లన్నిటిం గూర్చియు నాతో జెప్పుదురా?

అమ—సరే—పోనిమ్ము—నీవు లోచనితో గలసి యెన్ని సంవత్సరములనుండి తిరుగుచున్నావు?

రాస—నేనినాటిదాననా? చాలకాలము క్రిందటనే యాతడు నన్ను బెండ్లియాడినాడు—అయిననేమి? నేనిప్పటికి ముసలిదాననై పోయితినిగదా! ఇక నాతనికి నాతో బని యేమున్నది?

అమరేంద్రుడు తనలో—"దీనికి దెలిసిన సంగతు లన్నియును సంపూర్ణముగా దెలుపుటలేదు. ఎంతగా నడిగినను ముఖ్య విషయములంగూర్చి చెప్పుటయే లేదు. ఊరక ప్రశ్నలపై ప్రశ్నలనువైచి యీ రాత్రి యంతయు నీమెను విరక్తురాలిం జేయుట నాకు యుక్తి సంగతముగా దోచుటలేదు. కాని యీ రాత్రి యీమె నిచ్చట విడిచి పెట్టి నేనింటికి బోవుట ప్రమాదముకాదా? ఈమె యతిదారుణ సాహసికయగు స్త్రీ ప్రకృతి. దీనికి గుండెపై గూడ గావలసినంత కోప మున్నది. ఇది యొకవేళ నామెను జంపినను జంపగలదనుట కెంత మాత్రమును సంశయములేదు. కుంజ మైమఱచి నిద్రించుచున్నప్పుడు పోయి యేకత్తితోనో యామెను బొడిచివైచినచో నీమె నడగింపగల సమర్థు లెందెవ్వరున్నారు? దీనిపై నెవ్వరినైన గావలిపెట్టకుండ నేనూరక వెడలిపోవుట యుచితకృత్యముకాదు. ఏ పోలీసు రక్షక భటులనైన గాపుంచి పోవుదమన్నచో నిట జరిగిన యెల్లసంగతులును బయల్పడిపోవును. ఈ రాసమణి నన్ను జంపుటకై ప్రయత్నించు

చుండెననియు, నన్ను నణఁకుటకై నాపై గ్రిని తెసనియు బోలీసు వారికి దెలియఁజేయుట నాకెంతమాత్రము నిష్టముగాలేదు. అట్లు తెలిపినచో గుంజను గూడ న్యాయస్థానములకు దీసికొనిపోయి యామెచే సాక్ష్యము చెప్పింపవలసివచ్చును. ఆ పని యెంతమాత్రము నాకుచితముగా దోచుటలేదు—కాని యిట్టి స్థితిలో నిచ్చట నెవ్వరిని గావలి యుంతును ? ఎట్లయిన నీప్రదేశమునందీ రాసమణిని స్వేచ్ఛగా సంచరించునట్లు విడిచి యుంచుట యుచితముకాదు. గావున నేనే యీ రాత్రి యిచ్చట నిలిచి యుండిన బాగుగా నుండునేమో ! అవును. నేనుండుటయే యవశ్య కర్తవ్యము—నేనే యుండెదను ” అని యాలోచించి నిశ్చయించుకొనియెను.

అనంతరి మమరేంద్రుఁడు కుంజం గాంచి—“ కుంజా ! నాకీ స్త్రీరూప రాక్షసియుం డించుకంతయును నమ్మకములేదు పిశాచి యగు సేవకునిచే నీకును భయజాబాదునకు బంపించు నంతవఱకును నిశ్చింతుఁడనై యుండఁజాలను. ఇది యెంత శాంతముగ మాటాడు చున్నను, నెంత భయభక్తులతో మసలుచున్నను, నెంత వినయమును నటించుచున్నను సమయము దొరకినచో నిన్నుగాని, నన్నుగాని పైఁబడి చంపుట కెంతమాత్రమును వెనుదీయునదికాదు !” అని రాసమణికి వినబడకుండ మెల్లగా గుంజ చెవిలో జెప్పెను.

రాసమణి యాత్రముతోడను, భయముతోడను గొట్టుకొని పోవుచు వారివంక దదేకదృష్టితో జూడదొడంగెను. అమరేంద్రుఁ డప్పటి రాసమణి యవస్థను గుంజకు జూపించి మృదుస్వరముతో— “ చూచితివా కుంజా ! ఆ దురాత్మురాలి కెంత క్రోధమున్నదో— ఏమాత్ర మవకాశము లభించినను దానికి మనల నిరువురను నమలి మ్రింగివేయవలయునని యున్నది ” అనియెను.

కుంజ కొంతసేపటివఱకు దనలో నేమేమియో యాలోచించు కొని యనంతరము మెల్లమెల్లగా—“ మీరెంతయో కష్టమునకు సహించి యిచ్చట నుండుటకంటె నేనే యీ రాత్రి యీ హంతకు

రాలిని గాచుకొని యుండెదను—ఒక్క నిమిషమైనను నిద్రింపబోను—నా యీ డేరాలోనే సావధానన్నై యుండెదను—నాకేమైన నపాయము కలుగునేమోయని మీరు శంకింపనక్కఱలేదు. నాకాభయ మెంత మాత్రమును లేదు. మీరు రేపు తెల్లవాఱినతోడనే వచ్చి దీనిని ఘటజాబానునకు బంపివేయవచ్చును" అనియెను.

అమరేంద్రు డా రాత్రి యా డేరాలోనుండుట కుంజ కెంత మాత్రము నిష్టములేకుండెను. అందులకు గారణమేమో యమరేంద్రున కెంత యోచించినను బోధపడుటలేదు. అందుచే నాతడు మరల నేమియో సమాధానము చెప్పబోవుచుండగా కుంజ యాతని నిక మాటాడనీయక—"వలదు. మీరు వెడలిపొండు! నాకేమియును భయములేదు—ఈ రాత్రి యంతయు నిచ్చట నేనే కాచుకొని యుండెదను!" అనియెను.

కాని యమరేంద్రు డింకను సంశయించుచునే యుండెను. కుంజ యప్పు డాతనిం గాంచి యించుక తీవ్రస్వరముతో—"అట్లయినచో మీకు నాయందు గూడ నమ్మకము లేదా?" అని ప్రశ్నించెను.

అమరేంద్రుడు వ్యగ్రభావముతో—"లేకేమి? అదికాదు—నేను పొరపాటు పడితిని—ఏమైననేమి—నేను పోయెదను, మరల రేపు తెల్లవాఱినతోడనే యిచ్చటికి వచ్చెదను" అని యాతడు గమనోద్యుక్తు డగుచుండగా కుంజయును జటాలున లేచి—"ఇంచుక సేపు వేచియుండుము! మీకు సాయముగా నెవ్వరినైన బంపెదను. ఒకవేళ మార్గమధ్యమున లోచను డడ్డగించునేమో? నాకనుమానముగా నున్నది" అనియెను.

తోడనే యామె విశ్వాసముగల యిరువురు మనుష్యులను బిలిపించెను. వారు లాంతరులను బట్టుకొని యమరేంద్రునకు సహాయముగా బయలుదేఱిరి. అమరేంద్రుడు వారి సహాయముననే నతిసులభముగ బోటునొద్దకు జేరుకొనియెను. అతడాయాసముచే నలసి యుండుటచే బోటు జేరినంతనే లోపలికి బోయి శయనించెను.

# ప్రకరణము 34

మాయలాడియగు రాసమణి వలన నేసంగతి తెలిసినను, తెలియకపోయినను నొక్క విషయము మాత్రము స్పష్టముగా తెలియ వచ్చుటచే నాతని హృదయ మత్యంతము నానంద తరంగితమైపోవు చుండెను. ఆతడు తనలో—"కుంజ నిశ్చయముగా మందులబాలిక కాదు—ఆమె తప్పక బంగాళీల బిడ్డయై యుండును. నిజముగా గుంజ సత్కుల సంజాతయే కాకయున్నచో నట్టి రూపగుణ గౌరవములు నీచజాతి బాలిక కెట్లు లభించును? కుంజ నిజముగా నమూల్యుని యాత్మీయుడగు నానందకుమారుని యపకృతకన్యయే యైయుండ వచ్చును. క్రూరులగు నీమందులవా ళ్ళచ్చటినుండియే యీమె నపహరించి తీసికొని వచ్చియుందురు. ఆ గ్రామముపేరేదియో డాంగా యని రాసమణి చెప్పినదిగదా! బాగుగ బ్రయత్నించినచో దెలిసి కొనుట యసాధ్యముకాదు—అట్లయినచో నేను తప్పక కుంజను బెండ్లియాడవలసి యున్నది. ఔను, ఏల పెండ్లియాడగూడదు? ఆమె నన్ను మనఃపూర్వకముగ బ్రేమించినది—మూడుసారులు నా ప్రాణ రక్షణమును గావించినది. ఈ నా శరీరమును బ్రాణములును గూడ నామెవియే—ఆమె సౌందర్యవతికి సద్గుణవతి; చారుమతి—అట్టి సతీరత్నమును బడయగలిగినచో నా జన్మము సార్థకమగును. నాజీవితము సుఖజీవితమగును—కాని యింతకాలమువఱకు నామె మందులవాళ్ళతో గలసియున్నది. ఇప్పటికి సర్వగుణాలంకృతయగు నభినవ యౌవనవతియైనది. నేనట్టి కన్యను బెండ్లియాడినచో సమాజము వారుగాని, నాబంధువులుగాని, మిత్రులుగాని యేమైన ననుకొందు రేమో?—ఏమనుకొనుటకును నిందు దప్పేమున్నది? అన్ని సంగతు లను సంపూర్ణముగా దెలిసికొన్నచో నీ వివాహమున కందఱును గూడ నిశ్చయముగా నానందింపక పోరు. ఎవ్వరి హృదయముల యందు దయయును, జాలియు, నభిమానమును లేకుండునో, ఎవ్వరు

కేవలమును నృశంసులై యుందురో యట్టివారుమాత్ర మీ వివాహ
మును గూర్చి నిందించెదరు. కాని మానవ హృదయము గలవా
రెవ్వరు నీవిషయమున నేమియు ననజాలరు—నిరర్థకమును, నిర్దయాత్మ
కమునగు సంసారమునకును, సమాజమునకును లోబడి యూరక
నాజీవిత సుఖమును నేనేల నష్టపఱచుకొనవలయును? అందువలన
నాకేమి ప్రయోజనమున్నది? ఈ సంసారమునందు నాయాత్మీయు
లలో నొక్క నీలరతనబాబు మాత్రమే యున్నాడు; మిత్రులలో
నమూల్యు డొక్కడున్నాడు. ఈ యిరువురును గూడ నీవివాహముం
గూర్చి యెట్టి యాక్షేపముం జేయక పరమానందముతో నంగీకరింతు
రని నాకు నమ్మకమున్నది" అని భావించుకొన దొడంగెను.

అమరేంద్రునకు జిన్నతనమునందే తల్లిదండ్రులు లోకాంతర
గతులైరి. నీలరతనబాబే యాతని బెంచి యింతవానినిగా జేసెను.
అమరేంద్రుని తండ్రి సంపాదించిపెట్టిన ఆస్తివలన నాత డేయుద్యోగ
మును జేయనక్కఱలేకుండ బెద్దమనుష్యునివలె మర్యాదగా జీవించు
టకు దగిన యవకాశ మున్నది. మఱియు నీలరతనబాబా యాస్తిని
బాగుగ గాపాడుటయేగాక యనేక విధముల వర్ధిల్ల జేసి యుండెను.
యెల్లవిధముల బితృసమానుడగు నొక్క నీలరతనబాబు నాజ్ఞకు
మాత్రమే యాతడు బద్ధుడు కావలసియుండెను. కాని యితరు లేమను
కొందురోయని యాత్మసుఖమును త్యజించుకొనుట కాతని కెంత
మాత్రము నావశ్యకము లేదు. నీలరతనబాబీ వివాహమున కెట్టి ఆక్షేప
మును జేయడని యమరేంద్రుడు దృఢనిశ్చయుడై యుండెను.

కుంజ విషయమున నాతని హృదయమునం దించుకను నస్పష్ట
ముగా సంశయము కలుగుచునే యుండెను. ఆమె యాతని ప్రాణ
సమానునిగ జూచుకొనుచున్నట్లు స్పష్టపడుచునే యున్నది. కాని
నిన్న సాయంకాలమునం దామె దృఢస్వరముతో నీవిట నుండవలదని
యమరేంద్రుని ప్రార్థనాపూర్వకముగ శాసించినది. ఎంత ప్రయ

తిష్ఠించినను రాత్రి యాతని జేరాలో నుండనిచ్చినదికాదు. ఈ విషయమున నామె యుద్దేశ మేమైయుండును! ఆమె హృదయ మెంత కోమలమో యంతటి నిశ్చలమైనది. ఆమె యెంత చనువు చూపు చుండెనో యాకస్మికముగ నంతటి స్వాతంత్ర్యమును ప్రకటించు చుండెను. పెండ్లిని గూర్చి మాటాడినప్పు డామె యెట్టి ప్రత్యుత్తరమును జెప్పలేదు. అందుచేతనే యాతనికా సంశయము!

అప్పు డాతడు మరల మనలో—“ కుంజ తన ప్రస్తుతావస్థంబట్టి తన హృదయాభిలాష నావలె నంత విస్పష్టముగా దెలుపుటలేదు. తనకు నాయందలి యనురాగము దుర్లభజనానురాగమని భావించి సంశయించుచున్నది. అందుచేతనే యామె నిరాశపడుచున్నది— భయపడుచున్నది. అంతేకాని, నాయెడల నామెకు విరక్తి యెంత మాత్రమును లేదు. అమృతరసము పొంగిపొంగి పొరలునట్లుగా వసంత కోకిలవలె నానాడు పాడిన పాటలో నామె హృదయభావ మంతయును విస్పష్టమగుటలేదా! నిన్నటి సంధ్యాసమయమున, నిర్జనంబగు నా తరుషండ మధ్యమున నేనామె ప్రాణిగ్రహణము గావించితిని. అప్పు డామె హృదయము నాకు బోధపడలేదా? నిశ్చయముగా నామె ప్రాణసమానముగా నన్ను ప్రేమించినది. ఇతరు లెవ్వరేమనుకొనినను నేనామెను దప్పక పెండ్లియాడెదను” అని భావించుకొనియెను.

ఈ యాలోచనలతో నాతనికా రాత్రి యంతయును నిద్దురయే లేదు. క్రమముగా దెల్లవారెను. అప్పు డమరేంద్రుడు కాల్యకరణీయములం దీర్చుకొని జేరాల యొద్దకు బోయి రాసమణిని వెంటబెట్టుకొని వచ్చి యామెను బోటుపై నెక్కించుకొని కలకత్తాకు దీసికొని పోయెను. బోటు కలకత్తా చేరునప్పటికి దొమ్మిదిగంట లయ్యెను. అమరేంద్రు డప్పుడు రాసమణి నా బోటునందేయుంచి సేవకుల కొప్పగించి తిన్నగా నమూల్యు నింటికి బోయెను.

# ప్రకరణము 35

భోజన మైనతరువాత నమరేంద్రుడు దమూల్యునితో జరగిన సంగతు లన్నియును జెప్పెను గానమణి చెప్పిన కుంజ పూర్వ చరిత్రమును గూడ దెలియజేసెను ఆమె జన్మస్థాన మేదియో డాంగా యని చెప్పినప్పు డమూల్యు డదరిపడియెను. అత డించుకసే పేమో యాలోచించుకొని—" ఈ సంగతు లన్నియును బత్తేదారునకు దెలుపవలదా ?" అనియెను.

అమ—తెలిపిన నాత డేమిచేయుగలడు ? గ్రుడ్డికన్ను మూసి నను దెఱచినను నొక్కటియే—మన తంత్రము సాగినచో నాగజ దొంగను మనమె పట్టుకొనగలము—అయినను నావిధాయుక కృత్యమును నిర్వహింపవలెనుగాదా ?

అని చెప్పి యమరేంద్రుడు ఫతేఆలీ జనకు బోయెను. ఫతేఆలీ యాతనిం గాంచి యాశ్చర్యముతో—" అమరబాబూ ! నీవగపడ కుండుటచే నాకు మతిపోయినట్లున్నది. మరల నేమి పుట్టిమునిగినదో యని భయపడుచున్నాను. విశేషము లేమి ?" అని యడిగెను.

అమ—ఆ దొంగవిషయమై కొంతవఱకు దెలిసికొనగలిగితిని. ఆ సంగతి చెప్పవలయుననియే మీయొద్దకు వచ్చితిని.

ఫతే—ఎంతవఱకు దెలిసికొంటివి ? అమరబాబూ ! నీవు లేకున్నచో నేనీపాటికి వ్యవహారము నే వదలుకొనియుందును.

అమ—వదలుకొన దలచినను మిమ్ముల నాదొంగ నిశ్చింతతో నుండనిచ్చునా ?

ఫతేఆలీ తత్తరపాటుతో—ఏమి ? మరల దొంగతనము జరిగినదాయేమి ?" అనియెను.

అమ—లేదు—కాని—శీఘ్రముగనే జరుగగలదు.

ఫతే—నీకెట్లు తెలిసినది ? మరల నెక్కడ జరుగును ?

అమ—ఎక్కడ జరుగునో మాత్రము చెప్పజాలను. కాని త్వరలో జరుగునని మాత్రము తెలిసికొనగలిగితిని.

ఫతే—ఎట్లు తెలిసినదో చెప్పుము!

అమ—ఆ గుఱ్ఱమొక మందులదానికడ నున్నదిగదా—మందులది యననేల? ఆమె లోచనుని భార్యయే. అది ఆ గుఱ్ఱమును మరల లోచనుని కడకు బంపించినది.

ఫతే—అలాగా? ఆ సమయమున నామనుష్యుని బట్టుకొన్నచో జాల బాగుగా నుండును.

అమ—ఆ సమయమందా? ఆ సంగతి నాకు దరువాత దెలిసినది. ఎట్లయిననేమి—నిన్న సాయంకాలమందొక కుఱ్ఱవాడా గుఱ్ఱమును దీసికొని పోయినాడు.

ఫతే—నిశ్చయముగా వాడాగుఱ్ఱమును లోచనుని యొద్దకే తీసికొని పోయియుండును. కాని అమరబాబూ! నీవావెంటనే యాగుఱ్ఱము నన్వేషించుచు బోవలసినది. తప్పుపని చేసినావు. నీవెన్నటికిని పత్తేదారుడవు కాజాలవు. పత్తేదారుపని యనిన సామాన్యకార్యమా? ఆ పని చేయుట కెంతవాడు కావలయును?

అమరేంద్రుడు నవ్వుచు—"ఔను. మీవంటి సమర్థులగు పత్తేదారు లెంతమంది యుందురు! అందుచేతనే మీకింతటి పెద్ద పేరు!" అనియెను.

దాంభికుడగు ఫతేఆలీ యమరేంద్రుని యెత్తిపొడుపును గ్రహింపజాలక పోయెను. అతడు స్ఫీతవక్షుడై నవ్వుచు—"అమర బాబూ! నీవు చెప్పినమాట నిజమే—కాదామరి—" అనియెను.

అమ—ఏమైననేమి? గుఱ్ఱ మిప్పుడు లోచనుని కడకు జేరినది. కావున శీఘ్రముగా వారల నింకొక దారిదోపిడి జరగి తీరును.

ఫతే—నీయూహ సరిగనే యున్నది. నాకు నట్లే తోచుచున్నది. కాని యీసారి యెచ్చట జరుగునో మాత్ర మూహింపవలసి యున్నది.

అమ—ఆ సంగతి ముందుగనే తెలిసికొనగలిగినచో మనమా దొంగల ననాయాసముగా బట్టుకొనగలుగుదుము.

ఫతే—ఆ మాట నిజమే. ఆ మందుల డాకీసీ యీ సంగతి సులభముగా జెప్పినదా? ఎట్లు చెప్పినది?

అమ—ఆ మాయలాడి సులభముగా జెప్పునా? నిన్నరాత్రి యా రాక్షసి నన్ను కత్తితో నఱుక వచ్చినది. అకస్మికముగ దప్పించుకొంటిని గాని లేకున్నచో నాజీవితము నిన్నటితో బూర్తి కావలసినదే. పోలీసువారి కొప్పగింతునని భయపెట్టి నేనామెవలన నీ సంగతు లన్నియును దెలిసికొంటిని.

ఫతే—ఆమెను దప్పక పోలీసువారి కొప్పగింపవలసినదే. హత్య చేయుటకు బ్రయత్నించుట కూడ హత్య చేసినట్లే—పద. దానిని బట్టుకొనవలయును. ఎక్కడ నున్నది?

అమరేంద్రున కామెను పోలీసువారి కొప్పగించుట యిష్టము లేదు. అందుచే నాతడు ఫతేఅలీ దనవెంట దీసికొని వచ్చునట్లు చెప్పక—"ఆమె మందులవాళ్ళ గుంపులోనే యున్నది" అనియెను.

ఫతేఅలీ నెత్తిపై మొత్తుకొనుచు—"అయ్యో! ఇట్టి బుద్ధిహీనునితో గలసి పనిచేయుట నాదురదృష్టముగాక మఱియేమి?" అని నిందించుకొన దొడంగెను.

అమరేంద్రుడు నవ్వుచు—"ఫత్తేదారుసాహెబూ! ఇప్పుడంత చిక్కేమి కలిగినది?" అనియెను.

ఫతేఅలీ అమరేంద్రునం గోపపూరిత నయనములతో దిలకించుచు—"ఏమైనదా! నీతెలకాయ మట్టిమైనది. అంత గొప్పకేసు చేతికి దొరకియు ధ్వంసమైనది—ఇంతవఱకా డాకీసీ కొఱకు కచ్చుట గనిపెట్టుకొని యుండుననుకొంటివా?" అనియెను.

అమ—ఆమె పాఱిపోజాలదు. మీరు కంగారు పడవలదు. దానిని నిర్బంధించి శిక్షించుట వలన లాభములేదు. అందువలన

దొంగలు దొరకినట్లు కాదు. ఇంతేకాక యీ సంగతి తెలిసినచో వారు పలాయితులై పోవుట కూడ దటస్థించును. కావున నారాయణసి వలన నిక నట్టి ఘోరకృత్యములను జరుగకుండ నామె నీదేశము నుండి వెడలగొట్ట దలచితిని. అట్లు గాక ప్రయత్నించెదను. ఫయజాబాదులో నామె సోదరి యున్నదట! అక్కడకు దానిని బంపించెదను.

ఫతేఅలీ వెఱ్ఱిమొగము పెట్టుకొని యమరేంద్రునివంక నదేపనిగ జూడదొడంగెను. యమరేంద్రుడు నవ్వు నాపుకొనజాలక పకాలున నవ్వివైచెను.

## ప్రకరణము ౨౮

ఫతేఅలీకి గోపము వచ్చెను. అతడు భీషణ భ్రుకుటియై యమరేంద్రునివంక జూచెను. అమరేంద్రుడు గంభీర భావముతో— "పత్తేదారు సాహెబా! నేనేపనియైన న్యాయముగా జేయదలచుకొనలేదు. ప్రతిఫలాపేక్షతో నేను బనిచేయుటలేదు. కార్యసిద్ధియైనచో గొప్పతనమంతయు మీదేకాని నాదికాదు. ఈ సంగతి నేననేక పర్యాయములు మీతో జెప్పియున్నాను. ఈ యాడు ముండను బట్టుకొన్నచో అసలు దొంగను బట్టుకొనుట కవకాశముండదు!" అనియెను.

ఫతేఅలీ గంభీర భావముతో— "ఔను. నీవు చెప్పినమాట నిశ్చయమే" అనియెను.

అమ—అందుచేతనే మీకిప్పుడు మరల జెప్పుచున్నాను. ఏవిధము చేసైనను నేనాదొంగను బట్టుకొని మీకొప్పగించెదను.

ఫతే—నీవు వట్టి డంబములు కొట్టుచున్నావు. కాని నాకు మాత్ర మాయాశ యించుకంతయును లేదు.

అమ—తిరువాత మీరే చూడగలరు. ఈ విషయమున నాకు మాత్రము కావలసినంత యాశ యున్నది.

ఫతే—ఈ మాటకేమి ? పని జరుగవలయును. ఇప్పుడు నేనేమి చేయవలయునో చెప్పుము.

అమ—మీరామందులవాళ్ళగుంపును గాచుకొని యుండవలయును. ఎప్పటికైన లోచను డచ్చటకు రాక మానడు.

ఫతే—పోలీసువారిని మారువేషములతో గాచుకొని యుంచుమనట్లిదివఱకే యేర్పాటు చేసితినిగాదా ?

అమ—ఔను. కాని వారేమిచేయుగలరు ? ఆ లోచనుని గూఢ వ్యాపారములను వారు తెలిసికొనగలరా ?

ఫతే—సరే—ఇంతగొడవ యెందులకు ! ఇప్పుడు నన్నేమి చేయుమనియెదవు ?

అమ—మీరొకటి రెండు దినము లచ్చటనుండి యంతయును గనుపెట్టుచుండుడు !

ఫతే—సరే, అట్లే చేసెదను, అంతమాత్రమున నేమి ప్రయోజన మున్నది ?

అమ—రెండు మూడు దినములలోనే మరల దొంగతనము జరుగునని నాదృఢవిశ్వాసము. గుఱ్ఱము లోచనుని కడకు జేరినది. నేడో రేపో తప్పక దొంగతనము జరుగక మానదు. ఇక్కడ గాకున్న మఱియొకచోటనైన జరగి తీరును. మీరచ్చట గాచుకొని యున్నచో లోచనుని జాడ యేమైన దెలియుట కవకాశ ముండును.

ఫతే—మంచిది. అట్లే చేసెదను. ఇక నీవేమి చేయుటకు నిశ్చయించుకొంటివి ?

అమ—నాకు కుంజ విషయమున గొన్ని రహస్యములు తెలియ వచ్చినవి. ఆ సంగతులు దెలిసికొనుటకై నేను పోయెదను.

ఫతేఆలీ యానందముచే నవ్వుచు నమరేంద్రుని వెన్నుపై గొట్టుచు—"ఏమేమి సంగతులను దెలిసికొంటివో నేను విన గూడదా ?" అనియెను.

అమరేంద్రున కదియంతయు నసహ్యముగా దోచెను. ఆతడు కోపము నడంచుకొని—“ కుంజ బంగాళీల బిడ్డయని తెలియ వచ్చినది. చిన్నతనమునందే మందులవాళ్ళామె నపహరించి తీసికొని వచ్చి యుండిరి !” అనియెను.

ఫతేఅలీ పరమోత్సాహముతో “ ఆలాగా ? గట్టిపట్టే పట్టితివి !” అనియెను.

అమ—వాళ్ళెత్తుకొని వచ్చినప్పటికి కామె వయసు రెండు వత్సరములు మాత్రమే యుండెను.

ఫతే—ఎత్తికొనివచ్చినవా రెవ్వరు ?

అమ—ఇంకెవ్వరు ? ఆమాయలమారియుండయు, లోచనుడును.

ఫతే—అట్లయినచో జాల మంచికేసే—మొత్తమమీద బది సంవత్సరములకు దక్కువ శిక్ష పడదు.

అమ—అట్లయినచో మీరీనేరమునకే వారిని నిర్బంధించి శిక్ష చేయింప దలచుచున్నారా !

ఫతే—అట్లేల చేయకూడదు ? దొరతనమువారు మాకు వేతనము లిచ్చుచుండుట మాముక్కు మొగము, చక్కదనము జూచియా !

అమ—ఫత్తేవారు సాహెబా ! ఈగందరగోళ మంతయు నిప్పటికి గట్టిపెట్టుము ఇది పట్టుకొని ప్రాకులాడుచున్నచో బందిపోటు దొంగను బట్టుప్రయత్నమున గేవలమును గొంచెనయ్యెపోవును.

ఫతే—నీమాటలనునమ్మి యిదివఱకే నేనెన్నియో మంచి మంచి కేసులను విడిచివైచితిని. ఇది కేవలము శాసనవిరుద్ధమైనపనియే. ఇట్టినేరములను బట్టుకొన్నచో మంచి పేరుకూడ వచ్చును.

అమ—ఆ దొంగను బట్టుకొనుట మనకిప్పు డావశ్యకకృత్యమై యున్నది. తక్కిన వన్నియు దరువాత జూచుకొనదగిన పనులు !

ఫతే—దొంగ యెంతమాత్రమును దొరకుటయే లేదు. దొరకిన మంచికేసు లన్నియును మంట గలసిపోవుచున్నవి. ఎంత యవివేకము ! నీవంటి మూఢుని చేతులలో బడుటచేతనే నాకీగతి కలిగినది.

అమ—అయినదేమో యైపోయినది. ఇక నొకటి రెండు దినములుమాత్ర మోపికపట్టి యుండుము! శీఘ్రముగనే మన కార్యసిద్ధి కాగలదని నాకు జాల నమ్మకముగా నున్నది.

ఫతే—ఇన్నాళ్ళనుండి నీవు చెప్పినట్లు చేయుచు నిప్పుడు మాత్రము చేయుననిన దప్పునా? కాని యీసారిమాత్రము నీమాట వినియెదను. ఇక నెన్నడు నట్లు జరుగదని స్పష్టముగా జెప్పుచున్నాను. నీమూలమున నేను చాల మంచి కేసులను ముంటగలిపివైచితిని.

అమరేంద్రుడిక మారుమాటాడక తాను ఘట్టమున విడిచి వచ్చిన బోటుకడకు బోయెను. రాసమణిని దీసికొనివచ్చి యమూల్యుని సేవకులలో నెవ్వనిచేనైన నామెను బశ్చిమమునకు బంపివైవవలయునని యాతని యుద్దేశము. పోలీసువారిచే బంపించుట యాతని కిష్టము లేదు. అమరేంద్రుడప్పుడు బోటులోనుండి రాసమణిని క్రిందికి దింపించెను. అప్పు డామె యచ్చట నెవ్వరిని జూచినదో కాని యాత్రముతో—"అమరబాబూ! ఇదిగో! మాసోదరి యిచ్చటనే యున్నది" అనియెను.

అమరేంద్రుడత్యాశ్చర్యముతో నామె వ్రేలిజాడనే చూచెను. వెంటనే యాతడు తనలో—"ఈ జిత్తులమారిముండ మరల నేదో పన్నాగము పన్నుచున్నది!" అని భావించుకొని—"రాసమణీ! నీ సోదరియా?—ఆమె ఫరుజాబాదులో నున్నదంటివి కాదా?" అనియెను.

రాసమణి యుత్సాహావేగముతో లేచి—"కాదు—కాదు—ఇదిగో! ఆమె యీ రేవులోనే యున్నది. చూడుడు! మెడలోతు నీళ్ళలో నిలువబడి యున్నది!" అని చెప్పుచు నామె యతివేగముగ నావైపునకు బరుగెత్తుచుండెను. ఆ మాయలాడి తన చేతులనుండి యెక్కడ దప్పించుకొని పోవునోయని యమరేంద్రుడు కూడ నామె వెనువెంటనే పరుగెత్తెను.

కాని యామె నిజముగనే రేవులోనికి బోయి మోకాలిలోతు నీళ్ళలోనికి దిగి యెవ్వరినో—"సోదరీ! సోదరీ!" అని పిలుచు చుండెను ఆ పిలువబడిన యామె యత్యాశ్చర్యముతో రాసమణిం గాంచి—"అక్కా! నీవిక్కడ కెట్లు వచ్చితివి?" అనియెను. రాసమణి యేమియో చెప్పి యామె కమరేంద్రుని జూపించెను. తరువాత వారిరువురు నమరేంద్రుని యొద్దకు వచ్చిరి.

అప్పుడు రాసమణి—"అమరబాబూ! నాసోదరి ఆ గాయకురాలితో గలకత్తాకు వచ్చినది నేను ఫయజాబా దెవ్వరియొద్దకు బోవుదును?" అనియెను.

అమరేంద్రు డామె మాటలకు విశ్వసింపలేదు. ఇది యంత యును దాసి పన్నాగమే యని యనుమానించి యాతడా రెండవ స్త్రీని జూచి—"ఈమె నీసోదరియేనా?" అని ప్రశ్నించెను.

స్త్రీ—అవును. మేమిరువురము నక్క చెల్లెండ్రము. ఈమె లో చనుసి బెండ్లియాడినది. నాభర్త మరణించుటచేత నేను చాకిరి చేసికొని బ్రదుకుచున్నాను.

అమ—అలాగా? నీవెవ్వరియొద్ద దాసిగా నుండి పని చేయుచున్నావు?

స్త్రీ—ఒక సానియొద్ద.

అమ—ఆమె పేరేమి?

స్త్రీ—ఆమె పేరు మనియాబీబీ.

ఆ పేరు విన్నతోడనే యమరేంద్రు డాశ్చర్యావిష్టహృదయుడై పోయెను. నేనడిగియున్న మనియాబీబీయేనా యని యాతడు మనసులో ననుమానించి యా స్త్రీ నుద్దేశించి—"మీయజమానురాలిప్పుడు మూర్షిదాబాదు నుండియేనా యిక్కడకు వచ్చినది?" అని ప్రశ్నించెను.

స్త్రీ—అవును. మేము మరల నొకటి రెండు దినములలో ఫయజాబాదునకు బోయెదను.

రాస—అమరబాబూ! అట్లయినచో నేను వీరితోడనే కలసి పోయెదను.

అమరేంద్రుడు సాధారణముగ వదలువాడు కాడు. అతడా స్త్రీని జూచి—"మీ మనియాబీబీ మూర్షిదాబాదునుండి యిచ్చటకు వచ్చి యున్నదా? అట్లయినచో నేనామెతో మాటలాడవలయును. నడువుము. అక్కడకు బోవుదము. మనియాబీబీ యీ రాసమణిని దనవెంట దీసికొనిపోవుట కంగీకరించినచో నీమె నచ్చట విడిచి పెట్టెదను. అంగీకరింపకున్నచో నేనీమె నెంతమాత్రమును విడువజాలను" అనియెను.

అప్పుడా స్త్రీ యమరేంద్రునివంక విస్మయముతో జూచి—"సోదరీ! ఏమి చేయుదము?" అనియెను.

అమ—నీవు మీసోదరి యాలోచన నడుగుచున్నావా! ఈమె సాధారణురాలుకాదు—సకలగుణ సంపన్నురాలు! మొట్టమొదట నీమె నన్నొకసారి యొక పడవలో బంధించివైచినది. తరువాత నన్ను నిశిత కరవాలముతో నఱకవచ్చినది. ఇంతేకాక ఈమె లోచనునితో గలిసి యీ బందిపోటు దొంగకు సాహాయ్యము చేయుచున్నది. ఇంతటి యామెదానిని నేనెచ్చటను జూడలేదు. నేను దయ చూపకున్నచో దీనికీపాటికి బదిసంవత్సరములు కారాగృహశిక్ష కావలసినదే!

ఆ స్త్రీ భయముచే గడగడ వడకుచు—"బాబూ! మీరు పోలీసు కర్మచారులా?" అనియెను.

అమరేంద్రుడు గంభీర భావముతో—"అట్టివాడనే యని భావించుకొనుము!" అనియెను.

ఆమె మఱింత భయభ్రాంతయై చటాలున నొకించుక వెనుకకు జరగి నిలువబడియెను. అప్పుడు రాసమణి—"అమరబాబూ అట్లయినచో నన్నిప్పుడేమి చేయుమనియెదరో చెప్పుడు!" అనియెను

అమ—నేను మణియాబీబీని బాగుగ నెఱుంగుదును. ఆమె నిన్ను ఫయజాబాదునకు దనవెంట దీసికొని పోవదలచినచో నామె

యొద్ద నొప్పగించి వచ్చెదను. ఈ సమాచార మంతయు కేవల మసత్యమే యైనచో నిప్పుడే కారాగృహమునకు దీసికొనిపోయి పోలీసువారి కొప్పగించెదను.

అప్పుడా రెండవ స్త్రీ తత్తరముతో—"అంతపని యెందులకు బాబూ! ఇందసత్యము చెప్పవలసిన యావశ్యకమేమున్నది? నాతో గూడ రండు! మిమ్ములను మనియాబీబీ యొద్దకు దీసికొని పోయెదను.

అమరేంద్రుడు రాసమణిని వెంటబెట్టుకొని యా స్త్రీతో గూడ బయలుదేఱెను. ఆ స్త్రీ యాతని మేఛువాబజారునందలి యొక మందిరమునకు దీసికొని పోయెను. ఆ మేడపై నొక గది నిలువుటద్దములు మొదలగు వానిచే నాడంబరముగా నతిసుందరముగా నలంకరింపబడి యుండెను. అమరేంద్రుని గాంచినంతనే మనియాబీబీ మందహాస వదనముతో నతివేగముగ నాగదినుండి వెలువడి యాతని కెదురువచ్చి—"మీదర్శనము లభించుటచే నీదినమున నేనెంతటి యదృష్టవంతురాలనైతిని! దయచేయుడు! లోనికి రండు!" అనియెను.

అమ—నేనిప్పుడు కార్యార్థినై యిచ్చటికి వచ్చితిని. కావున నా సంగతి ముందుగా వినవలయును.

మని—అంత తొందర పడియెదరేల? దయచేయుడు—దాసీ! రత్నకంబళమును దీసికొనిరావే!

అమ—నాకిప్పుడు మనస్స్థిమితము లేదు. చేయవలసిన తొందర పనులు చాలగ నున్నవి. ఒక సంగతిమాత్రము నీవలన దెలిసికొని పోదలచి వచ్చితిని.

మని—అలాగే—క్రమముగా నన్నిసంగతులను మాటాడు కొనవచ్చును. దయచేయుడు! ఆ దొంగ సమాచార మెంతవఱకు దెలియవచ్చినది? ఇప్పటికి మీ రెంతవఱకు బనిచేసితిరి? నిజముగా మీరు పందె మోడిపోయినట్లేనా?

అమరేంద్రుడు నవ్వుచు—"ఇంకను నోడిపోలేదు—శీఘ్ర కాలములోనే యా దొంగను బట్టితెచ్చెదను" అనియెను.

మనియాబీబీ మందహాసము చేయుచు—"ఎంత సమర్థులైనను మీరా దొంగనిక బట్టుకొనజాలరు బాబూ!" అనియెను.

అమ—సరే. ఆ సంగతి తరువాత నీకే తెలియును—కాని నేనా దొంగను బట్టుకొనలేదని నీకింత యావేగమేమి?

మని—కాదా మరి! నేనా దొంగ భయముచే నెన్నియో సంగీత సభలకు బోవజాలనైతిని. నాకెంతయో సొమ్ము నష్టమై పోయినది. ఆ దొంగ యెంతకాలమునకు బట్టువడడో యంతవఱకును నా వ్యాపార మాగిపోవలసినదే కదా!

అమరేంద్రుడు మత్సాహపూరిత హృదయముతో నామాట చెవిని బెట్టకుండగనే—"ఇప్పుడీ మాటలకేమి—నేను వచ్చినపని చెప్పెదను వినుము!" అనియెను.

మని—చెప్పుడు!

అమరేంద్రుడప్పుడు రాసమణి వృత్తాంత మంతయును సవిస్తరముగా నామెకు జెప్పెను. మనియాబీబీ యంతయు నాలకించి భయముచే గడగడ వణకుచు—"ఎంతటి దారుణ సమాచారము! ఇట్టి రాకాసి యాపదాసిని నాయొద్దమాత్ర మెట్లుంచుకొందును!" అనియెను.

అమ—అట్లయినచో దప్పకుండ నేనీమె నిప్పుడే పోలీసువారి కొప్పగించుటకు బాధ్యుడను కావలసి యున్నది.

అప్పుడామె దాసి కన్నుల నీరు పెట్టుకొనుచు దీనస్వరముతో—"బాబూ! ఈమె నా సహోదరి. మీవంటివారు రక్షింపకున్నచో నిక దీనికి గత్యంతరమేమున్నది? ఇది యెక్కడకు బోయి యుండగలదు?" అనియెను.

మనియాబీబీ యామె భయసంచలిత దీన భాషణంబులకు జాలిచెంది—"అమర బాబూ! నే నొకటి రెండు దినములలో ఫయిజాబాదునకు బోయెదను. ఏమి చేయుదును? దీని దుఃఖమును జూడజాల

కున్నాను. దానితోటికే రాసమణిని గూడ దీసికొని పోయెదను—పాల కోఱకు ఆఁతిని గూడ మోయవలయునుగాదా ?" అనియెను.

అమ—అట్లు చేయుటకు నీవు మనఃపూర్వకముగ నంగీకరింతువేని నేనీమెను నీకొప్పగించి పోగలను.

ముని—అట్లే చేసెదను. ఇది నా దాసికి సోదరి. దీనికి నేను సాయము చేయకున్నచో మఱి యెవ్వరు చేసెదరు ? దీనిని ఫయజాబాదునకు దీసికొని పోయినచో నచ్చట దీని కెట్టి దుష్టసహవాసమును గలుగబోదు !

అమ—అట్లయినచో నీయిష్టము వచ్చినట్లు చేయుము. నీయందలి నమ్మకముచేతనే నేనీమెను విడిచి పోవుచున్నాను.

అని చెప్పి యమరేంద్రుఁడు లేచెను. అప్పుడు మునియాబీబీ—"తొందర పడియెదరేల ? కూర్చుండుఁడు. ఇంచుక నీవు తంబాకు సేవించి మఱి పొండు !" అనియెను.

అమ—క్షమింపుము ! నాకు జాల పనియున్నది పోవలయును. మఱియొకప్పుడు మగల వచ్చి చూచెదను.

అని చెప్పి యమరేంద్రు డటనుండి వెడలిపోయెను.

## ప్రకరణము 37

అమరేంద్రు డింటికి వచ్చునప్పటి కమూల్యుఁ డింటియొద్ద లేఁడు. అతఁ డావశ్యకమగు పనిమీఁద గ్రామాంతరము పోయినట్లు తెలియ వచ్చెను. ఎక్కడకు బోయెనో స్పష్టముగా దెలియ లేదు. అతని కేమియు దోచకుండెను. అమూల్యామరేంద్రు లాలోచించి యిది వఱకే యొక గొప్ప జమీందారుఁడు విశేషధనముతోడను, జవాహరితోడను బయలుదేఱి హుగ్లీకి బోవునని యా చుట్టుపక్కల బ్రచారము గావించి యుండిరి. ఆ దినమున వారే యొక పల్లకిపై

జమీందారు వేషములతో గూర్చుండి ప్రయాణము చేయుటకు నిశ్చయించుకొనిరి. ఆ గడువుదినము నేటికి నాలుగురోజులు మాత్రమే యుండెను. మంచి బలిష్ఠులగు పల్లకీ బోయీలు పల్లకితోబోయి కాచుకొని యుండుటకు సంకేత స్థానము కూడ నిర్ణయింప బడియెను.

అమరేంద్రుడమూల్యుని రాక కాత్రముతో నిరీక్షించుచుండెను. రేపు గడువుదినమనగా నానాటి సాయంకాలమున నమూల్యుడును వచ్చెను. అమరేంద్రుడుత్సాహముతో— "అమూల్యా! చెప్పకుండ నెక్కడకు బోయితివి? నీవు లేక నాకేమియును దోచుటలేదు!" అనియెను.

అమూల్యుడు నవ్వుచు—"తోచకున్నచో జందన నగరము పోలేకపోయితివా?" అనియెను.

అమ—అమూల్యా! కుంజ సంగతి తెలుసుకొను వఱకును నామనసు కుదురుగా నుండదు.

అమూ—అనుకూల దినములు వచ్చినప్పు డన్నియును గుదురుగనే యుండును. నీకిప్పు డింత తొందరయేల?

అమ—తొందర కాదా? నా ప్రాణరక్షణమును గావించిన యామె నుద్ధరించుట నాకు విధాయక కృత్యము కాదా?

అమూ—అవును. అది యొంతపని—. నేనెంతయో తొందరపడి వచ్చితిని. అనేక ప్రాణులను దల్లడిల్ల జేయుచున్న యా దొంగను గూర్చి యేమిచేయదలచితివి?

అమ—మనమీరాత్రియే బయలుదేఱి పోవలయును.

అమూ—సరే. అట్లే పోవచ్చును. వాడు మరల దొంగతనము చేయుటకై వచ్చునని నమ్మక మేమున్నది?

అమ—మనము ప్రచారము చేసిన వార్త వారికి దెలిసియే యుండును. అందుచేతనే లోచనుడు గుఱ్ఱమును దన యొద్దకు దెప్పించుకొనియెను. కావున దప్పకుండ దొంగతనము చేయుటకే వాళ్ళు సంసిద్ధులై యుందురని నాకు సంపూర్ణ విశ్వాస మున్నది.

అమరా—సరే. అట్లయినచో బోవుదము !

ఆ రాత్రి భోజనము చేసి వారిరువురును గుండ్లతో గూడ రివాల్వరులను సిద్ధము చేసికొని రహస్యముగా నొక బోటుపై నెక్కి బయలుదేఱిపోయిరి. తెల్లవాఱుజామునకాబోటు హుగ్లీ నగరమునకు జేరుకొనియెను. అప్పుడా యిరువురును బోటును రేవులో విడిచి చేలగట్లపై గాలిబాటను నడచి పోవుచుండిరి. ఎవ్వరైన జూచిపోవుదు రేమోయని వారు నలిగిన త్రోవను విడిచి చేలనడుమనుండి బయలుదేఱిరి

హుగ్లీ స్టేషనునుండి పశ్చిమముగా నైదాఱు క్రోశముల దూరము వఱకును సస్యక్షేత్రమే కాని యెచ్చటను నెట్టి పల్లెయును లేదు. ఆ బయటి నడుమనుండి హుగ్లీ నగరము వైపునకొక కాలిబాట యున్నది. ఆ త్రోవను బగటివేళ కూడ నంతగా జనసంచారముండదు. ఇక రాత్రివేళ జెప్పవలసినదేమి ? ఇంతకు బూర్వ మీప్రదేశమున నొకటి రెండు దారిదోపిడులు జరుగుటయే యందులకు గారణము.

అమరాల్యామరేంద్రులు బయలుదేఱునప్పుడు కొన్ని యాహార పదార్థములను వెంట దీసికొని వచ్చియుండిరి. వారప్పుడొక చెఱువు నొడ్డున గూర్చుండి యా పదార్థములను భుజియించి యనంతర మొక మహీరుహచ్ఛాయకు జేరి రాత్రి యగుటకు బ్రతీక్షించుచుండిరి. అప్పుడమరాల్యుడు—"అమరా ! రాత్రియంతయును జాల గందరగోళములో బడియుండవలసి యున్నది. ఇప్పుడించుక సేపు నిద్రించినచో బాగుగ నుండును" అని చెప్పి యాతడా చెట్టుపీడను శయనించి సుఖనిద్రా మగ్నుడయ్యెను. అనేక కారణముల మూలమున నమరేంద్రుని హృదయము సంచలితమును, సముద్వేలితము నగుచుండుటచే జాల దినములనుండి యాతని కంటికి నిద్రయనుమాటయే లేకయుండెను.

అప్పుడమరేంద్రుడు తనలో—"ఏమి జరుగనై యున్నదో ? ఇప్పుడాదొంగ తప్పక వచ్చునా ? మా యుపాయము ఫలించునా ?

వాడు రాకయే యున్నచో బరిహాసశీలుడగు నీయమూల్యుని యెదుట నేను తలయెత్తుకొని నిలువబడగలనా ?—కాని మా యీ ప్రయత్నమును గూర్చి యితరు లెవ్వరికిని దెలియదు. మే మేర్పఱచియుంచిన పల్లకి బోయులకు గూడ మా యుద్దేశ మించుకంతయును దెలియదు. ఈ రహస్యము నెవ్వరికిని దెలియదు. ఫతేఅలీ సాహేబునకును దెలియదు. ఒకవేళ నాదొంగ రాకయే పోయినచో, నాతని నెట్లయిన బట్టుకొన జాలకయే పోయినచో నిష్ఫల ప్రయత్నము వలనం గలిగిన నాపరాభవమును గూర్చి యొక్క యమూల్యునకుదక్క నితరుల కెవ్వరికిని దెలియజాలదు" అని భావించుకొన దొడంగెను.

అమరేంద్రుని హృదయము నీవిధముగా నాదొంగను గూర్చిన యాలోచనలచేతనే కొట్టుకొని పోవుచుండగా నిక గుండను గూర్చి భావించుకొనుట కవకాశ మెక్కడనున్నది ? అయినను వేయిసారు లామె మృదుమధుర భాషణము లాతని చెవుల బ్రతిధ్వనించుచునే యుండెను. ఆమె సుందర వదన మండల మాతని కన్నుల గట్టినట్లగపడుచునే యుండెను.

క్రమక్రమముగా సంధ్యాసమయము కాజొచ్చెను. అప్పుడు వారిరువురును దామిదివఱ కెచ్చట బల్లకి నుంచున ట్లేర్పాటు చేసియుండిరో ఆ ప్రదేశమునకు బోయిరి. రాత్రి తొమ్మిదిగంటలైనతరువాత నా నిర్జన ప్రదేశమున వారిరువురు నాపల్లకి నధిరోహించిరి. అంత నా నలువురు బోయలు నుచ్చైస్స్వరమున నోంకార శబ్దమును జేయుచు బల్లకిని మోచికొని పోవుచుండిరి. అప్పు డమరేంద్రు డమూల్యునిం గాంచి—"అమూల్యా ! నీవావైపున దృష్టి నిలిపి జాగ్రత్తగా బరిశీలించుచుండుము—నేనీవైపున జూచుకొనుచుండెదను" అనియెను.

అమూ—ఇప్పుడు మనమనుకొనునట్లు వచ్చుటయే నిశ్చయమగునేని వాడే మనకొఱకు గనుపెట్టుకొని యుండును.

అమ—నిశ్చయముగా వచ్చును—వచ్చునని నాహృదయము స్పష్టముగా జెప్పుచున్నది. వాడు వచ్చినంతనే ముందుగా నివాగట్టి ముసు లక్ష్యముచేసి రివాల్వరును గాల్చవలయును. నేను కూడ నట్లే చేసెదను. ఆ గుఱ్ఱము పడిపోయినచో నిక వాడు పలాయితుడు కాజాలడు.

అమూ—మనమూరక కాలనేమి జపము చేసికొనుచు కూరుచుండుటయేగాని నిజముగా వాడు వచ్చునో రాడో యెవ్వరు చెప్పగలరు?

అమ—నిశ్చయముగా వచ్చును.

కాని యమరేంద్రు డామాట దృఢముగా జెప్పుట కాతని హృదయమునందప్పుడు నూఱు సంశయములు తోచెను. అతడు బలవంతముగా నాసంశయములనన్నిటిని హృదయమునుండి దూరముగ ద్రోసివైచెను. అప్పు డాతని హృదయ మతితీవ్రముగ కొట్టుకొని పోవుచుండెను.

అతివేగముగ నడచుచున్న పల్లకి యప్పు డాకస్మికముగ నాగి పోయెను ఎవ్వరో కాని తీవ్రస్వరముతో—"ధనమును భూషణములను నేమేమి యున్నవియో వానినన్నిటి నిటు తెమ్ము! లెత గామే యిచ్చివేయవలయును! శీఘ్రము—శీఘ్రము—ఊయుకున్నచో నీదగో జూచితివా? ఈ రివాల్వరులతో నీతల యెగిరిపోవును. జాగ్రత్త!" అని యదలించుచుండిరి.

అప్పుడా యిరువురును బల్లకిలోనుండియే తలలువంచి వెలుపలికి జూచిరి—ఒక నల్లని పెద్ద గుఱ్ఱముపై నొక వ్యక్తి—ఆ ముఖముపై ముసుగు—ఆ చేతులలో బారుచేసిన రివాల్వరులు—సరిగా మార్గమధ్యమునందే నిలిచి యుండెను—ఆ వ్యక్తిం గాంచినంతనే బోయలు స్తంభితులై నిలువబడిపోయిరి.

"ఈసారి యేమనియెదవు?" అని యమరేంద్రు డమూల్యుని వెన్నుపై జఱచి గుభాలున బల్లకినుండి క్రింది కుఱికెను. తోడనే

యాతడు గుఱ్ఱమునకు గుఱిపెట్టి రివాల్వరును ప్రేల్చెను— అమూల్యుని మాత్రి మూరకుండెనా! అవ్వలినైపునుండి యాతడు కూడ నాఱికి రివాల్వరును ప్రేల్చుచుండెను.

వారిరువురును బల్లకినుండి వెలుపలికి వచ్చినంతనే యాదొంగ నిమిషములో గుఱ్ఱమును మరలించి చబుకుతోఁగొట్టి శరవేగమున బరుగెత్తింప దొడంగెను. అమూల్యామరేంద్రులుకూడ నావెనుకనే పరుగెత్తుచు రివాల్వరులను గాల్చుచుండిరి. ఆ గుండు దెబ్బలలో నొక్కటియైనను గుఱ్ఱమునకు దగిలెనో లేదో తెలిసికొనుటకు వారి కవకాశమే లేదు.

గుఱ్ఱము పరుగెత్తి పోవుచుండెను. అమరేంద్రునకప్పటి జ్ఞానములేదు. హితాహిత జ్ఞానశూన్యుడై యాతడా గుఱ్ఱము వెన్నంటి పరుగెత్తుచునే యుండెను. రివాల్వరుతో గాల్చుచునే యుండెను. అమూల్యుని రివాల్వరు కూడ నొక్కటే విధముగ శబ్దాయమానమగుచుండెను. గుఱ్ఱమును వారును గూడ బరుగెత్తుచునే యుండుటచే గుఱి సరిగా నానుటలేదు. అప్పుడమరేంద్రు డొక్కచో నాగి నిలువబడి స్థిరముగ లక్ష్యముచేసి రివాల్వరును ప్రేల్చెను. ఈసారి యాగుండు దెబ్బ గుఱ్ఱమునకు దగిలెను. తోడనే యాయశ్వము వికట స్వరముతో సకిలించుచు నొక్కదాటు దాటెను; ఆ ముత్తర క్షణమునందే యశ్వారోహితో గూడ గ్రింద బడిపోయెను. ఆ గుఱ్ఱ మొకటి రెండుసారు లారోహి నెత్తుకొని లేచి పరుగెత్తుటకు బ్రయత్నించెను గాని శక్తి చాలకపోవుటచే నట్లే పడిపోయెను.

అమరేంద్రుడు దూర్ధ్వశ్వాసముతో బరుగెత్తుకొని యాగుఱ్ఱము చెంతకు బోయి పరిశీలించి చూచెను. గుఱ్ఱము చచ్చి పడియుండెను. ఆ యశ్వారోహియు స్మృతి లేకుండ గుఱ్ఱముక్రింద బడియుండెను. అప్పుడా మొగముమీది ముసుగు చెదరిపోయినది. అమరేంద్రుడా గాఢాంధకారములో గూడ నామొగమును జూచి యానవాలు పట్టెను. అది పరిచితమైన మొగమే—

అమరేంద్రు డప్పు డెవ్వరిని జూచెనో వారి నట్టి యవస్థలో నెన్నడైన జూచుట తటస్థించునని యాత డొకప్పుడును గలలోనైన ననుకొని యుండలేదు. ఎవ్వరును గూడ నట్లు తలంచుట కావకాశము లేదు. అప్పు డమరేంద్రుడు విస్మితుడును, స్తంభితుడునై స్వప్నా విష్టునివలె దిలకించుచుండెను. ఏమిది? ఎంతటి యద్భుత సంఘటనము!

**ఎవ్వరా గజదొంగ ?   ఆమె మనియాబీబీ !**

## ప్రకరణము 38

అంతలో నమూల్యుడు వగర్చుకొనుచు, వగర్చుకొనుచు నచటికివచ్చి తత్తరముతో—"దొంగ దొరకినాడా?" అని ప్రశ్నించెను.

అమరేంద్రు డేమియు మాటాడలేదు. అప్పు డమూల్యుడు వ్యగ్రభావముతో—"ఆ దొంగ కూడ మరణింపలేదుగదా!" అని ప్రశ్నించెను.

అమరేంద్రుడు నవ్వుచు—"అమూల్యా! ఈ దొంగ మగ వాడు కాడు—ఆడుది!" అనియెను.

"ఆడుదియా? ఎంత చిత్రముగానున్నది!" అని పలుకుచు నమూల్యు డొకగంతువైచి నిలువబడియెను.

అమ—అమూల్యా! ఇటుచూడుము! ఎంతటి భయానకాద్భుత వ్యాపారము! ఇట్లగునని స్వప్నమందైన భావింపలేదు. ఈబందిపోటు దొంగ యెవ్వరనుకొన్నావు? మనియాబీబీ!

అమూ—ఎవరు? ఎవరు? ఆ గాయకురాలగు మనియాబీబీ యేనా? ఇదియేమి?

అని యమూల్యుడు వ్యగ్రభావముతో సమీపమునకుబోయి యత్యాశ్చర్యముతో నామె మొగమువంక బరికించి చూచి—

"అవు నామెయే—నిజముగా నామెయేనోయి!—ఇదిగో! మనియా బీబీయే!" అనియెను.

ఇట్టి యద్భుత వ్యాపారము జరిగిపోయినందుల కప్పుడు వారిరువురిలో నెవ్వరును కూడ మాటాడజాలకపోయిరి. ఏమనుకొన వలయునో వారికి దోచనే లేదు.

ఏబందిపోటు దొంగ మూలమున బంగాళా దేశమంతయు దల్లడిల్లిపోవుచుండెనో, ఏచోరశిఖామణికొఱకు పోలీసువా రందఱును మతిలేకుండ దిరుగుచుండిరో, ఏదొంగ భయమువలన గృహస్థు లెల్లరును సాయంకాల మైనతరువాత నిల్లు వెడలుటకు భీతిలు చుండిరో, ఏదారిదోపిడి వ్యాపారమువలన గొప్ప గొప్ప జమీందారులకును, భాగ్యవంతులకును కూడ గుండె గుభిల్లుమనుచుండెనో యట్టి దారిదోపిడిదొంగ కేవలము నొక్క యాడుదియై యుండెను! ఆ దొంగ—సుప్రసిద్ధ గాయనీ శిరోమణియగు మనియాబీబీ!

బంగాళా దేశమందలి ధనవంతులగువా రందఱును నామె మధుర గానమునకును, మోహన రూపమునకును, హావ భావ విలాసములకును ముగ్ధులు కానివా రెవ్వరును లేరు. వంగరాజ్యమునందు బాలుర మొదలు వృద్ధుల వఱకును నామె పేరు తెలియనివారు లేరు. అట్టి లోకప్రసిద్ధురాలగు మనియాబీబీ—యామెయే దారిదోపిడి దొంగ కూడ నై యుండెను! ఇంతకంటె నాశ్చర్యకరమగు విషయ మీలోకమున మఱేయున్నది? ఈ విధముగా మనియాబీబీ దొరకిపోయినది గాని లేకున్నచో నెవ్వారికైన నీమెయెడల ననుమానము కలుగుట కెట్టి యవకాశ మున్నది? ఈమె యిట్లు రాత్రివేళ గుఱ్ఱముపై నెక్కివచ్చి బందిపోటు దొంగతనము చేయునని యెవ్వరైన ననుకొన గలరా?

అప్పు డమూల్యామరేంద్రులు చచ్చిన గుఱ్ఱమును దొరలించి యా క్రింద బడియున్న బీబీని బయటికి దీసిరి. అప్పు డామె యొక్క

కోటును, పరాయియును దాచికొని యుండెను. అప్పు డమరేంద్రు డామె కోటు బొత్తములను సడలించి యామె తలను దన యొడిలో నుంచుకొని యా సమీపమునందున్న చెఱువులో నించుక జలమును దీసికొని రమ్మని యమూల్యని బంపించెను.

అమూల్య యతి త్వరితముగబోయి యా చెరువులో దన యుత్తరీయమును దడుపుకొని తెచ్చెను. అమరేంద్రుడా యుత్తరీయమును బిండి యా జలము నామె మొగముపై జిలికెను—ఈ విధముగా గొంతసేపటివఱకు జిలికించుచుండుటయు, నామె కప్పు డించుక చైతన్యము కలిగెను—నామె యొక్క దీర్ఘ శ్వాసమును విడిచి కన్నులను దెఱచెను. ఆ యుత్తర క్షణమునందే లేచుటకు బ్రయత్నించెను గాని బాధచే నార్తనాదము చేయుచు మరల గ్రిందబడిపోయెను. గుఱ్ఱముపై నుండి క్రిందబడుటచే నామెకు బలమైన యాఘాతమయ్యెనని యమరేంద్రుడు భావించుకొనియెను.

అప్పు డమరేంద్రుడు పల్లకిని దీసికొని రమ్మని యమూల్యని బంపించి తానెప్పటివలె నామె మొగంబున జలమును జిలుకరించుచుండెను. కొంతసేపైనతరువాత మనియాబీబీ మరల గన్నులను దెఱచి యమరేంద్రునివంక జూచి మందహాసము చేయదొడంగెను. అప్పు డమరేంద్రు డాశ్చర్యముతో—"నేనెవ్వడనో చెప్పగలవా?" అనియెను.

మనియాబీబీ యింకను నట్లే చిఱునవ్వు నవ్వుచు నాతనిం గాంచి—"అమరబాబూ! తుదకు బందెమును నీవే గెలిచితివి!—నీకే జయము లభించినది!—నాకపజయము కలిగినది" అనియెను.

అమ—"జయాపజయములు" దైవాధీనములు—మనియా! నీకు దీవ్రముగనే దెబ్బ తగిలినదా యేమి? ఎక్కడ దగిలినది?

మని—ఎక్కడ దగిలినదో నాకు దెలియుటలేదు—కాని దెబ్బమాత్రము తీవ్రముగా దగిలినది—వేదన యతి దుస్సహముగా

నున్నది—ఇక నేను బ్రతుకజాలను—జైలునకు బోవుటకంటె చావే మంచిదికాదా?

అమ—సన్నిప్పుడే మేము హుగ్లీనగర వైద్యశాలకు దీసికొని పోవలయునని యనుకొనుచున్నాము.

మని—ఎందుకు బాబూ! ఏమియును లాభములేదు. నిరర్థకముగా నేల శ్రమపడియెదరు?

అని పలుకుచు నామె మ్లాన మందహాస వదనముతో—"బందిపోటు దొంగకే మరియాదయుంటయు నెందులకు బాబూ! మనియాబీబీనై యున్నప్పుడే మరియాదగాని యిప్పుడేల?" అనియెను.

ఇంతలో నమూల్యుడు బోయులచే బల్లకిని మోయించుకొని వచ్చెను. అప్పుడు వారిరువురును భద్రముగా నామెను బట్టుకొని యెత్తి యా పల్లకిలో బరుండబెట్టిరి. ఆ కదలికవలన నామెకు విశేష బాధ కలిగియుండునని యమరేంద్రు డనుకొనియెను. అప్పు డామె పెదవిపై పెదవినిజేర్చి బిగించి పట్టుటయేగాని యెట్టి వేదనాసూచకము నార్తనాదమును జేయలేదు.

బోయులు పల్లకి నెత్తినతోడనే యామె హీనస్వరముతో—"నాగజ్జి యేమైనది?" అని కేవల మొక్కటేమాట యనియెను.

అమ—అది చచ్చిపోయినది—

మనియాబీబీ యిక నేమియును మాటాడలేదు. బోయులు పల్లకి నెత్తుకొని నడచుచుండిరి. అమూల్యామరేంద్రులు కూడ బల్లకి వెనుకనే బయలుదేరి పోయిరి.

రాత్రి యొంటిగంటవేళకు వారు హుగ్లీ వైద్యశాలయొద్దకు జేరుకొనిరి. అప్పు డమరేంద్రుడు డాక్టరునకు సంక్షేపముగా నెల్ల సంగతులను దెలిపి మనియా నాతని కొప్పగించెను. తోడనే కొందఱు డాక్టరులుచేరి యామెకు జికిత్స చేయుట కారంభించిరి.

అమరేంద్రుడా క్షణమునందే పోలీసువారికి సమాచార మంతయు దెలియజేసెను. ఫతేఅలీ సాహేబునకు దెలుపుటకై చందన నగరమునకొక రక్షకభటునిగూడ బంపించెను. తరువాత నమరేంద్రుడు పోలీసు ఇన్స్పెక్టరుతో జెప్పి గుఱ్ఱమునొద్ద పారాయుండుటకై నలుగురు రక్షక భటులను బంపించెను.

అమూల్యామరేంద్రులు వైద్యశాలకు వెలుపల గూర్చుండి యుండిరి. ఇంచుమించుగా నఱగంటసేపైనతరువాత నొక డాక్టరు వెలుపలికి వచ్చెను. అమరేంద్రు డాత్రముతో నాతనిం గాంచి— "ఎట్లున్నది ?" అని ప్రశ్నించెను.

డాక్ట—ఒకటి రెండు గంటలకంటె నెక్కువసేపు జీవించి యుండదని తోస్తుంది. ఆమె వెన్నుపూస విఱిగిపోయినది. ఇంతపని చేయఁగలిగిన యాడుదానిని జూచుట యిదియే ప్రథమ పర్యాయము ! మీయెదుటను—మేజస్ట్రేటు నెదుటను నేమియో చెప్పదలచియున్నది—నేనిప్పుడే మేజస్ట్రేటునకు సమాచార మంపితిని.

మఱియొక యఱగంట సేపటికి మేజస్ట్రేటచ్చటికి వచ్చెను. అప్పు డమూల్యామరేంద్రులును, మేజస్ట్రేటును, డాక్టరును గూడ వైద్యశాల లోపల ప్రవేశించిరి. పోయి చూడగా నప్పటికి మనియాబీబీ కన్నులు మూసికొని శయనించి యుండెను. ఆకస్మికముగ జూచినచో నామె మరణించినదానివలెనే యగుపడుచుండెను.

## ప్రకరణము 39

అప్పుడు డాక్టరు మనియాబీబీచే దీవ్రమగు బ్రాందిని సేవింప జేసెను. ఆ బలముచే నామె కన్నులను దెఱచి యందఱివంకను జూచి—" మీరు సాధ్యమైనంతవఱకు నాకుపచారములను గావించితిరి. నేను మీకు ఋణగ్రస్తురాల నైపోయితిని " అని యా క్షణముననే దొరగారివంక జూచి—" ఈయనయేనా మేజస్ట్రేటు ?" అనియెను.

డాక్టరు—ఔను ఈయనయే—చెప్పవలసినదేమైన నున్నచో నీయనతో జెప్పవచ్చును.

మని—ఆ. చెప్పవలయుననియేగాదా పిలిపించితిని! నేనేమేమి పనులను జేసితినో సమస్తమును జెప్పివైచెదను.

అని యామె యించుక సేపూరకుండి పిమ్మట హీనస్వరముతో- "ఈ నడుమ జరగిన దారిదోపిడు లన్నియును నాచేతనే చేయ బడినవి. ఈ యమరబాబే లేకయున్నచో నిక నితరు లెవ్వరును నన్ను బట్టుకొన జాలరనియే నాదృఢవిశ్వాసము" అనియెను.

మేజ—నీవు బుద్ధిపూర్వకముగనే యీ పనిలో బ్రవేశించితివా! నీవాడుదానవు—సౌందర్యవతివి—మంచి గాయకురాలవు. నృత్త గీతముల మూలమున నీవు విశేష ధనము నార్జించుచుందువని కూడ నేను వినియుంటిని. ఇట్టి స్థితిలో నీవేకారణముచే నీచోరవృత్తికి బూనుకొంటివి?

మనియాబీబీ విషాద గర్భితంబగు మందహాసము చేయుచు— "దొరగారూ! మీరు మూలము తెలియునికారా? ఇదియంతయు నాకర్మఫలము—దురదృష్టము!" అని చేతితో నుదుటిని స్పృశించుచు- "విధివ్రాత!" అనియెను.

మేజ—సరే—తరువాత నింకను నేమి చెప్పదలచుకొంటివో చెప్పుము!

మని—నేనెవ్వతెనో నాకేమియును దెలియదు. నాతల్లి యెవ్వరో, తండ్రి యెవ్వరో కూడ నేనెంతమాత్రము నెఱుంగను. లోచనుని భార్యయగు రాసమణి—నాదాసి సోదరి—ఆమె నాచిన్న తనమునందు నన్నెత్తుకొని వచ్చినదట! లోచనుడు నన్ను బెంచుటకై ఫయజాబాదునందలి యొక హీరామూస్థాపివాసి కొప్పగించినాడు. అతడే నాకు నృత్యగీతములను బాగుగ నేర్పి యింతటి గాయకు రాలినిగా జేసినాడు. చదువుకొను సమయమునందే నేనొక పురుషుని

ప్రేమించి యుంటిని. ఆ కారణముచే నా హిందూస్థానీవానికి మాయిరువురిమీదను గూడ కోపము కలిగెను. ఒకనాడాతడు రహస్యముగా నేనున్న గదిలోనికి వచ్చెను. అప్పుడు నేను ప్రేమించిన పురుషుడు నాయొద్దనే యుండెను. ఆ హిందూస్థానీయు డాతనిం గాంచి క్రోధావిష్టుడై కత్తితో గొట్టెను. ఆ సమయమున వారిరువురికిని బలవంతమగు పోరాటము జరిగినది. ఆ సందాసనకు నేను వారి పోరాటమును వారింపజాలక పోయితిని. తుదకా హిందూస్థానీయుడు మరణించెను. ఈ సంగతి యాతని సమీప బంధుడగు కాహియా కొక్కనికిదక్క నితరుల కెవ్వరికిని దెలియదు. నాటినుండి నేటివఱకు గూడ నా కాహియా ఖూనీనేరమునకై పోలీసువారి కొప్పగింతునని మమ్మిరువురను గూడ భయపెట్టుచుండెను. ఆ భయముచే నేను సంగీత సభలుచేసి సంపాదించిన ధనమంతయు నాతనికి సమర్పించుచు వచ్చుచుంటిని! అయినను నాతడు సంతోషించినందక యెప్పటి కప్పుడే మమ్ములను బెదరించుచుండెను—

అని చెప్పి మరియా యాయాసముచే మాటాడజాలక పోయెను. కొంతసేపైనతరువాత కించుక తేరుకొని మెల్ల మెల్లగా—

"ఆ దురాత్ముని మూలమున నిన్నాళ్ళవఱకును నాహృదయ మెంతగా బరితపించుచుండెనో యీ సంగతి యంతర్యామి కొక్కనికి మాత్రమే తెలియును. నాదినదిన సముపార్జిత ధనమంతయు నాతని మొగముననే పడవైచుచుంటిని. అయినను నాతని యాశ తీరుటలేదు. ఇంకను ధనమును వాంఛించుచునే యుండెను. నేనిచ్చిన ధనమునంతను నాపాపాత్ముడు త్రాగుటకొఱకును, జూదమాడుటకొఱకును రెండు చేతులను వెచ్చపెట్టుచుండెను. డబ్బు చెల్లిపోయినతోడనే యాతడు మరల నన్ను బాధించుచుండెను" అని చెప్పెను.

మేజస్ట్రేటంత యునువిని క్రోధావేశముచే—"ఆ దురాత్ముడగు కాహియాకు ద్వీపాంతరవాస శిక్షయైనది—ఎంతటి దారుణ చరిత్రము!

ఇటువంటి బాలికను బందిపోటు దొంగగా జేసివైచినాడు! ఎంత దౌర్జన్యము!" అనియెను.

మనియాబీబీ మరల హీనస్వరముతో—"తుట్టతుదకా కాహియాయే యీ దారిదోపిడి వ్యాపారము నేర్పాటు చేసినాడు! నన్ను గొని పెంచి విద్యనేర్పిన యాహిందూస్థానీయుడు చిన్నతనమునందే నాకు గుఱ్ఱపు సవారుకూడ నేర్పి యుండెను. నేనతి లాఘవముతో నతి నిపుణముగా గుఱ్ఱపు సవారు చేయగలను. అందుచేతనే కాహియా నాయొద్దకువచ్చి—"పద! బంగాళాదేశమునకు బోయినచో గొలది దినములలోనే విశేష ధనమును సంపాదించవచ్చును. గానసభలవలన గొంత ధనము లభించును. రాత్రి సమయమున గుఱ్ఱము నెక్కిపోయి దారుల గొట్టుటవలన మఱింత ధనము దొరకును" అని చెప్పెను. ఆ మాటల నప్పుడు నేను బాగుగ బోధపఱచుకొన జాలకపోయితిని. అప్పుడాతడు స్పష్టముగా—"ఏమార్గమున నెప్పుడే పెద్దమనుష్యుడు విశేష ధనముతో ప్రయాణము చేయుచుండునో నేను తెలిసికొనుచుందును. నీవును సంగీత సభలకు బోయి యనేక భాగ్యవంతుల స్థితిగతులను దెలిసికొనగలవు. తన గుంపుతో గూడ బంగాళాదేశమున ప్రచారము చేయవలయునని నేను లోచనునితో జెప్పియున్నాను. ఆతనికి నేనొక మంచి తెల్లని గుఱ్ఱమును గొని యిచ్చితిని. వాడా గుఱ్ఱమును వెంటబెట్టుకొని తన గుంపుతో గూడి నందందు విడిసి యుండును. ఏ పెద్దమనుష్యుని సమాచారమైనను దెలిసిన వెంటనే నీవాతని యొద్దకు బోయినచో నాతడు నీకా గుఱ్ఱమును నల్లరంగువైచి మార్చి యొప్పగించుచుండును. నీవు మగవేషము వేసికొని మొగమున ముసుగు వైచుకొని రెండు చేతులను రెండు రివాల్వరుల నుంచుకొని యా గుఱ్ఱము నెక్కిపోయి మార్గస్థులగు గొప్పవారి నదలించి యటకాయింపవచ్చును. అప్పుడు వారు భయభ్రాంతులై తమ సర్వస్వమును నీకొప్పగించి బికారులై

పోవుదురు. తరువాత నీవాసొత్తు నొకచో బూడ్చిపెట్టి యాసమీపము నందలి యేసత్రమునకైన బోయి యందలి యొక పాత్రముక్రింద సొమ్ము పూడ్చిన స్థలమును గూర్చి సంకేతాక్షరములను వ్రాసి పోయినచో నేను వర్తకవేషముతో బోయి యారహస్యమును గ్రహించి వెంటనే యాసొత్తును దీసికొని పోవుచుందును. నీవెప్పటికిని గాయకురాలవే యైయుందువు—ఇట్లు చేసినచో నిన్ను గూర్చి సంశయించుట కెవ్వని బాబుతరమును గాకుండబోవును" అని బోధించెను. ఆ మాటలను విన్నంతనే నాకు నోట మాట లేకుండ బోయెను—" అనియెను.

మునియాబీబీ మాటలను విన్నంతనే హరా బందిపోటు జరగిన మఱునాటి సంగతి యమునేంద్రున కతిస్పష్టముగా స్మృతికి వచ్చెను. అతడు తనలో—" ఈమె యారాత్రి దొంగతనముచేసియే యెప్పటి వేషముతో బల్లకినెక్కి కలకత్తాకు బోవుచు నాకగపడినది. నా సంగతులన్నియు నీమెకు ముందే తెలియుచున్నవి. నేను రాసమణిని దీసికొని వచ్చుచున్న సంగతి తెలిసికొని యీమె యామె సోదరిని గంగాఘట్టమునకు బంపించినది. నేనిప్పటివఱకు నీమె సంగతిని గ్రహింపజాలకయే పోయితిని" అని యనుకొనియెను.

ముని—వినుము! నేను మొట్టమొదట నాశాహియా దుర్బోధనమున కింతమాత్రము నంగీకరింపనైతిని. అప్పుడు వాడు మమ్ముగవురను పోలీసువారి కొప్పగించక మానననని ప్రతిజ్ఞ చేసెను. అట్లు పోలీసువారి కొప్పగించినచో నేను ప్రాణసమానముగ ప్రేమించియున్న నాప్రియునకు మరణదండనము కాగలదు—నాకు ద్వీపాంతరవాస శిక్ష యగును. అందుచే నేను చాల భయపడి పోయితిని. ఆ దురాత్ముడు తన పట్టినపట్టు వదలక నిరంతరమును నన్ను బెదరింప దొడంగెను. అందుచే నేనకార్యమున బ్రవేశించుటకు బాధ్యురాలనై ఈబంగాళా దేశమునకువచ్చి బందిపోటు దొంగతనముల కారంభించితిని.

ఆ యా ప్రదేశములందు లోచనుడు తన గుంపుతో విడిసియుండి యుచిత సమయములందు నాకాగుత్తము నొప్పగించుచుండెను—ఇదియే నా వృత్తాంతము—నేను చెప్పవలసిన దింతవఱకే—

అని చెప్పి మనియాబీబీ కన్నులను మూసికొనియెను. ఒక్క-నిమిషములో నామె వదన మండలము వివర్ణమైపోయెను. తోడనే యా ముఖమండల మపూర్వ సౌందర్యముందాల్చి జ్యోతిర్మయమై పోయెను. అప్పుడు డాక్టరు సత్వరముగ బోయి యామె కపాలమున జేయివైచి చూచెను—గుండెలను బాగుగ బరీక్షించెను—నాడిని సావధానముగ బరిశీలించెను—అనంతర మాతడు వెనుకకు దిరిగి—"అయిపోయినది!" అనియెను.

తోడనే యమూల్యామరేంద్రులు విషణ్ణ హృదయులై యా వైద్యశాలనుండి వెలుపలికి వచ్చిరి. అంతటి దారుణ హృదయ వేదన వారిదివఱ కెన్నడు ననుభవించి యుండలేదు. ఇంతటి హత భాగినిని వారిదివఱ కెప్పుడును జూచియుండలేదు.

అప్పు డమూల్యు డమరేంద్రునిం గాంచి—"అమరా! లోకు లేమనుకొన్నను సరియే—ఈ మనియాబీబీకి దహన సంస్కారము చేయవలదా! ఈమె నెత్తికొని తెచ్చుటకు వాహకు లెవ్వరైన దొరకినను దొరకకపోయినను నేనే యీమెను దీసికొనిపోయి యథా విధిగా సంస్కారము గావించెదను" అనియెను.

అమరేంద్రునికన్ను లశ్రుజల పూరితములై పోయెను. అతడు విషాద సూచక స్వరముతో—"అమూల్యా! నేను మాత్రము పాషాణ ప్రతిమ ననుకొంటివా!" అనియెను.

వారామెకు దహన సంస్కారము చేయుటకు మేజస్ట్రేటు కూడ ననుమతి నొసంగెను. అంతేగాక వారికి దగిన సాహాయ్యముం గావించుటకై పోలీసువారి కాజ్ఞాపించెను.

అప్పుడా యమూల్యామరేంద్రులు హుగ్లీ నగరమునందలి గంగాతీరమునకు యథాసమయమునకు దీసికొనిపోయి యూర్ధ్వ

పితృహీనయు, ననాథయు, మందభాగ్యురాలునగు నా మనియాబీబీ శరీరమును చితారోపితముం గావించిరి.

అనంతర మమూల్యుడు స్నానము చేసివచ్చి—" అమరా! ఈ జన్మమునందు మనకు నీమెకు నెట్టిసంబంధమున్నదోయి! ఎక్కడి యాపద యెక్కడకు వచ్చిపడినదో చూచితివా!" అనియెను.

అమరేంద్రు డేమియు మాటాడలేదు. మాటాడుట కాతనికి సామర్థ్యము కూడ లేకపోయెను. అతని హృదయమేమో వికలమై పోయెను.

పిమ్మట వారిరువురును వచ్చటినుండి తిరిగి హుగ్లీ నగరమునకు వచ్చుచుండగా మార్గమధ్యమునందే మందహాస వదనముతో ఫతేఆలీ సాహేబు వారి కెదురు వచ్చుచుండెను.

## ప్రకరణము 40

ఫతేఆలీ సాహేబు సంతోషముతో నమరేంద్రుని వెన్నుపై గొట్టుచు—" అమరబాబూ! తుదకు నీవు నీప్రతిజ్ఞను దీర్చుకొన్నావు. దొంగను బట్టుకొన్నావు—కాని కేసుమాత్రము మంటగలసి పోయినదోయి! దొంగ దొరకినది కాని యేమిలాభము! తుదకు జచ్చిపోయినది! కాని మనియాబీబీ యింతలేసి పనులు చేయునని యెవ్వరైన ననుమానింప గలిగిరా! ఆమె సంగీతము నేనొకసారి విని యుంటిని. ఆ మధురగాన మిప్పటికిని నాచెవులలో ప్రతిధ్వనించుచునే యున్నది" అని యాతడు చేతులు త్రిప్పుచు గూనిరాగములు తీయ దొడంగెను.

ఫతేఆలీ వాచాలత్వమునకు వికల హృదయుడై యున్న యమరేంద్రు డప్పుడు విరక్తుడై పోయెను. అందుచే నాత డేమియును మాటాడలేదు. అప్పుడు ఫతేఆలీ యమూల్యునివంక దిరిగి—" బాబూ!

ముసల్మానుల మతస్థురాలగు మనియాకు గోరీ కట్టింపక దహన సంస్కారము చేసినారేమి? చాల తప్పుపని చేసితిరి!" అనియెను.

అమ—మనియా హిందూస్థాని సానియై యున్నమాట నిజమే కాని యామె హిందూ యువతి, ఆమెను చెందినవాడుకూడ హిందువే.

ఫతే—ఏమైననేమి? తుదకు జచ్చిపోయినది. ఇంతటి గజ దొంగను బట్టుకొని యురికంబమునకడ నిలువబెట్టుట కవకాశము లేక పోయినది. వేలకొలది ప్రజలు చూచుటకై వచ్చియుందురు. నాకు గూడ మంచిపేరు వచ్చియుండును. అట్లుగాక యంతయును చెడిపోయినది. కాని ప్రధానులగు నిరువురను గూడ బట్టుకొనియుంటిని గదా—ఫతేఅలీ కాక ఇంతటి ఘనకార్య మితరు లెవ్వరు చేయగలరు!

ఆ మాట విన్నంతనే యమరేంద్రుడు ఆత్రముతో—"ఇరువు రనుచున్నారు—ఎవరెవరు?" అనియెను.

ఫతేఅలీ పకపక నవ్వుచు—"అయ్యో! అమరబాబూ! నేనూరక కన్నులు మూసికొని యుంటినని నీవనుకొనుచున్నావు కాబోలును! నేనంతటి చేతగానివాడనుగాను. దొంగలను బట్టుకొనుటలో ఫతేఅలిని మించినవా డింతవఱ కెవ్వడున్నాడు?" అనియెను.

అమ—ఇరువురు దొంగ లనుచున్నారు—రెండవవా డెక్కడ దొరకినాడు?

ఫతే—ఒకని సంగతి తెలిసినదా? వాడు శాహిరా—రెండవవాడు లోచనుడు—లోచనుడు!

అమరేంద్రుడు వ్యగ్రభావముతో—"లోచనుడు పట్టుపడినాడా? ఎక్కడ దొరకినాడు?" అనియెను.

ఫతేఅలీ సాహేబు గంభీర భావముతో—"ఓ! దొరకిపోయినాడు, ఫతేఅలీ కాక యింతటి ఘనకార్యము నెవ్వరు సాధింపగలరు? నిన్నటి రాత్రియే యాతని బట్టుకొన్నాను" అని చెప్పెను.

అమ—మీ రాలోచనను నేవిధముగా బట్టుకొనగలిగితిరో యా సంగతి ముందుగా జెప్పుడు !

ఫతే—నేనచ్చటికి బోయి యా గుంపువా ళ్ళుండతిప్పైని గన్నుంచి తగిన పారాలుంచి కట్టుదిట్టము చేసియుంటిని. నిన్నటిరాత్రి యాలోచనుడు గుఱ్ఱమును మనియా యొద్దకు బంపి తానొక్కచో దాగియుండునని యనుకొందును. కార్యము వ్యత్యస్తమై పోవుటచే యధాసమయమునకు మనియాబీబీ తిరిగి రాలేదు. ఆ గుఱ్ఱము కూడ నగపడలేదు. అందుచే నాతడు సమాచారము తెలిసికొన వలయునని బుద్ధిహీనుడై గుంపులోనికి దిరిగి వచ్చెను. తానగపడ కుండుటచే మనియా గుఱ్ఱముతో గూడ గుంపునొద్దకు బోయియుండునని యాత డూహించుకొని యుండెను. దుర్మార్గుల కంత్యకాలము సమీపించినచో నిట్లే బుద్ధి భ్రంశమై పోవుచుండును. అట్లే కాకున్నచో లోకమున దౌర్జన్యముల కంతముండునా !

అమ—తరువాత నేమి జరగినదో చెప్పుడు !

ఫతే—అట్లే యూహించుకొని యా పాపాత్ముడు డేరాల యొద్దకు వచ్చెను. ఆత డటునిటు బరికించి యంత రాత్రివేళ దన్నెవ్వరును జూడజాలరనియు, నందఱు నిదురించుచుందురనియు నిశ్చయించుకొనియెను. కాని యొక్కరు మాత్రము కన్నమూయ కుంత గాచుకొనియే యుండిరను సంగతి మాత్రము వాడు తెలిసికొన జాలకపోయెను.

అమ—వారెవ్వరు ? అట్లు మేలుకొనియున్నవా రెవ్వరు ? అంత జాగరూకులై కాచుకొనియున్నవా రెవ్వరు ?

అమరేంద్రుని యాత్రతముం గాంచి ఫతేఆలీ నవ్వుచు— "ఇంకెవరు ? ఆ యమూల్య వజ్రమణి—ఆ యమోఘ చింతామణి—నీ కుంజయే !" అనియెను.

అప్పు డమరేంద్రుని వదనమండల మాకస్మికముగ రాగరంజిత మైపోయెను. ఫతేఆలీ యా భావమును లక్ష్యము చేయనేలేదు—

ఏవిషయమును గూర్చియైనను సూక్ష్మముగా గ్రహించు సామర్థ్యమాతనికి లేనేలేదు. అప్పు డాతడు గంభీర స్వరముతో—"కుంజ మేలుకొని యుండెను. ఆమెయే లోచనుని రాకను గ్రహించి యొక రక్షక భటునకు సమాచార మంపించెను. ఆ క్షణమునందే యట గావలియున్న రక్షకభటు లందఱును బోయి యాకస్మికముగ నాతని బట్టుకొని బంధించి వైచిరి. తరువాత వా రాతని నాయొద్దకు దీసికొని వచ్చిరి. నేను క్రోధావేశముచే నాచేతి బెత్తముతో గసిదీర నా లోచనుని బాదివైచితిని. దొంగముండాకొడుకు—" అనియెను.

అమూల్యుడు నవ్వుచు—"అలాగా? ఫతేఆలీ సాహెబా! అట్లయినచో మీ రా లోచనుని స్వయముగా బట్టుకొనలేదా?" అనియెను.

ఫతేఆలీ యెగసిపడి యమూల్యునివంక రోష కషాయిత నయనములతో దిలకించుచు—"నేను పట్టుకొనలేదు—సరియే—నీవు పట్టుకొంటివా యేమి?" అనియెను.

అమూ—లేదు!—పట్టుకొనుటకు నే నెవడను? పై నుండి యూరక చూచువాడనే కాదా? నేను గ్రహించినదేమన—కుంజయే యాతని బట్టుకొన్నదని—

ఫతేఆలీ యించుక యావేశమును దగ్గించుకొని తెల్లపోవుచు—"ఈమాటలు యెల్లవిధములచేతను సత్యమే—కాని నేను చందన నగరమునందే లేకయున్నచో నాతడు దొరకుట కెట్టియవకాశమును లేకయేపోవును!" అనియెను.

అమూ—ఆ యాలోచన కూడ విజయకుమారేంద్రుడు చెప్పినదే. అందుచేతనే మీరు రంపురకు బోయియుంటిరి. ఇది మీ స్వబుద్ధికి దోచినది మాత్రము కాదు!

ఫతే—ఎంత చాలాకుడవు! నీవంటి బుద్ధిహీనుడీ లోకమున మఱియొకడుండడని నాకు దోచుచున్నది.

అమాత్యుడు మందహాసము చేయుచు—"ఫత్తేదారు సాహెబా! మీవంటి సూక్ష్మబుద్ధి సులభముగా నందఱకును లభించునా?" అనియెను.

ఫతేఆలీ నిందాస్తుతిని గ్రహించునంతటి బుద్ధిశక్తి లేదు. ఆత డప్పు డమాత్యుని వెన్నుపై దట్టుచు—"ఔను! అలాగున కూర్గనువకు రమ్ము! మీకు మంచి బుద్ధి యున్నది. అందుచేతనే మీరిరువురును నా సామర్థ్యమును గ్రహింపగలిగితిరి. రత్నగౌరవము రత్నవర్తకునకు మాత్రమే తెలియును."

ఫతేఆలీ సంగతి బాగుగ దెలిసినవారగుటచేతనే యమాత్యామరేంద్రు లప్పటి యాతని మాటలం గూర్చి యుపేక్షించుకొని ఆతని కింతటి పేరెట్లు కలిగినదో యని వారిప్పటికిప్పుడు శంకించుకొనుచునే యుండిరి. వారొకప్పు డాతని క్రిందయుద్యోగులు నీవిషయముం గూర్చి యడిగిరి. ఆ ప్రశ్నకు ప్రత్యుత్తరముగా వారందఱును నుదుట జేతులుంచుకొని—"నసీబు!" అని చెప్పియుండిరి.

# ప్రకరణము 41

అమాత్యుడు నాకు తొందరపని యున్నదని చెప్పి యింటికి వెడలిపోయెను—బందిపోటు దొంగలనణచు వ్యాపారమంతయును నొక విధముగా ఫైసలై పోయినది. కాని యమరేంద్రునిపని యొకటిమాత్ర మింకను మిగిలియున్నది. ఆ కార్యము కూడ సంపూర్ణముగ నెఱవేర్చ గలిగినచో నమరేంద్రుడు కృతార్థుడు కాగలడు!

ఆత డప్పుడు తనలో—"ఆ మందులవాళ్ళెవరు బిడ్డల నపహరించి తీసికొనివచ్చినారుగదా—యిందొక దురదృష్టవంతురాలు సురూప యౌవన గుణ సంపన్న యువతియును గాలవశంబున సంసార చక్రాంతరాళంబునబడి నలిగి నలిగి పిప్పిపిప్పియై తుదకు జూన్లీఖాత

మైపోయినది. ఆమె సంగతి ముందుగనే యెవ్వరికైన దెలిసినచో నౌకరు గాకున్న మతియొకరైనను నామెను రక్షింపగలిగియే యుందురు, పాప మామెకా యోగము లేకపోయినది. కాని యింద దుఃఖింపవలసినపని యేమియును లేదు. అదృష్టము!—ఏమిచేయ వలయునో యంతయు జేసివైచినది. కాకయున్నచో నామె మాతృ క్రోడమునుండి యుపహరింపబడకయే యుండును—

"రెండవబిడ్డ యింకను మిగిలియున్నది. ఆమెను నేను నుద్ధరింపలేనా? నియతి యామె యెడల గూడ నింతటి భీషణమై పోవునా? అట్లుకాదు—ఎన్నటికి నట్లు కానేరదు. ఆమెను గాయకు రాలిం జేసికొనుటకై యెవ్వరు నింతవఱకు గోనియుండ లేదు. అట్లే జరిగినచో నీపాటి కామె పని కూడ నేమైయుండునో యెవ్వరు చెప్ప గలరు? ఆమె యింతవఱకు గొప్పయింటి బిడ్డవలె గౌరవింపబడు చున్నది. అట్లే పాలింపబడుచున్నది—విద్యావతికూడ నైయున్నది. సర్వవిధములచేతను సర్వగుణ విభూషితయైయున్నది. ఇంతేకాక తన్ను దాను రక్షించుకొనుటకు సమర్థురాలైయున్నది—అట్టి యామెను నేను రక్షింపజాలనా? ఆ కుంజను నేను ప్రేమించితిని—ప్రాణ సమానముగ ప్రేమించితిని. ఆ దివ్యసుందరమూర్తి నాయస్థిమజ్జాదుల పర్యంతమును విలీనమైయున్నది—

"కాని, ఆనాడు గంగానదీ తీరమున, సంపూర్ణ యౌవనయు, నపరూప సుందరీమణియు, హతభాగినియునగు మనియాబీబీ భస్మీభూత మైపోయినది. అజ్ఞాతదేశమున నవిదిత ప్రదేశమున దల్లిగాని, తండ్రి గాని, యాత్మీయులుగాని, స్వజనులుగాని సమీపమున లేకుండ నితరులచే భస్మీకృతమైపోయినది—మోహన సుందరీ విగ్రహము కాదు—దారుణ ఘోర విగ్రహము! కులటయగు గాయనీమూర్తి భస్మమైపోయినది—అప్పుడే యా జాజ్వల్యమానమగు చితానలము నాహృదయమున నంకితమైపోయినది. ప్రాణాంతస్థమగు ప్రదేశము

నుండి యీ జ్వాల యింకను సముత్థిత మగుచునే యున్నది—నేను కుంజను రక్షింపజాలనా? రక్షింపజాలకున్నచో నేనీ సంసారావర్త మధ్యమునంబడి యే యగాధ తల పర్యంతమును మునిగిపోవలసి యుండునో యెవ్వరు చెప్పగలరు?—

"ఈ సంసార మేమైనను సరియే—ఆత్మీయ బంధు మిత్రు లేమనుకొన్నను సరియే—సామాజిక లోకాచారములు సర్వమును విధ్వస్తములైపోయినను సరియే—నేను ఘోరతమ పాపండుడను గాకయేయున్నచో గుంజను తప్పక రక్షించి తీరవలయును—రక్షించుటయే కాదు—యెవరెట్లాడుకొన్నను నేనామెను బెండ్లియాడి తీరదను" అని యనేక విధముల భావించి నిశ్చయించుకొనియెను.

తరువాత నమరేంద్రు డటనుండి చందన నగరమునకు మందుల వాళ్ళ డేరాల యొద్దకు బయలుదేఱి పోయెను. అమరేంద్రుడు వచ్చుచుండుటను దూరమునుండియే చూచి సంతోషముతో గుంజ యాతని కెదురుబోయెను. బందిపోటుదొంగ వృత్తాంతమంతయు నిదివఱకే యామెకు దెలిసిపోయెను. ఆమె యమరేంద్రుని సమీపించిన తోడనే—"ఎంతవింత! మనియాబీబీ దారిదోపిడి చేయునని యెవ్వరైన ననుకొన్నారా?" అనియెను.

అమరేంద్రు డాశ్చర్యముతో—"కుంజా! నీవు మనియాబీబీ నిదివఱ కెఱుంగుదువా?" అని యడిగెను.

కుంజ—మేము పశ్చిమదేశమునం దున్నప్పుడు మనియాబీబీ తఱచుగా మాడేరాల యొద్దకు వచ్చుచుండెడిది.

అమ—అట్లయినచో నామె యింతపని చేయుచున్నదని నీకిదివఱకు గొంచెమైనను దెలియదా?

కుంజ—ఏమియును దెలియదు. నాకెప్పుడు ననుమానమైనను గలుగలేదు. ఔరా! పాప మంతటి చిన్నవయసులోనే యామెకు మరణము సంప్రాప్తమైనది—ఔను. మంచిపనియే జరిగినది. లేకున్నచో నామె జైలునకు బోవలసి వచ్చును.

అమ—కుంజా! నీవలెనే యీతడును గూడ లోచనుడు దొంగతనముగా నెత్తుకొని వచ్చినాడట సుమా!

ఆ మాట విన్నంతనే కుంజ తెల్లపోయెను. అప్పు డామె యొక్క దీర్ఘనిశ్వాసమును విడిచి యతి విషాద సూచక స్వరముతో మెల్ల మెల్లగా—"దాని నుదుటి వ్రాత యట్లున్నది! దానిని మాడిచివైచుట యెవ్వరితరము!" అనియెను.

అమరేంద్రు డుత్సాహముతో—"అదృష్టము నీయెడల మాత్ర మింకను ననుకూలించియే యున్నది. కాకున్నచో నీపాటి కెవ్వరైన నిన్ను గూడ సాగిం జేయుటకై కొనియే యుందురు.

కుంజ గడగడ వణకుచు—"ఈ రాక్షసుల చేతిలో బడిన తరువాత నెట్టి యవస్థ తటస్థించుటకైనను నాశ్చర్యమేమున్నది?" అనియెను.

అమ—కాని యట్లు జరుగక యొక పెద్దమనుష్యుడు నిన్ను దన బిడ్డవలె నెంతయో గారాబుతో బెంచుట తటస్థించినది. అందుచేతనే నీవదృష్టవంతురాల ననుకొనుచున్నాను.

కుంజ—ఆతడు బ్రతికియే యున్నచో నాకీ మందులగుంపులో మరల జేరుట తటస్థింపకయే యుండును.

అమ—కాని యిప్పు డిక నిచ్చట నుండుటకు వీలులేదు. నిన్నిట్లుండనిచ్చుట నాకిష్టములేదు.

కుంజ కొంతసేపటివఱకు నేమియు మాటాడలేదు. తరువాత మృదుస్వరముతో—"లోచనునకు పట్టువడిపోయినాము!" అనియెను.

అమ—నీవు పట్టి యొప్పగింపకయే పోయినచో నాతని బట్టుకొను సామర్థ్య మెవ్వరి కున్నది?

కుంజ విషాద స్వరముతో—"ఆతని బట్టి యొప్పగించుట మంచిపనియో, చెడ్డపనియో నేనిప్పు డెఱుంగజాలనైతిని—కాని యిప్పుడు మాత్రము నామనసున కెంతయో కష్టముగా నున్నది,

వాడెట్టివాడైనను చిరకాలమునుండి నన్ను గారాబముతో పెంచినాడు. ఆతని బట్టి మృత్యుముఖమున కొప్పగించుట కృతఘ్నత కాదా ? కాని వాడు దారుణ క్రోధావేశముచే మిమ్ము జంపదలచి యున్నాడు. నేను పట్టి యొప్పగింపకయే యున్నచో నాక్రూరుడు నిశ్చయముగా మిమ్ము జంపకమానడు—అందుచేతనే నేనింతపని చేయుటకు సాహసించితిని " అనియెను.

అమరేంద్రుడు దత్యుత్సాహముతో ససంభ్రమముగా కుంజ పాణిగ్రహణముం గావించి ప్రేమ మధుర స్వరముతో—"కుంజా ! అట్లయినచో నీవు లోచనుని బట్టి యొప్పగించినది నారక్షణను కొఱకేనా ?" అనియెను.

కుంజ మృదుస్వరముతో—"అట్లు కాకయున్నచో నేనాతని బట్టి యొప్పగింపవలసిన యావశ్యకమేమున్నది ? ఆతడు నన్ను పెంచినవాడుగదా !" అనియెను.

అమరేంద్రుడు విచలిత భావముతో—"కుంజా ! అది యేమైన నగుగాక ! ఇప్పుడిక నిన్నిగుంపులో నుండనిచ్చుట నాకెంత మాత్రము నిష్టముగా లేదు " అనియెను.

కుంజ కొంతసేపటివఱకు కేమియు మాటాడజాలక యతి దీన స్వరముతో—"మీరు—" అనియెను.

అమరేంద్రుడు డామాట కడ్డమువచ్చి—"ఇంకను సంశయ మెందులకు ? కుంజా ! నీవు నాదానవు కావా ? నన్ను నీవానిగా భావించుటలేదా ?" అనియెను.

కుంజ యీ మాట వినిపించుకొనకుండగనే యతి కరుణ స్వరముతో—"ఆనాటినుండియు నేను కేవలమును భావించుకొనుచునే యున్నాను—నాదుర్బల హృదయమునకు బలమును ప్రసాదింప వలయునని నిరంతరమును నేనాపరమేశ్వరుని బ్రార్థించుచునే యున్నాను—మీరు నన్ను పెండ్లియాడినచో లోకులందఱును

మిమ్ములను బరిహసింతురనియు, నాక్షేపింతురనియు నేనెఱుంగుదును—అట్టి పరాభవమును నాప్రాణములు సహింపజాలవు—ఆ కారణముచే నేను సుఖవతినై యుండజాలను—ఇట్టిచో నన్ను బెండ్లియాడి మీరు మాత్ర మెట్టి సుఖము ననుభవింపగలరు? ఇంతకంటె బరమేశ్వరుడు నుదుట నెట్లు వ్రాసియుంచెనో యట్లే నేనున్నచో, నొకరీతిగా సుఖదుఃఖముల ననుభవించుచు నాజీవితమును గడుపుకొనవచ్చును—మీరు నన్ను క్షమింపవలయును—చాల మాటలాడితిని—బాలికను—అవ్యక్తురాలను—దయయుంచి మీరు నన్ను క్షమింపుడు!" అనియెను.

ఆ బాలిక ధీర గంభీర వాక్యముల కమరేంద్రుడు స్తంభితుడై పోయెను. ఏమని ప్రత్యుత్తరము చెప్పవలయునో యతనికి దోచలేదు. కుంజ యవనత వదనయై నిలువబడి యుండెను. అప్పు డామె కనుదమ్ములనుండి యశ్రుబిందువులు జాల్వారుచుండెను.

అమరేంద్రు డతి సంచలిత హృదయుడై తత్తరపడుచు దృఢస్వరముతో—"కుంజా! నీతల్లి దండ్రు లెవ్వరో, నీజాతి యేమో తెలియక పోయినను, లోకు లేమనుకొన్నను, సమాజము నన్ను త్యజించినను, బంధు మిత్రు లాక్షేపించినను నేను తప్పక నిన్ను బెండ్లియాడవలయునని నిశ్చయించుకొంటిని. కావున నీయుద్దేశ మేమో స్పష్టముగా జెప్పుము!—నీవు నన్ను బెండ్లియాడెదవా?" అనియెను.

కుంజ యేమియును బ్రత్యుత్తరము చెప్పలేదు. అమరేంద్రుడు మరల నాభావముతోనే—"చెప్పుము!—శీఘ్రముగా జెప్పుము!—ఒక్కమాట చెప్పుము!—కుంజా! నీవు నాజీవిత మంతయును దుఃఖమయముగా జేసివేయదలంచితివా?" అనియెను.

వాత్యాప్రకంపిత వాసంతికా కుసుమ వల్లరింబోలి కుంజ కోమల తనులత యాపాదమస్తకమును బ్రకంపితమై పోవుచుండెను. అప్పు డామె యొక్కసారి వ్యాకులిత నయనములతో నమరేందునివంక

దిలకించెను. చూచుచుండగనే యామె నిలువున కూలబడి పోవుచుండెను. కాని యమరేంద్రుడు చటాలునబోయి పట్టుకొనుటచే నామె యించుక యాత్మసంయమము గాంచుకొని యతికష్టముతో నిలువబడి యస్ఫుట దీన గద్గద స్వరముతో—" వేగు పొండు !" అనియెను.

అమరేంద్రుడు విభ్రాంతుడై—" అట్లే పోయెదను—కాని చెప్పుము ! పెండ్లియాడుటకు నీకెట్టి యభ్యంతరమును లేదుగదా !" అనియెను.

కుంజ తలవంచుకొని యతిదీనముగా, నత్యస్ఫుట స్వరముతో—" లేదు—వేగు పొండు !" అనియెను.

అమరేంద్రు డామె హృదయమును గ్రహించి మారు మాటాడక వెడలిపోవుట కుద్యమించుచుండగా దూరమునుండి పల్లకి బోయల యోంకారధ్వని వినవచ్చెను. క్రమక్రమముగా నాపల్లకి రోడ్డుత్రోవను జందననగరము వైపుపోక యా దేవాలవైపునకే వచ్చుచున్నట్లగపడియెను. అమరేంద్రు డాశ్చర్యముతో—" కుంజా ! ఎవ్వరో పల్లకి నెక్కి యీ వంకకే వచ్చుచున్నారు " అనియెను.

కుంజ స్మృతి నభినయించి తెల్లపోవుచు మృదుస్వరముతో—" కొన్నటిదినము నమూల్యబా బెవ్వరో యొక పెద్దమనుష్యునితో గలసి యిచ్చటికివచ్చి పరమాదరముతో నన్ను దిలకించి యనేక విధముల నభినందించి వెడలిపోవునప్పుడు—" కుంజా ! మాయమరేంద్రుని ప్రాణదాయినివగు నీకు నాగృహిణి పరమానందముతో విందుచేయ గోరుచున్నది. ఆమెను బల్లకితో నిచ్చటికి బంపించెదను. కావున నీవామెతో గలసి యొకసారి మాయింటికి రావలయును " అని చెప్పి వెడలిపోయెను. నేనామాట నంతగా లక్ష్యము చేయలేదు.

అమూల్యబాబు నిజముగా దన గృహిణిని బంపుచున్నాడు కాబోలును !" అనియెను.

అమరేంద్రు డాశ్చర్యముతో—"ఆ రెండవవా రెవ్వరు ?" అని ప్రశ్నించెను.

కుంజ—ఆయనను నేనిదివఱ కెన్నడును జూచియుండలేదు.

వారిట్లు మాటాడుకొనుచుండగనే పల్లకీ యచ్చటికి వచ్చెను. తోడనే యా పల్లకినుండి యమూల్యుని గృహిణియగు సతీదేవి దిగి కుంజను కౌగిలించుకొనియెను. కుంజ యానంద వికసిత హృదయముతో నామెకు సాష్టాంగ ప్రణామమునుం గావించెను. ఇంతలో నొక పట్టిపల్లకి కూడ వచ్చెను. అమరేంద్రున కది యంతయు నద్భుత వ్యాపారమువలె దోచెను. అత డేమి యాలోచించుటకును దోచక బాహ్యాభ్యంతర జ్ఞానశూన్యుడై చిత్రప్రతిమవలె నిలువబడిపోయెను.

## ప్రకరణము 42

యథాసమయమున కింటికివచ్చి యమూల్యుని గృహిణి కుంజను వెంటబెట్టుకొని యంతఃపురమునకు దీసికొనిపోయెను. అమరేంద్రుడును పల్లకినుండి దిగి యమూల్యుని దర్శన గృహమున ప్రవేశించెను. తోడనే యమరేంద్రు డత్యాశ్చర్యాన్విత హృదయుడై పోయెను. మూర్షిదాబాదునుండి నీలరతనబాబువచ్చి యచ్చట గూర్చుండి యుండెను. అత డట్లు వచ్చునని యమరేంద్రు డనుమానించియైన నుండలేదు. చటాలున నాతడు నీలరతన బాబునకు సాష్టాంగ ప్రణామమునుం గావించెను. నీలరతనబా బానందభాష్ప

పూరిత నయనములతో—"కల్యాణమస్తు!" అని యాశీర్వదించి యమరేంద్రుని లేవనెత్తి కూర్చుండ జేసెను.

ఇంతలో నొక పెద్దమనుష్యుడా లోపలికివచ్చి కూర్చుండెను. అమరేంద్రుడా యపరిచితునివంక సవితర్క నయనములతో దిలకించు చుండెను. అప్పు డమూల్యుడు మందహాసము చేయుచు—"అమరా! నీప్రతిజ్ఞాపాలనముం గావించుకొని నీవెల్లవిధముల సంపూర్ణవిజయుడ వైతివి—ఇంతకంటెను కృతార్థత యేమున్నది! అట్లు చూచెదవేమి! ఈయన నాయాత్మీయుడు! వీరి నివాసము సాగరడాంగా యను గ్రామము!" అనియెను.

అమరేంద్రుడా మాటవిని తెల్లపోయెను. అతని నోటినుండి యెట్టిమాటయును వెలువడలేదు.

అప్పుడా పెద్దమనుష్యుడు నీలరతనబాబుం గాంచి—"అయ్యా! నన్ను జయంతకుమారు డందురు. ఆనందకుమారవసువు నాయన్న గారు. ఆయనకు లేక లేక చిరకాలమున కొక యాడుశిశువు కలిగినది. కాని దురదృష్టవశమున రెండవయేటనే యాబిడ్డ చోరులచే నపహ రింపబడియెను. ఆమెను వెదకించుటకై యెంతయో ధనము వెచ్చించి యెన్నియో విధముల బ్రయత్నించితిమి. కాని లాభము లేక పోయెను. ఆ పుత్రికా శోకముచేతనే యచిరకాలములో నామె తల్లి మరణించినది. దుస్సహమగు భార్యాపుత్రికా వియోగ దుఃఖముచే నాయన్నగారుకూడ లోకాంతరగతులగుచు సోదరుడనగు నన్నుబిలిచి తన సర్వసంపత్తియును నావశముచేసి—"సోదరా! ఎప్పటికైన దైవాను గ్రహమున సుషమ దొరకుటయే తటస్థించినచో నప్పుడు నాయాస్తి నామెకొసంగి వివాహము చేయుము!" అని యాజ్ఞాపించి స్వర్గస్థులైరి. [illegible]నుండియు నేను పితృసమానుడగు నాయగ్రజుని యాదేశమును

ప్రతిపాలించుటకై ప్రయత్నించుచునే యుంటిని. కాని నాకింతవఱకు నట్టి భాగ్యము లభింపలేదు. ఇట్లుండగా నీవెఱుగు నమూల్యబాబు మాయింటికివచ్చి యీ సంగతి యంతయు నెఱింగినవాడే కావున నన్ను జూచి—"జయంతా! ఆ బిడ్డ రెండవయేటనే యపహృత యైనదిగదా! ఇప్పటి కామెకు బదునైదేండ్ల వయసు వచ్చును; ఇట్టిచో నామె నానవాలుపట్టుట యెట్లు?" అని యడిగెను. అప్పుడు నేనాత్రముతో—"నాచేతులలో బెరిగిన బిడ్డ యెంతపెద్దదైనను నేనానవాలు పట్టలేనా? వయసు మారునుగాని సహజమగు నాకృతి లీలగనైనను ద్యోతకము కాకుండునా? ఇంతేకాక యీ బిడ్డ భ్రూమధ్యమున నల్లని పుట్టుమచ్చ యొకటి యున్నది. అది యెచ్చటికి బోవును?" అని నేను చెప్పితిని. అప్పు డమూల్యుడు పరమానందముతో నన్ను వెంటబెట్టుకొని చందన నగర సమీపమునందలి మందులవాళ్ళ డేరాలయొద్దకు దీసికొని పోయెను. అంతలో డేరానుండి యొకబాలిక వెలువడి మా కెదురువచ్చెను. ఆ బిడ్డం గాంచినంతనే నాకన్నులు చల్లనై పోయెను. నాయొడలంతయును బులకించి పోయెను. నాహృదయ మానంద తరంగిత మైపోయెను. ఆమె మాబిడ్డయేయని నాహృత్పిండచలన సంబంధమగు ప్రతిశబ్దమును సాక్ష్యము చెప్పుచుండెను. ఆ బాలిక గునగున నడచుచు వచ్చి మమ్ములను సమీపించెను. ఇకనేమి? ఆ గౌర సుందర వదన మండలమున నా భ్రూమధ్యమునందలి నల్లని పుట్టుమచ్చ విస్పష్టముగా నాకన్నుల బడియెను. ఇక నేనానందముచే నిలువజాలకపోయితిని. చటాలునబోయి నాబిడ్డను గాఁగిలించుకొనుట కుంకించితిని. అమూల్యుడు నన్ను వారించి ఆమెతో గొంతసేపు మాటాడి తిరిగివచ్చెను. అనంతరము మేమిరువురమును గలసి కలకత్తాకు వచ్చితిమి. ఇచ్చట నేను నాబంధువులయింట విడిసి యుంటిని. నీలరతనబాబూ! దైవాను

*



గ్రహమున మందులవాళ్ళ కుంజయే మా సుషమయైనది. నాకింత కాలమునకు నాయగ్రజుని యాదేశమును బరిపాలించు నదృష్టము లభించినది; మీవంటి మహనీయులతోడి బాంధవ్యము వలన ధన్యత చేకూఱినదై యున్నది. ఇన్నిమాట లెందులకు; విజయాభ్యుదయశాలి యగు మీ యమరేంద్రునకు మా సుషమను నాసోదరుని సర్వ సంపత్తితో గూడ గానుక చేయుటకు గుతూహల పడుచున్నాను. పెద్దలగు మీయనుజ్ఞకొఱ కెదురు చూచుచున్నాను " అనియెను.

నీలరతనబా బానంద బాష్ప పూరిత నయనములతో —

" ఇంతకంటెను భాగ్యము గలదా! మీరు మీసౌందర్యమును సార్థకపఱచుకొంటిరి. అమూల్యబాబు తన మిత్రత్వము నన్వర్థముగ జేసి కృతకృత్యుడైనాడు. ఇకారణముల వలన మాయమరబాబు కృతార్థుడైనాడు! పెద్దవాడనగు నేనీ యమూల్య శుభసంఘటనము మూలమున ధన్యుడనైతిని. అఘటన ఘటనాధురీణుండును, నానంద లీలామయుండునగు పరమేశ్వరునకు సహస్రకోటి వందనములు!" అనియెను.

అమరేంద్రు డద్భుతానందోత్సాహములు ముప్పిరిగొను హృదయముతో నంతయు నాలకించుచు జిత్రప్రతిమవలె నైపోయెను.

ఆనంద సంభాషణములచే నామందిర మిప్పుడే కల్యాణ మందిరమువలె శోభామయమయ్యెను.

*

# ఉపసంహారము

ఇక జెప్పవలసిన దేమున్నది! లోచనునకును, కాహియానకును కూడ ద్వీపాంతరవాస శిక్ష యైనది. అందుమూలమున వారి పాపమునకు దగిన ప్రాయశ్చిత్త మయ్యెనో లేదో యెవ్వరు చెప్పగలరు?

అమరేంద్రనాథుడు జయరామానాథు డగుటయేకాక సుషమా మనోనాథుడు కూడ నయ్యెను. స్వయముగ నమూల్యుడును నాతని గృహిణి సతీదేవియు కన్యాదాతలై సుషమామరేంద్రుల వివాహ మతి వైభవముతో జరిపించిరి. ఆ కల్యాణ సమయమునందే జయంతి కూమారుడు తన యన్నగారి సంపత్తి యంతయును గుండకు—కాదు! సుషమాదేవికి దానపత్ర పూర్వకముగా నొసంగెను.

నీలరతనబా బమరేంద్రుని పితృ సంపత్తి యంతయును నాతని కొప్పగించివైచెను. అమరేంద్రుడు మహైశ్వర్య సంపన్నుడగు గృహస్థుడై సంసారమును స్వర్గసుఖము ననుభవించుచుండెను. అమరేంద్రుడు డానందోన్మాద సమయములం దప్పుడప్పుడు సుషమ యులికిపడునట్లుగా నామెను—"కుంజా!" యనియే పిలుచుచుండెను!

సమాప్తము.

